RNI No. APTEL/2003/12253

# భావవీణ

సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Literary, Culture & Language Study

Vol : 17 Issue No. 1(2) Monthly January 2020 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC CARE - Journal
Arts & Humanities
Sl.No. : 35



## గొల్లపూడి మారుతీరావు




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

**Journal of Literary, Culture & Language Study**

(సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 17 - Issue. 1(2) - January 2020 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# గొల్లపూడి మారుతీరావు

గొల్లపూడి మారుతీరావు ఒక నటుడిగా చాలామందికి పరిచయం అక్కరలేని పేరు. ఆయన నటుడే కాకుండా రచయిత, సంపాదకుడు, వ్యాఖ్యాత, విలేఖరి, తెలుగు సాహిత్యాభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి. సినిమాల్లోకి రాకముందు నాటకాలు, కథలు, నవలలు రాశారు. రేడియో ప్రయోక్తగానూ, అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టరుగాను మరియు ఆంధ్రప్రభ దినపత్రిక ఉపసంపాదకుడిగానూ పనిచేశారు.

సినిమారంగంలో ఆయన మొట్టమొదటి రచన డాక్టర్ చక్రవర్తికి ఉత్తమ రచయితగా నంది అవార్డుతోబాటు మరో మూడు నందులు అందుకున్నారు. తెలుగు సాహిత్యంపై ఆయన రాసిన పరిశోధనాత్మక రచనలు, నాటకాలు పూర్వపు ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా నిర్ణయించబడ్డాయి.

1939 ఏప్రిల్ 14న విజయనగరంలో ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. అయినప్పటికీ విశాఖపట్టణంలోనే నివాసమున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బిఎస్సీ (ఆనర్స్) పూర్తిచేసిన ఆయన 1959లో ఆంధ్రప్రభ ఉపసంచాలకునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. రెండు దశాబ్దాల ఆకాశవాణి కడప కేంద్రం డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు.

కోడి రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య' చిత్రంలో నటుడిగా సినీరంగ ప్రవేశం చేశారు. ఆ చిత్రంలో నటించడమే కాకుండా మాటల రచయితగా కూడా పనిచేశారు. చిన్న వయస్సులోనే రాఘవ కళానికేతన్ పేరుతో నాటక బృందాన్ని నడిపారు. 'గొల్లపూడి', 'ఆడది', 'కుక్కపిల్ల దొరికింది', 'స్వయంవరం', 'వాపస్' వంటి నాటకాలకి నిర్మాణం, దర్శకత్వం వహించడంతోపాటు, ప్రధాన పాత్రధారిగా కూడా నటించారు. విద్యార్థి దశలో ఉండగానే స్నానాలగది, మనస్తత్వాలు నాటకంలోనూ అభినయించారు. ఎన్నో యూనివర్శిటీల్లో పాఠ్యాంశాలుగా గొల్లపూడి రచించిన నాటకాలు, తెలుగు సాహిత్యంపై ఆయన రాసిన రచనలకు స్థానం దక్కింది.

తొలి ప్రయత్నంలోనే ఉత్తమ కథా రచయితగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి నంది అవార్డుని అందుకున్నారు. 250 చిత్రాలకి పైగా సహనటుడిగా, హాస్యనటుడిగా మెరిశారు. మారుతీరావు తన కుమారుడి జ్ఞాపకార్థం గొల్లపూడి శ్రీనివాస్ జాతీయ అవార్డుని నెలకొల్పారు. ఉత్తమ నూతన దర్శకుడికి రూ. 1.50 లక్షల నగదు బహుమతిని, ప్రముఖ చిత్రకారుడు బాపు రూపొందించిన బంగారపు జ్ఞాపికనూ ప్రధానం చేస్తున్నారు. సినిమాకు సంబంధించి విశేష ఉపన్యాసం చేసిన ప్రముఖునికి గౌరవ సూచకంగా రూ. 15 వేలు గొల్లపూడి మెమోరియల్ రెక్టర్ పేరిట బహుమానం అందిస్తున్నారు.

సినీ రచయితగా నాలుగు నంది పురస్కారాలు సొంతం చేసుకున్న గొల్లపూడి మారుతీరావుకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళారత్నతోపాటు మరెన్నో విశిష్ట పురస్కారాలు లభించాయి. కొన్ని కార్యక్రమాలకి వ్యాఖ్యాతగా కూడా చేశారు. 'ఇంటింటి రామాయణం', 'గుణవతి', 'ప్రేమలు పెళ్ళిళ్ళు' తదితర ధారావాహికల్లో నటుడిగా కూడా మెప్పించారు. ఇలా చివరి వరకు నటుడిగా, రచయితగా, వ్యాఖ్యాతగా, నాటకకర్తగా అనేక రకాలుగా తెలుగు సాహిత్య సినీరంగం తనదైన రీతిలో సేవ చేస్తూ వృద్ధాప్యం కారణంగా మనల్ని వదలి వెళ్ళడం చలనచిత్రరంగానికి, తెలుగు సాహిత్య లోకానికి తీరని లోటు. వారికి ఇవే మా నివాళులు.

- సంపాదకవర్గం

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | జానపద విజ్ఞానం - భావి తరాలకు ప్రయోజనం | - ఎన్. వి. వసుమతి | 6 |
| 2. | తెలంగాణా రచయిత్రుల నవలలు -సామాజిక వాస్తవికత | - సయ్యద్ అఫ్రీన్ బేగం | 10 |
| 3. | కాళోజి కవిత్వము - సామాజిక స్పృహ | - నోముల రాజు | 16 |
| 4. | ఆడియో గీతాలలో వడ్డెరల స్థితిగతులు - విశ్లేషణ | - పి. అనిల్ కుమార్ | 20 |
| 5. | శ్రీ కృష్ణదేవరాయల సాహితీ వైభవం | - ఆచార్య ఎం. రామనాథంనాయుడు | 24 |
| 6. | సౌజన్య నాటికలు - శైలీ విన్యాసం - పాత్రోచిత భాష | - డా॥ బూసి వెంకటస్వామి | 28 |
| 7. | పెద్దింటి "మా ఊరి బాగోతం కథలు" | - రంగు శ్రీకాంత్ గౌడ్ | 32 |
| 8. | 'కరుణశ్రీ' బాల సాహిత్యం- తీరు తెన్నులు | - రాంభట్ల వేంకటరాయశర్మ | 34 |
| 9. | ఆధునిక తెలుగు కథా సాహిత్యం-ధిక్కారస్వర స్త్రీ పాత్రలు | - టి. వెంకటనారాయణ | 36 |
| 10. | భాషా సాహిత్యాలు - వ్యక్తిత్వ వికాసం | - వేదుల శ్రీలక్ష్మీ భార్గవి | 40 |
| 11. | చావా శివకోటి - 'సివంగి' కథ ఇతివృత్తం - పాత్ర చిత్రణ | - యరమల కోటారెడ్డి | 42 |
| 12. | నిలువెత్తు ప్రేమకు నిదర్శనం మానస ఎండ్లూరి 'అవిటి పెనిమిటి' | - యద్దనపూడి దీప్తి | 45 |
| 13. | పాపా సాహెబ్ సాహిత్యము | - డా॥. పఠాన్ ఖాసిం ఖాన్ | 48 |
| 14. | "మళ్ళీ పల్లె ఒడిలోకి..." నవల - పరిశీలన | - శెల్కలపెల్లి రాజు | 51 |
| 15. | దళిత కవిత్వంలో దళిత స్త్రీలు | - డా॥. ఎస్. యజ్ఞశేఖర్ | 58 |
| 16. | ఆంధ్ర మహాభారతం - స్త్రీ పాత్రలు | - డా॥ లింగాల మంగమ్మ & డా॥ నూనావత్ రాంబాబు | 63 |
| 17. | 'చిత్తూరు కథ'లో చిత్రింపబడ్డ ప్రజల ఆర్థిక దుస్థితి | - డా॥ పి. జయచంద్రుడు | 71 |
| 18. | సత్యకామ జాబాలి వచన కవితాకావ్యం - జాబాలి పాత్ర | - ఎ. సుబ్రమణ్యం | 77 |
| 19. | తొలి తరం దళిత కవులు | - డా. వై.విజయానంద రాజు | 80 |
| 20. | దళిత ఉద్యమం | - గూడెపు అనిత | 87 |
| 21. | సాహితి వెలుతురు బోయ జంగయ్య | - పుప్పాల రవీందర్ | 90 |
| 22. | తిన్నని వృత్తాంతము - గిరిజన జీవన చిత్రణ | - డా॥. చాట్ల కిశోర్ | 92 |
| 23. | పాత రోతేనా? చరిత్రబూజు దులపక్కరలేదా? | - డా॥ పి.ఎ. సత్యనారాయణ | 98 |
| 24. | జానపద సాహిత్యంలో పంబకథ తెలుగు నుడికారం | - కొమ్మాలపాటి శ్రీనివాసరావు | 102 |
| 25. | ఉద్యమ గీతాలు - దళితాభ్యుదయం | - గూడూరి గ్లోరియానెట్ | 105 |
| 26. | రాయలసీమ గిరిజన మూలికా వైద్యం | - యం. శోభారాణి | 108 |
| 27. | కందుకూరి వీరేశలింగం- స్త్రీ సంస్కరణోధ్యమం | - కె. సతీష్‌కుమార్ | 110 |
| 28. | దళిత జనోద్ధారకుడు - బోయి భీమన్న | - డా॥. జి. శ్రీనివాసరావు | 114 |

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# జానపద విజ్ఞానం - భావి తరాలకు ప్రయోజనం

**- ఎస్. వి. వసుమతి,** తెలుగు పరిశోధకురాలు, తెలుగు విభాగం, యస్.వి. యూనివర్శిటి, తిరుపతి.

పుస్తకాలకు, సెలఫోన్‌లకు పరిమితమై పోయిన నేటి (సమాజం అంటే) విద్యార్థులు శారీరక శ్రమకు, ఆరోగ్యానికి ప్రాధాన్యతను ఇవ్వలేకపోతున్నారు. ఆటలు, పనులు చేయుట వంటివి ఆరోగ్యమునకు కారణాలుగా చెప్పవచ్చు. గ్రామాలలో తీరుబాటు సమయాలలో కబడ్డీ, ఖోఖో వంటి క్రీడలను ఆడుతుంటారు. పాఠశాలలో కూడా పైకా పేరుతో గ్రామీణ క్రీడలను పరిచయం చేస్తున్నారు. మనిషి ఆరోగ్యంగా ఉండటానికి అతని ఆహారపు అలవాట్లు కూడా కారణమౌతాయి. గ్రామాలలో ఆహారంగా తీసుకొనే చిరుధాన్యాలు, ఆకుకూరలు సహజ సిద్ధంగా పెరిగిన కూరగాయల వల్ల, వారి అలవాట్ల వల్ల వ్యాధులు బారిన పడటంలేదు సగటు ఆయుర్దాయం కూడా ఎక్కువే. చుట్టూ కనిపించు ఎన్నో మొక్కలను వైద్యానికి వాడతారు. తులసి, వేప, సబ్జ వంటివి వివిధ నొప్పులకు మందులుగా వాడుతారు. వేపపుల్లను పళ్ళు తోమడానికి నేడు కూడా వాతున్నారంటే కారణం టూత్‌పేస్ట్ కొన లేక కాదు, దంత సంబంధ వ్యాధులు రాకుండా ఉంటాయని వేరు, ఆకు, కాయ, పండు, కొమ్మలు కూడా వైద్యానికి వాడుతారు. ఇలా ప్రతీ విషయాన్ని మనం పరిశీలించాలంటే జానపద విజ్ఞానాన్ని ఆశ్రయించాల్సిందే. జానపద సంస్కృతిలో భాగమైన జానపద విజ్ఞానం గురించి మరికొన్ని వివరాలు తెలుసుకోవాలి.

**జానపద విజ్ఞానం-భావి తరాలకు ప్రయోజనం:**

జానపద విజ్ఞానం, జానపద సంస్కృతి, జానపద జీవనం వేరుకాదు. జానపద విజాఞనం అంటే కేవలం మౌఖికంగా ఒక తరం నుంచి మరొక తరానికి సంక్రమించే వాగ్రూప సాహిత్యమనే సంకుచిత దృష్టిని పోగొట్టాలని నేడు అమెరికాలో జానపద జీవన మనే పదాన్ని కొందరు విద్వాంసులు వాడుతున్నారు. మానవ జీవతమంత విస్తృతమైన పరిధి జానపద విజ్ఞానంనకున్నదని చెప్పడమే వారి ఆశయం.

జానపద విజ్ఞానం సంస్కృతిలో ఒక భాగం. సంస్కృతిని నాగరికతకు పర్యాయపదంగా కొందరు వాడుతారు. కాని అది సరికాదు. ఆది మానవుని కాలం నుంచి నేటి నాగరిక మానవుని వరకు ఆయా కాలల్లో మనిషి తన అభ్యున్నతి కోసం చేసిన కృషి ''సంస్కృతి''. అంటే మానవకృతి "సంస్కృతి" అన్నమాట. ఈ సంస్కృతిలో జానపదుల జీవనానికి సంబంధించిన గేయాలు, కథలు, సామెతలు, భాష, నమ్మకాలు, దుస్తులు, ఆటలు, వంట, వైద్యం, కళలు మొదలైన వన్నీ జానపద విజ్ఞానంలో భాగాలే.

జానపద విజ్ఞానం ఒక ప్రత్యేక అధ్యయన విభాగమై విశ్వవిద్యాలలో కూడా ప్రవేశించింది. అందువల్ల జానపదలంటే ఎవరు, జానపద విజ్ఞానం పుట్టు పూర్వోత్తరాలేమిటి, దీని అధ్యయనం చెయ్యాలంటే ఏయే పద్ధతుల్ని అనుసరించాలి. దీన్ని వర్గీకరించడమెలా అనే విషయాలను పరిశీలించవలసి ఉంది. ఒకప్పుడు జానపద విజ్ఞానానికి ఇంగ్లీష్‌లో ''ఫోక్ లోర్''అనే పదాన్ని సమునార్థకంగా వాడుతున్నాం. "పోక్ లోర్" అనే పదాన్ని డబ్ల్యు.జె.థాంస్ 1846 లో రూపొందించారు. "ది అధనీయం" అనే పత్రికకు రాసిన ఒక ఉత్తరంలో "ఫోక్ లోర్"ని వివరిస్తూ "జానపదులకు చెందిన ఆచారాలు, నమ్మకాలు, కథాగేయాలు సామెతలు మొదలైన విజ్ఞానము అని వచించారు. జనపదం అంటే పల్లెటూరు అనే అర్థం ఉండి ఉండవచ్చు. అయితే అది సబబు కాదు. భారతీయులు, వివిధ జనసముదాయాలు కూడా జానపదులే (స్త్రీలు, పిల్లలు, విద్యార్థులు, గిరజనులు). జానపద విజ్ఞానం సంస్కృతిలోని, జీవితంలోని అన్ని విషయాలను తనలో ఇముడ్చుకోగలిగినంత విశాలమైనది కావడంచేత దాన్ని నిర్వచించడం చాలా కష్టంతో కూడిన పని.

జానపద విజ్ఞానం అత్యంత ప్రాచీన కాలానికి సంబంధించిన సాంప్రదాయిక విజ్ఞానమని మరో విధంగా చెప్పాలంటే అది సజీవ శిలాజం వంటిదని కొందరు అభిప్రాయపడ్డారు. జానపద విజ్ఞానం గతకాలానకి ప్రతిధ్వని మాత్రమేకాదు వర్తమానంలోని శక్తివంతమైన గొంతుక అనే విషయాన్ని కూడా మనం గమనించాలి. పల్లెటూళ్ళన్నీ పట్టణాలుగా మారితే జానపద విజ్ఞానం నామరూపాలు లేకుండా పోతుందను కోవడం కూడా సరికాదు. గ్రామీణులు, విద్యాహీనులు మాత్రమే జానపదులని, వారికి సంబంధించినదే జానపద విజ్ఞానమని 19వ శతాబ్దానికి చెందిన జానపద విద్వాంసులు భావించేవారు. నేడు నగర సంబంధమైన జానపద విజ్ఞానాన్ని గురించిన అధ్యయనం కూడా సాగుతున్నది. R.S. Boggs పండితుడు జానపద విజ్ఞానంలోని ముఖ్య భాగాల్ని Groupలు గా విభజించిన గుర్తులుగా ఇంగ్లీష్‌లోని ABCD అనే పెద్ద అక్షరాలతో సూచించాడు.

A. సాధారణ జానపద విజ్ఞానం
B. గద్యాఖ్యానం
C. కదాగేయం, గేయం, నృత్యం, ఆట, సంగీతం, గద్యం
D. నాటకం
E. ఆచారం
F. భూగోళం
G. భాష
H. కళ, చేతిపనులు వాస్తు
I. ఆహారం
J. నమ్మకం
K. వాక్కు
L. నామెత
M. పొడుపు కథ

విలియం బేస్కమ్ ప్రకారం జానపద ప్రక్రియలు ప్రకార్యాత్మక సమాజం సృష్టించేవి కావడం వల్ల అవి సంచలనాత్మకంగా ఉంటాయి. నిశ్చలంగా ఉండవు. ఒక్కొక్క జానపద ప్రక్రియము ఒక నిర్ధిష్ట ప్రయోజనం ఉంటుంది. సామెతలు జానపద న్యాయస్థానాలలో తీర్పు చెప్పడానికి ఉపయోగించబడుతాయి. పొడుపు కథలు బుద్ధికి పదును పెడతాయి. పనిపాటలు శ్రమను తగ్గించడానికి దోహదం చేస్తాయి. జానపదుల పండుగలు, ఉత్సవాలు నమ్మకాలు, పలుకుబళ్ళు, సామెతలు వైద్యం మొదలైన వాటికి నిర్ధిష్టమైన ప్రయోపనాలున్నాయి.

జానపద విజ్ఞానం జానపదులకు ఉల్లాసాన్ని, ఆనందాన్ని కలిగిస్తుంది. గేయాలు, కదాగేయాలు కథలు మనకెంత హాయిని కలిగిస్తాయో వేరుగా చెప్పనక్కరలేదు. కథాగేయులు వినేవారికి, చెప్పేవారికి కూడా ఇంపుగా ఉంటాయి వీర గాథలు వినేవారికి ఉద్రేకాన్ని, ఊపును ఇస్తాయి. సమాజంలోని సభ్యుల మధ్య సంబంధ బాంధవ్యాలను పెంపొందిస్తాయి. చిత్రకళ, శిల్పం ప్రదర్శన కళలు కంటికి, చెవికి, ఇంపుగా ఉంటాయి. ఆటపాటలు పిల్లలకు ఆనందాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తాయి. వారి జీవితం ఉల్లాసంగా ఉండటానికి తోడ్పడతాయి.

జాన పద విజ్ఞానం సంస్కృతిని పరిరక్షిస్తుంది. జానపద ప్రక్రియల ముఖ్య ప్రయోజనములలో ఇది ఒకటి సంస్కృతికి సంబంధించిన అనేక విషయాలు కాలగర్భంలో కలిసిపోకుండా జానపద విజ్ఞానం కాపాడుతుంది. గేయాల్ని గానం చేయడం కూడా మన సంస్కృతిలో ఒక భాగం. కానీ నేడు సినిమాల ప్రభావం వల్ల జానపద గేయాల్ని పాడే వాళ్ళే కరువైనారు మామూలుగా పాటలు పాడడానికి సిగ్గుపడే వాళ్ళు పెళ్ళిళ్ళు పేరంటాల్లో, వ్రతాల్లోనో, పండుగల్లోనో నలుగురితో కలిసిపాడుతారు. అంటే ఈ జానపద సందర్భాలు మన సంస్కృతిని పరిరక్షిస్తుందని చెప్పక తప్పదు. మనం మామూలుగా పంచకట్టుకోవాలన్నా, తలపాగా చుట్టుకోవాలన్నా, నగలు పెట్టుకోవాలన్నా సిగ్గుపడతాం. అయితే జానపద విజ్ఞానానికి సంబంధించిన పెళ్ళి గానీ, తిరునాళ్ళు గానీ, పండుగలు గానీ, నాటకంలో వేషాలు వేసేటప్పుడు గానీ పెట్టెలో భద్రంగా దాచిన పట్టు పంచెలు. చీరలు, నగలు బయటకు వస్తాయి. ఈ రకంగా జాన పద విజ్ఞానం సంస్కృతిని కాపాడుతుందనటంలో ఎటువంటి సందేహంలేదు.

జానపదుల విద్యాభ్యాసానికి కూడా జానపద విజ్ఞానం తోడ్పడుతుంది. మన చదువులు పాఠశాలల్లో కళాశాలల్లో, విశ్వవిద్యాలయాలలో సాగుతాయి. ఈ చదువులే మాన వుణ్ణి పరిపూర్ణుణ్ణి చేయలేవు. మనం నిజమైన విద్యావంతులు కావాలంటే జానపద విజ్ఞానం సహాయ పడుతుంది. ఉదా:- పిల్లల పాటల్ని తీసుకుందాం. చిన్న పిల్లలు వినోదంగా రకరకాలైన పాటల్ని పాడుకుంటారు. పిల్లలు తమాషాగా పాడిన పాటలు వారి జ్ఞాపక శక్తిని పద జ్ఞానాన్ని పెంపొందిస్తాయి. కొందరు తల్లులు వీర గాధల్ని చెప్పి తమ పిల్లలకు ఉత్సాహాన్ని కల్గిస్తారు. పిల్లలను వీరులుగా తీర్చిదిద్దడానికి ఇవి ఉపయోగ పడుతాయి. శారీర వ్యాయమంతో పాటు బుద్ధిని వ్యాయమం కూడా అవసరం ఆటపాటలు ప్రదర్శన కళలు వంటివి శరీరానికి వ్యాయామాన్ని కల్గిస్తే పొడుపు కథలు బుద్ధి పుట్టినవే సామెతలు. చిన్న చిన్న వాక్య రూపంలో ఉండే ఈ సామెతలు జానపదులకు పలు సందర్భాలలో గుణపాఠాలను చెబుతాయి.

"నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది". మంచిగా మాట్లాడితే అందరూ మిత్రులౌతారు. లేదంటే దూర మౌతారు. "ఒక దెబ్బైనా తినొచ్చు, మాటపడలేం. మొత్తం మీద పై సామెతలు మానవ జీవితంలో మాటకుండే విలువను తెలియజేస్తాయి. మాట విలువను వివరించే ఉపాఖ్యానాలు కూడా మన పురాణాలల్లోను, ఇతిహాసా ల్లోను ఉన్నాయి. కైకేయి దగ్గర నోరు జారిన దశరథుడు ఎన్ని పాట్లు పడ్డాడో మనకుతెలిసిందే.

జానపద విజ్ఞానం ప్రయోజనాలలో మరొకటి నిషిద్ధ మైన వాటికి అవకాశం కల్పించడం మన సమాజంలో అనేక నిషేధాలున్నాయి. తాగుడు, బహు భార్యాత్వం, నలుగురిలో తిట్లు, అరుపులు నిషిద్ధాలు. మన సంస్కృతి లోను ఒక నియమావళి ఉంటుంది. అయితే జానపద విజ్ఞానం అలాంటి నియమావళిని అతిక్రమించడానికి సహాయపడుతుంది.

ఉదా : బూతు మాటలు మాట్లాడకూడదు. కానీ ఈ బూతు మాటల్ని జానపద గేయాల్లో ఎలాంటి జంకూ గొంకూ లేకుండా వాడవచ్చు. సామెతలలోనూ పొడుపు కథలలోను ఉపయోగించవచ్చు. తాగి బూతులు తిడితే ఒప్పుకోరు కానీ గంగ జాతుల్లో అది నిషిద్ధంకాదు. జానపద సంగీతం, నృత్యం వంటివి మనకు ఎన్నో విషయాల్ని నేర్పుతాయి. సంగీతాన్ని, నృత్యాన్ని క్రమపద్ధతిలో సాధన చేస్తే అందులో రాణించి మన జీవితానికి వర్తింపచేసుకొని సుఖంగా జీవించవచ్చు. సమాజంలో విభిన్న వ్యక్తుల మధ్య మంచి, చెడ్డ, నీతి, న్యాయం, ధర్మం, నీతి, పుణ్యం, పాపం మొదలైన ఎన్నో విషయాలను తెలుసుకోవచ్చు. నేటి యువతరానికి భావి తరాలకు జానపద విజ్ఞాన పరి జ్ఞానం చాలా అవసరం. యాంత్రికంగా మారుతున్న నేటి జీవన విధానంలో సంస్కృతి సంప్రదాయాలు, విలువల గురించి తెలియజేయాలి. పాశ్చాత్య జీవన విధానంలోని మంచిని మాత్రం గ్రహించవచ్చు. నమ్మకాలు మనిషిని సన్మార్గం వైపు నడిపిస్తాయి. కానీ మూఢవిశ్వాసాలు పనికిరావు. కుటుంబంలో ప్రేమ అప్యాయతలు నిండా లంటే జానపద విజ్ఞాన పరిజ్ఞానం ఎంతో అవసరం. వాతా వరణం ప్రకృతిని కలుషితం చేసే నేటి సమాజ అలవాట్లు జానపద ఆచారాలు, సంప్రాయాల ప్రభావం వలన మారే అవకాశం ఉంది. వ్యక్తులతో లుప్తమైపోతున్న ప్రేమ, ఆప్యాయత వంటి విలువల ప్రాముఖ్యత తెలుస్తుంది. కాబట్టి జానపద విజ్ఞానం భావి తరాల శారీరక, మానసిక వికాసానికి తోడ్పడుతుందనుటలో ఎటువంటి సందేహం లేదు.

జానపద సంస్కృతిలో భాగమైనవి పండుగలు, నమ్మ కాలు, ఆచారాలు, వైద్యం, క్రీడలు ఆహార అలవాట్లు, వస్త్రధారణ వంటివి ఒక్కొక్క ప్రాంతాన్ని బట్టి ఆచారాలు మారినా మొత్తం మీద అన్ని ప్రాంతాలలోని పద్ధతులు దాదాపు ఒకేలా ఉంటాయి. పండుగల విషయానికొస్తే కుటుంబంతో కలిసి సంతోషంగా గడపడం వీటి ఉద్దేశ్యం. ఇతర దేశాలలో ఉన్నా సాంప్రదాయాను తప్పని సరిగా పాటిస్తూ దీపావళినాడు లక్ష్మీపూజ, దసరా సందర్భంగా బొమ్మల కొలువు, సంక్రాంతి ముగ్గులూ తప్పనిసరిగా నిర్వహిస్తారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ సంస్కృతుల

కలయికగా అన్ని పండుగలను అందరూ కలసి జరుపుకుంటారు. ప్రాచీనకాలంలో వైద్యం ప్రధానంగా ఆకు, వేరు, పూత, కాయలు వంటి వాటితో జరిగేది. నేడు ప్రాచుర్యంతో ఉన్న ఆయుర్వేదంకు నాటి వైద్య విధానమే మూలం. గ్రామాలలో కానీ, పట్టణాలలో కానీ కొన్ని వ్యాధులకు నాటు వైద్యవే వాడుతున్నారు. ఉదా:- కామెర్లు, అమ్మవారు, ఉబ్బసం వంటివి మనుష్యులకే కాక, పశువులకు కూడా ఆయుర్వేదాన్ని అంటే ఆకు పసర్లతో చేసిన ఔషధాలను వాడేవారు. పాముకాటుకు కూడా నేడు పసర్లనే వాడుతున్నారు. నమ్మకాలలో భాగంగా భూత ప్రేతాలను తొలగించే పద్ధతి మూఢ విశ్వాసమైనా, ప్రపంచాన్ని శాసించే ఒక అద్భుతశక్తి ఉందని అందరూ

విశ్వసిస్తారు. వైద్యులు సైతం మా కర్తవ్యం మేం నిర్వహిస్తాం అంటారు. మేధావులు సైతం పనిలో భగవంతుడిని చూస్తారు. దేవుడున్నాడన్న నమ్మకం కొంత భయాన్ని, విస్మయాన్ని కలిగిస్తుంది. చెడు చేయాలన్న తలంపుకొంత రాదని చెప్పవచ్చు. కొందరైనా సన్మార్గంలో నడిచే అవకాశం ఉంది. ఆహార అలవాట్లు కూడా సాంప్రదాయానుకూలంగా ఉండేవి. పిండివంటలు కూడా ఆయా పండుగలను బట్టి, కాలలను బట్టి తయారు చేయుట జరిగేది ఆరోగ్యాన్ని, శరీరానికి తగిన పోషకాల నందించేలా ఆహార తయారే ఉండేది. ఆహారం మోతాదు మించితే అనారోగ్యానికి దారితీస్తుంది. "లంఘణం పరమౌషథం" అని పూర్వోక్తి పథ్యమే మందుగా వైద్యులు చెప్పడం ఉండేది. వాత, పిత్త, శ్లేష్మ సంబంధ పదార్థాలను దూరంగా ఉంచేవారు. ఇలా నాటి ఆచార సాంప్రదాయాల అలవాట్లు నేటి సమాజానికి అనుసరణీయమైనవిగా చెప్పబడుతున్నాయి. జానపద విజ్ఞాన సంబంధంగా ఇంకా పరిశోధనలు కొనసాగించవలసి అవసరం ఎంతైనా ఉంది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. 1980 జానపద విజ్ఞాన స్వరూపం, - డా॥ ఆర్వీయస్. సుందరం
2. 1983 ఆంధ్రుత జానపద విజ్ఞానం, - డా॥ ఆర్వీయస్. సుందరం
3. 1981 జానపద విజ్ఞాన వ్యాసావళి, - డా॥ జి.యస్. మోహన్
4. 1978 తెలుగు జానపద గేయసాహిత్యం, - డా॥ బి. రామరాజు
5. 1975 జానపద సాహిత్యము - వీరగాథలు, - సుబ్బారావు. తంగిరాల వెంకటడ్రా
6. పత్రికల నుంచి సమాచార సేకరణ.

❀ ❀ ❀

# తెలంగాణా రచయిత్రుల నవలలు -సామాజిక వాస్తవికత

## (వొయినం, జోగిని, ఆమె అడవిని జయించింది)

- సయ్యద్ అఫ్రీన్ బేగం

తెలుగు సాహిత్యంలో తెలంగాణా నవలకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇతర ప్రాంతాలలో లేని నవల కంటే తెలంగాణా నవల భిన్నంగా, విలక్షణంగా కన్పిస్తుంది. పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల నవలా ప్రక్రియ తెలుగులో ప్రవేశించిన ఈ ప్రక్రియ సమాజ పరిస్థితులను పరిణామాలను మానవ ఔన్నత్యాన్ని చిత్రించడంలో తెలంగాణ నవల అద్భుత విజాయాన్ని సాధించింది అనడంలో అతిశయోక్తిలేదు. తెలంగాణా ప్రాంతంలో పేదరికం, నిరక్షరాస్యత, భూమిసమస్య, వెట్టిచాకిరి, అణిచివేత మొదలైన ప్రాంతీయ సమస్యలు తెలంగాణా నవలలో ఉండే మౌలికమైన లక్షణాలు. వీటితో పాటు స్త్రీల జీవితాలను, అనుభవాలను వస్తువుగా తీసుకొని తెలంగాణా నవలా రచయిత్రులు తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు.

మానవజీవితంలో ఉన్న సంక్లిష్టతను సామాజిక వాస్తవికతను పూర్తి నిబద్ధతతో తమతమ నవలలో వ్యక్తీకరించడంలో జాజులగౌరి (వొయినం), శాంతి ప్రబోధ (జోగిని), గీతాంజలి(ఆమె అడవిని జయించింది), ప్రత్యేకంగా పేర్కొనవచ్చు. కథకంటే నవల విస్తృతమైన ప్రక్రియ కాబట్టి మానవజీవితాన్ని, వ్యవస్థలోని లోపాలను విపులంగా చిత్రించడానికి నవలా సాహిత్యాన్ని ఎన్నుకొన్నారు. తెలుగు సాహిత్య పరిపుష్టికి తెలంగాణా నవలా రచయిత్రులు తమ నవలల ద్వారా ఎంతో దోహదమొనర్చారు. వీరి నవలలు మనల్ని ఆలోచింపచేస్తాయి. ఆచరణకు పురికొల్పుతాయి. వొయినం, జోగిని, ఆమె అడవిని జయించింది నవలల్లో సామాజిక వాస్తవికత బలంగా కన్పిస్తుంది.

ఎందుకంటే ఈ ముగ్గురు రచయిత్రులు సామాన్య కుటుంబంలో పుట్టారు. సామాన్యుల కష్టాలను కన్నీలను ఎరిగిన వారు. వారిపై జరిగిన అన్యాయాలను చూసి కసితో రగిలిపోయినవారు. కావున వీరి నవలల్లో జీవిత సత్యాలు అంతబలంగా వేళ్ళనికున్నాయి. ఈ ముగ్గురు రచయిత్రులు కూడా అభ్యుదయ భావాలతో కలం పట్టి స్త్రీ సమస్యలను వాటి పరిష్కారాలను వెతకడంలో నిమగ్నమైనవారే.

సమకాలీన తెలంగాణ సమాజాన్ని ఆవిష్కరిస్తూ సమస్యలకు మూలాలను అన్వేషిస్తూ సామాజిక వాస్తవికతకు దర్పణంపడుతూ కొన్ని అంశాల్లో పరిష్కారాన్ని సూచిస్తూ వీరు నవలా రచనలు చేశారు. ఏ ప్రాంత సాహిత్యానికైన ఆ ప్రాంత సమకాలీన సమాజవే వస్తువును సృష్టిస్తుంది. అలాగే వీరి నవలలకు అసమానతలు, ఆధిపత్యాలు, వివక్షలు, వస్తువులైనాయి. వీరి ఇతివృత్తాలన్నీ వీరి అనుభవంలోంచి వచ్చిన సజీవ దర్పణాలు. ఈ శతాబ్దాంలో ఆధునిక భావాలతో రచనలు చేస్తు సమాజ అభివృద్ధికి తోడ్పడినవారిలో వీరిని మొదటి వరుసలో పేర్కొనవచ్చును.

### జాజులగౌరి - వొయినం :

ఆధునిక సమాజనంలో ఏ మాత్రం స్థానంలేని జీవితాలు ఎలా ఉంటాయో నీలమ్మ, మొగులయ్య భార్యభర్తల ద్వారా రచయిత్రి కళ్ళకు కట్టించారు. గ్రామీణ వ్యవసాయ జీవితంలో ప్రజలు ఎలా జీవించి బ్రతికారో మొగులయ్య ద్వారా చెప్పించారు. "లమ్డికొడ్క చెప్పిన పని జేయ్యాక ఏడవొయ్యి తిరొస్తున్నవురా" అంటూ చంప మీద దెబ్బలు వేసేసరికి మొగులయ్యకు కండ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. తన తండ్రిలాంటి సత్యయ్యను ఎదిరించలేక పోచమ్మను ఏమీ అనలేక గౌరవభావంతో ఉండే వాడు. మొగులయ్యను పెండ్లికొడుకుగా చేసిన రోజునే సత్తయ్య చేతిలో దెబ్బలు తింటూ శిలలా నిల్చుండి

పోయాడే గాని ఒక్క మాటకూడా మాట్లాడలేదు. గొడవ జరుగుతుందని గ్రహించిన చంద్రయ్య, ఎల్లయ్యలు పరుగున వచ్చి సత్తయ్యను వెనక్కులాగి మొగులయ్యను పక్కకు తీసుకొని సముదాయించారు. మర్నాడు నీలమ్మ, మొగులయ్యల పెండ్లి జరిగింది. తమ ఇంటి కంటి వెలుగు నీలమ్మ మరో ఇంటికి కోడలిగా వెళ్లుతుందని తల్లి దండ్రులు ఎల్లమ్మ, సాలయ్య కన్నీళ్ళు పెట్టుకున్నారు.

మొగులయ్య కష్టపడి పండించిన పంటను అంతా తీసుకొని రెండు సంచులిచ్చి మిగతాసంచులు సత్తయ్య తీసుకుపోయాడు. సత్తయ్య చేసిన పొలం పంపకాల్లో మంచిపొలం తీసుకొని బీడుపొలం మొగులయ్యకు ఇచ్చాడు. నీలమ్మ, మొగులయ్య గడ్డపలుగుతో పెద్దపెద్ద రాళ్ళను పెకిలించి బీడుగా ఉన్న చెల్కను పంట భూమిగా మార్చారు. ఇంతలో నీలమ్మ నీళ్ళుపోసుకుందని తెలిసి అంతా సంతోషపడ్డారు. అదే సంవత్సరం ఎక్కువపంట ఇంటికి రావడంతో ఇద్దరూ ఆనందపడ్డారు. వచ్చిన డబ్బుతో కొడుక్కి కొత్తబట్టలు, కరెంటుబిల్లు కట్టి మిగిలిన డబ్బుతో కొత్త నాగలి గొర్రు చేయించాడు.

కాలగమనంలో మూడేండ్లు గడిచాయి. సురేంద్రకు తోడు నరేందర్ కూడా పుట్టాడు. ఇద్దరు కొడుకులను భార్యను చూసుకొని మొగులయ్య మురిసిపోతుంటే జీవితం సాఫీగా సాగిపోతుంది. ఇది సహించలేని సత్తయ్య పగ మాత్రం నానాటికీ ఎక్కువై త్రాచుపాములా బుసకొట్ట సాగింది.

అధికారుల సహాయంతో సత్తయ్య మొగులయ్య చేత స్టాపు పేపర్లమీద వేలిముద్రలు వేయించి మోసపూరితమైన ఆలోచనలతో కాగితాలు తయారుచేయించాడు. జరిగిన మోసం తెలుసుకుని ఏమి చేయాలో తెలియక అప్పటి నుంచి కళ్ళు ఎక్కువగా తాగడం మొదలుపెట్టాడు. దాంతో ఆరోగ్యం చెడిపోయింది. దానివల్ల జ్వరం వచ్చి నీరసంతో ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ద్నువొయినం

దు:ఖాన్ని దిగమింగి నీలమ్మ ఇద్దరిపిల్లలతో సత్తయ్య కుతంత్రానికి అడ్డుకట్టవేయడానికి సొంతంగా తన పొలాన్ని దున్నించి నాట్లు వేయించింది. తల్లిదండ్రుల ప్రోత్సహంతో ఓ శుభముహుర్తన ఇల్లు కట్టుకొని అందులోకి మారింది. భర్త లేకపోయినా చైతన్యంతో సత్తయ్యకు ఎక్కడ వేటుపడాలో అక్కడ వేటు వేసింది. మొగులయ్య ఓ భూమి కోసం ఎంత తల్లడిల్లాడో ఆ భూమికి చెందిన పట్టా కాగితాలను చేతికి చిక్కించుకుంది. ఇన్నిరోజులు దేనికోసమైతే పోరాటం చేసిందో ఆ పొలం ఈ రోజు తనకు దక్కింది. ఈ పొలాన్ని సాగుచేస్తూ పిల్లలను బాగా చదివించి వారికి బంగారు భవిష్యత్తుని ఇచ్చింది. వొయినం నవల గ్రామీణ పేద మాదిగల జీవితాన్ని, సంస్కృతిని ఆర్ద్రంగా చిత్రించింది. నగర జీవితం కాకుండా గ్రామీణ వ్యవసాయ జీవితాన్ని తెలంగాణ ప్రజలు ఎలా జీవిన్తూ వచ్చారో ఈ నవల తెలుపుతుంది. తల్లి దండ్రులను, తన పొలాన్ని కోల్పోయిన మొగిలయ్య అతనికి అర్ధాంగిగా మారిన నీలమ్మ ఈ కష్టాలగుండా ఎలా పయనిస్తూ వచ్చారో వొయినం నవల చిత్రించింది. సన్నకారు వ్యవసాయదారులుగా జీవించే మాదిగలు ఒక స్వయం సంపూర్ణ గ్రామీణ సమాజంగా శతాబ్దాలుగా ఎలా జీవిస్తూ వచ్చారో తెలుసుకోవడానికి ఈ నవల ఉపయోగ పడుతుంది. ఆధునిక అభివృద్ధిలో, ఆధునిక సమాజంలో ఏ మాత్రం స్థానం లేని జీవితాలు ఎలా ఉంటాయో వొయినం నవల కళ్లకు కట్టిస్తుంది. సికింద్రాబాదు నగర పరిసరాలలోని 1970-80 మధ్య పేద మహిళల జీవితాల లోని అనేక కోణాలను ఈ నవలలో అస్తిత్వ చైతన్యంతో చిత్రించారు. ప్రతి సందర్భంలో జానపదులు పాటలు పాడుకునే క్రమాన్ని ఈ నవలలూ సహజంగా రచయిత్రి చిత్రించారు. వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ తమదైన సంస్కృతిని జీవితాన్ని ప్రత్యేకమైన భాషను, నుడికారాన్ని, సామెతలను ఎలా తమ సంపదగా, వారసత్వంగా కొన సాగిస్తూ వస్తున్నాయో ఈ నవల ద్వారా తెలుసుకోవచ్చు.

వొయినం నవలలోని సంఘటనలు సన్నివేశాలు, పాత్రలు వారి స్వభావాలు చదువుతుంటే పాఠకులు నవలలోని ప్రధాన పాత్రలైన మొగిలి, నీలమ్మ, మొగ లయ్య పాత్రలలో లీనమై పోతారు. ఈ పాత్రల ద్వారా రచయిత్రి సమకాలీన సంఘటలను, వివిధ ధోరణులను

ఈ నవలలో జొప్పించి తెలంగాణ మాండలిక భాషలో తీర్చిదిద్దారు. ఈ నవలలో సామాజిక దృక్పథంతో పాటు మాదిగ చైతన్య స్పృహను కూడ కనిపిస్తుంది.

### గీతాంజలి (డా॥. భారతి) - ఆమె అడవిని జయించింది :

ఆమె అడవిని జయించింది అనే స్త్రీవాద నవల రాశారు. భాషలో స్థానీయతను, సహజత్వాన్ని ఈ నవలలో ఆమె సాధించారు. ఆదిలాబాద్ జిల్లా భాషను ఆమె అత్యంత సమర్థంగా వాడారు. ఒక కులవర్గ మాండలికాన్ని ఇంత సమర్థంగా వాడిన వారు చాలా అరుదు. ఒక కుటుంబంలోని స్త్రీల మధ్య అనేక సమస్యలను, ఇబ్బందులను ఎదుర్కొని వారిని గెలిచిన స్త్రీ కథ ఇది.

ఇంటా బయటా అణచివేతకు గురౌతున్న స్త్రీలను పరిశీలించిన సంధ్య ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటేనే స్త్రీలు అణిచివేతనుండి దోపిడి నుంచి విముక్తిపొందగలరని విశ్వసిస్తుంది. చదువు అధ్యాయనం ఉద్యోగాలు, స్త్రీలలో మరింత చైతన్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని గ్రహిస్తుంది. ఆ దిశగా తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ధేశించుకున్న సంధ్య ఆశలన్నీ ఆమె వైవాహిక జీవితంలో చెల్లా చెదురైపోతాయి. తన ఇంటిలో తన పెళ్లిగురించి పెరిగిన ఒత్తిడి మూలాన మెడిసిన్ ముగియకుండానే ప్రాక్టిస్ చేసి నిలదొక్కుకున్న తరువాతే పెళ్లి చేసుకోవాలనే కల సాకారం కాకుండనే పెళ్లి అయిపోతుంది. స్త్రీ తక్షణ సమస్యలను పరిష్కారించుకుంటునే అంతిమ లక్ష్యమైన స్త్రీ విముక్తికై పోరాటంలో భాగం కావాలని నమ్మిన సంధ్య మహిళా విమోచన సంస్థలో చేరుతుంది. తాను అడవిని జయించాను అనుకుంటుంది. సంధ్య అడవిని జయించిందా? లేక దండకారాణ్యంలో ప్రవేశించిందా? ఇటువంటి ప్రశ్నలు పాఠకులను తప్పకుండా ఆలోచింప చేస్తాయి.

కుటుంబంలో స్త్రీ పురుషుల అభిరుచులకు అనుగుణంగా నడవడం వాళ్ళల్లో ఆత్మ గౌరవం, ఆత్మాభిమానం, సంప్రదాయాల పేరుతో అణచబడడం స్త్రీలు ఎటువంటి స్వాతంత్ర్యం స్వేచ్ఛా లేకుండా హింసకు గురికావడం మొదలైనవి ఈ నవలలో చిత్రీకరించారు. పితృస్వామ్య వ్యవస్థ స్త్రీల మీద అమలు చేస్తున్న అణిచివేతలతో పాటు కుట్రలను బహిర్గతం చేయడం, అలాగే స్త్రీ పురుష సంబంధాలలోని అమానవీయ అంశాల చర్చ అదే విధంగా మానవ ప్రవర్తనకు, ప్రవృత్తులకు వెనుక సామాజిక మూలాన అన్వేషన ప్రయత్నం మొదలవడంతో.

నవలలో ప్రధాన పాత్ర సంధ్య అంతిమంగా స్త్రీ విముక్తి కోసం పోరాటబాటలో ప్రయాణం మొదలవడంతో ఈ నవల ముగించారు. తన అన్ని వైయుక్తిక సమస్యలకు మూలాలు సమాజంలో ఉన్నాయని సమూల సామాజిక మార్పులలో భాగంగానే స్త్రీ విముక్తి సాధ్యమౌతుందని తెలుసుకొని పోరుబాటలోకి మళ్ళడం ఎన్నో త్యాగాలను చేస్తూ ప్రయాణాన్ని సాగిస్తూ, తన చివరి లక్ష్యాన్ని సాధించాలనుకుంటుంది సంధ్య. తన చుట్టూ ఉన్న సమస్యలన్నీ పెద్ద అరణ్యంలాంటివి. ఆ సమస్యలన్నిటిని జయించి ఒక పరమార్థాన్ని గ్రహించడం వల్ల "అడవిని జయించానని" నమ్ముతుంది. రచయిత్రి కూడా "ఆమె అడవిని జయించింది" అంటూ ప్రకటించి ఈ నవలను ముగిస్తారు. ఇతివృత్తానికి అనుగుణంగా నవలా శీర్షికను పెట్టడం జరిగింది.

'ఆమె అడవిని జయించింది' నవలలో, భాషలో స్థానీయతను, సహజత్వాన్ని సాధించారు. ఆదిలాబాద్ జిల్లా భాషను ఆమె అత్యంత సమర్థంగా వాడారు. ఒక కులవర్గ మాండలికాన్ని ఇంత సమర్థంగా వాడినవారు చాలా అరుదు. ఒక కుటుంబంలోని స్త్రీల మధ్య అనేక సమస్యలను, ఇబ్బందులను ఎదుర్కొని వారిని గెలిచిన స్త్రీ కథ ఇది. అయితే, ఇటువంటి ఇతివృత్తాలను తీసుకున్నప్పుడు చైతన్యవంతులు, మేధావులు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి వుంటుంది. మనకన్నా తక్కువ చైతన్యవంతులైనవారి పట్ల సానుకూల దృక్కోణం రచనలో వ్యక్తం కావాలి. వెనకబడిన ప్రాంతాల్లో నివసించే స్త్రీలు చైతన్యం కొరవడి గతానుగతిక పురుషాధిక్య భావజాలాన్నే మోసుకుని తిరుగుతుంటారు. వారిని చైతన్యం పొందిన స్త్రీలతో బేరీజు వేసి చూడడం భావ్యం కాదు.

**శాంతి ప్రబోధ – జోగిని :**

విద్య, కవిత కలసి స్త్రీ పద్మావతి విశ్వవిద్యాలయంలో చదువుకున్నారు. వీరిద్దరూ మంచి స్నేహితురాలు. కవిత విద్యను తమ ఊరు రమ్మని ఆహ్వానించింది. అక్కడికి వెళ్ళిన తరువాత విద్య జోగిని అనే పదాన్ని విన్నది. కవిత తండ్రి రాజాగౌడ్‌ని జోగిని గురించి అడిగింది. జోగిని గురించి చెప్పడానికి ఇష్టపడడం లేదని విద్య గ్రహించింది. అప్పటి నుండి జోగిని గురించి తెలుసుకోవాలని జోగిని వ్యవస్థమీద పిహెచ్‌డి చేయాలని కోరిక కలిగింది. ఆ ఊరిలో సాయవ్వ అనే జోగినిని విద్య కలిసింది. జోగిని అంటే ఏమిటో చెప్పమన్నది. నీకిష్టం లేకపోతే చెప్పవద్దు అనగానే సాయవ్వ "జోగిని నిత్య సుమంగళి ఆమెకు వైధవ్యం లేదు. చిన్నప్పుడే దేవతను లగ్నం చేసుకుంది. కాబట్టి దేవతకు ప్రతిరూపం ఈమె ఊరు విడిచి ఎక్కడికీ పోరాదు. ఆమె ఊరందరికీ పెండ్లాము. ఆమె దగ్గరికి ఎప్పుడంటే అప్పుడు పోవచ్చు రావచ్చు అప్పుడు ఆమె కాదనుకూడదు. జోగిని పిల్లలకు తండ్రి ఉండడు అని సాయవ్వ చెప్పింది. దాంతో విద్యకు కోపంవచ్చి ఎంత అమానుషం ఆమె ఇష్టా ఇష్టాలతో సంబంధం లేకుండా వాడుకుంటారా? దీనిని ఎట్లాగయిన రూపుమాపాలి. అని ఆలోచించ సాగింది. తరువాత ఆమె కూతురు పోశవ్వను కలిసింది.

కొన్ని రోజులకు ఆ ఊరిలో విద్య తెలుసుకున్నది ఏమిటంటే జోగిని వ్యవస్థను అడ్డుపెట్టుకుని దొరలు మాల మాదిగల మధ్య విభేదాలు సృష్టిస్తూ విద్వేసాలు రెచ్చగొడుతూ అన్నదమ్ముల లాంటి వాళ్ళు కొట్టుకు చస్తుంటే పెద్దరికం ముసుగులో సమస్యను తెగనీయకుండా మరింత ఆజ్యం పోస్తున్నారని తలచింది. దీని ద్వారా స్త్రీ జీవితాలను పాడుచేస్తున్నారని తలచింది. భోజాగౌడ్, ప్రతాప్ రెడ్డి, రాజాగౌడ్ వీరు జోగిని అనే ముద్రవేసి వాళ్ళను ఉంచుకునేవారు. మగవాడికి ఎంత మంది ఆడవాళ్ళతో తిరిగితే అంత మగతనం అనుకునే వారు. వీరిలో మొదటివారు రాజాగౌడ్ పదిరోజుల్లో జోగుపట్టం కట్టమని పోశవ్వకు చెప్పారు. పెద్దల నిర్ణయం మేరకు పోశవ్వకు జోగిపట్టం కట్టాడానికి మహూర్తం పెట్టారు. ఆరునెలలకే పోశవ్వ పెద్దదయింది. దాంతో రాజాగౌడ్ ఆమె దగ్గరకు చేరాడు. ఆమె గుండె చెదిరి పోయింది. ఒక్క ప్రక్క సారాకంపుతో ఆమెను బంధించి దగ్గరకు లాక్కున్నాడు. ఆ పెనుగులాటలో ఆమె అతన్ని ఒక్క తోపుతోసి తప్పించుకొనుటకు ప్రయత్నించింది. జోగుముండ ఎందుకోసమనుకున్నవే ఇంతా చేసింది అంటు బూతులు తిడుతూ మళ్ళీ ఆమె మీదకు వెళ్ళాడు దెబ్బతిన్న పులిపిల్లలా అతని మీదపడి రక్కబోయింది. ఆమె నోట్లో తువ్వాలు కుక్కి ఆమెను అనుభవించాడు. ఆమె స్పృహవచ్చేసరికి రక్తం కారుతుంది. ఆ రక్తస్రావం చూసి తల్లి ఆమెను పట్టుకొని బోరుమంది. అగ్రకులాల అహంకారంతో ధన, కామ బలంతో అడవి మనుషుల్లా ప్రవర్తిస్తున్నారని పోశవ్వ భాధపడింది. దీనికి చావు పరిష్కారం కాదని జోగినిగానే ఉంటూ అన్ని దోపిడీలను సమర్థవంతంగా ఎదుర్కొంటు ఎదగాలనుకుంది.

చదువు సంధ్యలేని ఆమె ఒక నాడు జోగినిగా అష్టకష్టాలను అనుభవించి దళిత నాయకురాలుగా సర్పంచ్‌గా, మహిళా సంఘ నాయకురాలుగా మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలుగా అనేక కార్యక్రమాలు చేసిన కారణంగా జాతీయస్థాయిలో పోశవ్వ "నీరజా బానోత్" అవార్డును రాష్ట్రపతి చేతులు మీదుగా అందుకుంది. సమాజంలో అసమానాతలను ఎదుర్కొంటూ ఆత్మ స్థైర్యంతో, విశ్వాసంతో మహిళా లోకానికి ఆదర్శంగా నిలుస్తు ముందడుగు వేసింది.

శైవమతంలోంచి పుట్టుకొచ్చింది. జోగిని వ్యవస్థ. ఈనాడు దక్షిణాది ప్రాంతాలలో ముఖ్యంగా కన్నడ, తెలంగాణ ప్రాంతాలలో వీరశైవులు ఎక్కువగా ఉన్నారు. వీరికి కుల, మత భేదం లేదు. అందులోంచి వచ్చిందే జోగినీ లేదా బసినివ్యవస్థ దైవసన్నిధిలో కాలం గడుపుతూ, దైవ కార్యాలలో పాల్గొనే కొందరు బాలికలను శైవులు జోగినులు, బిసినిలు, మాతంగులు అని రకరకాలుగా పిలిచేవారు. పెళ్ళి కాని ఆడపిల్లల్ని దేవతలకు ఇచ్చి పెళ్ళి చేయడం గ్రామాలలో దేవతలకు అంకితం చేయడం ఆనాటి నుండే ఈ జోగినీ వ్యవస్థ ఉన్నదని తెలుస్తుంది.

తెలంగాణ ప్రాంతంలో తరతరాలుగా ఎందరో మహిళలు నరకంగా మార్చిన జోగినీ దురాచారంపై వారి దుర్భర జీవితాలను, నరకంగా మార్చిన జోగినీ వ్యవస్థపై ప్రత్యక్షంగా పరిశీలన జరిపి తర్వాత కలిగిన ఆలోచనలకు అక్షర రూపమే జోగినీ నవల ఎన్నో వందల ఏళ్ళనుండి ఆడపిల్లల్ని జోగినిగా మార్చే ఆచారం వుంది. ఎల్లమ్మ పేరు ఎమీదో, పోశమ్మ పేరు ఎమీదో మరోపేరు మీదో ఆడపిల్లను, ఆడదేవతకు అంకితంక చేసి ఊరుమ్మడి ఉంపుడు' గత్తెగా మార్చారు. దారిద్ర్యం, అజ్ఞానం, అంటరానితనం, అమాయకత్వంతో పెరుగుతూ తండ్రి ఎవరో తెలియక సమాజంలో తమకు జరుగుతున్న అవమానాన్ని, అన్యాయాన్ని, అమానుషాన్ని తెలుసుకోలేక పోయారు. ఈ నవలలో ప్రధానపాత్ర పోశవ్వ అభ్యుదయ భావాలు కలిగిన విశిష్ట పాత్ర. తనతోపాటు ఇతర జోగినిగా ఉన్న స్త్రీలలో మార్పురావాలనీ కోరుకుంటుంది. ముత్తెమ్మ, సాయమ్మ, సబిత మొదలైన వారు జోగినీలు ఈ దురాచారమునకు బలైనవారే.

"నీబాంచెన్ దొరకాల్మొక్త దొర. గులాపోల్లం అన్కుంట దొరలు, పెద్ద కుల ఓల్లు, పటేండ్లు, ఊరోల్లు సెప్పినట్లు వారి మాటలు ఖాతర్ చేయకుంటే ఈ గులాపోల్ల బతుకులు సర్వనాశ్నం అయితాయని తలచిన పోశవ్వ చివరకు గ్రామ సర్పంచ్‌గా మండల పరిషత్ ప్రెసిడెంట్‌గా దళిత ఉద్యమకార్యకర్తగా మహిళోద్యమ కార్యకర్తగా సాధికారికతను సాధించింది. నీ బాంచన్ కాల్మొక్త మనస్తత్వం తగ్గి కొత్తగా ఆత్మ విశ్వాసంలో సమాజాన్ని జాగృతం చేసింది.

ఏ రచనైనా సామాజిక శ్రేయస్సును కోరాలి. తద్వారా వాస్తవికతను ప్రతిబింబించాలి. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎందరో రచయిత్రులు తమదైన శైలిలో సమాజాన్ని ప్రభావితం చేశారు. ఈ శతాబ్దంలో ఆధునిక భావాలతో రచనలు చేస్తూ సమాజాభివృద్ధికి తోడ్పడిన వారిలో చాలా మంది రచయిత్రులు కనిపిస్తున్నారు వారిలోవి. జోగిని నవల ద్వారా అనేక సామాజిక సమస్యలను వివరించి వాటిని పరిష్కరించి పోశవ్వ అనే జోగినీని చైతన్యవంతం చేసి గౌరవప్రదమైన స్త్రీగా మార్చింది. ఈ నవలలో కేంద్ర బిందువు స్త్రీ. అన్ని నవలలవలె నాయిక అందానికి ప్రాధాన్యం ఇవ్వక వారి అభ్యున్నతిని కాంక్షించింది. మొత్తంగా తెలంగాణ నవల ఇటీవలే ప్రారంభం కాలేదని, తెలుగు నవల ఆవిర్భావానికి తెలంగాణ నవలలో కూడా బీజాలున్నాయని వీటి ద్వారా మనం అర్థం చేసుకోవచ్చు.

శైవమతంలోంచి పుట్టుకొచ్చింది. జోగిని వ్యవస్థ. ఈనాడు దక్షిణాది ప్రాంతాలలో ముఖ్యంగా కన్నడ, తెలంగాణ ప్రాంతాలలో వీరశైవులు ఎక్కువగా ఉన్నారు. వీరికి కుల, మత భేదం లేదు. అందులోంచి వచ్చిందే జోగినీ లేదా బసినివ్యవస్థ దైవసన్నిధిలో కాలం గడుపుతూ, దైవ కార్యాలలో పాల్గొనే కొందరు బాలికలను శైవులు జోగినులు, బిసినిలు, మాతంగులు అని రకరకాలుగా పిలిచేవారు. పెళ్ళి కాని ఆడపిల్లల్ని దేవతలకు ఇచ్చి పెళ్ళి చేయడం గ్రామాలలో దేవతలకు అంకితం చేయడం ఆనాటి నుండే ఈ జోగినీ వ్యవస్థ ఉన్నదని తెలుస్తుంది.

తెలంగాణ ప్రాంతంలో తరతరాలుగా ఎందరో మహిళలు నరకంగా మార్చిన జోగినీ దురాచారంపై వారి దుర్భర జీవితాలను, నరకంగా మార్చిన జోగినీ వ్యవస్థపై ప్రత్యక్షంగా పరిశీలన జరిపి తర్వాత కలిగిన ఆలోచనలకు అక్షర రూపమే జోగినీ నవల ఎన్నో వందల ఏళ్ళనుండి ఆడపిల్లల్ని జోగినిగా మార్చే ఆచారం వుంది. ఎల్లమ్మ పేరు ఎమీదో, పోశమ్మ పేరు ఎమీదో మరోపేరు మీదో ఆడపిల్లను, ఆడదేవతకు అంకితంక చేసి ఊరుమ్మడి ఉంపుడు' గత్తెగా మార్చారు. దారిద్ర్యం, అజ్ఞానం, అంటరానితనం, అమాయకత్వంతో పెరుగుతూ తండ్రి ఎవరో తెలియక సమాజంలో తమకు జరుగుతున్న అవమానాన్ని, అన్యాయాన్ని, అమానుషాన్ని తెలుసుకోలేక పోయారు. ఈ నవలలో ప్రధానపాత్ర పోశవ్వ అభ్యుదయ భావాలు కలిగిన విశిష్ట పాత్ర. తనతోపాటు ఇతర జోగినిగా ఉన్న స్త్రీలలో మార్పురావాలనీ కోరుకుంటుంది. ముత్తెమ్మ, సాయమ్మ, సబిత మొదలైన వారు జోగినీలు ఈ దురాచారమునకు బలైనవారే.

"నీబాంచెన్ దొరకాల్మొక్త దొర. గులాపోల్లం అన్కుంట దొరలు, పెద్ద కుల ఓల్లు, పటేండ్లు, ఊరోల్లు సెప్పినట్లు వారి మాటలు ఖాతర్ చేయకుంటే ఈ గులాపోల్ల బతు కులు సర్వనాశ్నం అయితాయని తలచిన పోశవ్వ చివరకు గ్రామ సర్పంచ్‌గా మండల పరిషత్ ప్రెసిడెంట్‌గా దళిత ఉద్యమకార్యకర్తగా మహిళోద్యమ కార్యకర్తగా సాధి కారికతను సాధించింది. నీ బాంచన్ కాల్మొక్త మనస్తత్వం తగ్గి కొత్తగా ఆత్మ విశ్వాసంలో సమాజాన్ని జాగృతం చేసింది.

ఏ రచనైనా సామాజిక శ్రేయస్సును కోరాలి. తద్వారా వాస్తవికతను ప్రతిబింబించాలి. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎందరో రచయిత్రులు తమదైన శైలిలో సమాజాన్ని ప్రభావితం చేశారు. ఈ శతాబ్దంలో ఆధునిక భావాలతో రచనలు చేస్తూ సమాజాభివృద్ధికి తోడ్పడిన వారిలో ఈ ముగ్గురు రచయిత్రులు మొదటి వరుసలో కన్పిస్తారు. ఈ మూడు నవలలు సజీవమైన పాత్రలతో పాఠకులకు ఎప్పటికీ గుర్తుండేలా చిత్రికరించారు.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# కాళోజి కవిత్వము - సామాజిక స్పృహ

- నోముల రాజు, పరిశోధక విద్యార్థి, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. వరంగల్, తెలంగాణ.

**కాళోజి గూర్చి మాట్లాడుతె**

మాట తూటైతది
పాఠం పాటైతది
ఉపన్యాసం ఊటైతది
అది కోట్ల గుండెల్లోకి చేరె బాటైతది

ఆయనను చేరలంటె

ఊక దప్పుడు మాటలొద్దు
ఊ కొడుతె ఉరుము కావాల
చూస్తెనె విప్లవ మెరుపు రావాల
నీ సింగం పంజాను చూసి చీకటి పారిపోవాల
అప్పుడు కనబడేది కాళోజి

కాళోజి గారు "నిర్భీతికి సింహస్వప్నం". అన్యాయాలను ఎదిరించిన ఒక దిక్కార స్వరము. ప్రపంచం తీరుపై కాళోజి ఆవేదన ఈ విధంగా ఉంది.

నిలువు దోపిడిల నిత్య ప్రపంచము
చిలుక పలుకుల పలుకు ప్రపంచము
వియ్యాలకు విచ్చేసి ప్రపంచము
కయ్యాలకు కాల్దువ్వ ప్రపంచము

పై కవితలో ప్రపంచంలో పలు రకాల మనుషులుంటారని, అది చిలుక పల్కుల వారు, నిలువు దోపిడి గాండ్లు, వియ్యాల,కయ్యాల వంటి పలు రకాలుగ ప్రపంచంలో ఉంటారంటారు.

రాయి రువ్వినా రాకెట్ విసిరినా
గిట్టని వానిని కొట్టుటకే కదా
కాల నడిచినా కారు ఎక్కినా
కోరిన చోటికి చేరుటకే కదా
పోయి చెప్పినా ఫోన్ చేసినా
తలచినదేదో తెలుపుటకు కదా
ఏడు మారినా ఈడు ముదిరినా
ఏమి మారినవి ఈ లోకంలో

సమాజంలో ప్రతి పని అనుకున్నది సాదించడానికి ప్రయత్నిస్తాడు అలాంటి పనులలో ఎంత చేసిన, ఎంత మార్చిన వయస్సు, కాలం మారుతుందె తప్ప అభివృద్ధి లేదని ఆవేదన చెందారు.

అన్నపు రాసులు ఒక చోట
ఆకలి మంటలు ఒక చోట
హంస తూలికాలొక చోట
అలసిన దేహాలొకచోట
సంపదలన్నీ ఒక చోట
గంపెడు బలగంబొక చోట
కమ్మని చకిలాలొక చోట
గట్టి దేడలింకొక చోట

సమాజంలో దరిద్రం, చీకటి, ఆకలి, శ్రమలు ఒక చోట ఉంటె, వెలుగు, సంపదలు, అన్నము, హంస తూలికలు మొదలయినవి వేరొక చోట ఉంటాయి. అని సమాజంలోని లోప భూయిష్టమైన వ్యత్యాసాలను చూపించారు.

**దేశ పాలన తీరుపై కాళోజి ఆక్రందన :**

అప్పుల పాలయి పోయింది జనత
తప్పుల కుప్పయి పోయింది ప్రభుత
ప్రాజెక్టులకు పడుతున్నాయి గండ్లు
రాజ్యాధికారులకు అగుపడవు కండ్లు
బాపు ! నువ్వేడున్నావు బాపూ !
చూపు మాకెవ్వడున్నాడు కాపు?

ప్రజలు అప్పులు కాకుండ, తప్పులు చేయని ప్రభుత్వం ఉన్నట్లయితే తూట్లు పడకుండా ప్రతి ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. అలాంటి వాడిని (నాయకుడిని) మహాత్మ నీవేక్కడ వున్న మాకు చూపు - అతనినె సమాజానికి "కాపు" అంటారు.

**కాళోజి ఓటు – ఓటు విలువను తెల్పు కవిత !**

అభ్యర్థి ఏ పార్టి వాడని కాదు
ఏపాటి వాడో చూడు
పెట్టుకొచ్చిన టోపి చూడకు
వాడు జనంకు పెట్టిన టోపి చూడు

కాబోయె నాయకుడు ఏ పార్టి వాడైతేనేంటి కాని, ఇంతకు ముందు వాని ప్రవర్తన పాలన చూసి మాత్రమే ఓటు వేయాలంటాడు.

నేనంటే ఓటరు
నా గొడవ ఓటేసే వారు
నేనంటే తిరుగుబాటు దారు
నా గొడవ మన తిరుగుబాటు

నేనె ఓటరుని, నా గొడవె - ఓటు వేయు వారి గొడవ, అదంటెనె తిరుగుబాటు అంటారు.

**దొంగ రాజకీయ నాయకులను తన్ని తరుమాలం టాడు!**

దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకుని
దొరలై వెలిగేదెన్నాళ్ళు?
బాదలు పెట్టి పలుకనీయని
పాపుల భయమింకెన్నాళ్ళు?

అని దొంగలుగ దోచుకుని దొరలుగ మారిన రాజ్యం మారాలంటారు.

**నాయకుడిని ఎన్నుకొనెప్పుడు బుద్ధి ఉండా లంటారు**

మట్టి బానలు కొనిన కొట్టి చూచెదము
సరకు కొన వీధిల్ల తిరిగి చూచెదము
పండు పండెనా లేదో పట్టి చూచెదము
వరునన్ని విదముల తరచి చూచెదము
ఓటేసినప్పుడే ఉండాలె బుద్ది
ఎన్నుకొని తలబాదుకొన్న ఏమగును
తర్వాత ఏడ్చినను తప్పదనుభవము.

సంతలో మనము ఏ వస్తువు కొన్న తరచి తరచి చూస్తాము. అలాంటిది మనలను ఏలె నాయకుడిని బాగ ఆలోచించి ఓటు వేయాలె తప్ప, మోసగాల్లకు ఓటు వేసాక తెలిసి బాదపడ్డె లాభం లేదంటాడు.

**తల్లి భాష కోసం – కాళోజి మందలిపు :**

తెలుగు బిడవురోరి తెలుగు మాట్లాడుటకు
సంకోచ పడియెదవు సంగతేమిటిరా?
అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు - రాదంచు
సకిలించు ఆంధ్రుడా ! చావవెందుకురా?

ఈ నాగరిక ప్రపంచంలో పరాయి భాషలు నేర్చి, తల్లి తెల్గు భాష రాదని సకించె ఆంధ్రులు చచ్చిన మంచిదె అని మందిలింపు.

కాళోజి "నా గొడవ' ఆశయం సమన్యాయ స్వర్గము

మళ్ళీ ఒక దుమారం రేగాలె
మళ్ళీ ఒక ఉప్పెన రావాలె
మళ్ళీ జనం తిరుగుబాటు చేయాలె
అవినీతిని దించాలె
నీతిని పెంచాలె
అన్యాయాన్ని ఎదిరించాలే
అన్యాయాన్నెదించినోడు నాకు ఆరాధ్యుడు
అన్యాయం అంతరిస్తే "నా గొడవకు" ముక్తి ప్రాప్తి

ఏనాటికైన అవినీతి, అన్యాయం ఉన్న చోట తప్ప కుండ తిర్గుబాటు రావాలె, అవినీతిని దించాలె, అన్యాయంను ఎదిరించినోడు నాకు ఆరాధ్యుడు. అంది అంతరిస్తే నా గొడవకు "ముక్తి" అంటారు.

తెలంగాణ వేరైతే
దేశానికి ఆపత్తా?
తెలంగాణ వేరైతే
తెలుగు బాస మురుస్తరా?
తెలంగాణ వేరైతే
కిలోగ్రాము మారుతుందా?
వానపడక పోతాయా?
చెలిమిలెండి పెతాయా?

తెలంగాణ తొలి ఉద్యమ కాలంలోనే ఆంధ్ర నుండి తెలంగాణ వేరైతె ఎవరికి ఏ ఆపద రాదని చెప్పిన ముందు చూపు కల్గిన వారు.

ప్రాంతేతరుడే దోపిడి చేస్తే
ప్రాంతం దాకా తన్ని తరుముతాం
ప్రాంతం వాడే దోపిడి చేస్తే
ప్రాంతంలోనే పాతర వేస్తాం?

తెలంగాణను మందికంటె మనవాళ్ళు తప్పు చేస్తె క్షమించేది లేదని చెప్పారు.

**బువ్వ పెట్టె రైతన్నలను - మరువలేదు కాళన్న:**

ధార్మికుని దానాలు పండితుని భాష్యాలు
వర్తకుని వ్యాజ్యాలు వకీళ్ల వాదాలు
సైనికుని శౌర్యాలు యాంత్రికుని యంత్రాలు
యోధుల యుద్ధాలు రాజుల రాజ్యాలు
కర్షకా ! నీ కఱ్ఱు కదలినన్నాళ్ళే.
పండించు ప్రాణాలు పస్తుపడ్డాక
పాడు రాజ్యాన్ని కాపాడకుంటేమి?
రక్షించు వారలె భిక్షించినాక
విష్ణువని రేని సేవింపకుంటేమి?

దానం చేసేవాడి నుండి పాలన చేసె వాడి దాక అందరు జీవించాలంటె రైతు కష్టపడనిదె

అభివృద్ధి లేదని అలాంటి రైతె తిండి లేకుంటె దేవుడనెటోడు ఎవడు అని అతని ఘాటు ప్రశ్న అతని దృష్టిలో రైతె దేవుడు.

పుట్టుక, బతుకు, చావు, దేశం, జ్ఞానాల గూర్చి ఈ విధంగా అంటారు.

పుట్టుక నీది
చావు నీది
బతుకంత దేశానిదే
ఒక్క సిరా చుక్క
లక్ష మెదళ్లకు కదలిక

కాళోజి సామాజిక, రాజకీయ సంఘటనలు - అనుభవాలు:

నిజాం కాలంలో హిందు దేవతల ఆరాధనను, తెలుగు భాషను నిజాం రాజు అణచివేయడం - హేళన చేయడం జరిగింది.

కాళోజి, గద్దర్, వరవరరావు లాంటి వాళ్లను ఇతరులతో పోల్చి అసలు వీరు కవులె కాదని అన్నారు. అలాంటి సమయంలో కవులందర్ని ఏకం చేసి తన ఇంట్లో చర్చలు జరిపారు.

**నిర్భీతికి దర్పణం కాళోజీ :**

1946లో తెలుగు కవి సమ్మేళనంకై చలువ పందిళ్ళు వరంగల్ కోటలో వేయగ నిజాం రాజు దానిని వ్యతిరేకిస్తు పందిళ్ళు తగలబెట్టిన, ధైర్యంతో మళ్ళీ పందిళ్ళు వేయించి కవి సమ్మేళనం పెట్టారు.

1947లో ఆగష్టు 15న హన్మకొండ (బ్రాహ్మణవాడ)లో స్వతంత్ర్య జెండ ఎగరేసి స్వేచ్ఛ గీతం పాడటం నిజాం రాజుకు వ్యతిరేకమె.

అదే విధంగా 1970లో నక్సలైట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హయావగ్రీవ చారిని కాల్చి చంపారు. దానికి ప్రతికారంగా రాజ్యం మానవ హక్కులనేత నర్రా ప్రభాకర్‌రెడ్డిని చంపారు. కాళోజి ఈ రెండు దుర్ఘటనలను విరసం నేతగ, న్యాయ వాదిగా నిరసించాడు.

ప్రహ్లాదుడి దీక్ష భగ్నం అయితే నరసింహస్వామి వచ్చినట్లు అనచబడిన వారి కోసం నక్సలైట్లు వస్తె ఏంటి అని నక్సలైట్లను సమర్థించినారు.

1994లో ఎన్నికలను బహిష్కరించాలన్న నక్సలైట్లకు - ఓటు వేస్తే వెళ్ళు నరుకుతారేమో నరకండి అంటు తానె ముందు నక్కలగుట్టలో ఓటు వేసాడు.

అంతేగాక 1997లో జె.ఎన్.ఎస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక తెలంగాణ వేదికను పేల్చి వేస్తామని దుండగులు ప్రకటించిన ''ఏదీ పేల్చేయండ్రా'' అంటూ గర్జిస్తు సభనెక్కాడు.

**నిస్వార్థ - నిరాడంబరుడుగ ఉంటాడు - కాళోజి:**

అతిథివొలె వచ్చాను - అతిథివోలె పోతాను అంటు ఆడంబరాలకు, అహంకారాలకు చోటివ్వడు.

ఆనాటి కాలంలోనే ప్రధాని పి.వి. నర్సింహారావు గారినె ''ఏందిరా'' అనె సఖ్యత ఉన్నను ఏదియు ఆశించలేదు.

నా చేతి కర్ర - జబ్బకు సంచి, నా కలంలె నా ఆస్తి అనేవారు.

అలాగె మా అన్న రామేశ్వరరావు గారి ఇంట్లో అల్మార్‌లో గల పుస్తకాలె నా ధనం అనేవారట.

అందుకనె కాళోజి అంటారు ఒక్క సిరాచుక్క లక్షమెదళ్ళ కదలిక అంటారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. కాళోజీ యాదిలో - కాళోజీ ఫౌండేషన్, 2002.
2. 7 సెప్టెంబర్, 2014 ఆదివారం ఆంధ్రజ్యోతి వారపత్రిక, కాళన్న యాదిలో
3. కాళోజీ జీవితం సంక్షిప్త పరిచయం - వల్లంపట్ల నాగేశ్వరరావు.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# ఆడియో గీతాలలో వడ్డెరల స్థితిగతులు - విశ్లేషణ

- పి. అనిల్ కుమార్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

దేశంలోని ఏ మహానిర్మాణమైనా, ఆకాశాన్ని చుంబించే మహాసౌధాలైనా, నేలలో నిర్మించబడిన ఏ నిర్మాణమైనా పునాది రాళ్లు లేకుండా నిలబడలేదన్నది జగమెరిగిన సత్యం. పూర్వం ఏ భవనానికైనా దాన్ని నిర్మించే సుతారులు, వడ్రంగులు, ఇతర పనివాళ్ళు వేరువేరు కులాల వారు పని చేసేవారు. కానీ దానికి అవసరమైన రాయిని మాత్రం కాశవారు లేదా వడ్డెరలు మాత్రమే సమకూర్చేవారు. అలాంటి వడ్డెరలు ఈనాడు అసంఘటిత కార్యరంగంలోని సమూహాలుగా, వలస బ్రతుకులుగా అత్యంత దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నారు. సుమారు 72 సంవత్సరాల స్వతంత్ర భారతావణిలో కనీస అభివృద్ధికి నోచుకొని దౌర్భాగ్య జీవులు వడ్డెరలు. ఇంకా సమూహాలుగా, తెగలుగా, గణాలుగానే జీవిస్తున్నారు. ఎక్కడ నిర్మాణం జరిగితే అక్కడ వలస బ్రతుకులుగా అత్యంత దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నారు.

వడ్డెర కులానికి అతి ప్రాచీన చరిత్ర కలదు . "ఓఢ్ర" అనే గణ సమూహం నుండి విడిపడి వివిధ ప్రాంతాలకు వ్యాపించి తమ పొట్ట కూటికోసం రాతిని తొలచే పనిని చేస్తూ మహోన్నత నిర్మాణాలకు పునాది రాళ్లను మోసిన ఘనత వాళ్ళది. క్రీస్తు పూర్వమే కళింగలో అంతర్భాగమైన ఓఢ్ర గణతంత్రాలు అశోకుని సామ్రాజ్య విస్తరణను ఎదురించి పోరాడినట్లు చరిత్ర. అశోక చక్రవర్తి కళింగ యుద్ధంలో ప్రస్తుత ఒడిశాలోని దవనగిరి ప్రాంతంలో ఓఢ్ర గణతంత్రానికి చెందిన రెండు లక్షల మందివరకు పసిపిల్లలను, వృద్ధులను ఊచకోత కోసాడట. ఇప్పటికీ దవనగిరి ప్రాంతంలో ఓఢ్రల ఊచకోతకు గుర్తుగా స్మారక చిహ్నం కూడా ఉన్నది.

వడ్డెరోళ్లను దేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలుస్తున్నారు. తెలుగు ప్రాంతాలలో వడ్డెరలు, వడ్డీలు, వడ్డెలుగా పిలుస్తున్నారు. తమిళనాడులో బోయరులు, కర్ణాటకలో బోవి, మహారాష్ట్రలో ఒడారేలుగా చాలమణిలో ఉన్నారు. వీరిలో ప్రధానంగా కాశి వడ్డెర లేదా కాశోళ్లు ,బండి వడ్డెర, మట్టి వడ్డెర, కట్టె వడ్డెర, కుండ వడ్డెర, లాగోళ్ల వడ్డెర, బోరండ్ల, గాడి దొడ్డెర తదితర ఉపకులాలు ఉన్నాయి. ఒడ్డె లేదా ఒడ్డెర లేదా ఓఢ్ర గజపతులు కళింగ ప్రాంతానికి (ప్రస్తుత ఒరిస్సా) చెందిన గణ సమూహానికి చెందినవాళ్ళు. మొదటి గజపతి రాజును ఓఢ్ర రాజైన కపిలేంద్ర దేవవర్మ క్రీ.శ.1448లో ఆంధ్రప్రదేశ్ లోని రెడ్డి రాజులను జయించినట్టు చరిత్ర చెబుతుంది. కొండవీటిలో పెద కోమటి వేముని తరువాత రాచ వేముడు రాజయ్యాడు. కపిలేశ్వర గజపతి అతన్ని జయించాడు. అప్పటి నుండి ఒడ్డెరల వలసలు క్రమ క్రమంగా పెరిగాయి. వీరు బహమనీ రాజ్యం పైకి దండెత్తి ఖమ్మం, వరంగల్లు, నల్గొండ, మహబూబ్ నగర్,ఆ తరువాత విజయనగర ప్రాంతాలైన నెల్లూరు, చిత్తూరు ప్రాంతాలను జయించడం వల్ల తెలుగు నేలలో వీరు కూడా ఒక భాగమైనారు. ఆతరువాత కుతుబ్ షాహీలు, నిజాం నవాబులు తెలంగాణ ప్రాంతాలను ఏలిన నాటికి వీరికి స్థానికులతో పాటుగా కష్ట కాలం మొదలైంది. అసలీ తెగ లేదా గణ సమూహాలకు చెందిన వారవడం చేత వీరిని స్థానికులు వారితో పాటుగా వలస పాలకులు కూడా చిన్న చూపు చూడడం వల్ల వీరిని సమాజం కేవలం అవసరాల కోసమే పట్టించుకున్నట్లయింది. ఇక ఆంధ్ర ప్రాంతంలో ఇంగ్లీషు వారు (బ్రిటీష్ వారు) వడ్డెరలను బలవంతంగా తరలించి నిర్బంధంగా పని చేయించారు. నిర్బంధ పని నుండి తప్పించుకొని పోకుండా సెటిల్మెంట్ ఏరియాల పేరిట ఒక విధమైన కాన్సంట్రేషన్ క్యాంపులో బంధించేవారు. నిర్బంధ కార్య పరిస్థితుల నుంచి తప్పించుకొని పారుతున్న వడ్డెరలను భయ భ్రాంతులకు చేసేందుకు ఎదురు తిరిగిన వారిని అణచి వేసేందుకు వారిని క్రిమినల్ ట్రైబ్స్ గా(సి.టీ.యాక్ట్)ముద్ర వేసింది. ఇలా నిర్బంధ శ్రామి

కులుగా మారిన వడ్డెరలు తమ రక్తాన్ని ధారపోసి నిర్మించిన నిర్మాణాలు ఎన్నో.

తెలుగు సాహిత్య ప్రక్రియలో పాటకు సమానర్థకంగా వాడబడుతున్న గీతాలలో వడ్డెరల బతుకుల్ని, వారి వృత్తి జీవనవిధానాన్ని గీత రచయితలు ఏపూరిసోమన్న, వి.మురళి లు 'వడ్డెరోల్ల బతుకులు''అనే సామాజిక చైతన్య గీతాల ఆల్బంలో వడ్డెరల వలస బ్రతుకుల్ని చిత్రించగా ఏపూరి సోమన్న, విమలక్క, వెంకన్న, మల్సూరి లు గానం అందించారు. దీనిలో మొత్తం 7 గీతాలున్నవి.

1. వడ్డెరోళ్లమయ్యమేము వడ్డెరోళ్లము
2. ప్రోక్లేను మిషనొచ్చినాదో వడ్డెరోళ్లన్న
3. మండేటి ఎండలైన
4. అన్నావడ్డేరన్న
5. బండలు గొట్టే బాలన్న
6. దిక్కుమొక్కు లేని వాళ్ళకు
7. పిలుస్తోంది కదలిరండి

వీటిలో నాల్గు గీతాలు మాత్రం వీరి వృత్తిని, వెతలను తెలిపేవిగా ఉన్నవి. మిగతావి వడ్డెర హక్కులకై పోరాడిన నాయకులపై రాసిన గీతాలున్నవి. నేను ప్రదానంగా ఇందులో వీరి వృత్తిని, వెతలను తెలిపే నాల్గు గీతాలను మాత్రమే ఎంచుకున్నాను.

!!పల్లవి!! వడ్డెరోళ్లమయ్యమేము వడ్డెరోళ్లము
మట్టి తట్ట మోసి ఎట్టి జేసెటోళ్లము

1) సంచార జీవులై ఊరూరా దిరిగినం.
గడ్డపార తట్ట బట్టి బావులెన్నో దవ్వినం కంకర
సిమెంటు గలిపి కాల్వలెన్నో గలిపినం
సుక్క సుక్క సెమట దీసి మొక్కకు నీళ్లిచ్చినం
ఎండనక వాననక తిండి సరిగ లేకున్న
కండలన్ని బిగియించి కొండల బగలేసినం

2) కులం మతం జూడము కూడి కలసి పోతము
కుళ్లు కుట్రలెరుగము సావంటే బెదురము
నమ్ముకుంటె ఎవరికైనా ప్రాణాలు ఇస్తము
ఇంటికి పునాదులై బంగ్లై నిలుసుంటము
నీతెన్నడు దప్పము అవినీతి ఎరుగము
కష్ట జీవి బిడ్డలై కలిసిమెలిసి ఉంటము.

3) రాజుల కాలం నుండి రాజశేఖరుని దాక
రోడ్లను వేసింది మేము దారులు జూసింది మేము
ఉస్మానియ యూనివర్సిటీకి పునాదులేసింది మేము
చార్మినారు, గోల్కొండ రాళ్లను మోసింది మేము
మక్కా మసీదు నుండి మల్లన్న గుళ్లవరకు
మేమె నిర్మించినం చరిత్రలో నిలిచినం
!! వడ్డెరోళ్లమండి !!

4) అగ్రకుల రాజకీయ జెండాలు మోసినం
జేజేలు గొట్టినం జనం కూడ గొట్టినం
ఓట్లను ఎయించినం సీట్లను ఎక్కించినం
కొట్లాటకు వోయినం ప్రాణాలను ఇచ్చినం
పదవులెన్నడెరుగము పైసలు ఆశించలేదు
ఏ పార్టీలొచ్చినా మాబతుకులు మారలేదు

5) వొడ్డెరి కులపొల్లమంత సంఘమొకటి వెట్టినం
మాహక్కులు సాధించగా ఒక్కటయ్యి సాగుతం
గుండయిన బండయిన మాకే దక్కాలిరా
చెరువైన కుంటయిన మేమె దవ్వాలిరా
రాజ్యాధికారంలో మాకు వాటా గావాలె రా
!! వడ్డెరోళ్లమండి !!

చరిత్రకందినంత వరకు ఎక్కడ భారీ నిర్మాణాలైన గ్రామాలలో, నివాస యోగ్యాలైనా, దేవుని మందిరాలైనా, చెరువులు, బావులు ఒకటేమిటి ప్రతీ నిర్మాణంలోనూ ఒడ్డెరల ప్రమేయం లేకుండా కట్టబడలేదు. చరిత్ర పొడుగునా ఒడ్డెరన్నల చెమట చుక్కలో తడవని రాయి లేదంటే అతిశయోక్తి కాదు. ఇక తెలుగునేలలో గండికోట, కొయిలకొండ కోట, రాచకొండ, దేవరకొండ, గోల్కొండ, చార్మినార్, హైదరాబాదు, సికింద్రాబాద్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హుస్సేన్ సాగర్ కట్ట , నాగార్జున సాగర్ డ్యామ్ దాక అన్నీ వడ్డెరల రక్త మాంసాలతో నిలిచిన చరిత్రలే. సుమారు 700 సంవత్సరాల నుంచి ఒడ్డెర తెగ తెలుగు నేలలో వలస సంబంధాలు కలిగిన వీరు మొదట్లో సమూహాలుగా నివసించే వారు. వారు ఎరుకలి,

యానాదుల లాగా పందులను పెంచుకునే వారు. వడ్డెరలు ఎక్కడికి వెళ్లినా వారివెంట పందులను తీసుకొని వెళ్లేవారు. వారు పందులను తినేవారు. రానురాను సమసమాజంలో వచ్చిన పెను మార్పులు వారి జీవన విధానంలో మార్పులు తీసుకువచ్చాయి. క్రమ క్రమంగా పందుల పెంపకం వీరి జీవితం నుండి దూరమైంది. అంతే కాదు వడ్డెరల తమదైన జీవన విధానం, భాషా సంస్కృతులను పూర్తిగా కోల్పోయి తమ అస్తిత్వాన్ని కోల్పోయారు. విద్య, వైద్యం అనేవి వడ్డెరల జీవితాల చెంతకు ఇప్పటికి చేరలేదు.

ఇక వీరు పని చేసే చోట్లల్లో భద్రతా అంతంత మాత్రమే. ఎంతో కష్టం చేసి రోజులెల్లదీసి వీరి జీవితాలలో ఎప్పుడు ఏ దురదృష్టం వచ్చిచేరుతుందో చెప్పలేం. అతి దుర్భరమైన కాయ కష్టాన్ని చేస్తారు. పసితనం నుంచే వాళ్ళు ఆ పనులకు అలవాటు పడతారు. కాబట్టి కూలి పనులలో రాటుదేలుతారు. మనుషులు చూడ్డానికి మోటుగా కన్పించినా వారు మనుష్యులే. ఏడ్పు వచ్చినప్పుడు ఏడుస్తారు, నవ్వొచ్చినప్పుడు నవ్వుతారు. అనుక్షణం ప్రమాదాలతో తలపడతారు. పెద్ద సుత్తే, గడ్డపార, గంప వీరి నేస్తాలు. వీరి కరుకు గుండెల వెనుక కరిగిపోని వెతలుంటాయ్, రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలలో లెక్కలేనన్ని పస్తులుంటాయ్.

!!పల్లవి!! బండలుగొట్టే బాలన్నా నీకెన్ని బాధలురో,
బతుకు బండిని నడిపే దినమంత కన్నీటి గాదలెరో.

1) ఇంటిని యాజ్జెసుకుంటావు కంటినిండ కునుకు తీయకుంటవు
రెండురెక్కలే నీ ఆస్థులంటవు రేయి పగలు కష్ట పడుతుంటవు
సావుకెదురు వడుతుంటవు సాహసానికే మారుపేరైతవు.

2) గన్ను సుత్తె చేతబడుతవు బండ నాదును కని పెడతవు
ముళ్ళకంపను కూడ బెడతవు ఎండలోన బండ కాల్చుకుంటవు
దుమ్ము దూళి పొగ కండ్లల్ల గమ్మితే గాలిలో ప్రాణం పోయినట్టాయేనా.

3) రాయి రప్పలు సెలుగుతుంటావు ఇంటి కట్టడాలకు పంపిస్తవు
సైజుగ ముక్కలు జేస్తవు దాన్ని సన్న కంకర దీస్తుంటవు
ఒంటి నెత్తురు సచ్చి వయసు పైబడినా బండ నాబతుకని ఎండలో మాడేవు.

4) ప్రాజెక్టులెన్ని తవ్వినా వాని ఫ్యాక్టరీలెన్ని కట్టినా
అరె ఎడంతస్తుల మేడనైన ఇచ్చి ఇందిరమ్మ ఇళ్ళకైనా
అరే పునాది రాయి నాదంటవు అనాదిగా అనిగున్నామంటావు.

5) నీవు గన్ను చేత బట్టగానే ఆ కొండకైన దడుకు పుట్టే
నీవు బండ మీద కూకో నుంటే మండే ఎండైన నిను చూసి బెదిరే
అరె బాంబుల మోతయ్ పేలినా బతుకంత అతుకుల బతుకులు మారలేదంటవు.

ఇప్పటికి చాలా క్వారీల్లో కట్టు బానిసలుగా రాత్రింబగళ్ళూ పని చేయించుకుంటున్నారు .ఏ విధమైన శిక్షణా నైపుణ్యాలు అందించకుండానే వారితో క్వారీల్లో పేలుళ్లు చేయిస్తున్నారు. దీంతో ఎన్నో సందర్భాల్లో పేలుళ్లు జరిగి అనేక ప్రమాదాలు చోటు చేసను కుంటున్నాయి. ఈ మధ్యనే వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం కొత్తగట్టు సింగారం గ్రామం లో క్వారీ బ్లాస్టింగ్ లో ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇలా ఏటా వందలాది మంది క్వారీల్లో అనామకులుగా సజీవ సమాధులౌతున్నారు. పొద్దంతా పడ్డ కష్టాన్ని మరువడానికి సాయంత్రం పూట మద్యం సేవించడం వల్ల కొంత కాలానికి మద్యానికి బానిసలై ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారు. తద్వారా

తమనే నమ్ముకున్న కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నారు. కొంతమందికేమో చిన్నప్పటినుండి ఈ వృత్తినే అవలంభించడం వల్ల ముసలితనంలో కాళ్ళు చేతులు నొప్పిలేసి బాధపెడుతుంటాయి. ఇన్ని ఇబ్బందులు పడుతున్నా వారికి కనీసం వైద్య సౌకర్యాలు లేవు. ఒంట్లో సత్తువున్నప్పుడు సమాజానికే ధారపోసి, చివరి దశలో వారిని ఆదుకునే నాథుడు లేక దిక్కులేని బ్రతుకీడుస్తూ దైన్యంలోనే సమాప్తమవుతున్నారు.

**ముగింపు :**

ఎన్నో త్యాగాలతో, ఎన్నో పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలోవివిధ సామాజిక వర్గాలన్నీ బంగారు భవిష్యత్తును ఆశిస్తున్న ఈ శుభతరుణంలో రెండవసారి కూడా మన ప్రభుత్వానికే ప్రజలు పట్టం కట్టిన సంతోష మయ సమయంలో వడ్డెరలు కూడా ఎంతో ఆర్తితో, ఆశతో తెలంగాణ ప్రభుత్వం వైపు చూస్తున్నారు. వారిని కూడా ఆదుకోవాలి. వారు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న 'రనకీ కమిటీ' రిపోర్టును అమలు చేసి వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చడమే వారికి పెద్ద బహుమతి. వడ్డెరల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అమలు పరచాలి. తద్వారా ఈ దేశప్రగతి నిర్మాణంలో వారిని పునాది రాళ్లుగా కాకుండా మూల స్తంభాలుగా తయారు చేయాలి.

**ఆధార గ్రంథాలు :**

వడ్డెరోల్ల బతుకులు ( ఆడియో గీతాలు)
https://www.ntenews.com/namasthe telangana.in
https://te.wikipedia.org/wiki
https://www.youtube.com/watchAOIbQyuXL6w

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# శ్రీ కృష్ణదేవరాయల సాహితీ వైభవం

- ఆచార్య ఎం. రామనాథంనాయుడు, తెలుగు విభాగం, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, బెంగుళూరు.

హిందూ ధర్మ సంరక్షణకోసం, ఆనాటి ప్రజల మాన ప్రాణాలను కాపాడటం కోసం 1336వ సంవత్సరం విద్యారణ్య స్వామి ఆధ్వర్యంలో హరిహరరాయలు, బుక్కరాయలు నేటి కర్నాటక రాష్ట్రంలోని తుంగభద్ర నది ఒడ్డున విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. దక్షిణ భారతదేశ చరిత్రలో ఇది ఒక మహత్తరమైన, మహోన్నతమైన ఘట్టం.

విజయనగర పాలకులైన సంగమ వంశపు రాజులు సర్వసైన్య బలగాలలో ఇతర రాజులకంటే అధిక బలవంతులై ఆంధ్రదేశాన్ని తమ రాజ్యంలో అంతర్భాగం చేసుకున్నారు. ఆనాటి నుండి దక్షిణ భారతదేశంలో విజయనగర సామ్రాజ్యం శక్తివంతమైన రాజ్యంగా విలసిల్లింది.

సంగమ, సాళువ, తుళువ, అరవీడు వంశాల రాజులు విజయనగర సామ్రాజ్యాన్ని 1336 నుండి 1565 వరకు పరిపాలించారు. వీరి పాలనలో తెలుగునాడు సాంస్కృతికంగా, ఆర్థికంగా ఎంతో బలబడింది. తర్వాత తుళువ వంశపు రాజైన శ్రీకృష్ణదేవరాయలు ఆంధ్రదేశాన్ని సాంస్కృతికంగానే కాక సాహిత్యపరంగా కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా చేశాడు. ఆయన వైష్ణవుడు కావడం, అలాగే ఆయనకు 'తెలుగు' అభిమాన భాషకావడం తెలుగునాడుకు గొప్ప వరం అయింది. రాయల ఏలుబడిలో తెలుగునాడు సర్వాంగీణ వికాసాన్ని పొందింది. అలాగే ఆయన తెలుగు భాషలో రచించిన 'ఆముక్త మాల్యద' అనే మహా ప్రబంధం తెలుగు సాహిత్యానికి 'మేలుబంతి' అయింది.

క్రీ.శ. 1509 నుండి 1530 వరకు విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయలు సాహితీ సమరాంగణ సార్వభౌముడుగాను, ఆంధ్ర భోజుడుగాను ప్రసిద్ధి చెందాడు.

అష్టదిగ్గజకవి పోషకుడైన రాయలు భారతీయ సనాతన సంస్కృతికి అద్దం పట్టే ఎన్నో ప్రబంధాలు అవతరించడానికి కారకుడయ్యాడు. అలాగే తాను కూడా గోదాదేవి, రంగనాయకుల ప్రణయగాథను ప్రబంధీకరించి "ఆముక్త మాల్యదా" కుసుమంతో శ్రీనివాసుడిని అర్చించిన మహాచక్రవర్తి. తాను చక్రవర్తి అయినా శ్రీవారి విషయంలో సామాన్య మానవునిగా చేతులు జోడించి నమస్కరిస్తూ స్వామి ముందు నిలబడ్డాడు. తన ఇష్టదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామికి 'ఆముక్త మాల్యద' ప్రబంధాన్ని అంకితం చేసి, తన భక్తితో, వ్యక్తిత్వ దీప్తితో అందరికీ ఆదర్శమూర్తి అయ్యాడు.

తమిళంలో చూడికుడుత్త నాచ్చియార్ అని గోదాదేవికి పేరు. "ఆముక్త మాల్యద" (ఔతాను, ముక్తా ముడిచిన/ధరించిన, మాల్యా పూలదండను, దా ఇచ్చినది) అంటే తాను పూలమాలను తలలో ధరించి తర్వాత స్వామికి అర్పించేది అని అర్థం. ఆముక్తమాల్యదకు విష్ణు చిత్తీయం అనికూడా పేరు వుంది. విష్ణుచిత్తుడు (ఆండాళ్) గోదాదేవి పెంపుడు తండ్రి. ఆయన గొప్ప విష్ణుభక్తుడు. తమిళంలో ఆయనను 'పెరియాళ్వార్' అని అంటారు.

ఆముక్త మాల్యదలోని వర్ణనలు, శైలి, సంస్కృత పదాలు, సమాసాలు మొదలైనవన్నీ రాయల పరిశీలనా శక్తికి, పాండిత్యానికి, భావనా పటిమకు నిదర్శనం. ఆముక్తమాల్యద అపురూపమైన వర్ణనలకు, రాజనీతి విషయాలకు ఆలవాలం. ఇవి రాయల ప్రత్యేకతకు, కావ్యరచనాశక్తికి నిదర్శనంగా వున్నాయి. రాయల ప్రకృతి వర్ణనలు, ఋతువర్ణనలు అసాధారణంగా వుంటాయి. ఆయన వాడిన అలంకారాలు కూడా విలక్షణమైనవి.

రాయలు తన రాజ్యాన్ని విస్తరింపజేసిన రాజరాజు. కవులను పోషించిన సాహితీ సార్వభౌముడు. కావ్యకర్త. కావ్యభర్త. ఆంధ్రమహావిష్ణువును, తిరుమల శ్రీనివాసుడిని మొదలైన దేవతలను సేవించిన భక్తితత్పరుడు. రాయలు కదనరంగాన్ని, కవన రంగాన్ని సమపాళ్ళలో నడిపించిన రాజకవి. కవిరాజు. కరవాలంతో శత్రువుల గుండెల్లో

గుబులు పుట్టించి ఒక ఎత్తు ఎదిగితే, కలంతో పాఠకుల హృదయాలకు హత్తుకుపోయి మరో ఎత్తుకు ఎదిగాడు.

శ్రీ కృష్ణదేవరాయల మాతృభాష తుళు. ఆయనకు మరెన్నో భాషలు కూడా తెలుసు. సంస్కృతంలో మదాలస చరిత్ర, సత్యభామా పరిణయం, జ్ఞానచింతామణి, సకల కథా సారసంగ్రహం, రసమంజరివంటి కావ్యాలను రచించాడు. అయితే ఆయనకు తెలుగుభాష పట్ల మక్కువ ఎక్కువే.

రాయల రచన నారికేళ పాకానికి పెట్టింది పేరు. కొంచెం కష్టపడితే రాయల పదాలలో, పద్యాలలో అమృతం, రసికాభిషేకం వంటి పదార్థాలు లభిస్తాయి.

"భాషలొక పది తెలిసిన ప్రభువు, చూచి
భాషయననిద్ధి యని చెప్పబడిన భాష"

అని విశ్వనాథ సత్యనారాయణగారు రాయల భాషా వైభవాన్ని, తెలుగు గొప్పతనాన్ని చాటి చెప్పాడు.

పురాణాలను, చరిత్రను తిరగేస్తే భరతఖండాన్ని ఎంతోమంది రాజులు పరిపాలించారు. వారి రాజ్యాలను మహా సామ్రాజ్యాలుగా విస్తరించిన చక్రవర్తులు కన్పిస్తారు. శ్రీరామచంద్రుడు మాటకు విలువనిచ్చి తన రాజ్యాన్ని రామరాజ్యం చేశాడు. శిబిచక్రవర్తి దయాగుణంతో ప్రజల్ని పాలించాడు. బలిచక్రవర్తి దానగుణంతో వెలిగాడు. చరిత్ర విషయానికి వస్తే అశోక చక్రవర్తి రోడ్లు వేయించి, చెట్లు నాటించి ప్రజల్ని చల్లగా పాలించాడు. ఛత్రపతి శివాజీ పుణ్య స్త్రీలను గౌరవించి హిందూ సాంప్రదాయాన్ని కాపాడాడు. శ్రీకృష్ణదేవరాయలు మన కళ్ళ ఎదుటే సాహితీ సమరాంగణ సార్వభౌముడుగా కన్పిస్తాడు. ఒకే కాలంలో, ఒకే ఆస్థానంలో అష్టదిగ్గజ కవులుండటం, వారంతా మహా కవులే కావటం, వారిని పోషించిన మహారాజు అత్యున్నత ప్రమాణాలతో కలిగిన మహా ప్రబంధాన్ని రాయటం చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖింపదగిన విషయం.

తెలుగు సాహిత్య చరిత్రలో రాయల యుగాన్ని స్వర్ణయుగం అని, ప్రబంధయుగం అని పిలుస్తారు. దీనికి కారణం ఆనాడు మణి మాణిక్యాల్ని రాసులుగా పోసి అమ్మారని కాదు. భువన విజయంలో అష్టదిగ్గజ కవులున్నారనీ కాదు. రాయలు తిరుగులేని చక్రవర్తి అనీ కాదు. తెలుగు పంచ మహాకావ్యాలలో నాల్గింటిని అందించి, 'ప్రబంధం' అనే విశిష్ట సాహిత్య ప్రక్రియను చదువరులకు అందించాడనీ కాదు. ఆ నాడు తెలుగు భాషా సాహిత్యాలకు, తెలుగుకవులకు గొప్ప గౌరవం వున్నందువలనే. విజయనగర వీధుల్లో తెలుగు పద్యం ఊరేగింది. తెలుగు పలుకుల్లోని తియ్యదనాన్ని మనసారా ఆస్వాదించారు. తెలుగు కవులు ఎక్కడెక్కడి నుండో వచ్చి రాయల ఆస్థానంలో చేరారు. రాయలు కన్నడ రాజ్య రమారమణుడైనా ఆంధ్రభాష పైన ఎనలేని అభిమానం పెట్టుకున్న ఆంధ్రభోజుడు.

రాయలు చెప్పినట్టుగానే "తెలుగుదేలయన్న దేశంబు తెలుగేను" అన్న పద్య పాదాన్ని ఎల్లప్పుడూ తెలుగు వాళ్ళు నెమరు వేసుకోవాలి. ఆంధ్రాభిమానం కలిగిన రాజు ఎవరంటే వెంటనే రాయలు పేరు చెబుతాం. రాయలకు తెలుగుభాషపైన అంత అభిమానం, వుండబట్టే ఆయన పేరు చెప్పగానే తెలుగువారంతా పులకరించి పోతారు.

శ్రీకృష్ణదేవరాయల కూతురు మోహనాంగి. ఆమె రచించిన, 'మరీచి పరిణయం' అనే కావ్యంలో తన తండ్రి గురించి "కవిజన రాజరాజ పూజినభోజన కవితా విరాజ మాన ముఖాంభోజ విభ్రాజిత నవీన భోజుడు" అని కీర్తించింది. రాయల సాహిత్య ఆసక్తిని గురించి మోహనాంగి రాసిన పద్యం చూస్తే ఆనాడు కవిత్వమంటే రాయలకు ఎంతటి మక్కువో అర్థం అవుతుంది. ఆ మక్కువే రాయల యుగాన్ని "స్వర్ణయుగం" చేసింది.

నంది తిమ్మన తన పారిజాతాపహరణం అవతారికలో రాయలు ప్రతి సంవత్సరం వసంతోత్సవాన్ని జరిపేవాడని, అప్పుడు ఆ వసంతోత్సవానికి వచ్చే సుకవి సమూహం వినిపించే కావ్య ఆస్వాదనతో పొంగిపోయే వారని స్పష్టం చేశాడు.

"ప్రతి వర్ష వసంతోత్సవ
కుతుగాగత సుకవి నికర గుంభిత కావ్య
స్మృతి రోమాంచ విశంకిత
చతురాంతః పురవధూ ప్రసాదన రసికా!"

రాయలు ఆంధ్రకవితా పితామహుడైన పెద్దనా మాత్యుడిని చూచిన వెంటనే "మదకరీంద్రము" దిగి చేయిచ్చి, ఆ ఏనుగుపై ఎక్కించుకుని పురవీధులలో ఊరేగేవాడు. ఒక చక్రవర్తి కవులకు ఆనాడు ఇస్తున్న గౌరవం అది. ఒక కావ్యం రచించమని రాయలు పెద్దనను అడిగితే "నిరుపహతి స్థలం, రమణీ ప్రియధూతిక తెచ్చి యిచ్చు కప్పురవిడెము, ఉయ్యాల మంచం" కావాలన్నాడు. ఇలాంటివి మహారాజును అడగడమే తప్పు. అలాంటిది అంతటితో ఆగకుండా తప్పొప్పులు తెలిసిన పాతకోత్తములు కూడా కావాలని అడిగాడు. పాతకోత్తములను కూడా అడిగేంతటి ధైర్యం పెద్దనకు వుంది అంటే ఆ కాలం సాహితీవేత్తల పాలిట స్వర్ణయుగం అనటంలో ఎలాంటి సందేహం లేదు.

ప్రౌఢ దేవరాయలు శ్రీనాథ కవిసార్వభౌముడికి కనకాభిషేకం చేసినా తెలుగు కవిత్వం కోసం ఆ రాజు చేసింది అంతంత మాత్రమే. కవులు ఆయన ఆస్థానంలోకి ప్రవేశించాలంటే ఎన్నో కష్టాలు పడాలి. అలాంటి అవస్థలు శ్రీనాథుడు కూడా పడ్డాడు. ఆయన చివరకు "అమ్మా! కన్నడ రాజ్యలక్ష్మీ దయలేదా! నేను శ్రీనాథుడను" అని చెప్పుకోవలసి వచ్చింది. కానీ శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఆలా జరగలేదు. తెలుగు భాషకు ఎనలేని ప్రాధాన్యం, ప్రోత్సాహం లభించింది : తర్వాతి కాలంలో కూడా అపర శ్రీకృష్ణదేవరాయలుగా తంజావూరు రఘునాథ నాయకుడు వెలిశాడు. తెలుగు భాషకు గౌరవాన్ని ఇచ్చాడు. అతను, అతని కుమారుడు తెలుగు కవులను అమితంగా పోషించారు.

శ్రీకృష్ణదేవరాయలను కూచిపూడివారు "రాజాధిరాజ వీరప్రతాప శ్రీకృష్ణరాయ భూపా సకలాంధ్ర నిఖిల కర్నాటకధిప శ్రీకృష్ణరాయభూపా మకుట మాణిక్య సహస్రకిరణ శ్రీకృష్ణరాయ భూపా సంగీత నృత్య సాహిత్య కళల శ్రీకృష్ణరాయ భూపా" అని ప్రస్తుతించారు.

రాయల వైష్ణవ భక్తిని చూడాలన్నా, రాయల కాలంనాటి ప్రజల జీవన విధానాలను పరికించాలన్నా, రాజనీతిని తెలుసుకోవాలన్నా, అపురూపమైన వర్ణనలను చూడాలన్నా "ఆముక్తమాల్యద" ను పఠించాల్సిందే.

రాయల విష్ణుభక్తి మాలదాసరి కథలో విదితమవుతుంది. మచ్చుకు ఒక పద్యం..

"ఎవ్వని చూడ్కి చేసి జనియించు జగంబు, వసించు నిజ్జగం
బెవ్వదియందుడిందు మఱియెవ్వనియందిది, యట్టి విష్ణుతో
నివ్వలనొక్క వేల్పు గణియించిన పాతకి నౌదునేడనే
నెవ్విధినైన నిన్ గదియనేనియనన్ విని బంధ మూడ్చినన్."

మాలదాసరి గొప్ప విష్ణుభక్తుడు. ఆయన కురుంగుడిలోని విష్ణుమూర్తిని కైశికీరాగంతో మంత్రముగ్ధుడిని చేస్తుండెను. ఒకనాడు స్వామిని దర్శించుకోవడానికి వెళుతుండగా దారిలో బ్రహ్మరాక్షసుడు అడ్డుకుని భుజించడానికి బంధించాడు. అప్పుడు బ్రహ్మరాక్షసుడిని మాలదాసరి అనే భక్తుడు నేను భగవంతుడిని పూజించి తిరిగి వస్తాను. "ఏ విధంగానైనా నేను ఈ రోజు తిరిగి నీ దగ్గరకు రాకపోయినట్లయితే సృష్టి స్థితి లయకారుడైన విష్ణువుతో వేరే దేవతను సాటి చేసిన పాపానపోతాను" అని శపథం చేయగా రాక్షసుడు దానికి ఒప్పుకుని అతడిని బంధ విముక్తుడిని చేసెను.

వైష్ణవుడయిన దాసరి విష్ణువును వేరే దేవతతో సాటి చేయడం మహాపాతకం అని భావించాడు. రాయలవారికి ఇలా చెప్పడం తగునా! దేవతలంతా సమానమే కదా! అని చాలామంది అంటారు. కానీ "ఏకోహవై నారాయణా, ఆసీత్, నబ్రహ్మ, నేశానః నేమే ద్యావా పృథివీ" అంటూ వేదమే నిర్ణయించింది. ఈ భావం రాయలకే కాదు. ప్రసన్నులందరికీ సహజం. ఇది ఇతర దేవతలను నిందించుట కాదు. తాను సేవించే దైవం మీద వున్న విశ్వాసం. పతివ్రత తన భర్తతో సమానంగా మరెవ్వరినీ చూడదు. మనసులో తలచదు కూడా. అలాగని ఇతరులను నిందించదు. తన బిడ్డలను, బంధువులను ప్రేమగా చూసుకుంటుందే తప్ప తన భర్త స్థానం మాత్రం ఎవ్వరికీ ఇవ్వదు. అలాగే విష్ణుమూర్తిని సేవించే వారు ఇతర దేవతలంతా ఆయన సంతానంగాను, శరీర అవయవాలుగాను భావిస్తారు.

రాక్షసుడు దాసరిని విడువగానే కట్టుకొయ్య నుండి విడిచిన దూడ తల్లి దగ్గరకు పరిగెత్తినట్టుగా దాసరి స్వామిని చేరి స్తుతి కవితా ప్రబంధాలతో అతని స్వరూప, గుణ, విభూతులను మంగళకైశికీ గానంతో మెప్పించి 'అసత్యమగునేమో తనమాట' అని భయంతో పరుగున వచ్చి రాక్షసుని ముందు వాలాడు. "సత్యం విధాతుం నిజభృత్య భాషితం" అని తన భక్తుడు పలికిన మాటను నిజం చేయడానికి భగవంతుడు సోమశర్మ బ్రహ్మ రాక్షసత్వాన్ని పోగొడుతాడు. అప్పుడు సోమశర్మ దాసరికి ప్రణమిల్లి

"జయదురుత్తరణ సంసరణాబ్జదళనీర!
జయజయగాయక సార్వభౌమ
జయశౌరిగాథా రసజ్ఞ పుణ్య రసజ్ఞ
జయజయ తత్త్వ సంశయలవిత్ర!
జయజనార్వాచీన జనిసంగవంచక
జయజయ దేశిక చరణశరణ!
జయయుక్త వాక్రృతిష్టా తృణీకృతదేవా!
జయజయ భగవదాజ్ఞా కృతిస్థ
జయ సకల జంతు సమచిత్త! జయ దయార్థ్ర
జయముకుందాన్య దేవోస్తి శాస్త్రబధిర
జయచతుర్థ్వయ భక్తి లక్షణ చితాంగ
జయమురారి ప్రసన్నాంఘ్రి జలజ మధుప"

అని కీర్తిస్తాడు. అంటే సంసారమనే తామరాకుపై నీటిబొట్టులాగా అంటకుండావున్న సంకీర్తనా చక్రవర్తి నీకు జయము. శ్రీపతి కథల సారాంశం తెలిసిన పవిత్రమైన నాలుక కలవాడా! బ్రహ్మతత్త్వంలో కలిగే సందేహాలను తొలగించేవాడా! తక్కువ కులాన్ని భక్తితో మెప్పించినావు. ఆచార్యుల శ్రీపాదములే రక్షకముగా కలిగి వున్నావు. ఇచ్చిన మాటకు కట్టుబడి దేహాన్ని తృణంగా తలచావు. భగవదాజ్ఞను శిరసావహించే వాడివి. సకల ప్రాణులందు సమభావం కలిగినవాడవు. మోక్షాన్ని ప్రసాదించే వాసు దేవుని నమ్మి ఇతర దేవతలను దరిచేరనీయలేదు. అష్టవిధ భక్తి లక్షణాలు (భగవద్భక్తుల తప్పులను లెక్కించక గౌరవించడం, భగవంతుడిని పూజచేసి సంతోషించడం, స్వయంగా భగవంతుడిని పూజించడం, భగవంతుని ముందు డాబు, దర్పం వదలడం, భగవంతుని లీలలు వినుటలో ఆసక్తి కలిగివుండడం, భగవంతుని కథలు వినేటప్పుడు అన్ని అవయవాలు పులకరించడం, ఎల్ల ప్పుడూ భగవంతుని స్మరిస్తూ వుండడం, భగ వంతునితో కలిసి జీవించడం) కలిగిన వాడవు, హరిభక్తుల పాద పద్మములపై తుమ్మెదవలె నివసించేవాడివి.

సాహిత్య ప్రపంచంలో ఆముక్తమాల్యదా ప్రబంధం కౌస్తుభరత్నం. మాలదాసరి కథలోని "జయదురుత్తరణ" అనే పద్యం పదరత్న కిరీటం. దాసరికథ ఆముక్తమాల్యద కథా హారంనందు ఒక 'నాయకమణి'. పై పద్యంలో వాసు దేవ ద్వాదశాక్షరిని స్ఫురింపజేయడం, జయజయ శబ్దా లతో భగవద్భాగవతాచార్యులకు మంగళ శాసనం చేస్తు న్నాయి కాబట్టి శ్రీవైష్ణవానికిది ప్రధాన లక్షణం.

శ్రీ కృష్ణదేవరాయల కాలం తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చిన కాలం. ఆయన కాలంలో కవులకు అత్యున్నత గౌరవం లభించింది. "భువన విజయం" అనే సభా భవ నాన్ని నిర్మించి అందులో అష్టదిగ్గజకవులను, వారితో పాటు కన్నడ, తమిళ కవులను పోషించి తెలుగు సాహిత్యానికి ఉన్నత స్థానం కల్పించాడు. రాయలు తెలుగు సాహి త్యానికి చేసిన సేవ చిరస్మరణీయం. ఆయన సంస్కృ తాంధ్ర భాషల్లో అసాధారణ పండితుడు. కన్నడ రాజ్య రమారమణుడైనా తెలుగు భాష అంటే ఎనలేని అభి మానం. అందుకే ఆయన "దేశభాషలందు తెలుగు లెస్స" అని పలికిన సాహితీ సార్వభౌముడు. ఆయన మేధావి. ప్రతిభాశాలి. సర్వవిద్యలలో అమోఘమైన పాండిత్యం కలవాడు. కావ్యాలంకార మర్మజ్ఞుడు. లోక ప్రసిద్ధి కలవాడు.

శ్రీకాకుళాంధ్ర నాయక స్వామి తెలుగువారికి, తది తరులకు తెలుగుభాషపై గౌరవాదరణలు ప్రసాదించాడు. సూర్యచంద్రులు వున్నంతవరకు తెలుగుభాష సజీవంగా వర్ధిల్లాలి. తెలుగువారు అపర శ్రీకృష్ణదేవరాయలు లాగా తెలుగు భాషను పోషించుకోవాలి. కాపాడుకోవాలి.

# సౌజన్య నాటికలు - శైలీ విన్యాసం - పాత్రోచిత భాష

- డా॥ బూసి వెంకటస్వామి, శాఖాధిపతి, తెలుగు విభాగము, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు, గుంటూరు.

సమాజంగా ఒక వ్యక్తి వేషభాషలు, కట్టుబాట్లు, ఆచార సంప్రదాయాలు, మాటల తీరు మొదలైన అంశాలను అనుసరించి అతడు ఏ ప్రాంతానికి చెందిన వాడో, అతని జీవన శైలి ఎటువంటిదో మనం అర్థం చేసుకోవచ్చు. అతడు నాగరికుడా! అనాగరికుడా! జానపదుడా అనే ఆలోచనను కలగజేయటమే గాకుండా అతనిలోని నూతన వేషభాషల పట్ల మనం ఆకర్షితులవుతాం. అవసర మయితే అనుకరించడానికి ప్రయత్నిస్తాం. అంటే ఇక్కడ మనకు తెలియకుండానే అతని ప్రభావం మనపై ముద్ర వేసిందని తెలుస్తుంది. అదే విధంగా రచయిత యొక్క రచనా విధానాన్ని బట్టి అందులో అతడు ప్రయోగించిన భాషాసౌష్టవము, పదబంధ నిర్మాణము, జాతీయాలు సామెతలు మొదలైన విషయాలు మన స్మృతి పథంలో నిలచి ఆ రచయిత పట్ల ఒక రకమైన సదభిప్రాయం కలగటానికి ఆస్కారం ఏర్పడుతుంది. అటువంటి ఆలోచన చైతన్యాన్ని కలగజేసి అంశాన్నే మనం ఆ రచయిత శైలిగా పేర్కొనవచ్చు.

రచయిత తాను చెప్పదలుచుకున్న సందేశాన్ని పాఠకుల హృదయంలోకి సూటిగా చొచ్చుకుపోవటానికి సందర్భోచితంగా ఎంపిక చేసుకునే శబ్దసామాగ్రి సంపుటీ కరణ శైలి. సమాజం గురించి విస్తృత అధ్యయనం, లోక పరిశీలనానుభవం, కలిగిన రచయితలు తన అనుభవాలను, అనుభూతులను రంగరించి పాఠకుల హృదయ పీఠాలు కదిలించగల రచనలు చేస్తారు. తాను చెప్ప దలుచుకున్న విషయాన్ని ఏవిధంగా చెబితే పాఠకులకు రసానుభూతిని కలిగిస్తుందో రచయితకు తెలుసు. అటువంటి రసానుభూతిని కలిగించే భావ, భాషా విన్యాస సౌష్టవాన్నే శైలిగా పేర్కొంటున్నాం. ఇటు వంటి భావ భాషా విన్యాస సౌష్టవాన్ని యం.డి. సౌజన్య తన నాటికలలో చక్కగా చొప్పించారు.

**పాత్రోచిత భాష :**

నిపుణుడైన నాటక రచయిత తన నాటకంలో స్థల - కాల - వస్తు - పాత్ర - సంఘటనాది నిర్మాణ సంబంధమైన అవధులను అతిక్రమించకుండా తనదైన భాషా ముద్రవేస్తాడు. తను సృష్టించే పాత్రల పరంగా వాక్ విన్యాస నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడు. దీనినే మనం అతని శైలిగా పేర్కొనవచ్చు.

పూర్వకాలంలో నాటకాలలో ఉన్నత, నీచ పాత్రలకు తగినట్లు గ్రాంధిక భాషను ప్రయోగించారు. కాలక్రమంలో ప్రజలలో వచ్చిన మార్పులకు అనుగుణంగా నాటక కర్తలు తమ రచనలలో వ్యవహారిక భాషను పాత్రలపరంగా చొప్పించడం జరిగింది.

రచయిత ప్రయోగించిన భాషను బట్టికూడ నాటకం యొక్క ఔన్నత్యం బయటపడుతుంది. తెలుగు నాటక రంగంలో అజేయంగా పేర్కొనబడే కన్యాశుల్కంలో ఉపయోగించిన భాషను బట్టే ఆ నాటకం అంత ప్రాశస్త్యాన్ని అందుకున్నదని పండితుల అభిప్రాయం. గురజాడ కన్యాశుల్కం నాటకంలో ఏపాత్రకు ఏ భాష వాడాలో వాడి ప్రజల మనస్సులో ఆ నాటకం చిరస్థాయిగా నిలిచేటట్లు చేశాడు. అందుకే నాటకానికి జవం, జీవం అందించేది పాత్రోచిత భాషే అని చెప్పవచ్చు.

నాటకంలో వచ్చే వివిధ రకాల పాత్రలకు తగినట్లు భాషను ఉపయోగించడం నాటకకర్త ప్రతిభా పాటవానికి గీటురాయి. పాత్రను ప్రవేశపెట్టినప్పుడు అది నిజ జీవితంలోని వ్యక్తులను పోలి వారి భాషలోనే మాట్లాడటం వలన ప్రేక్షకులకు ఆనాటిక యొక్క ఉపదేశం బోధపడేటట్లు చేస్తుంది. అందుకే నాటకానికి పాత్రోచిత భాష ముఖ్యమైందని తెలుస్తుంది.

యం.డి. సౌజన్య సమాజంలోని విభిన్న వర్గాలకు చెందిన ప్రజల మనస్తత్వాలను, భాషను అకళింపు చేసు

కున్నారు కాబట్టే ఆయన నాటికల్లో ఆయా పాత్రలకు తగినట్లు ఆ భాషను ప్రయోగించి నాటికలకు వన్నెలద్దారు.

కనకపు సింహాసనమున..... నాటికలో నిరక్ష్యరాసుడు, పల్లెటూరు వ్యక్తి అయిన పోతురాజుకు కాలం కలిసివచ్చి మంత్రి పదవి పొందుతాడు. అతనికి మంత్రి పదవి వచ్చినా అలవాట్లు, భాష, నడవడిక ఏమాత్రం మారలేదు. తన దగ్గరకు వచ్చిన వ్యక్తులతో ప్రవర్తించే విధానం, మాట్లాడే తీరును బట్టి ఆ పాత్ర విశిష్టతను అంచనా వేయవచ్చు. రచయిత ఆపాత్రకు, అతనితో సంభాషణ సాగించే నవాబ్, తమిళ ప్రాంతానికి చెందిన పిళ్ళై వంటి పాత్రలకు చక్కని పాత్రోచిత భాషను ప్రయోగించారు.

పోతురాజు : ఎదయ్యి తాగినప్పటి నుంచి కడుపులో తిప్పటమే గాని కాత్తన్నాకైపెక్కదు.

నవాబ్ : హర్జంట్‌గా మినిష్టరు హయ్యారు హని హల్వాట్ హుల్టా సేస్తే ఎట్టాసాబ్ - మీకి హోక్టీ బాణం మార్యూ బీడియిస్తా. రెండు పీకల్ ఫీకండి మీది పాణ్యం తేల్కాపడి పైకీ పొద్దీ! నువ్వు దమ్ము పీకుసాబ్ హిక్టా తల్పూకి మేము ఖాప్లా కాస్తామ్ (పోతురాజు బీడిదమ్ములాగుతుంటాడు)

నవాబ్ : సర్కార్! సర్కార్ హిందాక చెప్పాన్ భూత మంగళం ఫిల్లీ అని అది మడ్డీ వచ్చాడ్. బయట హున్నాడ్ సాబ్.

పోతురాజు : మడిసి ఎట్టా ఉన్నాడు.

నవాబ్ : హేమ్టీ చెబుతాం! బంగారం కా పిచ్చా వచ్చాడ్.

పోతురాజు : నీకేమన్న సెయితడిపాడా ఎందిరా.... అప్పుడే.... తొందరగా రమ్మను (పిళ్ళై వచ్చాడు).

పిళ్ళై : గుడ్ మార్నింగ్ సార్! పొత్తరం రాజా వారిని కలిసే దానికి మనసు రొంబా ఉరకలు వేసెను.... వేగిరం వస్తిమి.

పోతురాజు : ఏ వూరయ్యా మందీ.... యాడో సూచిన ట్లుందే పిల్లగారిని

పిళ్ళై : అడెడె! మీ మూతి సూస్తేనే తెలియునబ్బా! మీరు నల్లమడిసిపోతురాజు : ఎందో పొగిడేత్తున్నారు.... నేను మీలాంటి మడిసినే సామీ! కూకో యింకా నిలబడే ఉండావు.

పిళ్ళై : అడెడె! ఎంత మర్యాద సేస్తురబ్బా.... రొంబ సంతోషమాయనే.

పై సంభాషణలో అద్భుతమైన పాత్రోచిత భాష ప్రయోగించబడటమే గాకుండా చక్కని సన్నివేశగత హాస్యం పోషింపబడింది.29 ఆయా పాత్రల తీరు తెన్నులు భాషను బట్టిఅంచనా వేయవచ్చు.

ధర్మసంరక్షణార్థం నాటికలో బలాదూర్‌గా తిరిగే రౌడీరంగడు రత్తమ్మను హత్య చేసి దాని నుండి తప్పించుకోవటానికి లాయర్ హరిశ్చంద్రరావు దగ్గరకు వస్తాడు. ఆ సమయంలో వాళ్ళిద్దరి మధ్య జరిగిన సంభాషణలో ప్రయోగించబడ్డ పాత్రోచిత భాషను పరిశీలిద్దాం.

హరిశ్చంద్రరావు : ముందలా కుర్చీలో కూర్చో (లాయర్)

రౌడీ రంగడు : మర్యాదలకేంగాని. యిక ముందు జరగాల్సిన కతాకమామిసం గేందే సూడు.

లాయర్ : వివరాలు చెబితే రాసుకుంటా

రంగడు : నువు రాసుకుంటావో, గీసుకుంటావో నాకనవసరం. నాకు మాత్రం సిచ్చ తప్పాల అది!

లాయర్ : నీ వృత్తి.... ఐమీన్.... నువ్వేం చేస్తుంటావ్.

రంగడు : పగలు పేకాటా, నవ్వారాటా, బ్యాకెట్టు కంపెనీలు నడుపుతా! రాత్రిళ్ళు బోతలూ, చిల్లరమల్లర సామానులూ అయి సరి సేయిత్తుంటా.

పై సన్నివేశంలో రౌడీ రంగడు నిర్లక్ష్యంతో వ్యవహరించే తీరు, భాష లాయర్ మాట్లాడే విధానం రెండు పాత్రల మధ్య ఉన్న ఆంతర్యం పాత్రోచిత భాష ద్వారా వ్యక్తమవు

తుంది. రౌడీ రంగడు వ్యవహరించే విధానం ప్రేక్షకులను నవ్విస్తుందనటంలో ఎటువంటి విప్రతలేదు.

## సంభాషణా చతురత :

నాటికల్లో పటుత్వం గల సంభాషణా చతురత ప్రదర్శింపబడుతుంది. రచయిత యొక్క ప్రజ్ఞాపాటవాలు సంభాషణా చతురతలోనే బయటపడతాయి. నాటికను ఒక్కొక్కసారి మలుపు తిప్పే స్థాయికి ఈ సంభాషణా చతురతే తీసుకురావటంజరుగుతుంది. ఒక్కొక్కసారి సన్నివేశంలో ప్రవేశించిన రెండో పాత్రకు నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్లు పరిస్థితులు ఎదురవుతాయి. ప్రేక్షకులను బాగా కట్టిపడేసేది సంభాషణా చతురతే.

సహజ సుందరమైన రీతిలో సంభాషణలు నడపటం సౌజన్య శైలి, ఆయన తన నాటికలలో చక్కని సంభాషణా చాతుర్యాన్ని ప్రదర్శించారు.

కనకపు సింహాసనమున ........ నాటికలో ఆ విద్యా మంత్రి అయిన పోతురాజుకి విలేఖరికి మధ్య జరిగిన సంభాషణలో రచయిత చూపిన చాతుర్యం అనన్య సామాన్యం.

విలేఖరి : అయ్యా! తమరు తమ రాజకీయ జీవితం అదీ ఎట్లా ప్రారంభించారో.

పోతురాజు : అదేనయ్యా! మన గ్యాందీ పంతులు లేడూ. కిట్టిండియా అంటూ మొదలెట్టాడే అప్పుడే గందయ్య మనకు లాకప్పు బోణి అయ్యింది.

విలేఖరి : చిత్తం.... చిత్తం అయితే తమరలా జైలుకి

పోతురాజు : ఎన్ని తూర్లెల్లానో ఎవరికి గుర్తు.... ఎదో చ్యాంతి యుతంగా గుట్టు సప్పుడు కాగుండా ఓ రైలు పట్టా పీకడమో, ఓ టెలిఫోన్ తీగలాగటమో చేసేది తెల్లారేటప్పటికి లాకప్పులో పడేది ఏదో దేస బత్తి అసుంటిది.

విలేఖరి : అలాగే.... తమ బాల్యం.... విద్యాభ్యాసం.

పోతురాజు : నువ్వేం యిలేఖరివయ్యా! నలుగురు మన పోయిన నాయకుల జీయిత యిశేషాలు కొత్త యివరాలు సూసి నా పేరుకు కలప కూడదంటయ్య.... నువ్వు మరీనూ.

విలేఖరి : తమ సన్మాన సభకి అధ్యక్షత వహించేది.

పోతురాజు : అది తెలియని విలేఖరి నుయ్యేం యిలేఖరి వయ్యా! నూ బమ్మలాట సూడవంటయ్య తెరమీద. అదేనయ్యా చినిమా నాట్య చరచ్వతి టంటు చరచ్వతీ - పద్మ బోషాణం - దీపలచ్చి అదేనయ్యా అర్థం కాలా చినిమా తారయ్యా.

విలేఖరి : చిత్తం చిత్తం మరి విద్యార్థుల స్టాండర్డ్ విషయం.

పోతురాజు : చోసలిజం అంటే ఏందయ్యా - అందరినీ ఒక గిరికి లాగటమే గందయ్యా! పిల్ల కాయల్ని పై కెట్టాగూ లాగలేం కాబట్టి లాకు లెత్తినట్టు పరీచ్చలెత్తేసి అందర్నీ పేసు చేత్తేసరి.

ఈ సన్నివేశంలో పోతురాజు చెప్పే మాటలకు అంతక ముందు ఎంతో మంది రాజకీయ నాయకుల్ని ఇంటర్యూ చేసిన విలేఖరే ఖంగుతింటాడు. వీరి సంభాషణలో హాస్యరస స్ఫోరకమైన సంభాషణా చతురత నడిపించ బడింది.

అల్లిబిల్లి అప్పారావు నాటికలో అరుంధతిని పెళ్ళి చేసుకోవటానికి డాక్టర్ రాజర్షి వస్తాడు. ఆ సమయంలో అరుంధతి తల్లి అతను ఎవరో తెలియక, అతని వేషాన్ని బట్టి అంచనా వేసి బిక్షగాడని కసురుకుంటుంది. వారి మధ్య జరిగిన సంభాషణ చాతుర్యం ఎలా నడపబడిందో చూద్దాం.

డా॥రాజర్షి : పశువుల హౌస్ ఇదేనా! ఐమీన్ పశుపతి హౌస్

ఆండాళ్ : ఏంబాబు! ఉన్నవాళ్ళు చాలకనా! బుడక కీచు గెటప్‌లో అడుక్కోవడానికి అడ్రస్సు కనుక్కొని మరీ బయలుదేరావు.

రాజర్షి : వాట్! యాం ఐ ఏ బెగ్గర్! నో... నో... ఐ యాం నో బెగ్గర్.

ఆండాళ్ : బెగ్గర్ కాదూ... మరి బిర్లా బ్రదరువా... టాటా తమ్ముడివా

రాజర్షి : ఐ యాం నేచర్ క్యూర్ బోన్ సెట్టర్ డాక్టర్ రాజర్షి

ఆండాళ్ : ఏమిటి నువ్వు రాజర్షివా! ఏ ఊరు నుంచి ఊడిపడ్డావు

రాజర్షి : ఐ యాం ఫ్రం పిట్స్‌బర్గ్ - నేటివ్ ఆప్ పిఠాపురం

మునిచంద్ : ఏమిటీ! పిట్స్‌బర్గా అంటే.... అత్తగారూ! ఇందాక మహర్షి మ్యారేజీ లింక్ చెప్పిన పిట్స్‌బర్గ్ మ్యారేజ్ సన్ - పెళ్ళికొడుకు వీరేనేమో.

**ఆధార గ్రంథాలు :**

1. సౌజన్య, యం.డి--అల్లిబిల్లి అప్పారావు.
2. సౌజన్య, యం.డి--కనకపు సింహాసనమున....,
3. సౌజన్య, యం.డి--కళ్ళుతెరవండి.
4. సౌజన్య, యం.డి-- ధర్మసంరక్షణార్థం

ఇటువంటి సంభాషణలు సౌజన్య నాటికలలో అనేక చోట్ల కన్పిస్తాయి. వారు పాత్రల మధ్య ప్రవేశపెట్టిన సంభాషణ వలన ఆ పాత్రల స్వభావం, వ్యక్తిత్వం ప్రేక్షకులకు అర్థం అవుతుంది. ఈ సంభాషణలలోని భావం కేవలం వ్యక్తిదిగా గాక సమస్త వ్యవస్థలోని వ్యక్తుల సామాజిక స్థితి, ధర్మాన్ని ఆవిష్కరించినట్లు తెలుస్తుంది. వీరు ప్రవేశపెట్టిన సంభాషణలు సర్వజనానికి సర్వకాలాలకు ప్రతీకలుగా నిలుస్తాయి. సమాజ జీవనాడిని పట్టి ఇచ్చే సంభాషణా చతురత సందర్భోచితంగా చొప్పించి నాటికలకు సౌజన్య పరిపూర్ణతను చేకూర్చారు.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# పెద్దింటి "మా ఊరి బాగోతం కథలు"

- రంగు శ్రీకాంత్ గౌడ్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

తెలుగు సాహిత్యంలో పరిచయం అక్కర్లేని పేరు పెద్దింటి అశోక్‌కుమార్. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కొత్త జిల్లాలు ఏర్పడ్డాయి. అశోక్‌కుమార్‌ది మాది ఒక్కటే కరీంనగర్ జిల్లా. ప్రస్తుత సిరిసిల్ల జిల్లా గంభీరావు పేట మండలం భీముని మల్లారెడ్డి పేటలో జన్మించాడు. వృత్తిరీత్యా గణిత ఉపాధ్యాయులు ప్రస్తుతం సిరిసిల్లాలో నివసిస్తున్నారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రను చిత్రణ చేస్తూ కథలు వ్రాస్తున్నారు. అశోక్‌కుమార్ 1999 సంవత్సరంలో కథా రచన ప్రారంభించి, రచన రంగంలోకి వచ్చారు. మొదటి కథ ఆశ-నిరాశ-ఆశ. వీరు ఇప్పటి వరకు 200 కథలు, 6 నవలలు, 5 నాటకాలు, 7 కథా సంకలనాలు, 35 వ్యాసాలను వెలువరించారు. అశోక్ తన చదువు, ఉద్యోగ రీత్యా ఊరికి దూరంగా ఉన్న కాలంలో తన ఊరు అనేక పెను మార్పులకు గురి అయినది. అందుకే తన రచనలకు స్ఫూర్తి తన ఊరు, ఊరి ప్రజలే. మార్పులకు గురవుతున్న ప్రజల జీవన విధానం. కరువు, వలసలు, పేదరికం అశోక్‌లోని రచయితను తట్టి లేపాయి. అవే కథా వస్తువులయ్యాయి. మరియు ఇతని కథల్లో వందేళ్ళ తెలంగాణ సామాజిక చరిత్ర కనిపిస్తుంది. పారిశ్రామీకీకరణ, యాంత్రీకరణ ప్రపంచీకరణ, చితికిపోయిన పల్లెల గురించి నిజ దృష్టితో మంచి కథలు వ్రాసారు.

## మా ఊరి బాగోతం కథల పరిచయం :

అశోక్‌కుమార్ గారు రచించిన 'మా ఊరి బాగోతం కథలు'' డిసెంబర్ 2004 నుండి మే 2005 వరకు 'నవ్య' (ఆంధ్రజ్యోతి) వారపత్రికలో సీరియల్‌గా వచ్చిన కథలు. 2005లో నయనం ప్రచురణలు వారు ప్రచురించారు. 70, 80వ దశకంలో తెలంగాణ పల్లెలలో వీది బాగోతాలు ఆడేవారు ప్రజలకు ఈ బాగోతాలే ప్రధాన వినోదం. రాత్రంతా మేల్కోని వారి ప్రదర్శనను చూసేవారు. ఆ కాలం నాటి ఆచార వ్యవహారాలు, కళల పట్ల అభిలాష ఎలాంటిదో ఈ కథల ద్వారా తెలుస్తుంది. అశోక్‌కుమార్ ఉత్తర తెలంగాణలోని పల్లెల వాతావరణం. నుడికారము మన ముందు కళ్ళకు కట్టినట్లుగా 'మా ఊరి బాగోతం కథలు' చిత్రించాడు. అశోక్ "మా ఊరి బాగోతం కథలను 24 కథలుగా చిత్రించి తెలంగాణ ప్రజానికానికి తెలంగాణ సంస్కృతిని తెలియజేశాడు.

1975-85 మధ్య కాలంలో అశోక్ తన మేనమామ కొడయ్యతో బాగోతం వేసే క్రమంలో వచ్చిన అనుభవాలే 'మా ఊరి బాగోతం కథలు'. ఈ కథలో తెలంగాణ యాస, గ్రామాలలో వాడిన మాటలతో ''మాఊరి బాగోతం కథలను చాలా చక్కగా చిత్రించి పాఠకులకు సుపరిచితులు అయినారు పెద్దింటి అశోక్ కుమార్.

## పాత్ర చిత్రణ :

ఈ కథ సంపుటిలో కొండయ మామ పాత్ర ప్రధానమైనది. కొండయ్య నాటకాలు చూసి చూసి కొండయ్యలో తాను కూడ నాటకాల్లో వేషం వేయాలని, స్వయంగా ఒక మ్యాల్లం (ట్రూపు)ను నిర్వహించాలనుకుంటాడు. దీన్ని బట్టి నాటకాలంటే కొండయ్యలో అభిలాష ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొండయ్యలో శ్రమైక జీవి అని తెలియజేయడం కోసం చాలా చక్కగా రచయిత చిత్రించాడు. కొండయ్య గ్రామ ప్రజల నుండి ప్రశంసలే కాదు తిట్లు, కూడ పడాల్సి రావడం అతని పాత్రలోని వైచిత్రిగా చెప్పవచ్చు. బాగోతాల మోజులో పడిన యువకులు వారి పనులు చేసుకోకుండా అడ్డంకిగా మారడాన్ని కొండయ్యను తిట్టిపోస్తారు.

ఎల్లయ్య పాత్రను చాలా అమాయకత్వంగా చిత్రణ చేస్తాడు అశోక్‌కుమార్. ఏమిటంటే ఎల్లయ్య చిన్నప్పుడే వివాహం చేసుకుంటాడు. తన భార్య పెద్ద మనిషి అయిన

రోజు ఆమె చేతుల్లో రెండు కుడుకలు పెట్టి ఆమె చెంపలు కొరకలని, తన స్నేహితులు చెప్పడంతో, ఎల్లయ్య తన ఆకతాయి స్నేహితుల మాటలు విని భార్య చెంపలు కొరుకుతాడు. ఆ భార్య భయపడి సంవత్సరంపాటు సంసారానికి రాదు. గ్రామీణ జీవన సంస్కృతిలో ఉండే ఉత్సాహం, అల్లర్లు, హాస్యాస్పదంగా చూసినా స్నేహ ధర్మాన్ని అమలు పరిచిన వ్యక్తిగా ఎల్లయ్య పాత్రణ చేసాడు రచయిత.

మా ఊరి బాగోతం కథలలో ప్రధానంగా చెప్పుకొనె మరొక్క పాత్ర జంగం పంతులు. బాగోతాలు నేర్పించడంలో నుంచి మెలుకువలు కలవాడు. పద్యాల రాగాలు బాగా తీయగలవాడు. పాటలు కూడ రాగయుక్తంగా పాడుతాడు. సమయ సందర్భాలను బట్టి ప్రజలను తన అవసరాలకు వాడుకోవడంలో మహనేర్పనని చిత్రిస్తాడు రచయిత. ఇలా పెద్దింటి అశోక్‌కుమార్ కథకుడు, దాసు (కథకుడి చిన్నాబాపు వరుస), చిన్నతాత, నాగంపేట పంతులు, కుంటి బాలయ్య, మొండయ్యసారు, నార గౌడ్, లస్మవ్వ మొదలైన పాత్ర చిత్రణలో అశోక్‌కుమార్ ఆలోచనాత్మమైన ప్రాముఖ్యతను, ప్రేమాభిమానాలను, ఆగ్రహవేషాలను ప్రదర్శించే పై పాత్రలను "మా ఊరి బాగోతం" కథల సంపుటిలో చిత్రించాడు.

## పల్లె జీవితం :

మా ఊరి బాగోతం కథ సంకలనం ముందు మాటలో డా॥ నలిమెల భాస్కర్ అన్నట్లుగా మల్లారెడ్డి పేట అనంగానే నాకిప్పటికి "అవునూరుకు ఆడపిల్లనియద్దు - మల్లరెడ్డిపేటకు ఎద్దునియ్యద్దు" అనే సామెతనే యాదికత్తది. అవునూరు దగ్గర పెద్దవాగుకు ఎల్కు తక్కువుంటది అందుకని బొండిగెల వంటి వాగచ్చినా నూకుడు ఎక్కువుంటదట ! వాగు దాట రాదట, అవునూరుకు ఆడపిల్లనిత్తె ఆపతికి సంపతికి అందదని చెప్పుకునెటోల్లు ఇగ నాగలి గట్టి దున్నుతున్నప్పుడు జెర్రంత దూరంబోయెసరికి రాల్లు తల్గి ఎడ్లకు మస్తు కష్టమైతదట అగో గట్ల మల్లారెడ్డి పేటకు, ఎద్దునియ్యద్దు అనెటోల్లు ... అని తెలంగాణ మాండలికంలో పల్లెల జీవన విధానం తెలియజేసే ప్రయత్నం చేశాడు. నలిమెల భాస్కర్ ఈ కథలలోని "మనం అడ్డమైన మన సదువుల్ని మర్చిపోయి మల్ల తల్లితోని మాట్లాడినట్లు ఉంటదని" చెప్పాడు.

అశోక్‌కుమార్ ఉత్తర తెలంగాణ పల్లె జీవితంను చాలా చక్కగా చిత్రికరించాడు. పల్లెలలోని బంధుత్వంను, అనురాగ అప్యాయతలను, చిలిపి చేష్టలను, పల్లెలలో జరిగే గొడవలను, పల్లె జీవన విదానంలోని పలకరింపులను, హాస్యంను, పంచాయితీల తీరును మొదలైనవి అన్నింటిని కలుపుకొని తన ఊరి బాగోతం కథలలో అద్భుతంగా వివరించాడు.

## ముగింపు :

సమాజంలోని అంతర్భాగం, స్పృషించే హృదయం, శైలి రచయితను ఇతరుల కన్నా ఉన్నత శిఖరాలలో నిలబెడుతుంది. అశోక్ కుమార్ జీవిత అనుభవాలను, తన పల్లె, తన పల్లె చుట్టు ఉన్న పల్లెలతో ఉన్న సంబంధం అప్యాయత అనురాగాలను 'మా ఊరి బాగోతం" కథల సంపుటిలో పంచుకున్నాడు. రచయిత తన పల్లె నేల వాసనను అద్భుతంగా తెలియజేశాడు. ఈ కథలను చదువుతుంటే ఒక్కసారిగా మన పల్లె తల్లి ప్రేమను మనస్సు అలుముకుంటున్నాము అని అనిపిస్తుంది. వీరి కథలో మన జీవితాలకు దగ్గరగా వ్రాసినట్టు అనిపిస్తుంది. ప్రస్తుతకాలంలో ఆర్థిక సంబంధాలతో వ్యక్తిగత సంఘర్షణలు, కుట్రలు కుతంత్రాలు వంటివి మనిషి మనిషికి దూరం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులలో రచయిత పల్లె జీవితాలలోని అనేక విషయాలను పొందు పరుస్తూ కథలు వ్రాశాడు ఇంక రాస్తున్నారు. ఇక భాష విషయానికి వస్తే ఉత్తర తెలంగాణ యాస, భాషలో వ్రాసి పాఠకులు ఆధరాభిమానాలను దొచుకున్నాడు. ఇలా తెలం గాణ యాసలోనే ఎక్కువగా ప్రాధాన్యతను ఇస్తూ చాలా చక్కగా 'మా ఊరి బాగోతం' కథలను చిత్రించాడు. ముఖ్యంగా చెప్పాలంటే అశోక్‌కుమార్ తన స్వీయ అనుభవాలు మరియు సమాజం పట్ల అవగాహన కల్గిన అంశాలు, తను చూసే దృష్టి, ప్రతి విషయం సామాన్య మానవున్ని హృదయం కదిలించే విధంగా తన కథలు వ్రాయడం జరిగింది.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# 'కరుణశ్రీ' బాల సాహిత్యం- తీరు తెన్నులు

- రాంభట్ల వేంకటరాయశర్మ, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

సహస్రాధిక సంవత్సరాల తెలుగు సాహిత్య చరిత్రలో నన్నయ మొదలు నేటి వరకు కవులు తమ కవిత్వంలో కొత్తదనాన్ని రంగరించి మనకు అందిస్తూనే ఉన్నారు. ఎవరెవరి కాలానుగుణంగా వారు తమతమ కవిత్వాన్ని కొత్తపుంతలు తొక్కించి తెలుగు సాహిత్య వినీలాకాశంలో, కొత్తగా రెక్కలొచ్చిన పక్షులలాగా విహరిస్తునే ఉన్నారు. శాసనాల్లో సమ్మిళితమై, పద్యపదనిసలతో నైవేద్యమై, ఆధునిక ఆంధ్ర సాహిత్యంలో మన వలలో నవలగా మారి, కథాగమనంలో కదంతొక్కి పద సాహిత్యంలో పదం పాడి, శతకాలనే పచ్చులపతకాలుగా, వచన కవితగా, నానీలుగా, హైకూగా, గజల్స్‌గా, రుబాయత్తుగా, తెలుగు సాహిత్యం నానాటికి నవ్యత్వం నింపుకొని కొంగ్రొత్తగా మన తరాలకు అందుతోంది. సాహిత్యప్రక్రియలు ఏవైనా తన బాణీలో తెలుగు సాహిత్యవాణికి అక్షర నైవేద్యాన్ని అందిస్తూనే ఉన్నాయి. ఈ ప్రక్రియల్లో తమ తమ రచనలతో కృషి చేసిన, చేస్తున్న వారు అనేకం.

జీవించినంత కాలం కవిత్వం వ్రాసి, తన కవిత్వంతో జనాల్లో ఎప్పుడూ జీవిస్తూనే ఉన్న మహాకవిశ్రీ "కరుణశ్రీ". తన కవిత్వాన్ని ప్రజల నాల్కలపై నాట్యం చేయించిన ప్రజా హృదయాస్థాన కవి ఆయన. తన రచనలతో పాఠకులను మైమరపించిన మధురకవి ఆయన. పిల్లలకు, పెద్దలకు, పామరులకు, పండితులకు,అందరికీ అర్థమయేలా కమ్మని కవిత్వాన్ని సౌందర్య సందేశాత్మకంగా అందించిన సుకవి చూడామణి ఆయన.

ఆయన డా. జంధ్యాల పాపయ్య శాస్త్రి . కలంపేరు 'కరుణశ్రీ'. కవిగా, పండితుడిగా, విమర్శకుడిగా, వ్యాఖ్యాతగా, సంపాదకుడిగా, బాలసాహిత్య కథకుడిగా ఉపన్యాసకుడిగా బహువిధప్రతిభామూర్తిగా భాసించారు. వీరు చిన్నవీ పెద్దవి మొత్తం 76 గ్రంథాలు రచించారు. ఇప్పుడీ పరిశోధనావ్యాసంలో డా. కరుణశ్రీ బాలసాహితి -1 అనే సంపుటిలో ఉన్న బాలసాహిత్యాన్ని పరిచయం చేస్తాను.

### కథ - చిరపరిచితం :

ఏ దేశంలో కానీ, ఏకాలంలో కానీ కథలకూ బాల బాలికలకూ అవినాభావ సంబంధం ఉంది. కథ చెప్పందే అబ్బాయి ముద్దమింగడు. కథ చెప్పందే అమ్మాయి నిద్రపోదు. అనగా, అనగా అంటూ తాతయ్య కథ ఆరంభిస్తే అన్నాహారాలు మాని ఆనందంగా, ఆప్యాయంగా ఆలకిస్తూ అదే పనిగా కూర్చుంటారు బాలలు.

కథలు వినటంగానే క్రమక్రమంగా కథ చదవటం అంటే కుతూహలం పెరుగుతుంది బాలలకు. చిన్నతనంలో చదివిన కథలు బాలబాలికల హృదయాలలో అవి ప్రస్ఫుటంగా ప్రతిఫలిస్తాయి. కనుకనే కథలలో కల్పనాచమత్కృతి మాత్రమేకాకుండా కొంత నీతి ఆదర్శంగా ఉండటం అత్యుత్తమం. కథలు పూల మాలికవలే బాల బాలికల హృదయాలను ఆకట్టుకొని, ఆసక్తి పుట్టించి కొంతలో కొంత లోకంలోని మంచి - చెడూ వెల్లడించి అభ్యుదయమార్గం సూచించేవిగాకూడా ఉండాలి.

ఈ సంపుటంలో 'పద్య విపంచి' అనే శీర్షికతో రెండు శతకాలు ఉన్నాయి. 'తెలుగుబాల' శతకం ఒకటి. 'విశ్వసందేశలహరి' అనేది రెండో శతకం. తెలుగు బాల శతకంలో పిల్లల గురించి నీతిని బోధించే 100 పద్యాలున్నాయి. "లలిత సుగుణజాల తెలుగుబాల " అనే మకుటంతో ఉన్న ఈ పద్యాలు అలతి అలతి పదాలతో అందరికీ అర్థమయ్యే రీతిగా ఉన్నాయి. ఉదాహరణకు-

దొరలు దోచలేరు, దొంగ లెత్తుకుపోరు
భ్రాతృజనము వచ్చి పంచుకోరు;
విశ్వవర్ధనంబు విద్యాధనంబురా
లలిత సుగుణజాల! తెలుగుబాల!

ప్రఖ్యాతమైన భర్తృహరి సుభాషితాన్ని ఇలా చిన్న చిన్నపద్యంలో అందించారు. ఇందులో ఇలాంటి పద్యాలు అనేకం. ఇక రెండో శతకంమైన 'విశ్వయోగి సందేశ లహరి'లో ''విశ్వయోగి మాట వెలుగుబాట''అనే మకుటంతో విశ్వమానవ శ్రేయస్సునుకాంక్షించే విధంగా పద్యాలను రాశారు. ఉదాహరణకు-

విశ్వయోగి దీక్ష విశ్వమానవ రక్ష
విశ్వయోగి దృష్టి విజయ వృష్టి
విశ్వయోగి బోధ విజ్ఞానమయగాథ
విశ్వయోగి మాట వెలుగుబాట!

పిల్లలకు అలవాటు అయ్యేటట్లుగా, అలతి పదాలతో వ్రాసారీ శతాకాలను. వీటి తర్వాత ఈ సంపుటంలో 'కథావిపంచి' అనే శీర్షికలో 'బాలభారతి' అనే ఉపశీర్షికలో 10 కథలున్నాయి. ఇవి పిల్లలకు అర్థమయ్యేటట్లు రాసిన నీతి కథలు. ఇందులో 'మహారాజు మామిడి చెట్టు' అనే కథలో పరులకు సహాయపడాలనే నీతి ఉంది. 'ఈశ్వర చంద్రుడు- నవయువకుడు' అనే కథలో ఎవరి పనులు వారే చేసుకోవాలనే నీతి ఉంది. 'గోపాలుడు-గోవిందుడు' అనే కథలో అపాయాన్ని ఉపాయంతో గెలవాలనే నీతి ఉంది. 'అలెగ్జాండరు-దొంగ' అనే కథలో ఒక దొంగకు అలెగ్జాండరికిమధ్య జరిగిన సంవాదం వలన యుద్ధం కన్నా శాంతి మార్గం మేలనే నీతి ఉంది. 'నాగార్జునుడు-శిష్యులు' అనే కథలో చదువుకుంటే బుద్ధి వికసించి పదిమందికి ఉపయోగపడతారనే నీతి ఉంది. 'మణి గుప్తుడు-ధనగుప్తుడు' అనే కథలో ఇద్దరి స్నేహితులమధ్య మోసంచేయాలనే ఉద్దేశ్యం ఉండకూడదనే నీతి ఉంది. 'ప్రభువు-పతితురాలు' అనే కథలో భగవంతుడిప్రేమ అందరిపట్లా ఒకే విధంగా ఉంటుందని చెప్పే నీతి ఉంది. ఇక ఆఖరిదైన 'అక్బరు -వీరబలుడు' అనే కథలో పరిపాలనలో జరిగే లోపాలను తెలివైన మంత్రులు ఎలా ఎదుర్కోవాలో అనే నీతి ఉంది. ఇవన్నీ చిన్న కథలు.

ఆ తర్వాత ఈ సంపుటంలో 'ఇంద్రధనస్సు' అనే ఉపశీర్షికతో ఏడు కథలున్నాయి. ఇందులో ఏడుగురు ప్రముఖుల బాల్యవిశేషాలను పిల్లలకు అర్థమయ్యే టట్లుగా రాశారు. ఇందులో తిమ్మరసు, బైజూ, నెపోలియన్, అబ్రహంలింకన్, శతమన్యు, ఆరుణి, గణపతి లాంటి ఏడుగురి బాల్యవిశేషాలు చెప్పారు. 'పూజా పుష్పాలు' అనే ఐదో ఉపశీర్షికలో పిల్లలకు దేశ భక్తి అలవడాలనే ఉద్దేశంతో ఇందులో నీతి కథలను భక్తి కథలను రాశారు. ఇందులో పూజా పుష్పాలు, తండ్రికి తగిన తనయుడు, పితృదేవోభవ, గురువుకు గురువు, ఆత్మార్పణం అనే ఐదు కథలున్నాయి. ఇవి కొంచెం మధ్యస్తమైన కథలు. శైలజ అనే ఆరో ఉప శీర్షికలో శైలజ, ఆముక్త మాల్యద, అనసూయ అనే కథల్లో ముగ్గురు ఉన్నతమైన స్త్రీ ల గురించి పిల్లలకు అర్థమయ్యే రీతిలో రాశారు.

'సింహం మెచ్చిన చిట్టెలుక' అనే ఏడో ఉపశీర్షికలో 17 జంతువుల కథలను రాశారు. పంచతంత్రంలాగానే ఇందులో అన్నీ జంతువులపాత్రలే. సింహం మెచ్చిన చిట్టెలుక, గ్రద్దకు చిక్కిన కప్ప, తప్పులు వెదికిన తోడేలు, తగవు తీర్చిన కోతి, ప్రాణం నిలిపిన పావురం, పందెం పెట్టిన కుందేలు, విందుకు వచ్చిన నక్క, బహుమతి పొందిన కొంగ, నీతి నేర్పిన గాడిద, మోతకు దొరికిన గుర్రం, వేషం వేసిన కాకి, మోసపోయిన మేక, కలసిరాని, ఎద్దు, గ్రుడ్లులేని బాతు, బుద్ధిచెప్పిన కోడి, పిల్లిమెడలో గంట, పాడనేర్చిన కాకి, అనే కథలు ఉన్నాయి.

'నవలా విపంచి' అనే మూడో శీర్షికలో నాలుగు నవలలున్నాయి. ఇవి చిన్నవి. పిల్లల గురించి తెలుగులో రాశారు. దమయంతి, వసంతసేన (శూద్రకమహాకవి 'మృచ్ఛకటికం' నాటకానికి గద్యానువాదం), త్యాగమూర్తి, అదృష్టమిచ్చిన అద్భుతదీపం అనే నాలుగు నవలలు ఉన్నాయి.

'నాటకవిపంచి' అనే నాలుగో శీర్షికలో శకుంతల, కరుణామయి అనే రెండు నాటకాలు ఉన్నాయి. (శకుంతల అనేది కాళిదాస మహాకవి కృతికి గద్యానువాదం). 'కరుణామయి' కరుణశ్రీ గారి స్వతంత్ర రచన. పిల్లల మనస్తత్వాన్ని చిత్రించిన నాటకమిది. ఇలా నవీనాంధ్ర సాహిత్యానికి సంబంధించిన శతకం, కథ, నవల, నాటకం అనే నాలుగు ప్రక్రియలను ఈ సంపుటంలో గుదిగుచ్చి పిల్లలకోసం అందించారు.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# ఆధునిక తెలుగు కథా సాహిత్యం - ధిక్కారస్వర స్త్రీ పాత్రలు

- టి. వెంకటనారాయణ, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

తెలుగు సాహిత్యానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. ఈ సాహిత్యంలో ఎన్నో ఉద్యమాలు వచ్చాయి. ప్రాచీన సాహిత్యంలో అయితే పురాణ, ప్రబంధ, శతక, ఉదాహరణ, సంకీర్తన, వచన మొ॥ సాహిత్య ఉద్యమాలు వచ్చాయి. అలాగే ఆధునిక సాహిత్యంలో భావ, దిగంబర, విప్లవ, అభ్యుదయ కవిత్వాలు వచ్చాయి. అలానే స్త్రీవాద దళిత బహుజన మైనారిటీ వాదాలు కూడా వచ్చాయి. ఇవి సామాజిక చైతన్యానికి సంబంధించినవి. స్త్రీవాద, దళిత బహుజన, మైనారిటీ వాదాలు సమానత్వం ప్రాతిపదికాంక్షతో, ఆయా ఆలోచనల దృక్పథాల పరిధిలో ఆవిర్భవించి కొనసాగుతున్నాయి. ఈ ఆలోచన దృక్పథాలను కవిత్వం, కథ, నవల, నాటకం ఏ రూపంలోనైనా వెల్లడించవచ్చు. ఈ దృక్పథం ఉన్న కవయిత్రులు, కవులు / రచయిత్రులు, రచయితలు యొక్క మార్గాలు వేరు వేరుగా ఉండవచ్చు గానీ గమ్యం ఒక్కటే. వీరు దోపిడీకి, వివక్షతకు, పీడితుల పక్షాన చేరి సమతుల్యత కోసం, సమన్యాయం కోసం, సమసమాజ స్థాపన కోసం పూనుకుంటారు. తరతరాలుగా వంచనలకు, వేదనలకు, అణచివేతకు గురైన, గురువుతున్న స్త్రీపక్షాన నిలిచి, వారి స్వరాన్ని వీరి కలాల ద్వారా తేటతెల్లం చేసి స్త్రీ చైతన్యంతో ధిక్కార స్వరం వినిపింపచేస్తున్నారు. తమ తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకునేలా చేశారు, చేస్తున్నారు. తెలుగు సాహిత్యంలో స్త్రీ ఉన్నతికై తపించిన ప్రముఖులలో కందుకూరి, గురజాడ, చలం పేర్లు ముందు వరుసలో ఉండక తప్పదు. అందుకు వారి రచనలు, రచనల లోని పాత్రలు నిదర్శనం.

హిందూ సంస్కృతి మాటలలో స్త్రీకి ఎంతో గౌరవ స్థానాన్ని ఇచ్చినట్లు ఉన్నది. కానీ ఆచరణలో జీవించడానికి అవసరమైన ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, ఆలోచనలకు కావలసిన జ్ఞానాన్ని అనాదిగా పురుషాధిక్య సమాజం స్త్రీలకు అందకుండా చేసింది. విద్యకు స్త్రీయే దేవత (సరస్వతి) కానీ స్త్రీకి చదువుకొనే హక్కు లేదు. ధనానికి స్త్రీయే దేవత (లక్ష్మి), కానీ ఆస్తి హక్కు లేదు, పైగా స్త్రీ పురుషునికి ఆస్తిగా భావించ పడుతూ వచ్చింది. గొప్ప గొప్ప తత్వవేత్తలు, రచయితలు, మేధావులు ప్రాచీన కాలం నుండి స్త్రీని చిన్నచూపు చూస్తూ వచ్చారు. అన్ని పాపాలకు స్త్రీయే మూలం అని అంటాడు ఒకరు. ఆపదలు అనేవి స్త్రీల మూలంగానే ఉత్పన్న మవుతామని అన్నాడు మరొకడు కోపగించుకున్న కొట్టినా స్త్రీ చిరునవ్వుతో ఇంటి పని వంట పని చేయాలంటారు మన స్మృతి కారకుడు. స్త్రీని పురుషుడు రక్షించాలి అనే పాత మాటల్ని ఇప్పటికీ వింటున్నాం.

ఈ అశాస్త్రీయ, పరిమిత, అవగాహన నుండి స్త్రీలోకం ఇప్పుడిప్పుడే బయట పడుతోంది. స్త్రీవాద ఉద్యమం ఈ అంశాల్ని బలంగా ముందుకు తెచ్చి, రచనలు తెస్తున్నారు. స్త్రీకి శరీరం ఉంది దానికి వ్యాయామం ఇవ్వాలి, మెదడు ఉంది దానికి జ్ఞానం ఇవ్వాలి, హృదయం ఉంది దానికి అనుభవం ఇవ్వాలి-చలం. అయితే అవన్నీ ఇవ్వడానికి పురుషుడు ఎవరు? స్త్రీకి కావాల్సిన వాటిని స్త్రీ ఏ సాధించుకోవాలి? సమాజంలో స్త్రీ సమస్యల పట్ల పురుష సమాజానికి అవగాహన గాని ఆలోచన గానీ స్త్రీ పట్ల కనీసం సానుభూతి కూడా లేవు. ఆధునిక కాలంలో వీళ్ళను ఉద్ధరించడానికి వారి సమస్యలను పరిష్కరించడానికి పురుషులు కూడా పూనుకోవడం నిజంగా ఒక అభివృద్ధికరమైన దశ. ఈ దశలో ఇది స్త్రీల సమస్యల పట్ల పురుషులు ఉన్న స్పృహ, స్త్రీ పక్షాన నిలబడి రాసిన కథలు కవిత్వం అనేకంగా వచ్చాయి.

కథ జీవితానికి అద్దం పడుతుంది. సాహిత్యంలో కథకు ప్రధాన స్థానం ఉంది. ఏ శతాబ్దంలో వచ్చిన కథలు ఆయా కాలాల్లోని ప్రజల జీవన స్థితిగతులను తెలియజేస్తాయి. జీవిత పోరాటం, జీవన పోరాటాలు కనిపిస్తాయి. కథలో ఆలోచన ఉంటుంది. కవిత్వంలో ఆవేశం ఉం

టుంది. ఈ రెండింటి మిశ్రమమే చైతన్య పోరాటం కావచ్చు. ధిక్కార స్వరం కావచ్చు. హక్కుల సాదన ఆరాటం కావచ్చునని నా అభిప్రాయం.

తెలుగు సాహిత్యంలోని ఇప్పటి కథల్ని పరిశీలించి నట్లయితే స్త్రీ సామాజిక కట్టుబాట్లను కుల మతాల అడ్డుగోడలు సైతం బద్దలు కొట్టి తన హక్కుల కోసం పోరాడుతున్నారు. గతంలో పురుషులు రాసిన స్త్రీ అణచి వేత సాహిత్యం వారి ధోరణిపై కూడా తిరుగుబాటు చేస్తూ హక్కుల సాధనకై పోరాటం సాగిస్తున్నారు అనడంలో సందేహం లేదు. ఇలాంటి రచనలు రచయిత్రిలే కాదు రచయితలు కూడా తమ తమ రచనల్లో ఈ దృశ్యాల్ని ప్రతిబింబింప చేశారు, చేస్తున్నారు. మచ్చుకకు కొన్ని కథలను పరిశీలిద్దాం.

సుప్రసిద్ధ కథా రచయిత్రి నల్లూరి రుక్మిణి గారి "జీవన స్పర్శ" కథా సంపుటిలోని 'కడపటి కాపలా' కథలో రత్నమ్మ వెంకటయ్య అనే దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె. ఈ దంపతులు కలిసి ఉన్న పొలాన్ని సాగు చేసుకుంటూ పిల్లలను పోషించి, పెళ్ళిళ్లు కూడా చేస్తారు. అనంతరం వారు వేరు వేరు కాపురాలు కూడా పెడతారు. ఆ పొలం పనుల్లో నిత్యం మునిగి ఉండే వెంకటయ్య ఒకరోజు పాముకాటుకు బలై పోతాడు. అనంతరం ఉన్న ఆస్తిని మూడు భాగాలు చేస్తారు కొడుకులు. దానికి తల్లి ఒప్పుకోదు. పెద్ద మనుషుల పంచాయితీ కూడా పెడతారు కొడుకులు. వచ్చిన పెద్ద వారందరూ భాగాలు మంచిదే అని సూచిస్తారు. కానీ దానికి తల్లి రత్నమ్మ ఒప్పుకోదు. అందుకు పెద్ద మనుషులకు దిమ్మతిరిగేలా మూసధోరణి పంచాయితీకి నేను ఒప్పుకోవడం లేదు. అందరూ చేసే పనే అయినా నేను చేయను, అంటు న్నాను." మా అత్తలు అమ్మలు అలా ఒప్పుకొని ఉండ వచ్చు. ఆ రోజులే వేరు. ఇవాళ కాలం మారిపోలా! ఇవాళ ఉన్నట్లు రేపు నా కోడలు కూతుళ్లు ఉండకపోవచ్చు, అన్నప్పుడు కొడుకులు ఆవేశంతో ఊగిపోతారు. ఛీ, మీకా మాట అనడానికి నోరెట్లు వచ్చిందిరా? మీ అయ్య సంపా దించిందా? ఎండనకా, వాననకా కూళోళ్ళను పెడితే ఖర్చువుతుందనీ, రోజు పొలం పోయి కూళోళ్ళతో పాటు పని చేసింది ఎవరు? మీ అయ్యా? నేనా? మీకు అయ్య కాక ముందే అతను నాకు మొగుడు? తెలుసా? నా తర్వాతనే మీరు. సచ్చినోడు కొడుకులు, కొడుకులు అని చచ్చాడు. కానీ ఆ రోజుల్లో ఈ తెలువులెక్కడున్నాయి. ఇంటి పేరింట్టోడని ఆస్తంతా మగాళ్ళకే కట్ట పెట్టేవారు. ఆడబిడ్డలకు ఏమైనా ఇద్దామా అనుకున్నాడా? పెళ్లిళ్లు అయ్యేవరకు ఇంట్లో చాకిరీ చేస్తారు. కాబట్టి ఆడబిడ్డలకు ఆస్తి కూడా సమానంగా ఇవ్వడం మంచిదని తెలుస్తున్నది, చివరి దశలో మా అత్త అమ్మ పడిన అగచాట్లు ఎవరికీ రాకూడదనే ఉద్దేశంతో ఇష్టాచారపు హక్కు కలిగి ఉండడం తల్లిదండ్రులకు ఎంతో మేలు కలుగుతుందనీ, సంబంధ బాంధవ్యాలు మంట కలిసి పోయే రోజుల్లో ఈ హక్కు చాలా అవసరం. ఎందుకంటే, సంబంధలేని వ్యక్తులు అయినా వృద్ధులు బాగోగులు చూసుకునేందుకు అవకాశం ఉంటుందనే విషయాన్ని రత్నమ్మ ధిక్కారస్వరంతో పలికింది. రచయిత్రి కలం ముల్లుకర్రలా సాలు తప్పిన ఎద్దును గుచ్చినట్లు, రత్నమ్మ మాటలు పురుష సంతానానికి ముల్లుకర్రపోటులా హెచ్చ రిస్తున్నాయి.

ప్రముఖ కథా రచయిత డాక్టర్ వి.ఆర్. రాసాని కలం నుండి వెలువడిన 'విషప్పురుగు' కథాసంపుటిలోని 'నల్ల పూసలు' అనే కథలో ఎరుకుల కులంలో పుట్టిన ఒక ఆడబిడ్డ. నాంచారి, ఆమె జీవితం లోని సంగతులను, స్త్రీలపై జరిగిన జరుగుతున్న సంఘటనలను తనకు తానుగా చెప్పుకుంటూ "అబ్బయా, నేను నిజం చెప్తున్నా, నేను తప్పు చేయలేదు,నాకు ముగ్గురితో మనువాయ. "ఎరుకల కుల మాండలికంలో వ్యక్తీకరిస్తుంది. ఆమెకు జరిగిన అన్యాయాన్ని నిక్కచ్చిగా, చెప్పడం నిర్భయంగా వ్యవహరించడం పాఠకుల్ని ఆలోచింపజేస్తుంది. ఒకానొక రోజు ఒంటరిగా ఉన్న నాంచారి పై ఆ ఊరి గంగి నాయుడు అనే ఉన్నత వర్గం కులంలోని పురుషుడు ఆమెపై చేయి వేస్తే ఆమె ధిక్కారస్వరంతో "నా బట్ట ఇంకెప్పుడునా జోలికి వచ్చినావా నాశనమై పోతావు జాగ్రత్త"

దర్భసి నా కొడకా పరాయి ఆడది ఒక చెల్లిరా, ఒక తల్లిరా, థూ! పాపిష్టి మగవాళ్ళంతా ఇంతే. మొలతాడు కట్టిన ప్రతి మగ నా కొడుకు ఆడదాన్ని ఒక వస్తువుగా చూస్తాడు. మాచి పోతానే వదిలేసే కట్టు గుడ్డ మాదిరి కట్టుకున్న దాన్ని వదిలేస్తారు. మొలతాడు మార్చినట్లు ఆడదాన్ని మార్చుతాడు. మొగోడి చేతిలో ఆడది ఇట్ల ఎన్ని దినాలని అణగారి బతకాలనో! ఇట్లా ఎన్ని దినాలు? ఎన్ని తరాలు? అని పురుషాధిక్య సమాజాన్ని నిలదీస్తున్నది. ఆమె మెడలోని నల్లపూసలతో ఆడుకుంటూ పాలు తాగుతున్న తన కొడుకుతో ఇది మెడలో కట్టిన వాడికి దీనిపైన గౌరవం లేనప్పుడు, ఇది నా మెడలో మాత్రం ఎందుకు? పోతే పోనీ ఆడుకో, బాగా ఆడుకో, ఆనందంగా ఆడుకో అని తన ధిక్కార స్వరాన్ని వినిపిస్తుంది.

పురుషాధిక్య సమాజంలో పరాయిస్త్రీ పైన పురుషుడి లైంగిక వేధింపులకు ప్రతిగా ఒమ్మి రమేష్ బాబు రాసిన "మంచు లోయ" కథా సంపుటిలోని 'కుట్టు కూలీ' కథలో విష్ణుపై కుట్టు కూలి స్త్రీ తన ధిక్కార స్వరంతో విరుచుకు పడుతుంది. దాంతో తోకముడిచి వెళ్తాడు విష్ణు. అలానే చక్రవేణు రాసిన కువైట్ సావిత్రమ్మ కథలో కూడా స్త్రీపైన పురుషుడు మరియు సమాజం చిన్నచూపు, లైంగిక వేధింపులు అన్నిటినీ ఎదుర్కొని, సమాజంలో తల ఎత్తుకొని బ్రతకలుగుతుంది. అందుకు కారణం ఆమె ఆర్థికంగా స్థిరపడడం. జయంపు కృష్ణ రాసిన 'కల్కి' కథలో తాగుబోతు భర్త తన మిత్రుడితో లైంగిక కార్యక్రమాలకు తన భార్యను ప్రోద్బలం చేయడం, చివరకు సొంత కూతురిపై అఘాయిత్యముకు పూనుకున్న తన భర్తనే కల్కి చంపేస్తుంది. అంతేకాకుండా భర్త యొక్క మిత్రుని ఆత్మాభిమానంతో బయటకు 'పో రా ఒక అమ్మకు అబ్బకు పుట్టి ఉంటే, నా కొడకా, నరికి పడేస్తా' అంటూ ధిక్కరించి, తిరస్కార ధోరణని ప్రదర్శిస్తుంది.

ఈ కోవలో సంగిపాకి ఆనందరాజు 'కొత్త వెలుగు" కథలో రామలక్ష్మమ్మ పాత్ర ద్వారా ఆ ఊరి ఎమ్మెల్యే బారి నుండి తప్పించుకొనే తరుణంలో అతన్ని చప్పుడు లేకుండా, అతని యొక్క పడక గదిలోనె చంపేసి, స్త్రీలను అతని భారి నుండి రక్షిస్తుంది. శాంతి నారాయణ గారు 'పల్లేరు ముళ్ళు' కథా సంపుటిలోని 'నిర్ణయం' కథలో కూడా ఒక బ్రాహ్మణ మహిళ సీతాలక్ష్మి తన సాంప్రదాయ కట్టుబాట్లను తెంచుకుని, తన కుటుంబం నుండి, సమాజం నుండి అనేక అవమానాలు భరిస్తూ, తన హొటల్లో పని చేస్తున్నటువంటి ఇంటర్ క్యాస్ట్ వ్యక్తిని పెళ్లి చేసుకొని, ధైర్యంగా నిలబడుతుంది. అలానే కేతు విశ్వనాథరెడ్డి గారి కథలు సంపుటిలో "పని మంతురాలు" "సతీ" కథలో పుల్లమ్మ, అచ్చమ్మ పాత్రలు బాధ్యతా రాహిత్యంగల పురుషాధిక్యంపైన మరియు తనకంటే ఉన్నత వర్గ పురుష సమాజంపైన కూడా తిరుగుబాటు ధోరణినితో ధిక్కరించి, బాధ్యతలను గుర్తు చేస్తారు. అలానే కాలువ మల్లయ్య సంపాదకత్వంలో వచ్చిన తెలంగాణ కథల్లో భూపాల్ రాసిన "బొండ్రాయి కథ"లో అధిక కట్నం కోసం వేధింపులు గూర్చి చంద్రమ్మ, సుజాత మాటలు స్త్రీలలో చైతన్యాన్ని నింపుతాయి. అలానే జాతశ్రీ రాసిన "అగ్ని తుఫాను" కథలో భర్తను అతని యజమాని కొట్టినప్పుడు, తిరస్కార ధోరణితో భార్య తన తాగుబోతు భర్తకు బాధ్యతను గుర్తుచేస్తూ, యజమానిపై తిరుగుబాటు చేస్తుంది. 'పత్తిగింజలు' కథలో ప్యారీ అనే స్త్రీ పాత్ర ద్వారా, మతపెద్దలమనే భావనతోనూ, పురుషలమనే అహంకారంతోనూ ఉన్నటువంటి వారికి స్త్రీల పట్ల వున్న చిన్నచూపునూ, హేళననూ ధిక్కారస్వరంతో బుద్ధి చెప్పిస్తాడు రచయిత వేంపల్లి షరీఫ్.

అంబల జనార్ధన్ కథా రచయిత 'ఆపద్బాంధవి' కథలో అధిక కట్నం కోసం ఆనంద్ అనే పురుషుని అహంకార ధోరణిని ఆనంద్ భార్య సుమిత్ర అణచివేసి, అతని (భర్త) నుండి విడాకులు కోరడం, సుమిత్ర తన పుత్రికకు అయ్యే ఖర్చులకు భరణం కూడా రాబట్టడం కోసం కోర్టుకు వెళుతుంది. చివరకు భార్యతో సంసారం చేయడానికి పూనుకుంటాడు. సుమిత్ర అంటుంది "ఆడది అణిగి మణిగి ఉంటే అన్ని చెల్లుతాయి, ఇంకా అణచి వేయాలనుకోవడం మూర్ఖత్వం". చదువుకొని ఉద్యోగం సంపాదించి ఉన్నత స్థానాన్ని సంపాదిస్తుంది సుమిత్ర.

ప్రముఖ స్త్రీపాద రచయిత్రి ఓల్గా గారు రాసిన పురిటి నెప్పులు కథలో వందనా నగేష్ భార్యాభర్తలు. వందన, మరియమ్మ, అన్నమ్మ, మార్తమ్మ మొదలగు వారందరూ కలిసి కూలి పనులు చేసుకుంటూ వేసుకుంటూ తమ కుటుంబ పోషణే ధ్యేయంగా జీవిస్తుంటారు. వందన వరుసగా ఇద్దరు ఆడ పిల్లలకు జన్మనిస్తుంది. మూడో సారి కూడా కూతురు పుడుతుందని భయంతో భర్త నగేష్ కుటుంబ నియంత్రణ చేయించుకోమని ప్రోద్భలం చేస్తాడు భార్యను. ఆ సమయంలో వందన తన భర్తను కుటుంబ నియంత్రణ నువ్వు చేయించుకోవచ్చు కోరాదు? అంటుంది. కానీ భార్యను అనేక భయాందోళణలకు గురిచేస్తాడు. చివరకు భర్త కొడుకు కోసం మరొక వివాహం చేసుకోవాలనే ఆలోచనతో అలా చేస్తాడు. అనంతరం పెళ్ళి కూడా చేసుకుంటాడు. అప్పుడు వందనకు సాటి కూలీ అయిన అన్నమ్మ సపోర్టుగా నిలబడి మగాళ్ళ కేం కుక్కల్లా ఎక్కడపడితే అక్కడ ఉంటారు. నీ భర్త వదిలేశా డని, నువ్వు ఊరు వదిలి వెళ్ళద్దు. 70 సంవత్సరాలు ఉన్న ఈరమ్మ బతకలేదా? తన భర్త, పిల్లలు వదిలేసినప్పటికీ. ఊర్లో న్యాయం అన్యాయం అన్నీ ఉన్నాయి. మగాళ్ళంతా అన్యాయం వైపు ఉన్నారు. తండ్రి ఎటువంటి వాడు, పిల్లలకు కూడా తెలియాలంటే నీవు ఈ ఊర్లోనే ఉండాలి, నీ కష్టమే కదా నిన్ను బ్రతికించేది అని ధైర్యం నూరిపోస్తుంది. శ్రామిక మహిళ వందనకు ధైర్యం చెప్పినట్లు సమాజంలో స్త్రీకి జరుగుతున్న అన్యాయాన్ని తమ ధిక్కార స్వరంతో తన తిరస్కరణ ధోరణితో పురుషాధిక్య సమాజం ఎలా ఉందో రచయిత్రి తమ కలం ద్వారా మహిళలను చైతన్యపరుస్తూ మెలకువతో జీవించాలని తెలియజేస్తోంది.

ఈ పురుషాధిక్య సమాజంలో ముఖ్యంగా ఉన్నత వర్గం పురుషుడు చేతిలోను, కులం మతం పేరుతోనూ, దళిత, బడుగు, బలహీన, అల్ప సంఖ్యాక వర్గస్త్రీలపై జరిగే అఘాయిత్యాలు, అవమానాలు ఒక కోణం అయితే, అధిక కట్నం కోసం త్రాగుడుకు బానిసైన భర్తతోటి జీవితంపై విరక్తి చెంది, ప్రాణాలు తీసుకొంటున్న స్త్రీలది మరో కోణం. తాగిన మైకంతో పురుషులు తమ ఆధి పత్యాన్ని స్త్రీపై చెలాయిస్తూ, కట్టుకున్నవాడే కాల యముడిలా హింసిస్తూ ఉంటే బలవుతున్నది స్త్రీలే. అన్నింటికంటే మించి పసిపిల్లల మొదలు స్త్రీలపై జరుగు తున్న అఘాయిత్యాలు, అవమానాలు ఆపై హత్యలు అన్నీ యిన్నీ కాదు. ఈ స్థితిని జయించుకొని స్త్రీ ముందుకు రావాలంటే వారికి ప్రత్యేక చట్టాలు, హక్కులు తప్పనిసరి. ఆ హక్కుల్ని పొందే మార్గం సులభతరం కావాలంటే ఒకటే మార్గం. శాసనాలు చేసే స్థానంలోనూ, ఆ చట్టాలను అమలుపరిచే స్థాయిలోనూ స్త్రీలే మెజార్టీగా ఉన్నప్పుడే అది సాధ్యమవుతుంది. అప్పుడే ఆ స్త్రీకి మేలు జరుగుతుంది తప్ప, వేరొక మార్గం లేదు. ఇప్పుడిప్పుడే స్త్రీలే తనకు తానుగా ప్రశ్న వేసుకొని, ప్రశ్నించడం మొదలైంది, ఇక జవాబు కోసం వెతకాలి. కాదు, కాదు వేట మొదలు పెట్టాలి. కొన ఊరి వదిలే వరకు కాదు, ఊసంతా (ఏచిన్న) హక్కు కూడా వదలకుండా సాధించే వరకూ పయనం సాగిద్దాం, సాధాద్దాం...

**ఆధార గ్రంథాలు :**

1. కథాంశం - ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి
2. సాహిత్య వీక్షణం - డాక్టర్ కొలకలూరి మధు జ్యోతి
3. విషప్పురుగు - డాక్టర్ వి.ఆర్. రాసాని
4. నారి సారించి - శిలాలోలిత
6. పలికించకు మౌనమృదంగాలను - ఓల్గా
7. స్త్రీవాద కవిత్వం భాష వస్తు రూప నవీనత - డాక్టర్ ఎం.ఎం. వినోదిని
8. మన గమ్యం - మహిళా మార్గ ప్రచురణలు
9. పిడికెడు ఆలోచనలు - డాక్టర్ కొలకలూరి మధు జ్యోతి

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# భాషా సాహిత్యాలు - వ్యక్తిత్వ వికాసం

- **వేదుల శ్రీలక్ష్మి భార్గవి,** తెలుగు అధ్యాపకురాలు, కరీంనగర్, తెలంగాణ.

భాష వల్లనే వ్యక్తికి విద్య, విజ్ఞానం, సంస్కారం, నైతికత, హృదయ వికాసం అలవడతాయి. ముఖ్యంగా మాతృభాష వల్ల ఆత్మీయ సంబంధ వాచకాలు, భావోద్వేగ అనుభూతులు, రసానుభూతి,ఉదాత్త లక్షణాలన్నీ అంతర్లీనంగా జీవన విధానంలో భాగమవుతాయి. ఆలోచనా పరిధి విస్తృతీకరుణకు భాష ఒక ఆధారంగా, ఆలంబనగా నిలుస్తుంది. ఉత్తమ సాహిత్య అధ్యయనంలో ఒక వ్యక్తి ఉత్తమ సంస్కారిగా,ఉత్తమ పౌరునిగా ఎదిగి సమాజాన్ని ప్రభావితం చేయ గలడు. అధ్యయనం, సమాజ పరిశీలన వల్ల విలువల విచక్షణ, వర్గీకరణ, జీవితానుభవం తెలుస్తాయి. తద్వారా దయ, కరుణ, సానుభూతి, ఆర్ద్రత, బాధ్యత వ్యక్తిలో పెరుగుతాయి. స్పందనలు పంచుకోవడానికి, సంభాషణలు కొనసాగించడానికి భాష ఒక వారధిలా పని చేస్తుంది. బాల్యం నుండే నైతిక, వ్యక్తిత్వ విలువలు గల విభిన్న కథల ద్వారా వారసత్వంగా తరతరాలకూ వచ్చేవి. మర్యాద రామన్న కథలు, పేదరాసి పెద్దమ్మ కథలు, చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు, బౌద్ధ జాతక కథలు, విష్ణుశర్మ పంచతంత్ర కథలు, ఇలాంటివి ఎన్నో నైతిక విలువల్ని ప్రబోధించి, స్ఫూర్తి నిస్తాయి. తెనాలి రామలింగని కథలు, పరమానందయ్య శిష్యుల కథలు, అక్బర్ బీర్బల్ కథలు, నసీరుద్దీన్ కథలు హాస్యంతో కూడి వివేకాన్ని, చమత్కారాన్ని, పిల్లల్లో ఆసక్తిని రేకెత్తిస్తాయి. ముఖ్యంగా బాల్యం లో ఇలాంటి అభినయ గేయాలు, నృత్య నాటికలు, సామెతలు, పొడుపు కథలు, పద వినోదం, అక్షరాల ఆటలు, భాషా విస్తృతికి దోహదం చేస్తాయి.

బాల్యంలో నేర్చుకున్న పరిజ్ఞానం ఉదయ క్షేత్రాలలో అక్షరాల పునాదుల వేర్లు బలంగా సంస్కార వృక్షానికి హేతువుగా భావి జీవితంలో అనుభవంలోకి వస్తాయి. పుస్తక పఠనం పట్ల భాష వల్లనే అభిరుచి కలిగి, మంచి పుస్తకాలు చదివే అలవాటు పెరుగుతుంది. చదవటం వల్ల ఉత్తమ సంభాషణ నైపుణ్యం, లేఖన నైపుణ్యాలు అలవోకగా వస్తాయి. ఒక ప్రాంత సంస్కృతికి అక్కడి భాష, జీవన విధానం, వారి అలవాట్లు, ఆచార వ్యవహారాలు, పండుగలు, వినోదాలు ప్రధాన కారణమవుతాయి. ఒక భాష మాట్లాడే వారంతా ఒకే విధమైన జీవనవిధానం గడుపుతుంటారు. దీనికి ఆ ప్రాంత భౌగోళిక పరిస్థితులు కూడా కారణం అవుతాయి. దీన్ని బట్టి భాష వ్యక్తి జీవితంలో ప్రధాన భూమికను పోషిస్తుందనడం నిస్సందేహంగా చెప్పవచ్చు. భాష వల్ల సమయస్ఫూర్తి కలిగి, జీవితాన్ని సార్థకంగా మలచుకునే అవకాశం ఉంది.

సృజనాత్మక ఆలోచనకు భాష వాహికగా పనిచేస్తుంది. చర్చలకు, తత్వబోధకు, కళా సృజనకు, స్నేహాన్ని బంధాలకు, ఊహ పరిధి పెరగటానికి భాష ఒక తల్లి వేరు లాంటిది. ప్రకృతిని ప్రేమించడం, తల్లితండ్రులను ప్రేమించడం, దేశాన్ని అభిమానించడం, జీవకారుణ్యం కలిగి ఉండటం వంటి అనేక ఉత్తమ లక్షణాలన్నీ భాషా వికాసం వల్లనే, ఉత్తమ మిత్రులతో పరిచయం వల్లనే సాధ్యమవుతాయి. వ్యక్తులు ఒక తరం నుంచి మరొక తరానికి ఇచ్చే వారసత్వ కానుక ఉత్తమ సంస్కారం. ఉదాత్త సంస్కృతి, ఉత్తమ జీవన శైలి మాత్రమే.

మంచి కవిత్వం, మంచి కథలు, నాటికలు, నాటకాలు, సంగీతాభిరుచి, లలితకళల పట్ల ఆసక్తి ఇలాంటివన్నీ జీవితాన్ని మధురంగా చేసే వెలుగు దారులు. జీవితంలో వచ్చే అనేక రకాల భావోద్వేగాలు, కష్ట నష్టాలు, ఎత్తుపల్లాలు, సుఖదుఃఖాలు, ఒత్తిళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే వ్యక్తిత్వ వికాసం, గుండె నిబ్బరం, ధైర్యసాహసాలు మంచి పుస్తకాలలోనే నిక్షిప్తమై ఉంటుంది. గాంధీ, నెహ్రూ, తిలక్, భగత్ సింగ్, అంబేద్కర్, శివాజీ, ఝాన్సీ లక్ష్మీబాయి, అల్లూరి సీతా రామరాజు, రుద్రమదేవి, ప్రకాశం పంతులు వంటి

త్యాగధనుల, దేశభక్తుల జీవిత కథల ద్వారా జీవితాన్ని దేశం కోసం తృణపాయంగా త్యాగం చేసిన కథలు దేశ భక్తిని విద్యార్థుల్లో స్ఫురింప జేస్తాయి. అబ్దుల్ కలాం, సుధా నారాయణమూర్తి, రాబిన్ శర్మ, పుల్లారెడ్డి వంటి జీవిత కథల ద్వారా అపజయాలు విజయాలకు ప్రగతి సోపానాలుగా ఎలా మలచుకోవాలో సులభంగా తెలుసు కోవచ్చు.

ప్రహ్లాదుడు, ధ్రువుడు, ఉత్తానపాదుడు, మార్కండే యుడు, సిరియాలుడు, గొడగూచి, గోదాదేవి, కుబే రుడు, కుచేలుడు, రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు, ఆంజ నేయుడు, సుగ్రీవుడు, కర్ణుడు, శిబి చక్రవర్తి, రంతి దేవుడు, జీమూతవాహనుడు మొదలైన పౌరాణిక పాత్రల అధ్యయనం ద్వారా బాల్యం ఉంటే క్రమశిక్షణ, పితృభక్తి, స్త్రీల పట్ల, స్నేహితుల పట్ల వ్యవహరించే తీరు విశదమవు తాయి.

సమాజంలోని రైతులు, సైనికులు, గురువులు, మహిళలు, వృద్ధులు, వికలాంగుల పట్ల గౌరవ భావం కలగడానికి ప్రధాన మార్గం మంచి పుస్తకాల అధ్యయనం, మంచి స్నేహితుల సాంగత్య ప్రభావం మాత్రమే. వీటన్ని టికీ మాతృభాష అభిరుచిని కలిగించే సాధనం. మాన వీయ విలువల అన్వేషణ, ఉత్తమ రచనల అధ్యయనం వల్లనే సాధ్యమవుతుంది. పాఠశాలలు సాహిత్య శాలలుగా రూపాంతరం చెంది బాల్యంలోనే విద్యార్థులకు లోతైన, విస్తారమైన సృజనాత్మక వికాసాన్ని కలిగిస్తాయి. మంచి పుస్తకాల్లో రచయితలు సంస్కారాన్ని అందించడానికి పడిన తపన కనిపిస్తుంది. వ్యక్తి ప్రవర్తనకు సరైన బీజాలు నాటగలిగింది ఉత్తమ సాహిత్యం, ఉత్తమ సంభాషణలు. మంచి భావ ప్రకటనకు తగిన పదజాలం, వాక్య నిర్మాణ శైలి అన్నీ పెంపొందాలంటే భావుకత్వం ఉండాలి. ఆ భావుకతకు భాష, పదాల పొందిక ప్రధాన సామాగ్రి. జీవితాలకు కొత్త వెలుగులు అద్దేవి పాఠశాలల వాచకాలు మాత్రమే. అక్కడ ప్రారంభమైన మాటలు, హావభావాలు, ఆంగిక, వాచిక చర్యలు వ్యక్తి నిర్మాణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాయి. ఒక వ్యక్తి తాత్విక దృక్పథం తీర్చి దిద్దడంలో పుస్తకాల పాత్ర ఎనలేనిది. ఇలా అన్ని ప్రక్రియల భాషా సాహిత్యాల వలన వ్యక్తి వికాసం పరిపూర్ణంగా, పరిపుష్టంగా ఉంటుంది..

**ఉపయుక్తగ్రంథ సూచి :**

1. ఎవరికీ తల వంచకు-అబ్దుల్ కలాం
2. విజయం మీదే- పట్టాభిరాం
3. గుడ్ పేరెంట్స్ ం బెటర్ టీచరొ బెస్ట్ స్టూడెంట్ - పట్టాభిరాం

❀❀❀

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# చావా శివకోటి - 'సివంగి' కథ ఇతివృత్తం - పాత్ర చిత్రణ

- **యరమల కోటారెడ్డి** , పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, గుంటూరు.

ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో విస్తృతంగా కథలు వ్రాస్తూ కథా సాహిత్యం సుసంపన్నం చేస్తున్న రచయిత చావా శివకోటిగారు. ఈయన 1940వ సంవత్స రంలో ముదిగొండ మండలం, గోకినపల్లి గ్రామంలో జన్మించారు. ప్రస్తుతం అది తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో ఉంది. ఈయన కేవలం కథలేకాక ఎన్నో నవలలు, పత్రికా రచనలు చేశారు. ఈయన రచనలు వేటికవే భిన్నంగా ఉంటూ సమాజంలోని వైరుధ్యాలను, భిన్న సమస్యలను తడిమి చూస్తున్నట్లుగా ఉంటాయి. ఈయన రచనలు పాఠకులను ఆలోచింప చేస్తాయి.

## సివంగి - నేపథ్యం :

చావా శివకోటిగారు ప్రధానంగా గిరిజనుల అమా యకత్వం, పేదరికత్వం, దాన్ని ఆసరా చేసుకొని వారిని ఇతరులు దగా చేయటం, గిరిజన గుంపుల్లో కుల పెద్దలు నడిపే సమాంతర ప్రభుత్వం మొదలైన పలు పార్శ్వల్ని చిత్రిస్తూ ఈ కథను వ్రాశారు.

## ఇతివృత్తం :

భద్రాచలం దగ్గర్లోని కుంట దాటిన, తర్వాత బస్తరు బోర్డరులోకి ప్రవేశిస్తాం. అక్కడే ఉన్న కొండలపైన కొన్ని గిరిజన గుంపులు నివశిస్తుంటాయి. వారికి ప్రభుత్వం ఎన్ని రాయితీలు కల్పించినా అనారోగ్యం, నిరక్షరాశ్యత వారిని వదలటం లేదు. వారి ప్రధాన వృత్తి పోడు వ్యవసాయం, అది సాగకపోతే కాలానుగుణంగా అడవిలో దొరికే కాయకసరులను, తేనెను అమ్ముకొని జీవిస్తుంటారు.

అక్కడికి దగ్గర్లో ఆర్.ఎమ్.పి. వైద్యుడు కూడా లేడు. వారికి అనారోగ్యం చేస్తే మంత్రాలు, కాయకసర్లే గతి.

అలాంటి ఒక గుంపులోని అందమైన పిల్ల సివంగి. ఆ సివంగిని ఆ గుంపులోనే కొండడనే యువకుడు ఇష్టపడతాడు. రవికల పండుగ రోజు వివాహం చేసు కుంటాడు. ఎంతో ఆనందంగా వీరికాపురం సాగుతుంది. పెళ్ళైన నెల దగ్గర్నుంచి కొండడి ఆరోగ్యంలో మార్పు రాసాగింది. నిస్సత్తువగా అనిపిస్తున్నా వయసు కుర్రాడు కనుక లెక్కచేసేవాడు కాదు. ఆరు నెలలు అలానే ఓపికపడతాడు. రానురాను మరీ క్షీణించి పుల్లలా అవ సాగాడు. దాంతో ఇక లాభం లేదని కొన్ని సరుకులు, 50 రూపాయల డబ్బు తీసుకొని కుంట ప్రాంతానికి వస్తారు. అక్కడ వైద్యుడు భూమయ్య ఆర్.ఎమ్.పి. అంతకంటే గొప్ప వైద్యులు అక్కడ లేరు. దాంతో భూమయ్య దగ్గర చూయించుకుంటాడు కొండడు. కొద్దిరోజులు ఇక్కడ ఉంటేనే వ్యాధి నయమవుద్దని చెప్తాడు భూమయ్య.

భూమయ్య పూర్వాశ్రమంలో ఖమ్మంలోని ఒక పెద్ద ఆసుపత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తాడు. నర్సుతో అసభ్యంగా ప్రవర్తించి మక్కెలిరగతన్నించుకొని ఇక్కడికి వచ్చి వైద్యునిలా చెలామణి అవుతుంటాడు. శివంగి అందం భూమయ్యను అపరిమితంగా ఆకర్షిస్తుంది. ఆమెను ఎలాగైనా పొందాలనుకుంటాడు. సమయం కోసం ఎదురు చూస్తుంటాడు.

కొండడు, సివంగి తెచ్చుకున్న సరుకులు, డబ్బు వారానికి అయిపోతాయి. భూమయ్య కనీసం నెలైనా ఉండాలని మందులు రాస్తాడు. సివంగి కొండడి సలహాతో డబ్బుల కోసం గుంపుకు బయలుదేరుతుంది. ఎంత ప్రయత్నించినా ఏభై రూపాయల కంటే ఎక్కువగా దొరకలేదు. దాంతో పస్తులు మొదలయ్యాయి సివంగికి. కొండడి వైద్యానికి మందులు రాసేటప్పుడు భూమయ్య వారి పరిస్థితిని అడుగుతాడు. గత్యంతరం లేక సివంగి తమ పరిస్థితిని వివరిస్తుంది.

భూమయ్య ఈ పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకోవాలనుకుంటాడు. కొండడికయ్యే మందుల ఖర్చు మరియు కొండడి, సివంగి ఉంటున్న బసకు అద్దె మరియు వారి తిండి తప్పలూ మొత్తం నేనే చూస్తా

నంటాడు. కొండడికి పండ్లు ఫలాలు పెట్టి రెండు నెలలు పూర్తిగా దగ్గరే ఉంచుకొని బండరాతిలా తయారు చేసి పంపిస్తానని దానికి ప్రతిఫలంగా సివంగితో శారీరక సంబంధాన్ని కోరతాడు. ఈ ప్రతిపాదనకు సివంగి మొదట ఒప్పుకోదు. ఎంత ప్రయత్నించినా డబ్బు దొరక్కపోయేసరికి గత్యంతరం లేక తన కొండడి మీద ప్రేమతో ఏడుస్తూ భూమయ్యకు సరేనని చెబుతుంది.

కొండడితో రెండు నెలల తర్వాత సివంగి గుంపుకు బయలుదేరుతుంది. మందులు, పండ్లు, ఫలాలు తీసుకోవటం వల్ల కొండడి వ్యాధి పూర్తిగా నయమవుతుంది. గట్టిగా ఆరోగ్యంగా తయారువతాడు. నెలరోజులు స్త్రీ పథ్యం చేయాలని వెళ్ళేటపుడు భూమయ్య చెబుతాడు. వెళ్తున్నప్పుడు కూడా భూమయ్య చూపులు సివంగిని వెంటాడుతుంటాయి.

కొండడు భూమయ్య చెప్పినట్లే నెలరోజుల తర్వాత ఒక పున్నమిరోజు సివంగిని దగ్గరకు తీసుకోబోగా నేను మైలపడ్డా చెడిపోయా నంటూ సివంగి, కొండడిని దగ్గరకు రానీయదు. అయిన పర్లేదు అంటూ కొండడు సివంగిని దగ్గరకు తీసుకోబోయినా దగ్గరకు రాదు. సివంగి ద్వారా దానికి కారకుడు భూమయ్య అని తెల్సుకున్న కొండడు కోపంతో ఊగిపోతాడు. ఈ విషయాన్ని గుంపుల్లోని కుల పెద్దలకు చెబుతాడు.

కులపెద్దలు సివంగిది తప్పని నిర్దారిస్తారు. కులతప్పు కింద రెండు బింకల కల్లు, ఒక సీసా ఇప్పసారా, అరవై రూపాయలు సివంగిని కట్టమన్నారు. అవే ఉంటే ఈ తప్పు నేనెందుకు చేసేదాన్ని అంటూ సివంగి తలొంచుకుంటుంది. కొండడిని అడగదు. కాసేపు చూసిన కుల పెద్దలు మరో తీర్పును ఇస్తారు. చిట్టడవి మధ్యలో ఉన్న రావిచెట్టుకు ఈ రాత్రికి వేలాడదీయండి. రేప్పొద్దుటికి బతికి ఉంటే తప్పు చెల్లిపోయినట్లే అని తీర్పు ఇచ్చారు. తెల్లారి కొండడు వెళ్ళి చూసేటప్పటికి సివంగి చనిపోయి కనిపిస్తుంది. కొండడి దుఃఖానికి అంతులేదు. తనకోసం మైలపడ్డ సివంగిని అనవసరంగా పెద్దలకు చెప్పి నేనే చంపించానా అని పెద్దగా ఏడుస్తాడు. ఇవేం తీర్పులు పెద్దాయనా అని పెద్దలను అడిగి బావురమనేవాడు.

సివంగి చావుకు కారణమైన భూమయ్యను చంపితే కాని ఆమె ఆత్మకు శాంతి లభించదని భావించిన కొండడు భూమయ్య ఇంటికెళ్ళి అతని తలను నరకుతాడు. గుంపులోకొచ్చి పెద్దలకు చెబుతాడు. భూమయ్యను ఎవరో కోయవాడు హత్యచేశాడన్న వార్త పాకి విచారణలో భాగంగా కొండడున్న గుంపుల్లోకి వస్తారు. పెద్దల ఆదేశానుసారం గుంపులో ప్రతి ఒక్కరూ మాకేమీ తెలియదని చెబుతారు. కానీ కొండడు మామూలు మనిషి కాలేకపోతాడు. మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. సివంగి జ్ఞాపకాలు వదలక ఎప్పుడూ బాధపడుతూ అడవిలో సివంగీ, సివంగీ అని అరుస్తూ పిచ్చివాడులా తిరుగుతుంటాడు.

ఈ విధంగా సివంగి కథలో రచయిత గిరిజనుల స్వచ్ఛమైన ప్రేమను, అమాయకత్వాన్ని, అక్కడి తీర్పులను కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

**పాత్ర చిత్రణ :**

ఈ కథలో ప్రధానమైన పాత్రలు సివంగి, కొండడు, భూమయ్య.

**సివంగి :**

సివంగి పాత్రను రచయిత అద్భుతంగా తీర్చిదిద్దారు. గుంపుల్లో ఉండే కోయపడతి సివంగి. ఎంతో అందమైనది. ఆమె నవ్వు గంగమ్మ వరవడిలా ఉంటుంది. చూసే వాళ్ళకు ఆదమరుపొస్తంది. గెంతితే మంచుకొండల్లో నడుస్తున్నట్టుంది. ఎదురొస్తే కిన్నెరసాని పొంగినట్లవుతది. అందంతో పాటు సివంగికి భర్త అంటే ఎంతో ప్రేమకలది. అతనికి ఒంట్లో నలతగా ఉంటే మందులు, ఆహారం కోసం గత్యంతరం లేక భూమయ్య చెప్పినట్లు చేయటానికి ఒప్పుకుంటుంది. అందుకోసం మానసికంగా ఎంతో సంఘర్షణకు గురవుతుంది. తను ఏమైనా కొండడికి నయమైతే చాలనుకుంటుంది.

సివంగికి కొన్ని విలువలున్నాయి. నిజాయితీపరురాలు. భూమయ్యతో తనకు గల సంబంధం కొండడికి తెలిసే అవకాశం లేకపోయినా నిజాయితీగా తన తప్పును చెబుతుంది. నేను చెడిపోయా అంటూ కొండడికి దూరంగా ఉంటుంది. కొండడు ఈ విషయాన్ని కుల పెద్దలకు

చెప్పినప్పుడు వారు శిక్షగా కొంత కల్లు సారా, డబ్బు కట్టమంటారు. అవే ఉంటే ఈ తప్పు ఎందుకు చేస్తానని ధైర్యంగా చెబుతుంది. కానీ వాటిని ఇవ్వమని కొండడిని అడగదు. ఇది ఆమె ఆత్మాభిమానానికి నిదర్శనం. కుల పెద్దల తీర్పుకు, భూమయ్య దాష్టీకానికీ బలై చని పోతుంది. కానీ కొండడి మనసులో శాశ్వతంగా ఉండి పోతుంది. త్యాగశీలం గల పాత్రగా సివంగిని రచయిత చిత్రించారు.

**కొండడు :**

సివంగి కథలో కొండడిది ప్రధాన పాత్ర. సివంగిని ఎంతో ప్రేమిస్తాడు. కానీ తొందరపాటుతనం కలవాడు. సివంగి దగ్గరకు రాకుండా విషయాన్ని చెప్పినప్పుడు సివంగిని నచ్చచెప్పటానికి కొద్దిరోజులు ఆగాల్సింది. అలాగాక కుల పెద్దలకు చెప్పటంతో వారు కల్లు, సారా, డబ్బు అడుగుతారు శిక్ష కింద. కనీసం అప్పుడైనా కొండడు, సివంగి కట్టలేదు కనుక ఆమె బదులు అతనే కట్టాల్సింది. అలా కాకుండా ఆమె అడుగుద్దేమోనని అలానే చూస్తూ మౌనంగా ఉంటాడు. ఇది అతని ఉదాశీన వైఖరికి, తెలివి తక్కువతనానికి నిదర్శనం.

దాంతో కులపెద్దలు ఊరిచివర ఉన్న రావిచెట్టుకు వేలాడదీయండి. బతికుంటే తప్పు చెల్లిపోయినట్లే అని చెబుతారు. అప్పుడు కూడా కొండడు మౌనంగానే ఉంటాడు. తెల్లారి వెళ్ళి చూస్తే సివంగి శవం చెట్టుకు వేళ్ళాడుతూ ఉంటుంది. ఏడుస్తూ భుజానేసుకుని గుంపుకు తీసుకొస్తాడు. ఇవేం తీర్పు అని కుల పెద్దలతో వాపోతాడు. తన కోసం కష్టపడ్డ సివంగిని నేనే అనవసరంగా చంపానా అని ఆత్మన్యూనతతో దాదాపు పిచ్చివాడయి పోతాడు కొండడు. సివంగిపై అతనికి గల ప్రేమకు ఇది నిదర్శనం.

భూమయ్యను చంపితేనే సివంగి ఆత్మ శాంతిస్తుందని భావించి భూమయ్య ఇంటికెళ్ళి సివంగిని ఇలా ఎందుకు చేశావంటూ నిందించి బొడ్లో నుంచి కత్తి తీసి ఒక్కవేటుతో భూమయ్య తల, మొండెం వేరుచేస్తాడు. ఇది అతని ప్రతీకార స్వభావానికి నిదర్శనం. తన తప్పును కులపెద్దల ముందు ఒప్పుకుంటాడు. భూమయ్య విషయంలో కొండడికి శిక్షపడకుండా గుంపులో వాళ్ళు కాపాడతారు. కానీ సివంగి జ్ఞాపకాలు కొండడిని వదలవు. ఏడుస్తూ సివంగి చనిపోయిన చెట్టుచుట్టూ పిచ్చివాడిలా తిరుగు తుంటాడు. చేతులు కాలాక ఆకులు పట్టుకునే తరహా వ్యక్తిగా ఈ కథలో కొండడు కన్పిస్తాడు.

**భూమయ్య :**

భూమయ్యది సివంగి కథలో స్వార్థపూరిత పాత్ర. ఇతను స్త్రీలోలత్వం కలవాడు. పేరుకు ఆర్.ఎమ్.పి. వైద్యుడు. కానీ గతంలో కాంపౌండర్‌గా పనిచేస్తూ ఒక నర్స్‌తో ప్రేమాయణం నడిపి తన్నులు తిని అక్కడ నుండి బైటపడతాడు. ఇది అతని నీచమైన గతానికి నిదర్శనం.

సివంగి, కొండడు తన దగ్గరకు వైద్యం కోసం వచ్చినప్పుడు వారి పేదరికాన్ని తనకు అనుకూలంగా మలుచుకుంటాడు. ఇది అతని క్రూరస్వభావానికి నిదర్శనం. సివంగి, కొండడిల జీవితం నాశనం కావటానికి భూమయ్యే ప్రధాన కారణం. అందుకే తప్పుకు తగిన శిక్షగా కొండడి చేతిలో ఘోరంగా హత్యగావించబడతాడు. హేయమైన పాత్ర భూమయ్యది.

తప్పు చేసిన వాళ్ళు శిక్ష అనుభవించక తప్పదని ఈ పాత్ర ద్వారా రచయిత తెలియజేశారు.

ఈ విధంగా రచయిత మనుష్యులోని జీవన వైవిధ్యా లను మరీ ముఖ్యంగా గుంపుల్లో నడిచే సమాంతర ప్రభుత్వాలు, తీర్పులు, మనుష్యులలోని స్వచ్ఛమైన ప్రేమలు, ఆశలు, పగ, స్వార్థం, ప్రతీకారం మొదలైన ఉద్వేగాలను కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు ఈ కథలో. చావా శివకోటిగారి కలం నుండి ఇలాంటి మరిన్ని కథలు రావాలని ఆశిద్దాం.

**ఉపయుక్త గ్రంథాలు :**

1) శివకోటి చావా, 2004 కథలోయి కథలు - ప్రజాశక్తి బుక్‌హౌస్, ఖమ్మం.
2) దక్షిణామూర్తి పోరంకి - 2015 కథ - సాహిత్య శాస్త్రం - శ్రీ వేదగిరి పబ్లికేషన్స్, హైద్రాబాద్.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# నిలువెత్తు ప్రేమకు నిదర్శనం మానస ఎండ్లూరి 'అవిటి పెనిమిటి'

- యద్దనపూడి దీప్తి , పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

"కూర్చున్న చోటినుండి లేవలేక పోవడం శారీరక సమస్య అయితే అలా లేవలేక పోవడానికి సరైన సహకారాన్ని అందించక పోవడమే అసలైన వైకల్యం అంటారు." ఐరిస్. అందుకే సమాజంలో ఎవరు ఏ పని చేసినా, చేయకపోయినా, చేయలేకపోయినా దాని వెనుక సమాజం పాత్ర ఎంతైనా ఉంటుంది. 'అంతర్‌దృష్టి లేకపోవడం అంధత్వం కంటే అధమ మైనద'ని విఖ్యాత రచయిత్రి హెలెన్ కెల్లర్ అంటారు.

శరీరంలోని అవయవాలు సరిగా పనిచేయనంత మాత్రాన ఎవరినీ తక్కువ అంచనా వేయాల్సిన అవసరం లేదు. కాళ్ళు, చేతులు, కళ్ళు ఇలా శరీరంలోని అవయవాల సహకారం సరిగా లేకపోయినా పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో, సంకల్పంతో అనితరసాధ్యమైన కార్యాలను సుసాధ్యాలు చేసిన వాళ్ళు మనకు ఎంతోమంది కనిపిస్తారు.

మానస ఎండ్లూరి రాసిన 'అవిటిపెనిమిటి' కథ మార్చి 2016లో మాతృక మాసపత్రికలో ప్రచురితమయ్యింది. ఈ కథ చదివిన తరువాత అవయవాలు లేని వాళ్ళు 'అవిటివాళ్లు' కాదు ఉన్న అవయవాలను సక్రమంగా వినియోగించు కోలేని వాళ్ళు అసలైన అవిటి వాళ్లు అనే భావన కలిగింది. ఈ కథలో ప్రధాన పాత్రలు రెండు జంటలు... దుర్గ, రాజు మరియు పద్మావతి, విష్ణువర్ధన్. రెండు విభిన్న కుటుంబాలు. నాలుగు విభిన్న మనస్తత్వాలు. అక్షరం ముక్క రాని నిరుపేద కుటుంబం ఒకటి. లక్షల అక్షరాలు నేర్చుకొని లక్షణంగా ఉద్యోగాలు చేసుకునే కుటుంబం మరొకటి.

దుర్గ భర్త రాజు. రాజు అవిటివాడు. చిన్నతనంలోనే పోలియో సోకి రెండు కాళ్ళు పనిచేయకుండా పోయాయి. అయితేనేం ఇప్పుడు తన రెండు కాళ్ళూ దుర్గ. రాజు దుర్గలను చూస్తే ఎవరైనా సరే ప్రేమించి పెళ్లిచేసుకున్న వాళ్లు అని అనుకోవలసిందే. నిజానికి దుర్గ రాజుని ప్రేమించి పెళ్లిచేసుకోలేదు. పెళ్లిచేసుకున్నాక ప్రేమించిది. ఎంతగా అంటే ఎవరూ ప్రేమించనంతగా... ఒక తల్లి కొడుకును ప్రేమిస్తే ఎలా ఉంటుందో అంతగా ప్రేమించింది.

తండ్రి తరువాత తండ్రి అంతటి వాడు మేనమామ. తండ్రి ఉన్నప్పటికీ కూడా మేనమామలకు ఉండే బాధ్యతే వేరు. మేనమామ మాత్రమే దగ్గర ఉండి చూసుకోవలసిన బాధ్యతలు కొన్ని ఉంటాయి. అందునా భారతీయ సంప్రదాయం ప్రకారం హిందూ వివాహ వ్యవస్థలో మేనమామకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. అలాంటి మేనమామ దుర్గ పేదరికాన్ని వెక్కిరిస్తూ తెచ్చిన సంబంధం ఇది. "అవిటోడైతే మనిసి కాదా?" అని మొండిగా, పౌరుషంగా రాజుని పెళ్లిచేసుకుంది దుర్గ. రచయిత్రి అంటారు "అప్పుడు నవ్విన వాళ్ళంతా ఇప్పుడు దుర్గారాజుల ప్రేమను చూసి ఈర్ష్యపడుతున్నారు.!" అని. ప్రేమించే మనసు ఉండాలే ఎవర్నయినా ప్రేమిస్తాం కదా! అయినా ప్రేమిస్తే ఏం పోతుంది మహా అయితే తిరిగి ప్రేమిస్తారు. రాజు కూడా దుర్గను ప్రేమించాడు. ఎంతలా ప్రేమించాడంటే దుర్గ ప్రేమించినంతగా ప్రేమించాడు. ఒక కొడుకు అమ్మ మీద చూపే అంత ప్రేమలా ప్రేమించాడు.

కథారంభంలో... "గిన్నెలు కడుగుతున్న శబ్దానికి నిద్ర లేచింది దుర్గ" అంటారు రచయిత్రి. గిన్నెలు కడుగుతుంది రాజు. అంటే దుర్గ కంటే ముందుగానే నిద్రలేచి తను చేయాల్సిన పనులన్నీ రాజే చేస్తాడని మనకు అర్థమవుతుంది. అలా అని దుర్గ రాజు చేత చేయిస్తుంది అనుకుంటే పొరపాటు. "ఏమయ్యా! ఏటంత ఆరాటం నీకు? నేను లేసి తోంకుంటాను కదా!" అని దుర్గ అన్న మాటలకు బదులుగా "ఏటైందిప్పుడు? రోజంతా పనిసేత్తనే ఉంటావ్! ఇంట్లో కూకొని బుట్టలల్లడమేగా నా పని!..." అంటూ రాజు దుర్గ రోజు వారీ పనుల్లో తనవంతు సహాయం చేస్తూనే ఉంటాడు, అనడం కంటే

తన వంతు బాధ్యత నిర్వర్తిస్తూనే ఉంటాడు అనడం ఉత్తమం. ఎందుకంటే బాధ్యతగా భావించినప్పుడే బంధాల విలువవేంటో తెలుస్తుంది. ఏదిఏమైనా రాజు అలా చేయడం దుర్గకు సుతారమూ ఇష్టం ఉండదు. కానీ రాజే వినిపించు కోకుండా పనులన్నీ చేస్తూ ఉం టాడు. ఎందుకంటే ఏ పనీ చేయకుండా ఉండడం రాజుకు ఇష్టముండడు.

దుర్గ బయట నాలుగు ఇళ్ళల్లో పాచి పనిచేస్తూ, రాజు ఇంట్లో ఉండి బుట్టలు అల్లుతూ జీవనం కొనసాగిస్తూ ఉంటారు. వీరికి ఒక కొడుకు. దుర్గ ఒకరోజు పని మధ్యలో నుంచి వచ్చే సరికి "రాజు పేడతో ఇల్లంతా అలుకుతున్నాడు. ఏటి రాజూ! బుట్టలన్నీ అల్లేసావా? ఏ పనీ జెయ్యాపోతే తోచదేటి? పొట్లంలోంచి గారెలు తీసి రాజు నోట్లో పెట్టింది."పని చేసే ఇంట్లో పెట్టిన గారెల్ని తినకుండా దాచి భర్త కోసం తెచ్చిన దుర్గను చూస్తే రాజుతో సహా ఎవరికైనా అమ్మే గుర్తురావాలి. ఎందుకంటే అమ్మే కదా తాను పస్తుండి కూడా బిడ్డల ఆకల్ని తీర్చేది. అమ్మే కదా దాచి దాచి బిడ్డకు ఇష్టంగా తినిపించేది. దుర్గ రాజుని అమ్మలా చూసుకుంటుంది, అమ్మలా ప్రేమి స్తుంది అనడానికి ఈ సంఘటనే నిలువెత్తు నిదర్శనం.

దుర్గ మొండిది. అన్యాయాన్ని సహించే మనిషి కాదు. ఆత్మాభిమానం కలిగిన అభిమానవతి. పద్మావతి గారింట్లో కూడా దుర్గ పనిచేస్తుంటుంది. అయితే కేవలం తిన్న గిన్నెలు తోమడం, కడగడం, ఇల్లు తుడవడం ఇంతవరకే అక్కడ తన పని. వంటింట్లోకి వెళ్ళే స్వేచ్ఛ పద్మావతి గారింట్లో దుర్గకు లేదు. కారణం పద్మావతి వాళ్ళ ఆయన విష్ణువర్ధన్. చదువుకొని ఉద్యోగం చేస్తున్నాడనే కానీ మహా చాదస్తపు మనిషి. అందునా ఆడదంటే చులకన భావం. దుర్గ విషయంలోనే కాదు భార్య విషయంలోనూ, కూతురు బుజ్జి విషయంలోనూ ఇదే భావన కనబరుస్తుంటాడు విష్ణు. భార్య ఊరు వెళ్ళిన సమయంలో కూతురు బుజ్జి చేసిన కాఫీలు, టీలు తీసుకోవడానికి కూడా ఎన్ని వంకలు పెట్టేవాడో... "సరదాకి చేసిన చపాతీ అమీబాని తల పించినా..." దానిని చూసి విష్ణు మెచ్చుకోకుండా "ఇంకా పనులు రాకపోవడ మేంటమ్మా! నానమ్మ నీ వయసులో ఎంత పని చేసేదో నీకు చాలా సార్లు చెప్పింది కదా!" అని విష్ణు మాట్లాడిన మాటలకు ఆ పసి మనసు ఎంత నొచ్చుకుందో...! ఏడ్చి ఏడ్చి అలానే నిద్రపోయిన ఆపాపను చూస్తే విష్ణు మనస్తత్వాన్ని అర్ధం చేసుకోవచ్చు. విష్ణు తన పనులు తాను చేసుకోడు. ఆయన పనులు అన్నీ భార్యే చేయాలి.

ఎందుకంటే భార్య, తల్లి, కూతురు ఎవరైనా సరే ఆడవాళ్ళు ఉన్నది మగాళ్ల పనులు చేయడానికే అనేది విష్ణు అభిప్రాయం. భార్య జ్వరంతో ఉన్నా ట్యాబ్లెట్ ఇచ్చి వేసుకోమనే మనస్తత్వం కూడా విష్ణులో కనిపించదు. ఆ సందర్భంలో దుర్గ వంటగదిలోకి వెళ్ళి పాలు కాచి పద్మా వతికి ఇవ్వాలని ప్రయత్నం చేస్తే ... "ఆగు దుర్గా! ఆమే కాచుకుంటుందిలే! నువ్వు నీ పని చూస్కో చాలు!" చికాకు ప్రదర్శిస్తూ కూతురు బుజ్జిని పిలవబోతే... "పనిచేతకాని పిల్లెట్టిన టీ అయినా తాగుతారు కానీ, మాలాటి తక్కువ జాతోళ్ళు ఎట్టిన కాపీలు, టీలు, పాలు ఎందుకు తాగుతా రండి మీరు? మీరు ఒండుకుని తిన్న కంచాలు, సామా నులు కడగడానికి పనికొత్తం గానీ, కడిగిన గిన్నెలు అంటు కోడానికి పనికిరాం! పక్కనున్న సొరుగులోంచి మాత్రలు తీసివ్వలేని మొగుడికి సేవచేసి జొరం తెచ్చుకున్న పెళ్ళాం!! బా సరిపోయేరు ఇద్దరికిద్దరూ నీ!ఛీ! మళ్ళీ ఈ గుమ్మం తొక్కితే మీ ఎడం కాలి సొప్పిచ్చుక్కొట్టండి!!" అంటూ విష్ణుని నిలువునా కడిగేసి వెళ్లిపోతుంది దుర్గ. తనకి విలువ లేని చోట ఉండడానికి ఇష్టపడని అభిమానవతి దుర్గ.

చదువుకుని ఉద్యోగం చేసే పద్మ కంటే అక్షరం ముక్క రాని దుర్గ ఎంతో ఎంతో ధైర్యంగా కనిపిస్తుంది. కష్టపడే తత్వం, అర్ధం చేసుకునే భర్త... దుర్గ తన భర్తను పేరు పెట్టే (రాజు) పిలుస్తుంది. పద్మ యావండి, అండి అని ఇలా... గౌరవం, మర్యాద పిలుపులో ఉట్టిపడాలి.

ఈ ఆలోచనాలోచనల్తో దుర్గకు నిద్ర పట్టడం లేదు. రాజుకు అన్ని విషయాలు చెప్పడం దుర్గకు అలవాటు. "ఇయ్యాలొక అవిటి పెనిమిటిని సూసానయ్యా!" ఇవి దుర్గ మాటలు "తప్పే నీ మొగుడూ ఒక అవిటోడే! ఎవల్నీ

అలా అనకు!'' ఇవి రాజు మాటలు. అవతలి వ్యక్తిని వేలెత్తి చూపడం నిజంగా తప్పే కదా! దుర్గ ఏం చెప్తుందో పూర్తిగా వినకుండానే రాజు మాట్లాడినా మాటల్ని గమనిస్తే అవతలి వారి లోపాల గురించి మాట్లాడుకోవడం పాపం అనే భావన కలుగుతుంది. రాజు మాటలు విన్న దుర్గ ''సెప్పుచ్చుకొట్టేత్తాను ఎవడన్నా నిన్ను అవిటోడంటే! అవిటోడంటే సేతులూ కాళ్ళూ లేనోళ్ళు కాదయ్యా! ఉండి కూడా ఆటిని ఉపయోగించుకోనోళ్ళు.!'' అని ఓ గొప్ప సత్యాన్ని ఆవిష్కరించింది దుర్గ. రాజుకు జరిగిందంతా చెప్పింది. దుర్గ చెప్పిందంతా విన్న రాజు ''పెళ్లాలే సెప్పుకోవాల ఆళ్ళ మొగుళ్ళకి! సాయం సేయమనో లేపోతే ఆడి పనులు ఆడ్నే సేస్కోమనో!'' అని చెప్తూ ''ఎన్నో ఏళ్ల తరబడి ఆడదాన్ని అట్టా తయార్సేసారు. కానీ ... ఏదైనా ఆడోళ్ళకే చేతనవుద్ది! ఇది మొగోళ్ల రాజ్యం కాబట్టి ఆడది పెతి నిమిసం పోరాడతనే ఉండాల! నోర్మూసుకుని ఉండాలో? ఎదిరించి గౌరం కాపాడుకోవాలో? ఆడదే నిర్ణయించుకోవాల!'' అయినా ''ఆడది నోరెత్తితేగానీ మొగాడిలో మార్పు రాదు'' ఈ మాటలు వింటుంటే ఆడదానికి రాజు మనసులో ఎంత గొప్ప స్థానం ఉందో అర్ధమవుతుంది. రాజు శరీరం అవిటిదేమో కానీ మనసు మాత్రం అవిటిది కాదు. పనికి వెళ్లిన దుర్గ రావడం లేటైతే ''తన భార్య కోసంఆందోళన పడుతూ నాలుగు కాళ్లతో'' కిందపడుతూ మీదపడుతూ వచ్చేస్తాడు రాజు.

భార్యను చూశాక... ''ఓ కర్ర తీసేసి తన భుజం ఇచ్చి, రాజు నడుం పట్టుకుని నడిపించుకుంటూ వెళుతుంది దుర్గ''. జ్వరంతో వణుకుతున్న భార్యకు ట్యాబ్లెట్ ఇచ్చి దగ్గర ఉండి చూసుకోని చదువుకున్న విష్ణువర్ధన్ అవిటివాడా? ఏ చదువూ లేకపోయినా భార్యే ప్రాణంగా బ్రతికే రాజు అవిటివాడా? ''రాజు అరచేతులు భూమ్మీద ఆన్చి పోలియో వలన చచ్చుబడిన రెండు కాళ్లూ, నడుం పైకి లేపి దేక్కుంటూ భార్య కోసం అన్ని పనులు చేస్తాడు రాజు...'',''అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నా భార్య ద్వారానే అన్నీ తన దగ్గరకు రావాలనుకుంటాడు విష్ణు'' నిజానికి అవిటి పెనిమిటి ఎవరో కథ చదివే పాఠకులకు అర్ధమైపోతుంది.

''ఆఫీసుకెళ్ళేటప్పుడు చెప్పులేసుకోవడానికి, భర్తకి వెళ్లొస్తానని చెప్పడానికి పెద్ద తేడా ఉండదు. రెండూ అనుభూతుల్లేకుండానే యాంత్రికంగా చేసే పనులే!'' అని రచయిత్రి అంటారు. నిజమే ప్రేమలు లేని చోట రెండూ యాంత్రికాలే.

ఈ కథలో... దివ్యాంగులు దేనికీ తీసిపోరని శారీరక, మానసిక వైఫల్యాలు ఉన్నప్పటికీ ఎదుగుదలను కాంక్షిస్తూ అనుకున్న లక్ష్యాలను చేరుకునే దిశగా మార్గాలను సుగమం చేసుకుంటారనే విషయలు అంతర్లీనంగా చెప్పబడ్డాయి. అంతేకాకుండా సుఖసంతోషాలు చదువుకున్న చదువుల్లో, చేసే పనుల్లో లేవని మన ఆలోచనా విధానంలో ఉంటాయనే సత్యాన్ని సరికొత్తగా ఆవిష్కరించారు రచయిత్రి. కథానాయకుడు రాజు మాటల ద్వారా స్త్రీవాద దృక్పథాన్ని కూడా కథాగమనంలో చూపించారు రచయిత్రి. మగాడి లోపాలను ఎత్తిచూపుతూ, పురుషాధిక్య ప్రపంచం కాబట్టి ఆడది నిరంతరం పోరాటం చేస్తూ తన ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడుకోవాలని, ఏదైనా ఆడాళ్లకే చేతనవుద్దని రాజు ద్వారా పలికించారు. ''ఆడాళ్లకు కాళికాదేవిలా ఎన్ని చేతులున్నా నోరుండదు కదే'' అంటాడు రాజు. పెద్దాళ్ళు చెప్పిన సామెతలు ''నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందని'', ''నోట్లో నాలుకుంటే ఎక్కడికైనా పోయి రావచ్చని''. నిజమే మాట్లాడే సత్తా ఉంటే మగువ మగాడిలో మార్పు తేగలదు. అనే భావాలను పలికించిన మానసిక పరిపక్వతను, శారీరక లోపంను కలిగిన రాజు ''నిలువెత్తు ప్రేమకు నిదర్శనం.''

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# పాపా సాహెబ్ సాహిత్యము

**- డా॥. పఠాన్ ఖాసిం ఖాన్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మోడర్న్ ఇండియన్ లాంగ్వేజస్, ఆలిగర్ ముస్లిం విశ్వవిద్యాలయం, ఆలిగర్, ఉత్తర ప్రదేశ్.

ప్రాచీనకావ్య లక్షణానుసారము ఆధునికాంధ్ర రచనగావించిన కవులెందరోయున్నారు వారిలో తక్కెల్లపల్లి పాపా సాహెబ్ గారు కూడా గణనీయులు. అనంతపురం మండలం నందలి రాయలచెఱువు సమీపమునగల కేశవరాయునిపేట వీరి నివాసస్థలము. వీరు సంస్కృతాంధ్ర భాషాధ్యయనము చేశారు. దుర్భర దారిద్ర్యమును అనుభవించి పలు ఒడుదుడుకులను తట్టుకొనిరి. వీరు ఆత్మాభిమానం కలవారు. సంస్కరణాభిలాషులు. జాతీయ వాదులు. దేశసేవాపరాయణులు, మానవతావాదులు, ప్రాచీనాంధ్ర కావ్యములను, ఆధునికాంధ్ర రచనల నధ్యయము జేసి పాండిత్యము నార్జించిరి. నిర్మలసేవా ధర్మమును జీవితాశకముగా విశ్వసించిరి. దుస్సహ బాధలను భరించిరి. పరాభవ పరంపరలను పొందిరి.

కర్తవ్య నిర్వహణము నందుపేక్ష వహించనివారు. ప్రతిఫలాపేక్షలేనివారు. నిరాశా నిస్పృహలకు తావివ్వని ఆశావాది. సంఘములో ప్రతినిత్యము సంభవించు నిత్యసత్యములను సాహిత్యములో ప్రతిబింబింపజేసిన సాహితీమూర్తి. పీడిత తాడిత కర్షక శ్రామిక వర్గములను మేలు కొలిపిన వైతాళికులు. నిస్తేజము, నిర్వీర్యము, నిర్జీవము, నీరసము, నిస్తబ్దతతో అలమటించారు మానవాళికి ఉత్తేజమును ఉజ్జీవమును కలిగించిన చైతన్యమూర్తి. దాస్యగాడాంధకారములో మ్రగ్గుచున్న జనావళికి వెలుగును విరజిమ్ము కావ్యకికరణములను ప్రసరింపజేసిన రవి. విశ్వమానవ శ్రేయస్సుకై విఖ్యాత గాథలను, విధివంచితుల వ్యథార్త గాథల యదార్థ దృశ్యములను, వివిధ రీతుల తాడిత పీడిత ప్రజల బాధలను కావ్యవస్తువులుగా కావ్యరచన గావించిన కవి. స్వార్థోన్మాద విద్రోహశక్తుల పాషాణ హృదయములను సహితము కావ్యాసిధారచే విదళించిన మహాకవి పాపా సాహెబు గార్. పవిత్ర మానవతకు సంకేతముగా ప్రకాశించిననవి.

భారతమాతకుంబ్రియము పావనహైందవజాతి దైవమౌ
గోరమబట్టి చంపి తిను క్రూరతురుష్కునకాంధ్ర భాషమల
దార దురందమాధురి తొనంకెడు ముగ్ధమనోజ్ఞ భావనో
దార గభీరధీర కవితా పటిమమ్మెటు లబ్బు నిస్సిరో!!!

అని ప్రగతి నిరోధక శక్తులు వారిని ఎత్తిపొడిచినప్పటికి దేశౌన్నత్యము, దేశ సౌభాగ్యము, దేశ సమైక్యత విరాజిల్లువలెననెడి యుత్తమాశయముతో పాపాసాహెబ్ గారు సాహిత్యసేవ జేయగడెంగెను. పై పద్యములో పాపాసాహెబ్ హృదయగాయములు ప్రతిబింబితము లయినవి.

అల్లాహోగ్బరటంచు నిచ్చ భగవధ్యానమ్ముగా వించుచున్
ముల్లానైతిని యయ్యవారినైతిన్ యుష్మత్పదారాధనో
త్ఫుల్లస్వాంతముతోడ, దివ్యకవనంబున్ ధీరతం జెప్పితిన్
తల్లీ! ఆంధ్ర సరస్వతీ! కరుణరాదా! నన్ను కాపాడవా!

అని ఉదృతావేదనతో అర్థించుచు నశ్రుతర్పణ గావించిరి. ఇందులో పాపా సాహెబ్ గారి ఆంధ్రభాషా దృఢాభిలాష అభివ్యక్తము.

సమాజంలో కవికి ప్రత్యక్షమైన హృదయ విదారణ దారుణ నికృష్టకష్ట దృశ్యములననేకము వారు సాహిత్యము నందు సాక్షాత్కరింపజేసిరి. వానితో మచ్చునకొక్కటి..

నవలా! మాయయు నారనట్టి పసి కూనన్ తొమ్ము నందాచి, ప్రా
ద్ధవునంచుంబని కేగుచో! బుడుతలమ్మా! ఆకలే! బువ్వబె

ట్టవె యంచాపగకొంగుబట్టి, తడికంటంబెట్టుచా తల్లియున్
ఆవలంబోయెడు దృవ్యముంగనిన నీరై పోయె పాషాణముల్.

ఇట్టి పద్య రత్నము లనేకములు పాపాసాహెబ్ సాహిత్యమునందు ప్రకాశించుచున్నవి.

రాజ్యశ్రీ, రసఖండమ్ వీరి ప్రథమ కృత్యులు ముద్రితమైనవి. కాని మృగ్యము.

**అవధి :**

ఇందులోని ఇతివృత్తము చరిత్ర ప్రసిద్ధిగాంచిన వారాంగినవాసవదత్త, బౌద్ధ భిక్షువయిన ఉపగుప్తుల వృత్తాంతము. దీనిలో రెండు తరంగాలు ఉన్నాయి. కర్నూలు జిల్లా పత్తికొండ తాలూక మారెల్ల గ్రామ వాస్తవ్యులు శ్రేయాడికి వెంకట స్వామికి ఇది అంకితము. ఇది ప్రకృత కవి తృతీయ ప్రయత్నము. 'అవధి' పీఠికాధారంగా కవి తన బాల్యదశలో విరచించినట్లు విదితము.

ఇందులో శృంగార శాంత రసాలు పరిపోషితము. కాని శృంగారాన్ని శాంతమతిశయించినట్లు నిరూపితము. రచనా విధానము సంభాషణాత్మకము. ఉత్కంఠ భరితము. నూతనర్తు వర్ణనా వైదగ్ధ్యముతో విరాజితము. కావ్యారంభానికి పూర్వము కవి తన కావ్య కన్యకుసార యశస్సును పొందమని ఆశీర్వచనాలిస్తారు.

తదుపరి ఆంధ్ర సరస్వతిని కవి....
తీరునొ తీరదో కృతులఁదీర్చి రచింపగఁదీరనట్టి సం
సార భరంబుపైబడుట మాయనుఁగుండెలుగమ్మ రోనమ
స్కార శతాలనీ 'యవధి' కావ్యము నర్పణఁజేతు దీని స్వీ
కారముజేసి సంతసము గాంచుము తల్లి! కటాక్ష ముంపుమా

అని వేడుకొంటారు. దీనియందు కవి కావ్యరచనా ప్రగాఢ తృష్ణప్రస్ఫుటమగుచున్నది.

**శకుంతల :**

ఇతివృత్తము మహాభరతమునుండి సంగృహీతము. నాల్గు ఆశ్వాలున్నాయి. శంకుతలాదుష్యంతులు ప్రధాన పాత్రలు. ఈ పాత్రలను దిద్దితీర్చడంలో కవి అభిజ్ఞాన శాకుంతలాన్ని యనుసరించారు. రచన ధారా శుద్ధి శోభితము. దీనిని కవి తన జనకునికి యంకితమిస్తారు. ప్రస్తుత కావ్యాన్ని లోకంలో ప్రకాశించేటట్లు చేయమని కవి సరస్వతిని ప్రార్థిస్తారు. ఈ కావ్యము మృగ్యము. ఆంధ్రోపన్యాసకులు శ్రీపట్నం నారాయణరెడ్డి 'గుత్తి మండల రచయితలు' అనే ఎం.ఫిల్ గ్రంథాధారంగా ప్రకృత కావ్యాన్ని గూర్చి పొందుపరటచమయినది.

**కన్నీటి చుక్కలు :**

పాపా సాహెబ్ గారి మూడేండ్ల ముద్దుల పట్టి మహబూబ్ హఠాన్మరణ శోకమ్ ప్రస్తుత కావ్యరచనకు ప్రేరణము. ఇందులోని యితివృత్తము కల్పితము కాదు. ఒకప్పుడు రాయలసీమలో ఒక పెద్ద జమీందారు కుటుంబంలో సంభవించిన దుస్సంఘటనాధారంగా ఈ రచనగావించారు. ఇది రెండు బ్యాగాలుగా విభజితము. ఇది మహబూబ్ కంకితము. ఇందులో ప్రధానంగా కరుణరసం జాలువారుతుంటుంది. దీనిని ఒక స్మృతి కావ్యముగా పేర్కొనవచ్చు. ప్రథమభాగంలో కవి ఆత్మీయచరిత్ర అధికముగా ప్రకటితము. పౌరాణిక చారిత్రక ఘట్టాలను స్పృసించడమయినది.

కావ్యారంభానికి మొదట భారతీ స్తుతి గావించిన తదుపరి తన తనయుని హృదయమునకు శాంతి చేకూరాలని ఆశీర్వదిస్తారు. ఇది తియ్యతియ్యని తేట తెలుగు పదములతో తేనెలొలుకుతుంటుంది. వర్ణనలు స్వభావసిద్ధముగా శోభిల్లుతుంటాయి.

**ప్రేమ విలాసము :**

ఇదియును మృగ్యమే. దీనిని గురించి ఆంధ్రోపన్యాసకులు రేపల్లె వాసులు శ్రీ మొవ్వపుషాద్రిపతి గారు పాపా సాహెబ్ గారి సమక్షములో ఒక సభలో ప్రసంగించటం జరిగింది.

**రాణీ సంయుక్త :**

ఇది చారిత్రక కావ్యము. రాణీ సంయుక్త పృధ్వీరాజుల ప్రణయగాధ కావ్య వస్తువు. అంగిరసము వీరము.

శృంగార కరుణ రౌద్రాలు, అంగరసాలు. సందర్భోచిత సంభాషణా చాతుర్యము సంశోభితము. కవి ప్రాచీన కావ్య పరిజ్ఞానము ప్రతిబింబితము. ఇది పంచతరంగాలుగా విరచితము. దేశభక్తి ప్రబోధితము. ఆంధ్రదేశము సహిత మభివర్ణితము. ఔచిత్యశోభితముపైన అలంకారములల రారుచుండును.

### అంబి :

మహాభారత ప్రసిద్ధతి వృత్తాధారముగా ప్రస్తుత కావ్యము విరచితము. అంబ గాథాకును కవి గాథకునున్న పోలికయే ఈ రచనకు ప్రేరణము. ప్రథమ భాగము మాత్రము ముద్రితము. ద్వితీయ భాగము వెలుగు చూడలేదు. ప్రథమ భాగముతో తరంగ త్రయము స్రవిస్తుంది. ఇది వేంకటేశ్వరునికి యంకితము. విష్ణువు వివిధావతరాములలో జేసిన ఘనకృత్యములను ప్రస్తుతిస్తాయి. సరస్వతిని ప్రార్థించి, ప్రాచీన సంస్కృతాంధ్ర కవులను స్మరించి ప్రకృత రచనకుపక్రమిస్తారు.

ఇందు వీరము ప్రధాన రసము. శృంగార కరుణ లంగరసములు. ఇది జాతీయములతో లోకోక్తులతో నలరారుతుంటుంది. ధారాశుద్ధి, భావగాంభీరయ్యము, పద ప్రయోగ పాటవము నిందు ప్రకటితము. రచనా ప్రాథమరమణీయముగా రాజిల్లుతుంటుంది. ఇవి ఔచిత్య సంవాద సభరితము. కవి పురాణ పరిజ్ఞానము నిందా ప్రకాశితము.

### సత్యాన్వేషణము :

ఒక గూడములో నివసించే కష్టజీవుల కన్నీటిగాధ దీని ఇతివృత్తము. అందుకే దీనికి 'కష్టజీవుల కన్నీటి గాధ' అని నామాంతరమును లిఖిస్తారు. పేదలను పీడిస్తూ కామాంధులు, ముఠా నాయకలు నధికారులు చేసే దౌర్జన్యములు కవి బట్టబయలు గావిస్తారు. తుదకు దోషుల్ని నిర్ధరించి శిక్షించడము, నిర్దోషులైన పేద ప్రజలను రక్షించడము సంభవిస్తుంది. ఇందు కులాంతర వివాహమభివర్ణితము. వీరము ప్రధానము. శృంగార కరుణలు గరసములు. ఇందలి వర్ణనములు, అలంకారములు, సహజ సుందర శోభితములు. సన్నివేశ శోభాద్విగుణీకృత సమాస రచనలు సంవిలితములు. ప్రస్తుత కృతి స్వతంత్ర భారతదేశ ప్రథమాధ్యమ్‌లయిన బాబూరాజేంద్రప్రసాద్ గారికి సమంకితము. ఇది సంస్కృతాంధ్ర జాతీయ సంచరితము.

### పాపసాబు మాట పైడిమూట :

ఇది నీతి శతకము. ఇందు 105 ఆటవెలదులు విలిఖితము. 'పాపసాబు మాట పైడిమూట' అనే మకుటంతో నీ శతకము పరమోజ్జ్వలముగా ప్రకాశితము. మకుటమే శతకనామమై విశిష్టశోభతో విరాజిల్లుతుంటుంది. చక్కని సామెతలు సంప్రయుక్తము. కవియనుభవించిన అభాగ్య జీవితము, చవిచూసిన పరాభవ పారజయములు, అన్య కృతాన్యాయములు దీనిలో ప్రతిబింబితము. రామాయణ మహాభారత సంఘటనలు దృష్టాంతములుగా సంగృవీతములు. యదార్ధమును నిర్భయముగా ప్రస్ఫుటము చేస్తుంటారు. కవి సంస్కరణాభిలాష యీ శతకము నందు సంస్పష్టము. ప్రస్తుత శతకమును ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి గారికి వీరంకితమిస్తారు.

1964 నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము పాపా సాహెబ్ గారిని కవిగా సన్మానించి గౌరవించినవి. 'అంబ' కావ్యమును ఆంధ్ర విశ్వవిద్యాలయము 'ఉభయ భాషా ప్రవీణ'కు పాఠ్య గ్రంథముగా నిర్ణయించి సత్కరించినది. 'అంబ', సత్యాన్వేషణము కావ్యములను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ కాని తగు విధముగా గౌరవించినది. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ శకుంతల, రాణీ సంయుక్త, అంబ, సత్యాన్వేషణము కావ్యములను గ్రంథాలయములకు పఠనీయములుగా నిర్ణయించినది.

విశ్వసించిన విశ్వాదర్శములకు జీవితమును వెచ్చించి పాపా సాహెబ్ గారు 1981 డిసెంబరు 2వ తేదీన తన శతకము ముద్రణలోనుండగానే గుండెపోటుతో పరమ పదించారు. సర్వశ్రేయస్సును సమకూర్చే సాహిత్యంలో సాక్షాత్కరిస్తున్నారు.

# "మళ్ళీ పల్లె ఒడిలోకి..." నవల - పరిశీలన

- **శెల్కలపెల్లి రాజు,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

భారతదేశపు ఆత్మ పల్లెటూళ్ళలో ఉందనీ, పల్లెటూర్లను అభివృద్ధి చేస్తేనే భారతదేశం అభివృద్ధి చెందుతుంది అని మహాత్మగాంధి అన్నారు. గతంలో డెబ్బై నుండి ఎనభై శాతం ప్రజలు పల్లెటూళ్ళలో నివసిస్తుండేవారు. పల్లెటూర్లు చాలావరకు స్వయంపోషకాలుగానే ఉండేవి. ప్రతీ గ్రామంలోనూ వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉండేది. మిగతా వృత్తుల వారందరూ ఏదో ఒక రకంగా వ్యవసాయం మీదనే ఆధారపడి జీవించేవారు. గ్రామాలలో నివసించే ప్రజల మధ్య ఒక అద్భుతమైన ఆర్థిక సంబంధాలతోపాటు, అనేక కులాల మధ్య చక్కని శాంతియుత సహజీవనం ఉండేది. పండుగలు, పబ్బాలు, పెళ్ళిళ్ళు, పేరంటాల వంటి ఉత్సవాలను ప్రజలందరూ కలిసి జరుపుకునేవారు. జానపద కళలకు పల్లెటూళ్ళు పెట్టని కోటలు. ప్రకృతి పట్ల, ప్రకృతి సౌందర్యం పట్ల ప్రజలకు గొప్ప ఆరాధనా భావం ఉండేది. ప్రజల మధ్య ఏవైనా వివాదాలు తలెత్తినప్పుడు గ్రామాధికారులు వాటిని పరిష్కరించేవారు. ఇలా ఒకప్పుడు ఎంతో శోభాయమానంగా విలసిల్లిన గ్రామాలు ప్రస్తుతం 'నగరీకరణ' అనే భావన విచ్చలవిడిగా పెరిగిపోవడంతో తమ శోభను కోల్పోతున్నాయి. పల్లెల్లో నివసించేవారంతా ఇప్పుడు నగరాల బాట పడుతున్నారు. నగరాల్లో అన్ని సౌకర్యాలుంటాయనీ, పల్లీయులు నగరాలకు వలసపోతున్నారు. ఇలా వలసపోవడంతో పల్లెటూళ్ళు ఎదుర్కొంటున్న నగరీకరణ సమస్యను శ్రీమతి వేముగంటి శుక్తిముకి "మళ్ళీ పల్లె ఒడిలోకి...." అనే నవలలో కళ్ళకు కట్టినట్లు చిత్రించింది.

వ్యవసాయమే వారసత్వమైన కుటుంబంలో వ్యవసాయదారుడి కూతురుగా జన్మించిన శుక్తిమతి పల్లె గురించి సమగ్రరూపంలో రాసిన ఈ నవల ప్రథమ ముద్రణ మన్మథనామ సంవత్సరం ఫిబ్రవరి 2016లో ముద్రితమై "అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్టు" పురస్కారం 2016 పొందింది. ఒక రచయిత రచించిన మొదటి నవలకు ఇచ్చే పురస్కారం రావడం జరిగినది. ఈ నవలను తన తండ్రి అయిన కీ॥శే॥ సూర్యప్రకాశ్‌రావు, మామ అయిన కీ॥శే॥ లక్ష్మీనర్సింహారావులకు అంకితం చేసినది. రచయిత్రి ఈ నవలతోపాటు మలిదశ తెలంగాణ ఉద్యమ విషయాలతో రాసిన "నేను సైతం...." (2017) నవల 'విశాల సాహితి పురస్కారం' పొందింది.

పల్లెటూళ్ళలో ఉన్న యువత పట్టణాలను ఆకర్షితులై ఏ విధంగా పెడదోవ పడుతున్నారో కళ్ళకు కట్టినట్లు చూపించిన నవల మళ్ళీ పల్లె ఒడిలోకి... ఈ నవల ఇతివృత్తానికి కేంద్రం : మన పల్లెటూళ్ళు. "కొక్కొరకో"తో మొదలైన ఈ నవల మళ్ళీ 'తొలికోడి కూత' తోనే ముగిసింది. ఇందులో బంగారయ్య కోడి కూతతో నిద్రలేచి మనుమరాలు సీతాలును లేపటం మొదలుకొని ఆద్యంతం జానపద భాష, భావవ్యక్తీకరణ, వర్ణన, పోలికలు, కనులకు కట్టినట్లు రచయిత్రి రచనా నైపుణ్యాన్ని చాటుతుంది. తెలంగాణ మాండలికంలో కొనసాగిన ఈ నవల ఎంతో హృద్యంగా ఆకట్టుకుంది.

నల్గొండ జిల్లాలోని పైడిపల్లి గ్రామం ఈ నవల కథకు ఆధారం. పైడిపల్లి అందాలవల్లి, అనురాగాలకు అది తల్లి. దాదాపు వెయ్యి గడపలున్న ఆ ఊరు వివిధ కుల వృత్తుల సంకీర్ణం. ప్రాచీనకాలంలో గ్రామ వ్యవస్థ నిర్మింపబడిన వైనానికి ఆ గ్రామం ప్రతీక. ప్రధాన వృత్తి అయిన వ్యసాయానికి కావలసిన సామాగ్రిని అందించే వివిధ వృత్తుల వారి నిలయం. అయోధ్యను పరిపాలించిన రామఅయుడిని కథల్లో చదివాము. కానీ పైడిపల్లిని పాలించే రాముడంతటి 'రామయ్య'ను అక్కడ చూడగలం. నిజాయితీకి ప్రతిరూపంగా, పల్లెపెద్దగా నిలిచి, ప్రజలకు విశ్వాస పాత్రుడుగా, స్వంత ఆస్తులు కలిగి ఉండి, గ్రామంలోని వ్యవసాయ భూములపై అవగాహన కలిగిన వాడు కరణం రామయ్య. అనుక్షణం గ్రామ అభివృద్దే ధ్యేయంగా జీవించే మొదటి వ్యక్తి. వ్యవ

సాయమే జీవనాధారంగా, పంట పొలాల్ని ప్రాణంగా భావించే నిస్వార్థజీవి రామయ్య.

కమ్మరి కులానికి చెందిన బంగారయ్య ఆ ఊర్లో గౌరవ మర్యాదలు సంపాదించుకున్న వ్యక్తి. కటువు మాటలు ఏమాత్రం మాట్లాడడు. చిరునవ్వు పెదవులు దాటిపోదు. వృత్తి పనులు మూలన పడకముందు బంగారయ్య కొలిమిలో తయారు చేయబడిన ఏ వ్యవసాయ పని ముట్టు అయినా చెక్కుచెదరకుండా ఉండేది. కమ్మరి వృత్తి పనులు చేసుకుంటూ రెండు ఎకరాల పొలం కొని వ్యవసాయం కూడా చేసేవాడు బంగారయ్య కొడుకు జోగయ్య తండ్రికి వ్యవసాయ పనులలో చేదోడు వాదోడుగా ఉండేవాడు. జోగయ్యది ఒక విచిత్రమైన మనస్తత్వం. ఎవరి మీద కోపం, ప్రేమ, అభిమానము, ఆవేశం ఉండదు. ఒక విధంగా చెప్పాలంటే ఇంకా తండ్రి చాటు బిడ్డే. బంగారయ్య తెలివితేటలు, ఆలోచనా విధానం, కష్టించి పనిచేసే నైజం ఏవీ మచ్చుకైనా జోగయ్యలో లేవు. జోగయ్య ఒక్కగానొక్క కొడుకు 'చంద్రం'కు చిన్నతనంలోనే తల్లి మరణించడంతో కంటికి రెప్పలా, ఎంతో గారాబంగా పెంచి పెద్ద చేశాడు. చంద్రం భార్య సీతాలు ఉత్తమ ఇల్లాలు. బంగారయ్య కుటుంబానికి దూరపు చుట్టం. తల్లిదండ్రిలేని ఆ పిల్ల గుణ గణాలు చూసి ఏరికోరి చంద్రంతో పెళ్ళి చేసాడు బంగారయ్య. సీతాలును కన్నకూతురులాగా చూసుకునే వాడు. క్రమక్రమంగా వృత్తి పనులు ఒకటొకటి మూలన పడుతూ కత్రకోత మిషన్లు, వెల్డింగ్ మిషన్లు అందు బాటులోకి రావడంతో బంగారయ్యకు వృత్తి పని తగ్గిపోయింది. పైగా వయసు పైబడింది. "నాయనా నువ్వు మూలపడ్డవ్. నేనె ఎవసాయం పనికుంటిని. ఈ శంద్రంని బస్తీకి పంపిద్దాం. ఏ పనైనా చూసుకుంటడు". (మళ్ళీ పల్లె ఒడిలోకి.... పుట సంఖ్య 8) అని జోగయ్య కొడుకును బస్తీకి పంపించాడు. పనికోసం పట్నానికి వెళ్ళిన చంద్రం మంచి కంటే చెడుకు ఎక్కువ ఆకర్షితుడయ్యాడు. మితిమీరిన సినిమాలు చూస్తూ వాటిలోని ఆవేశపు పనులను చూసి ప్రభావితుడయ్యి ఒక రౌడీలాగా తయారయ్యాడు. ఏ పండుగకో పబ్బానికో ఊరికి వచ్చి వెళ్ళేవాడు.

గ్రామ అభివృద్ధిని కాంక్షించే రెండవ వ్యక్తి అనంతశాస్త్రి. మంచి - చెడు తెలియజెప్పే పురోహితుడు. ఆయుర్వేద వైద్యం పట్ల అమితమైన నమ్మకం కలిగిన శాస్త్రి హస్తవాసి మంచిదని ఆ ఊరి వారే కాకుండా చుట్టుప్రక్కల గ్రామల నుండి కూడా వైద్యం కోసం వచ్చేవారు. అనంతశాస్త్రికి సంతానం కుమారుడు శేఖర్, కూతురు పార్వతి. శాస్త్రి చెప్పిన మంచిరోజునాడు చంద్రం భార్య సీతాలు కొడుకు శీనును బడిలో చేర్పించింది. బడిలో హెడ్‌మాష్టర్ వెంకట్రామయ్యతో పాటు మరో ఇద్దరు టీచర్లు ఉన్నారు. చాలా అనుభవం ఉండి రిటైర్‌మెంట్‌కు దగ్గర్లో ఉన్న వెంకట్రామయ్యకు వృత్తిపట్ల ఎంత గౌరవమో, అంత కంటే ఆదర్శవంతుడు. అక్షరజ్ఞానం లేక, సరిగ్గా పట్టించుకునే వారు లేక పిల్లలు ఏం నష్టపోతున్నారో ఇలాంటి అనేక పల్లెల్లో చూశాడు. కాబట్టి అవకతవకలు లేకుండా బడి పిల్లలకు న్యాయం చేయడానికి కంకణం కట్టుకున్న ఉత్తమ ఉపాధ్యాయుడు. చాలామంది పిల్లలు వర్షాకాలంలో బడికి రారు. ఎందుకంటే వారి తల్లిదండ్రులు పొలం పనులకు పంపుతారు. కొందరు తమ పిల్లలు బడిలో మధ్యాహ్న భోజనం చేశాక పొలం పనులకు తీసు కెళ్ళేవారు. పంతులు పిల్లలను పంపకపోతే అగౌరవంగా మాట్లాడేవారు. అలాంటి వారిలో నిరుపేదవాడైన ఎంకులు ఒకడు. పేదరికం ఎన్నో రకాలు 'విలువైన వస్తువులు లేకపోవడం, ఖరీదైన బట్టలు లేకపోవడం, ఘరానా ఇల్లు లేకపోవడం, సెంటు భూమి లేకపోవడం'. కానీ 'కడుపులోకి తిండి లేకపోవడం పేదరికం కాదు. జీవన్మరణాల మధ్య పోరాటం'. అలాంటి పేద పిల్లకు విద్యాబుద్ధులు నేర్పేందుకు వెంకట్రామయ్య మాస్టారు ఆ ఊర్లోనే ఉండేవాడు. బడిలో శీనుకు రామయ్య కొడుకు విశ్వం మంచి స్నేహితుడు. చదువులో వారిద్దరి మధ్య పోటీ తీవ్రంగా ఉండేది.

గ్రామ సర్పంచ్ 'బుచ్చమ్మ'గా గౌడ కులానికి చెందినది. మాట నేర్పు, సమయస్ఫూర్తి కలిగినది. వేలిముద్ర

తప్ప అక్షరంముక్కరాని బుచ్చమ్మను ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చేసినది రామయ్య. అయినప్పటికీ ఆమెను కాదని ఏ పనీ చేయలేదు. ఊర్లో పంచాయితీ ఆఫీసు కట్టించాలని రామయ్య సంకల్పించుకున్నాడు. ఊరి మధ్యలో పంచాయితీ ఆఫీసు కట్టాలని రామయ్య, ఊరి చివరన కట్టాలని దుష్టద్వయంగా తయారైన చంద్రం, ఏకస్వామిల అభిప్రాయాలతో ఊరిలో రెండు వర్గాల య్యాయి. చివరగా ఊరి మధ్యలోనే పంచాయితీ ఆఫీసు నిర్మాణం పూర్తి అయినది. ఇది దుష్టద్వయానికి మింగుడు పడలేదు. చంద్రం ప్రతి విషయంలోను అడ్డుతగులుతూ రామయ్య మీద ప్రజలకు లేనిపోనివన్నీ కల్పించి చెప్పే వాడు. ప్రతి సమస్యను సావధానంగా ఆలోచించి, చివరకు శాంతియుత పరిష్కారం చేయాలనే తత్త్వం కలిగిన రామయ్య భరించలేకపోతున్నాడు. పాల సముద్రం లాంటి ఆ ఊర్లో చంద్ర వలన విషయం పుట్టి కార్చిచ్చులాగా రోజు రోజుకు పెరిగిపోతోంది.

ఆ గ్రామంలో పండరి ముదిరాజ్ కులస్తుడు మూలన పడినప్పటికీ కుల వృత్తి పని అంటే చాలా ఇష్టం. చంద్రంతో సావాసం చేసిన పండరి తమ్ముడు రంగడు దుర్వ్యసనాలకు అలవాటు పడి చెరువులో చేప పిల్లలు పోసుకోవడానికి చంద్రం సలహాతో దళారులకు అవకాశం ఇచ్చాడు. చేపలు పెరిగిన తర్వాత మారుభేరగాండ్లు చంద్రం సహాయంతో గుండాలను కాపలాగా పెట్టి చేపల్ని పట్టుకుపోయారు. అడ్డువచ్చిన పండరిని హింసించారు. ఈ సంఘటనతో చంద్రం దౌర్జన్యాలు పెరిగిపోయాయి. అనంతశాస్త్రి కుమారుడు శేఖర్ పెద్ద చదువులు చదివి, పల్లెలపైన పరిశోధనలు కూడా చేశాడు. బస్తీలో ఉద్యోగం చేస్తూ భార్య కూతురుతో కలిసి ఉంటున్నాడు. శాస్త్రి కూతురు పార్వతికి వివాహం చేశాడు. ఒకసారి పార్వతి అత్తవారింట్లో జరిగిన సంఘటనలు సోదరుడికి చెప్పగా "మనిషిలో దైవత్వం, దానవత్వం రెండూ ఉన్నాయి. మంచితనంతో మనుగడ సాగించాలంటే ఆ మానవత్వం దైవత్వం ప్రకాశిస్తుంది. మూర్ఖత్వంతో రాగద్వేషాలు పెంచు కుంటే దానవత్వం విజృంభిస్తుంది. 'అగ్ని చనిపోయిన శవాన్నే కాలుస్తుంది. కానీ ఈర్ష్యాద్వేషాలనే కార్చిచ్చు బ్రతి కున్న మనిషిని కూడా దహిస్తాయి' అందుకే ప్రతి మనిషిని ప్రేమించడం నేర్చుకోవాలి. ఎవరి చెడు వాళ్లెంటే నీడలా తిరుగుతుందనుకొని మన మార్గం నుండి మనం తప్పుకోవద్దు" (మళ్ళీ పల్లె ఒడిలోకి... పుట సంఖ్య 49) అని చెల్లెలికి అత్తగారింట్లో అందరితో కలిసి మెలసి ఉం డాలని హితబోధ చేస్తాడు. ఇక్కడ రచయిత్రి 'అగ్ని చని పోయిన శవాన్నే కాలుస్తుంది. కానీ ఈర్ష్యాద్వేషాలనే కార్చిచ్చు బ్రతికున్న మనిషిని కూడా దహిస్తాయి. అని రాసింది. చదవడానికి బాగానే ఉన్నా 'అగ్ని చనిపోయిన శవాన్నే కాదు బ్రతికున్న మనిషిని కూడా కాలుస్తుంది. కదా మరి ఇలా రాశారేం అని అనిపించింది. కానీ మనిషిలో ఈర్ష్యాద్వేషాలు ఉండకూడదు అనే విషయాన్ని చక్కగా చిత్రించింది.

సంక్రాంతి పండుగకు రామయ్య అన్న భుజంగం భార్యా పిల్లలతో కలిసి వచ్చాడు. సెక్రటేరియట్‌లో ఫైనాన్స్ విభాగంలో ఉద్యోగం చేస్తున్న భుజంగం రిటైర్‌మెంట్‌కు దగ్గర్లో ఉన్నాడు. రామలక్ష్మణుల లాంటి అన్నదుమ్ముల మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు. వ్యవసాయ దారుల కాయకష్ట ఫలం, పంట ఇంటికొచ్చే తరునం ఉత్తరాయణ పుణ్యకాలం. సంక్రాంతి పర్వదినాలు, భోగి, సంక్రాంతి, కనుమ. అందరిండ్లలోను పిండివంటల ఘుమఘుమలు, చకిలాలు, గొబ్బెమ్మలు, పూలతో అలం కరణ, దర్వాలకు మామిడి ఆకుల తోరణాలు, బొమ్మల కాలువులు, సాయంకాలం పిల్లలకు భోగిపండ్లు పోయడం, పండుగ రోజు పూజలు, నోములు, కనుమ రోజు పశువుల పండుగ, ఎడ్లను కడిగి పసుపు కుంకుమ లతో అలంకరణ, పూజ ప్రసాద నైవేద్యం మొదలైన వానిని రచయిత్రి పరిపూర్ణంగా వర్ణించి పండుగ సందడిని తెలిపినది మరియు సూర్యాపేట వద్ద దరాజుపల్లి గట్టుపై ప్రతి రెండు సంవత్సరములకు ఒకసారి పెద్దగట్టు జాతర జరిగే విధానాన్ని చాలా చక్కగా వివరించినది. ముఖ్యంగా యాదవులు, ఇతర జాతుల వారుకూడా తమ మొక్కు బడులు తీర్చుకొనుటకు గొర్లు, మేకలు, కోళ్ళు బలి ఇచ్చి

తమ కోరికలు తీరనున్నట్లు సంతృప్తి చెందడం ఆన వాయితీ. గ్రామల నుండి ఎడ్లబండ్లు కట్టుకొని పెద్దలు, పిల్లలు అందరు వెళ్ళి రెండు మూడు రోజులు వంటలు చేసుకుని తిని ఆనందించడం జాతర విశిష్టతను తెలుపు తుంది. ఈ జాతరలో చెడు లక్షణాలు కలిగిన చంద్రం ఏకస్వామిల దోస్తానం మరింత బలపడింది.

ఊరిలో పనులు సరిగా లేకపోవడంతో నూకాలమ్మ కొడుకు మల్లయ్య తల్లి ఎంత వద్దని చెప్పినా వినిపించు కోకుండా సూరత్ వెళ్ళాడు కొడుకు ఊరుగాని ఊరుకు వలస వెళ్లిన నాటి నుండి నూకాలమ్మ బాధతో సగమైంది. ''అమ్మ'' అన్న పదానికి ఓంకారమంతటి పవిత్రత ఉంది. ప్రణవనాదం జగతిని పాలిస్తే, అమ్మ మనసు మమతను పాలిస్తుంది'. రోజులు గడుస్తున్న కొద్దీ జరిగే మార్పులకు మనసు అలవాటు పడిపోతుంది. ఖచ్చితంగా నూకాలమ్మ విషయంలోనూ అదే జరిగింది. ఒంటరి తనాన్ని అనుభవించగలుగుతోంది. ఇక్కడ రచయిత్రి అమ్మ గొప్పతనాన్ని చాలా చక్కగా వర్ణించింది.

బడి హెడ్‌మాస్టర్ వెంకట్రామయ్యతో చంద్రం అకారణంగా తగాదా పడి, అసభ్యంగా మాట్లాడి అగౌరవ పరచడం వలన మాస్టారు గ్రామం నుండి బదిలీ చేయించుకున్నాడు. వారి స్థానంలో వచ్చిన అమృతరావు మాస్టారు సమయపాలన, క్రమశిక్షణ పాటించేవాడు కాదు. పిల్లలు అల్లరి చేసినా, వారికి చదువు చెప్పాలన్నా చిరాకు పడేవాడు. అమృతరావు మాస్టారు ప్రవర్తనతో విసిగిపోయిన చాలామంది పిల్లలు బడి మానివేసి గొడ్ల కాడికి పోతున్నారు. కొంతమంది పిల్లలు వేరే ఊరిలో ఉన్న బడికి పోతున్నారు. ఇది చూసిన రామయ్య అమృత రావు మాస్టారును మందలించాడు. అది మనసులో పెట్టుకున్న మాస్టారు అవకాశం కోసం ఎదురుచూస్తూ చంద్రంకు తోడయ్యాడు. ఆ సంవత్సరం వర్షాలకు కొదువలేదు. కానీ వర్షపు నీటిని ఆనందమయమైన బతుకమ్మ పండుగ వచ్చినది. అన్ని పండుగలలో పూవు లతో దైవాన్ని పూజిస్తే, ఈ పండుగలో పూవులనే దైవంగా భావించి పూజిస్తారు. రకరకాల రంగుల పువ్వులు - తంగేడు, బంతి, చేమంతి, గన్నేరు, గునుగు మొదలైన పువ్వులతో ప్రతి ఇంటి మహిళలు తోటి వారితో పోటీ పడుతూ పెద్దగా అందమైన అలంకరణలతో, బతుకమ్మ లను పేర్చుకొని, సాయంకాలం చెరువుగట్టుకు అంతా చేరుకుని ఆట పాటల సంబరాలతో ఆడిపాడి చివరకు చీకటి పడిన పిదప బతుకమ్మలను నీటిలో వదులుతూ 'పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా' అంటూ సాగ నంపడం, తర్వాత వారు తెచ్చుకున్న ప్రసాదాలు ఒకరి కొకరు ఇచ్చి పుచ్చుకుంటూ 'ఇచ్చితినమ్మా వాయసం, పుచ్చుకుంటినమ్మా వాయనం' అంటూ తెలుపుకుని సరదాగా పాటలు పాడుతూ తమ తమ ఇండ్లకు చేరు తారు. బతుకమ్మ సందడిని కనులకు కట్టినట్లుగా రచ యిత్రి చక్కగా వర్ణించినది.

ఆ సంవత్సరం పంటలు పండలేదు. ఇది వరకు ఆ పల్లెల్లో ఎప్పుడు ఏది జరగాలో అది సక్రమంగా జరిపించే వాడు రామయ్య. కానీ ఇప్పుడు అనసవర చర్చలు, వాదోప వాదాలు, వ్యాజ్యాల నడుమ చాలామంది తమ తమ ముఖ్యమైన పనులను మరిచిపోతున్నారు. రామయ్య సలహాలు ఎప్పటికప్పుడు తీసుకుంటూ సర్పంచ్ బుచ్చమ్మ ప్రతీదీ పద్ధతి ప్రకారం ముందే గ్రామంలో చాటింపు చేయించేది. కానీ రామయ్యను లెక్కచెయ్యఎయికుండా ఊరి ప్రజల చేత ఆలస్యంగా బోనాల పండుగ చేయిం చింది. బోనాల పండుగకు వచ్చిన చంద్రం పూర్తిగా ఊళ్లోనే ఉండాలనుకున్నాడు. బడి హెడ్ మాస్టారు అమృత రావుతో స్నేహం ఎక్కువయింది. బడిలో పిల్లలకు పాఠాలు చెప్పి విద్యాబుద్ధులు నేర్పి వారి జీవితాలలో వెలుగులు నింపాల్సిన మాస్టారు గ్రామ విషయాలలో జోక్యం చేసుకుని రామయ్య మీద కోపంతో చెడు గుణాలు కలిగిన చంద్రంను సర్పంచ్ ఎన్నికలలో పాల్గొనేలా చేశాడు. పంచాయితీ ఎన్నికలలో నిజాయితీపరుడైన రామయ్యకు చంద్రం పోటీ. ఎన్నికల్లో చంద్రం చేయని దురాగతాలు లేవు. తాగడం, తాగించడం, తగాదా పడటం, ఎన్నికలలో తనకు సహకరించని లింగం ఇల్లుకు నిప్పు అంటించడం, చివరికి పోలింగ్ బూత్‌లో చొరబడి

దౌర్జన్యంగా ఓట్లు వేసుకోవడం వలన చంద్రం అక్రమంగా గెలిచాడు. ఎన్నికలలో జరిగిన సంఘటనలన్నీ నేడు జరుగుతున్న ఎన్నికల తీరును గుర్తుకు చేస్తున్నవి. ఎలాగైతేనేం చంద్రం సర్పంచ్ కాగలిగాడు. గ్రామ ప్రజల మధ్య తగాదాలు పెట్టి దరావతులు కాజేయడం, అత్తా - కోడళ్ళు మధ్య గొడవలు సృష్టించడం, భూ తగాదాలతో పబ్బం గడుపుకోవడం చంద్రంకు విధి నిర్వహణగా మారిపోయాయి. రాత్రయిందంటే చంద్రం వర్గం వారు విచ్చలవిడిగా తాగడం, పిచ్చి వాగుడుతో ఊరునంతా గడగడలాడిస్తూ భయభ్రాంతులకు గురి చేసేవారు. పొలాలు - పంటలు గూర్చి తెలియని రామయ్య అన్న భుజంగం వాటా భూమిని ఎక్కువ ధరకు పొరుగూరు వారికి అమ్మిపెడతానని రామయ్యకు భుజంగానికి మధ్య గొడవ సృష్టించాడు. గ్రామంలో ఏ తగాదాకైనా చంద్రం - ఏకస్వామిలే సృష్టికర్తలు.

చంద్రం తాత అయిన బంగారయ్య అనారోగ్యంతో మృతి చెందితే, చంద్రం చేసిన అవమానాలను పట్టించు కోకుండా రామయ్య అంత్యక్రియలన్నీ చేయించాడు. రామయ్యను ఎదురించిన రోజు నుండి మరణించే వరకు బంగారయ్య చంద్రం ముఖం చూడలేదు. పరోక్షంగా కూడా మాట్లాడలేదు. బంగారయ్య చనిపోయాక సీతాలు పూర్తిగా ఒంటరితనం అనుభవించింది. కన్న తండ్రిలా కంటిపాపలా సాదుచున్న తాత బంగారయ్య ఇంట్లో లేక పోవడంతో పిచ్చిదానిలా తయారయింది. సీతాలు లక్ష్యం ఒక్కటే. తాత కోరిక తీర్చడం. 'శీనుగాడు సురుకైనోడు ఆడ్ని పైకి తీస్కరా!' అంటూ సీతాలు మీద ఎంతో నమ్మకంతో చెప్పాడు. జోగయ్య ఇంట్లోనే ఉన్నా ఏదీ పట్టించుకోలేదు. బంగారయ్య ఇంటి ప్రక్కనే ఉండే కమ్మరి కనకం బాధతో కుమిలిపోతున్న సీతాలును చేరదీసింది. సీతాలుకు సహాయ సహకారాలు అందిస్తున్న కనకం ఇంట్లోకి దొంగలను, రౌడీలను పంపి నగలన్నీ దోచుకునేలా చేసి, ఆ పని రామయ్య మనుషులు చేశారని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి తన తప్పును రామయ్య మీదికి నెట్టివేసి ఊర్లో పోలీసు క్యాంపు పెట్టించాడు చంద్రం. కాఖీ బట్టల మొహం చూడని పైడిపల్లి పోలీసు క్యాంపు నిలయమైంది. చంద్రం ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా ఏమీ పట్టించుకోకుండా బండిలో మాస్టారు సరిగా పాఠాలు చెప్పకపోవడంతో పిల్లల భవిష్యత్ అంధకారం అవుతుందని భావించిన రామయ్య తన కొడుకు విశ్వంతో పాటు చంద్రం కొడుకు శీను గాడిని కూడా బస్తీ పాఠ శాలలో చేర్పించి వారికి కావలసిన వసతులన్నీ చూసు కుంటున్నాడు. తనకు అపకారం చేస్తున్న చంద్రం కొడుకు శీనుకు విద్యాధానం చేసిన విద్యాదాత రామయ్య.

రామయ్య అన్న భుజంగం భూమి అమ్మకం చేసు కుంటానని పంచాయితీ తీర్మానం చేయాలని పట్టు పట్టాడు. ఎప్పుడు ఒకరికి చెప్పేవాళ్ళం. మనకు పంచా యితీ ఏమిటి? అని రామయ్య ప్రశ్నించడంతో నువ్వు భూమికి అధిక ధర ఇవ్వలేవు. చంద్రం మారుబేరగాళ్ళకు అమ్ముతానంటున్నాడు. అని భుజంగం గొడవకు దిగాడు. అన్నయ్య నేను నిన్ను ఎప్పుడు వేరుగా భావించలేదు. నాక్కావలసింది నీ భూమిని తక్కువ ధరకు లాక్కోవడం కాదు. మన భూమిని మనమే దక్కించుకోవాలనే తాప త్రయం తప్ప మరొకటి కాదు అని రామయ్య అనడంతో వ్యాపారం కోసం కొనే వాల్లు ఎంత డబ్బు పెట్టగలరో అంత ఇవ్వాలనీ, రామయ్య ఇచ్చిన డబ్బును తీసుకొని ఇంకా కొంత బాకీ ఉన్నట్లు కాగితం వ్రాయించుకొని వెళ్ళిపోయాడు భుజంగం. అన్న భూమి కొనడానికి ఆపద సమయంలో ధన సహాయం చేసిన అనంతశాస్త్రికి జీవి తాంతం ఋణపడినట్లుగా భావించుకున్నాడు రామయ్య. వారం రోజుల తరువాత భుజంగం భూమిని ఇస్తానని ఒప్పుకొని కమీషన్ డబ్బులు తెచ్చుకున్న వారు వచ్చి తమకు భూమి ఇవ్వాలని గొడవకు దిగడంతో చంద్రం ఎన్నో రోజుల నుండి తగాదాలో ఉన్న సత్తయ్య అడ్డుకొని రామయ్యను తీసుకురావడంతో ఆ పొలం సత్తయ్యదనీ, తాను ఆ ఊరి కరణం అనీ, అవసరమైతే పహాణీలు చూసుకొమ్మని వారికి సర్దిచెప్పగా వచ్చిన వారు ఈ భూమి సర్పంచ్ తనదని చెప్పాడనీ, ఎలాగైనా సర్పంచ్ నుండి తమ డబ్బులు ఇప్పించమని వేడుకొని వెళ్ళిపోయాడు.

ఆ రోజు రాత్రి చంద్రం అమాయకుడైన సత్తయ్యను చంపించాడు. ఆ సంఘటనతో ఊరంగా గడగడలాడి పోతోంది. వ్యాజ్యమంటే కూడా తెలియని ఆ ఊర్లో అల్లర్లు, తగాదాలు, కొట్లాటలు, ఇవే కాకుండా దోపిడీలు హత్యలతో ఊరంతా స్మశానంలా తయారయ్యింది. పైగా కరువు కాటకాలు ఊరంతా పోలీసులు నిమిషానికోసారి అన్నట్లు వచ్చి పోతున్నారు. నెల రోజులు తిరగకముందే ఊరిలో మూడొంతుల మంది బ్రతుకు దెరువుకోసం నాగార్జునసాగర్ ఆనకట్ట నిర్మాణం కోసం, బస్తీలలో వివిధ రకాల పనుల కోసం వలస వెళ్ళారు. ఇదంతా చూసిన రామయ్య హృదయవ ఇదారకంగా కుమిలిపోయాడు. చంద్రం కారణంగా అమాయకులైన ప్రజలంతా మోస పోయారు. తమకు జరిగిన మోసాలను గ్రహించి చంద్రం ఏమి చెప్పినా వినిపించుకోవడం లేదు. వార్డు మెంబర్లు చంద్రాన్ని వ్యతిరేకించి పంచాయితీ బోర్డు నిధులన్నీ తిన్నందుకు ఋజువు చేయడానికి సిద్ధపడుతున్నారు.

ఈలోగా అనంతశాస్త్రి కొడుకు శేఖర్ పట్నంలో పల్లెల పట్ల పరిశోధనలు జరిపి "వలసలు - పర్యవసానాలు" అనే పుస్తకము వ్రాసి పల్లెకు చేరుకొని పరిస్థితులు గమనించి ఎంతో ఆవేదన చెందాడు. ప్రజలు ఇలా కావడానికి వ్యవసాయ పనులు లేకపోవడం. నీరు మనిషికే కాక ప్రతీ ప్రాణికి ప్రాణవాయువు. వర్షపు నీరు వృధా కాకుండా చెరువులు పునరుద్ధరణ చేసుకోవాలి. ఒక చెరువు ప్రతిష్ట అశ్వమేధ యాగంతో సమానం. అందుకే సప్త సంతానాల్లో చెరువు ఒకటి. అలాంటి చెరువులు రాజుల కాలంలో చాలా వరకు ఉద్ధరింపబడ్డాయి. శాతావాహన రాజవంశం వారికంటే ముందు నుండే ప్రారంభింపబడి, రాష్ట్ర కూటుల తర్వాత కళ్యాణి చాళ్యుకులు, ఆ తర్వాత వారి వద్దసేనా నాయకులుగా ఉన్న కాకతీయుల వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. ఓరుగల్లును పరిపాలించిన కాకతీయుల నాటి రామప్ప, పాకాల, శనిగరం, లక్నవరం చెరువులు ఈ నాటికీ చెక్కుచెదరలేదు. ఒక విధంగా చెప్పాలంటే గొలుసుకట్టు చెరువులను ఏర్పరచి తద్వారా తెలంగాణ ప్రాంతంలో చాలా వకు నీటి ఎద్దడి లేకుండా సాగుభూములుగా మార్చి సస్యశ్యామలం చేశారు. కాబట్టి మన ఊరి చెరువును పునరుద్ధరించుకోవాలి. దానితోపాటు ప్రజలలో ఆధ్యాత్మికతను పెంపొందించడానికి ఆలయం నిర్మించుకోవాలి. గుడి ఊర్లలో ఆధ్యాత్మికతను పెంచు తుంది. ధర్మప్రవృత్తికి దారి చూపుతుంది. దుర్మార్గులను మార్చగలిగేదే భక్తి మార్గం. గ్రామం సంస్థ, ఆలయం ఉప సంస్థ. ఈ రెండింటికీ అవినాభావ సంబంధం ఉంది. ఆలయం నిర్మాణానికి నా చేతనైనంత సహాయం చేస్తాను... అనీ గ్రామ వ్యవస్థ నిర్మాణం, నీటి గొప్పదనం భూ పోరాటాలు, ప్రాజెక్టుల నిర్మాణం, ఇలా అనేక అంశాల గూర్చి తండ్రతో శేఖర్ చర్చించాడు. అంతే కాకుండా గ్రామ పునరుద్ధరణకు పాటుపడాలనే సంక ల్పాన్ని రామయ్య గారిని కలిసి వివరించాడు. ఇది ఒక మంచి సంకేతంగా భావించిన రామయ్య సమ్మతించి ప్రోత్సహించాడు.

రామయ్య భగీరథ ప్రయత్నం లాంటి ఆలోచన చేశాడు. ఆ ఆలోచనకు అనుగుణంగా పల్లె రైతులంతా కలిసి పాలేరు వాగు నుండి పైడిపల్లి చెరువులోకి కాలువ తీశారు. ఎండిన చెరువు అంతా నిండింది. పాలేరు పైడి పల్లిని పన్నీటితో ముంచెత్తింది. తన ప్రవాహంతో ఎండిన రైతు గుండెలో జలాజలా ప్రవహించింది. కాలువ వచ్చిం దని తెలిసి ఊళ్ళో ఒక్కరు కూడా మిగలకుండా వచ్చి చూసి పోతున్నారు. ఆ సమయంలో దుష్టద్వయమైన చంద్రం ఏకస్వామిలు కూడా పారలతో కాలువ పనులు చేసి కొత్త నీటిలో తమ పాపాలు కడుక్కొని పునీలయ్యారు. పల్లె జనానికి నీటి కరువు తీరి, సాగునీరు - త్రాగునీరు అంది సారవంత భూములు సాగు అయినవి. పట్నం వలస వెళ్ళి వారంతా తిరిగి మెల్లమెల్లగా 'మళ్ళీ పల్లె ఒడిలోకి...' పైడిపల్లి ప్రజలు చేరుకున్నారు. ఇంతకాలం ఖాళీగా తిరుగుతున్న బంగారయ్య కొడుకు జోగయ్య గ్రామ పరిస్థితిని గమనించి, ఇక ఉపాధికి కొదువ లేదనీ వ్యవసాయం పనిముట్లు చేయుటకు సిద్ధపడి వృత్తిరీత్యా రైతులకు సహకరించ పూనుకున్నారు. పల్లె ప్రగతిని గమనించిన నూకాలమ్మ కొడుకు మల్లయ్య సూరత్

నుండి పవర్‌లూమ్స్ తెచ్చి గ్రామంలో పెట్టి పదిమందికి ఉపాధి కల్పించాడు. పల్లె ప్రజలందరికీ పైడితల్లిగా మారిందని రామయ్య ఎంతో సంతోషించారు. ఇలా అందరూ కలిసి పల్లె పూర్వవైభవం తీసుకురావడం శుభపరిణామంగా చెప్పవచ్చును. పట్నంలో చదువు కుంటున్న విశ్వం - శీనులు సెలవల్లో ఊరికి వచ్చారు. వారి రాకకు కారణం శీను కలలో ఊర్లోకి నీళ్ళు వచ్చినట్లు కనిపించడం అని కొడుకు విశ్వం ద్వారా తెలుసుకున్న రామయ్య పైడిపల్లి పల్లె ప్రజలందరికీ పైడితల్లిగా మారిందని ఎంతో సంతోషించాడు. ఒకరోజు రామయ్య విశ్వంతో నిన్ను ఆర్థిక ఇబ్బందులకు అతీతంగా ఉంచి చదివించాను. డబ్బులకు ఆశపడి ఏనాడు మన కన్నతల్లిలాంటి ఈ భూముల్ని అమ్మకం చేయకు. నా కోరిక ఇదేరా.... నా కోరిక ఇదే. నువ్వీ కోరిక మన్నిస్తే నిజంగా నా జీవితం ధన్యం అని చెప్పాడు. ఆ రాత్రంతా రామయ్య విశ్వంలు నిద్రపోలేదు. ఇరువురి మనస్సుల్లో ఒకే ఆశలు. ఒకే ఆశయాలు ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం శాస్త్రీయపరమైన అభివృద్ధి చెందాలి. ఎప్పుడో కన్నుమలిగిందిద్దరకీ తొలి కోడి కూతతో గాఢమైన నిద్ర నుండి చటుక్కున లేచారిద్దరు.

ఈ నవలలో చిత్రించబడిన నీటి సమస్య ఒక్క పైడి పల్లి ఊరుకు సంబంధించినదే కాదు. ప్రపంచ దేశాల ప్రజలకు సంబంధించినది. ఈ సమస్య పరిష్కారానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరాన్ని ఈ నవల తెలిపింది. పాలకులు, ప్రజలు, మేధావులు, మానవజాతి యావత్తూ ఆలోచింపవలసిన ఆవశ్యకతను రచయిత్రి ఈ నవలా ముఖంగా వ్యక్తీకరించింది.

ఈ నవలలోని పాత్రలన్నీ ఎంతో సజీవంగా మనం నిత్యజీవితంలో రోజూ చూసే, మన చుట్టూ ఉండే మనుషుల్లాగే కనిపిస్తాయి. ఈ వాస్తవికతే ఈ నవలకు ప్రాణం. పల్లెల్లో పలికేవాళ్లు లేక సాంఘిక, ఆర్థిక, రాజకీయ విద్య - వైద్య వర్షాభావ కారణాలతో పొట్టచేత పట్టుకొని బస్తీల్లోకి ఆటోడ్రైవర్లుగా, అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్లుగా, ఇంకా బజ్జీలు, పకోడీలు అమ్ముకునే దయనీయ పరిస్థితిని చూడలేక, చేసేది లేక ఎంతోమంది పల్లె బిడ్డలకు తెలంగాణ కన్నీరు తుడిచి, తిరిగి సస్యశ్యామలమైన అమలమైన "మళ్ళీ పల్లె ఒడిలోకి..." చేర్పించాలని ఆశిస్తున్నానని రచయిత్రి వేముగంటి శుక్తిమతి తెలిపినట్లుగా జరగాలని ఆశిద్దాం...

**ఆధార గ్రంథాలు :**


1. మళ్ళీ పల్లె ఒడిలోకి... - శ్రీమతి వేముగంటి శుక్తిమతి
2. మానవత్వం మరిచిన వేళ - శ్రీమతి వేముగంటి శుక్తిమతి
3. తెలంగాణ చైతన్యస్ఫూర్తి ప్రజల మనిషి - ఆచార్య అనుమాండ్ల భూమయ్య

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# దళిత కవిత్వంలో దళిత స్త్రీలు

– డా॥. ఎస్. యజ్ఞశేఖర్, శాఖాధిపతి, తెలుగు విభాగం, మద్రాసు క్రిష్టియన్ కళాశాల, చెన్నై, తమిళనాడు.

ప్రపంచ దృష్టిలో పురుషుడికి చాలా వరకు స్త్రీపై ఆధిపత్యం చేయటానికి అనుకూలంగా ఉంది. రామాయణ, భారతాల్లో కూడా పురుషునికే ప్రాధాన్యత ఎక్కువగా ఉంది.

**మనుధర్మశాస్త్రం :**

మనుధర్మ శాస్త్రంలో మనువు

శ్లో॥ పితారక్షతి కౌమారే - భర్తా రక్షతి యౌవనే
రక్షంతి స్థావిరే పుత్రా - నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి
(9 - 3)

కుమార దశలో తండ్రి, యవ్వనంలో భర్త, వార్ధక్యంలో కొడుకు రక్షించాలి స్త్రీ స్వతంత్రంగా జీవించరాదు అని చెప్పాడు.

ప్రాచీనులు సద్ధరమ్మ పత్ని ఎలాగ ఉండాలో కూడా ఈ విధంగా నిర్దేశించారు.

శ్లో॥ కార్యేషు దాసీ, కరణేషుమంత్రీ - రూపేచలక్ష్మీ, శయనేషురంభా
భోజ్యేషు మాతా క్షమయాధరిత్రీ - షట్కర్మయుక్తా కులధర్మ పత్నీ

అంటే దాసీలాగ సేవచేయాలి, మంత్రిలాగా సలహాలివ్వాలి, రూపంలో లక్ష్మీ లాగా వుండాలి, పడకగదిలో రంభలాగా చరించాలి, తల్లిలాగా భోజనం పెట్టాలి, భూదేవిలాగా ఓర్పుతో ఉండాలట.

**స్త్రీవాదం :**

ప్రపంచమంతా స్త్రీ ల పరిస్థితిని దాదాపు ఇదే విధంగా వివరించారు. అన్ని విషయాల్లోను స్త్రీలు పురుషుల్నే అనుసరించవలసి వచ్చింది. పురుషులకు ఛాయామాత్రంగా బ్రతకటం స్త్రీలకు అలవాటయిపోయింది. ఆధునిక కాలంలో ముఖ్యంగా 19వ శతాబ్ది పూర్వార్ధంలో మహిళల హక్కులను గురించి ఆలోచనలు బయలుదేరాయి. ఎలిజబెగ్ కేడీ, స్టాంటన్ సూసన్, బి. ఆంథోని నాయకత్వంలో స్త్రీవాద ఉద్యమం ప్రారంభమయ్యింది. స్త్రీవాదుల లక్షణం పురుషాధిక్యాన్ని కాదనటం, ఆ పురుషాధిక్యాన్ని కాలరాయటమే. పురుషాధిక్య ప్రపంచంలో సమాజంలో గాని, కుటుంబంలో గాని స్త్రీకి జరుగుతున్న అన్యాయాల్ని, అక్రమాల్ని ఎత్తి చూపించటమే స్త్రీ వాద కవయిత్రుల లక్ష్యం. అదే స్త్రీవాదమన్నమాట. మనువు (8- 72) స్త్రీ పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిని విచారించకుండా కఠినంగా శిక్షించాలన్నాడు.

**స్త్రీవాద కవిత్వం :**

స్త్రీవాద కవిత్వం నుండే దళిత వాద కవిత్వం ఉద్భవించింది. అత్యంత ప్రాచీన కాలం నుండి, మన భారత దేశంలో కులాలకు ఒక ప్రత్యేకస్థానం ఉంది. రామాయణ, భారతాది గ్రంథాల్లో చాతుర్వర్ణ విభాగం ఉంది. అనంతరం కాలంలో పంచమ కులాన్ని ఏర్పరిచారు. ఆ పిమ్మట అనేకానేక ఉపకులాలు కూడా ఏర్పడ్డాయి. అగ్రకులానికి సంబంధించిన గ్రామస్థులు పంచమ కులం వారిని గ్రామానికి వెలుపలగా నివసింపచేస్తూ అస్పృశ్యతను కూడా పాటించారు. తరతరాలుగా దళితుల్ని అంటరానివారుగా తయారు చేసింది సమాజం. ప్రధాన జీవన స్రవంతికి దూరమై శ్రమదోపిడీకి ఆర్థికపరమైన అణచివేతకు దళితులు ఆహుతయ్యారు. స్థూలంగా అంటరానివారిచే దళితులుగా పేర్కొనవచ్చు. మన భారత దేశంలో కొన్ని రాష్ట్రాల్లో శ్రమ దోపిడీకి, ఆర్థికపరమైన అణచివేతకు గురి అవుతున్న వారందరిని దళితులుగా ప్రభుత్వం గుర్తించింది.

**దళిత ఉద్యమం :**

ఆంధ్రదేశంలో దళిత ఉద్యమం 1960-70 ప్రాంతాల్లో ప్రారంభమైంది. 1966లోకంచికచెర్ల గ్రామంలో ఒక దళితుని సజీవ దహన వృత్తాంతం బహిర్గతమైంది.

1985లో కారంచేడు గ్రామంలో దళితులపై జరిగిన మారణ హత్యాకాండల కారణంగా దళితుల్లో చైతన్యం వచ్చింది. ఆ పిమ్మట గద్దర్ రచించిన దళిత పులులమ్మా అనే పాట కారణంగా దళితుల్లో చైతన్యం ఉధృతమై దళిత ఉద్యమం ఆరంభమైంది. ఈ సంఘటనలన్నీ దళిత సాహిత్య సృష్టికి మూలాధారాలయ్యాయి.

డా॥. బి.ఆర్. అంబేడ్కర్ దళిత సమస్యలకు విరుగుడు సూత్రం కుల నిర్మూలన మాత్రమే అని ఘంటా పథంగా చెప్పారు. దళిత కవిత్వం, పుట్టిన అనతి కాలం లోనే మూడు పువ్వులు ఆరు కాయలుగా దినదినాభివృద్ధి చెందింది. దళిత కవులు వస్తు వైవిధ్యంలోనూ, అభివ్యక్తిలోనూ, వినూత్న మార్గాల్ని, అన్వేషించి దళిత సాహిత్యాన్ని ఎంతో సుందరంగా ఆవిష్కరించారు.

దళిత సాహిత్యాన్ని గూర్చి అర్జున్ డాంగ్లే అనే మరాఠీ భాషా రచయిత చక్కగా నిర్వచించాడు.

Dalit Literature is nothing but the literary expression of the self respect.

ఆత్మ గౌరవానికి అక్షర రూపమే దళిత సాహిత్యమని చెప్పవచ్చు.

**దళిత రచయితలు :**

నోరు విప్పని, నోరు విప్పలేని దళితుల్ని అగ్ర కులాల వారు ఏలాగున దోచుకుంటున్నారో వివరంగా పేర్కొనటం జరిగింది. దళిత స్త్రీలను ఉన్నత వర్గాలవారు ఎంత అన్యాయంగా అణచివేస్తున్నారో గమనించిన దళిత కవులు దళిత స్త్రీల అణచివేతను ఇతివృత్తంగా తీసుకుని పెక్కురు పెక్కు కవితల్ని విరచించారు. దళిత స్త్రీల అణచివేతను వస్తువుగా తీసుకుని రచించిన ప్రధానమైన దళజత కవులెందరో ఉన్నారు. అందులో ముఖ్యంగా పేర్కొనదగ్గవారు. 1. కత్తి పద్మారావు, 2. ఎండ్లూరి సుధాకర్, మద్దూరి నగేష్‌బాబు, 4. శిఖామణి (సంజీవరావు), 5. నాగప్పగారి సుందర్‌రాజు, 6. బొజ్జ తారకం, 7. దున్న యాదగిరి ప్రభృతులు.

**కత్తి పద్మారావు :**

నీలికేక అనే దళిత కవితా సంపుటిలోని కత్తి పద్మారావు రచించిన వెన్నెలమ్మలో ఒకానొక దళిత సోదరి అగ్రవర్ణాల వాళ్ళ అమానుష కృత్యాలికి ఏ విధంగా బలి అయి పోయిందో హృదయ విదారకంగా వర్ణించాడు.

తల్లీ! నా బుక్కుల కోసం
నీదుద్దులు పెట్టి
అన్నా నువ్వన్నా సదువుకోరా
మన కట్టాలు తీరతాయి... అన్నప్పుడు
నా గుండె చెరువయింది గదమ్మా!.....
అమ్మా నువ్వు ఊరు మేసిన వన్నెలవుతావను కుంటే
నేను అక్షరాన్ని వొదిలి ఆయుధాన్ని అయ్యేవాణ్ణి గదే....
అని తీవ్రంగా ఆక్రోశించాడు.

**ఎండ్లూరి సుధాకర్ :**

ఎండ్లూరి సుధాకర్ రచించిన నల్లద్రాక్షపందిరి అనే కవితా సంపుటిలోని నల్లతల్లి అనే కవితలో దళిత స్త్రీలను అగ్రవర్ణ స్త్రీలు ఏ విధంగా అణచివేస్తున్నారో పఠితల మనోనేత్రాలకు కనబడేటట్లు విరచించాడు.

బలిసిన అహంకారాలన్నీ
జింక తనంలాంటి నీ అమాయకత్వం మీద
చీకటి పులులై ఎన్నిసార్లు ఎగబడి పంజాలు విసరలేదా
నీకు కులం పేరే తప్ప
నీ సొంత పేరు పెద్దవాళ్ళకు తెలియదు కదా
ఉన్నత వర్గ స్త్రీలు దళిత స్త్రీలకు కులం పేరు మీద
మాలదానా!
అనో మాదిగదానా! అనో పిలవటాన్ని చక్కగా ఎండ్లూరి
గర్హించాడు.

ఇంకొక చోట సుధాకర్...

ఆడదుశ్శాసినులు నీ కోకలు చింపుతున్నప్పుడు
ఒక కొడవలి లాగో
ఒక కాళిక లాగో మారకుండా
ఆడ క్రీస్తులా అలా బేలగా ఉండి పొయ్యేదానివి...

అని దళిత స్త్రీని శిలువ వేయించుకున్న ఆడ క్రీస్తని చెప్పటం మనోహరంగా ఉంది.

సుధాకర్ నిలువెత్తు నిప్పు అనే కవితలో దళిత స్త్రీల పై జరిగిన అత్యాచారాల్ని అణచి వేతల్ని మనోజ్ఞంగా వివరించి చెప్పాడు.

నలుగురూ కలిసి....
నా స్త్రీలను రాక్షసుల్లా చెరచి చంపినప్పుడు
నన్నింకా తుంగలో తొక్కి సంచుల్లో కుక్కుతున్నప్పుడు
లోలోపల అంటరాని తనపు ఫర్మానాలు
అచ్చు వేసుకుంటున్నప్పుడు
నమ్మకముంటే నాకింకా అనుమానమే
అని ఆవేశంతో తన సందేశాన్ని వెలిబుచ్చాడు.

ఎండ్లూరి వర్గీకరణీయం అనే దళిత దీర్ఘకావ్యంలో మాతంగ మాతల జీవన విధానాన్ని ఇలాగ వివరించాడు.

మాదిగ తల్లులు
మట్టిలో మాణిక్యాలే అయినా
వెట్టిలోనే మగ్గిపోయారు
పల్లెలో ఎల్లమ్మలుగా నలిగిపోయారు
భోగినీ వ్యవస్థలో
జోగినీలుగా చితికిపోయారు
దేవుడు పెళ్ళాలుగా మాతంగ కన్యలుగా
నెత్తురు కొరికిన
పచ్చి పసుపు కొమ్ములయ్యారు
అని వాపోయారు.

మద్దూరి నగేష్‌బాబు :

మద్దూరి నగేష్‌బాబు అప్పుడు గానీ? (చిక్కనవుతున్న పాట సంకలనం) అనే కవితలో దళిత స్త్రీలపై జరిగే దౌర్జన్యాల్ని, మానభంగాల్ని, హత్యల్ని, సజీవదహనాల్ని, హృదయ విదారకంగా అభివర్ణించాడు.

అయ్యా అగ్రకులాల్లారా
మా గుండెల్లో దిగుతున్న శూలాల్లారా
దించండి దించండి
మా తల్లుల పొత్తికడుపుల్లో
గడ్డ పలుగుల్ని మరింత లోతుకు దించండి
మానేల గుడిశెల తాటాకు చూర్లకి
మీ అహంకారాన్ని పెట్రోలు పోసి మరీ వెలిగించండి
ఘడియకో మాన భంగం
లిప్తకోహత్య చేసి
దళితుల ఉనికినే లేకుండా చేయమని
తన హృదయగత బాధను ఎంతగానో వ్యక్తీకరించాడు.

**శిఖామణి :**

చిన్ననవుతున్నపాట అనే దళిత వాద కవితా సంకలనంలో శిఖామణి వాడే అశుద్ధమానవుడు అనే కవితలో దళిత స్త్రీలపై జరుగుతున్న రాక్షసమైన అకృత్యాల్ని ఈ విధంగా ఏకరువు పెట్టాడు.

ఇంకా ముక్కుపచ్చలారని ఆడపిల్లల్నీ
ఇంకా పురిటి వాసనైనా పోని పచ్చి బాలింతల్నీ
క్రూరంగా అనుభవించి
పైశాచికంగా... దారుణాతి దారుణంగా హత్య చేస్తున్నారని
దళిత స్త్రీలు అనుభవిస్తున్న అరాచక అకృత్యాల్ని పేర్కొన్నాడు.

**నాగప్పగారి సుందర్‌రాజు :**

చండాల చాటింపు అనే దళిత కవితా సంకలనంలోని నాగప్ప గారి సుందర్రాజు రచించిన పెద్దింటిపిల్ల అనే వచన కవితలో ఇలాగ తన బాధను సువ్యక్తం చేశాడు.

ఎవరు పెద్దమనిషి అయినా
పాడేకినన్నే పిలుచుకు పోయే వాళ్ళు
నేను పెద్దమనిషి అయినప్పుడు ఎవరూ రాలేదు
ఆఖరికి మాలరామన్న బిడ్డ
వస్తుందనుకున్నాను
మాలోళ్ళు కూడా మాకంటే పేద్దోళ్ళేనంట
మాదిగేళ్ళోకి ఎవ్వరూ రాలేదు.

అని అగ్రకులాల స్త్రీలే కాకుండా మాలవర్ణ స్త్రీలు తోటి మాదిగవర్ణ స్త్రీలనెలా బాధిస్తున్నారో వివరించటం అని అగ్రకులాల స్త్రీలే కాకుండా మాలవర్ణ స్త్రీలు తోటి మాదిగవర్ణ స్త్రీలనెలా బాధిస్తున్నారో వివరించటం విశేషంగా ఉంది. మాదిగ వారికంటే మాలవాళ్ళకు తాము ఉన్నతులమనే భావన ఉన్నట్లుగా అభివర్ణించటం విశిష్టం.

**బొజ్జా తారకం :**

నది పుట్టిన గొంతుక సంపుటిలో నేను అస్పృశ్యుణ్ణి అనే వచన కవితలో బొజ్జా తారకం దళిత స్త్రీలను ఉన్నత వర్గ స్త్రీలు ఏ విధంగా హింసిస్తున్నారో మనస్సు వికలమయ్యేటట్లుగా విరచించాడు.

**నన్నెచోడుడు :**

కవిరాజ శిఖామణి తన కుమార సంభవ కావ్యంలో భంగ్యంతరంగా వ్యంగ్యంగా ఉన్నత వర్గాల వారు వాడుకునే కొలనులోని నీళ్ళను మాతంగులు వాడటానికి వీలు కాదనే విషయాన్ని పేర్కొన్నాడు.

తే॥. కొలునువన్యేభములు సొచ్చి కలయగలప
పులువులుండక వెలువడి పోయె పోక
తగదె మాతంగ దూషితంబగు సరోవ
రంబు సద్ద్విజ వర్జనీయంబు గాదె

ఒక అర్థంలో మాతంగ (ఏనుగు) దూషితమైన సరోవరం మంచి పక్షులకు వర్జనీయం కదా! అనీ మరొక అర్థంలో మాదిగ వారిచే వాడబడ్డ (దూషితమైన) సరోవరాన్ని మంచి బ్రాహ్మలు వర్జిస్తారు కదా! 12వ శతాబ్దం నుండే వస్తున్న ఈ విషయాన్ని బొజ్జా తారకం ఈ విధంగా పేర్కొన్నాడు.

ఎవరూ చూడకుండా
గుడికాడ బావి చేరుకొని
ఇన్ని నీళ్ళు భయంగా చేదుకొని
పరుగెత్తుకొస్తున్న
మా తల్లులు బట్టలూడదీసి
కొరడాలతో కొట్టుకుటూ
ఊరంతా తిప్పారు

ఈ విధంగా దళిత స్త్రీలను అమానుషంగా, అన్యాయంగా హింసించటం అక్రమంగా వుంది.

**దున్న యాదగిరి :**

మొగి అనే దళిత కవితా సంకలనంలోని అరుంధతులు అనే కవితలో దున్న యాదగిరి దళిత స్త్రీని అభివర్ణించాడు. దళిత స్త్రీలు అగ్రకులాల వాళ్ళ దౌర్జన్యాల నుండీ, దోపిడీలకు గురికాకుండా ఎలాగ ఉండాలో ఒక వినూత్న మార్గాన్ని యాదగిరి సూచించాడు. దళిత స్త్రీలు అందంగా సుందరంగా ఉంటే వాళ్లకు ఉన్నత కులాల వాళ్ళ నుండి కష్టాలెక్కువ అవుతాయట. అందువల్ల దళిత స్త్రీలు అందవికారంగా తయారయి ఆ కలియుగ రాక్షసుల బారి నుండి తమను తాము రక్షించుకోవాలంటున్నారు.

బొంత మందం ముదురు రంగు చీర రైక కట్టి
కాళ్ళకు గొట్టమంటి కడియాలు చుట్టి
మో చేతుల దాక గురుకైన
మట్టిగాజులు తొడిగి
ముక్కుకు యాపాకు కాడ
చెవులకు సొప్ప బెండ్లు పెట్టి
గూనినడక నేర్చి
అందమైన మా తల్లుల్ని
కురూపులుగా పెంచుతుంది
మీ కండ్లల్ల పడొద్దనే కదా దొరా

అని వాపోయాడు. అగ్రవర్ణం వాళ్లని దొరా అని సంబోధించడం మళ్ళీ వారికి ప్రాధాన్యం ఇవ్వటమే కదా! దొరా దొరసాని లాంటి పదాల్ని ఈ కవులు నేడు వాడకూడదు.

**బన్న ఐలయ్య :**

బన్న ఐలయ్య నిప్పుకణిక అనే కవితలో దళితుల్ని అగ్రవర్ణం వాళ్లు ఎలాగ దోచుకుంటున్నారో చాలా బాగా చెప్పారు. నోరు మెదపని బొడ్రాయి బ్రతుకే మొదటి సాక్ష్యం అని దళిత స్త్రీలను గురించి చెప్పారు.

**జూలూరి గౌరీ శంకర్ :**

కర్నూలు జిల్లా కోసిగి మండలం, సజ్జలగూడెం గ్రామంలో హరిజన స్త్రీపై దారుణమైన సామూహిక అత్యాచారం చేశారు. అది చాలక, నట్టనడి రోడ్డుపై పట్టపగలు బట్టలూడదీసి గొడ్డును బాదినట్లు బాదారు. ఈ సంఘటనను విన్న జూలూరి గౌరీశంకర్ వలువలొలిచి పూజించండి అనే కవితలో...

గుడిసె బజార్లోకి గుంజండి
రచ్చబండ వద్ద శీలం ఊరేగింపు
వలువలు వలవబడ సిగ్గు నా నాగరికత
గాంధీబొమ్మకాడ గొడ్డును బాదినట్లు బాది
అని వర్ణించాడు.

ఎండ్లూరి దళిత వాద కవి దున్న యాదగిరి దళిత స్త్రీలు అంద వికారంగా వేషం వేసుకోవాలంటుంటే ఎండ్లూరి సుధాకర్ దళిత స్త్రీ సౌందర్యాన్ని మనోజ్ఞగా వర్ణించాడు. ప్రకృతి సౌందర్యం కంటే కూడా దళితకన్యలో సొబగు ఉంది. ఈ కన్య సౌందర్యాన్ని వీక్షించి ప్రకృతియే ఉరకలు, పరుగులు వేస్తుంది నీలిక అనే కవితలో సుధాకర్...

నా నల్ల ద్రాక్ష పందిరీ
నా అరుంధతీ నక్షత్రమా!
సెగ బెట్టిన డప్పు బుగ్గ మీద
నామిని వేళ్లు పాటల గొంతై పలవరిస్తుంటే
నులివెచ్చన లేత మంటల వలయాల్లోంచి
నీ నీలి కళ్ళు ఆకాశంలో చుక్కల నాట్యం చూశాను
అని వర్ణించటం అసాధారణంగా ఉంది.

**మనిషి పుట్టుక కులం :**

2011లో ప్రచురితమైన గోసంగి అనే దీర్ఘ కావ్యంలో ఎండ్లూరి సుధాకర్ దళిత జన్మ పొందటాన్ని

ఒక విషాద శతాబ్దంలో జీవించిన వాణ్ణి
ఒక అంధకార యుగంలో
అస్పృస్యతను అనుభవించిన వాణ్ణి
పేర్కొనడానికి
వీలు లేని కులంలో పుట్టిన వాణ్ణి
అని వాపోయాడు అంతేగాకుండా
నేనూ మాణిక్యాన్నే
కానీ మసిగుడ్డలో దాచబడ్డాను
నేనూ సాటి మనిషినే
కానీ అంటరాని గడ్డలో పుట్టాను..
వేదం గుర్తించని మహాత్ముణ్ణి
అన్నాడు.

**ముగింపు :**

ఈఈ కులాల్లో జన్మించటం మానవ ప్రయత్నం కాదు. మన ఇష్టం కాదు. మనం ఆయా కులాల్లో ఉద్భవించటం అంతా దైవ నిర్ణయమే. అందుకే భట్ట నారాయణ తన కవి వేణీసంహారం నాటకంలో దైవాయత్తం కులేజన్మ అని వాక్రుచ్చాడు.

✿ ✿ ✿

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# ఆంధ్ర మహాభారతం - స్త్రీ పాత్రలు

- డా॥ లింగాల మంగమ్మ, పోస్టు-డాక్టొరల్ ఫెలో, తెలుగుశాఖ, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

- డా॥ నూనావత్ రాంబాబు, సీనియర్ ఫెలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఫర్ స్టడీస్ ఇన్ క్లాసికల్ తెలుగు, సి.ఐ.ఐ.యల్. మైసూర్, కర్నాటక.

విశ్వజనీనమైన భారతం వ్యాసలిఖితమైనది. ఆంధ్ర మహాభారతాన్ని ఎవరు ఏ విధంగా ఆశ్రయిస్తారో, ఆ విధంగా భాషిస్తుంది.

'ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
యాధ్యాత్మ విదులు వేదాంతమనియు
నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని
కవివృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్షణ సంగ్రహమని
యైతిహాసికు లితిహాసమనియు
బరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ
యంబని మహిగొనియాడుచుండ... భారతంబు'

అన్నట్లుగా భాషిస్తుంది. పంచమవేదంగా పేర్కొనబడుతున్న భారతం రాయబడి కొన్ని వేల సంవత్సరాలు గడిచినప్పటికీ, నేటికీ ప్రజాధరణతో సజీవత్వం పొందుతున్నదంటే అందులో ఉన్న వస్తువు ఎంత గొప్పదో అర్థమవుతుంది.

ఇతిహాస మహాకావ్యమైన ఆంధ్రమహాభారతం విభిన్న మనస్తత్వాలు గల వ్యక్తుల మధ్య నడచిన ఇతిహాస సౌరభం కాగా... అందులోని 'స్త్రీ' పాత్రలు... ఆలోచన కలిగించే విధంగా మలచబడి... నాగరికత వైపుకు వేగంగా అడుగులు వేస్తున్న యువతను సైతం ఆకర్షిస్తున్నాయి. జాతి జీవన విధానాన్ని ప్రతి బింబించేది సంస్కృతి. ఆ సంస్కృతి వారది స్త్రీ. భారతీయ సంస్కృతి స్త్రీలకు గొప్ప స్థానాన్నిచ్చింది.యత్ర నార్యస్తు పూజ్యంతీ, రమంతే తత్ర దేవతా, యత్రైతాస్తు నపూజ్యంతే, సర్వాస్తత్రా ఫలా:క్రియా: అంటూ స్త్రీలను పూజించే చోటనే దేవతలు ఆనందిస్తారు. స్త్రీలను గౌరవించనిచోట జరిగే సర్వక్రియలు నిష్ఫలములే అని వేద పారంగతులు ఉటంకించారు. సమున్నోన్నతమై చరిత్రలు చూసిన... చరిత్ర హీనమైన కథలు విన్నా... అందులో 'స్త్రీవ పాత్ర కారణ భూతంగా సాక్షాత్కరిస్తుంది. సంస్కృతి.... వారసత్వాన్ని అందించే ప్రతి క్రియ వెనుక... సజీవ చిత్రమై 'స్త్రీ' భాసిల్లుతున్నది.

పవిత్ర ఇతిహాసాలుగా పరిగణింపబడుతున్న రామాయణ, భారతాలలో 'స్త్రీ' ప్రాశస్త్యం వివిధ కోణాల్లో ఆవిష్కరించడం జరిగింది. అయితే మహాభారత స్వరూపాలలో 'స్త్రీ' ఔన్నత్యాన్ని స్థిరీకరించడం జరిగింది. ఆంధ్రమహాభారతాన్ని గమనిస్తే... కథా పారంభం, కథా కొనసాగింపు... కథాముగింపు వరకు గంగాదేవి గాంధారి, సత్యవతి, అంబ, అంభిక, అంబాలిక, కుంతీదేవి, ద్రౌపది మొదలైన పాత్రలు కనిపించి కథను నడిపిస్తారు. ఆంధ్రమహాభారతంలోని స్త్రీ పాత్రలు ఈ కిందివిధంగా ఉన్నాయి. కొన్ని స్త్రీ పాత్రల వివరించడం ఈ పత్ర ఉద్దేశం.

## గంగాదేవి :

ఆంధ్రమహాభరత ప్రస్తావనలో మొదటగా చెప్పుకోవలసిన పాత్ర గంగాదేవి. బ్రహ్మలోకంలో, బ్రహ్మ సమక్షంలో గంగాదేవి సౌందర్యాన్ని చూసిన కారణంగా మహాభిషుడు "నీవిక మానవ లోకంలో జన్మింతువుగాక" అని బ్రహ్మచేత శపించబడినాడు. అయితే భగీరథీదేవి కూడా మహాభిషునిని కూడా ఎక్కువగా ఇష్టపడి, అతని రూపురేఖలనే మనసులో మననం చేసుకుంటూ తిరిగి మర్త్యలోకానికి బయలుదేరగా మధ్య మార్గంలో వశిష్ఠ మహాముని వల్ల శపించబడిన ఎనిమిదిమంది వసువులు ఎదురుపడతారు.

ఆ వసువులలో ఒకరు ఆదేవికి ఈ విధంగా సందేహ నివృత్తి కలిగించారు. మహానదీయతల్లీ! స్వయంకృతాప రాధంవల్ల వశిష్ఠ మహర్షి మాకందరికీ మానవలోకంలో జన్మించవలసిందని శాపం ఇచ్చారు. ఇక మేమా నరకంలో ఉద్భవించవలసి ఉంది. అందువల్ల నీవు ఆ మానవ లోకంలో మహిళామణివై అవతరించి, మాకందరికీ నీ గర్భ వాసంలో జన్మించే మహద్భాగ్యం కలిగించమని కోరు తున్నాం. మేమెవరమూ వేరొక మానవ దేహంలో పుత్రులుగా జన్మించదలుచుకోలేదు. మహాభిషుడు ప్రతీప భూపతి తనయుడై శంతనుడను పేరుతో అవతరించ బోతున్నాడు. మీ ఇరువురికి వివాహం జరుగుతుంది. భూమిపై మా అవతరణకు అతడే హేతువు.

భగీరథి సంతసించంగా, వసుముఖ్యుడు తిరిగి ఈవిధంగా అర్థించుచూ అమరవాహిని నిశ్చయంగా నీవు మాకుపకారం చెయ్యవలెనని సంకల్పించిన యెడల జన్మించిన అనంతరమే మా అందరిని గంగా ప్రవాహంలో పడవేయవలెను. ఆ విధంగా ఆచరించిన యెడల మాకా మనుజలోకంలో చిరకాలం నివశించవలసిన దుస్థితి తప్పిపోగలదు. వశిష్ఠ మహర్షి కూడా మా కిదే తరుణో పాయమని ఆదేశించారు. దీనికి నీవు అంగీకరించాలని కోరుతున్నాం. వెంటనే ఆ దేవి నేను మీరందరు కోరినట్లు గానే ఆచరించగలను. అయినా జన్మించిన మీ అందరి లోను ఒక్క కుమారుడు మాత్రం దీర్ఘాయుష్మంతుడె వరిల్లవలెనని ఉవ్విళ్ళురుతున్నానని తన మనోరథం తెలుయజేసింది. వేర్వేరుగా తమ అందరి తేజో భాగాల లోను, నాల్గవ అంశం గ్రహించి జన్మించిన అష్టమ వసువు ఆవిధంగా చిరకాలం జీవించగలడనీ, అతని సచ్చరితం ముల్లోకాలలోను వ్యాపించగలదని వాగ్దానం చేశారు.

అలా కొంతకాలం తర్వాత ప్రతీపుడు కుమారుడుగా జన్మించిన శంతన మహారాజు మొదటి భార్య గంగదేవి. ఈమె అందాన్ని చూసి మోహించిన శంతన మహారాజు తనని మనువాడాల్సిందిగా గంగని కోరతాడు. అయితే ఆమె 3 నిబంధనలతో శంతన మహారాజుని వివాహ మాడుతుంది. అందులో మొదటి నిబంధన, తను ఎక్కడ నుండి వచ్చింది ఇత్యాది వివరాలేమీ మహారాజు అడగ కూడదు. రెండోది, తాను ఏమి చేసిన మహారాజు ఆమె చర్యలని అవి మంచివే అగుగాక లేదా చెడువే అగుగాక, ఆమె చర్యలని మన్నించాలి. ఇక మూడో నిబంధన, పై రెండింటిలో ఏ ఒక్క దానిని మహారాజు అతిక్రమించినా ఆమె మహారాజుని వదిలి వెళ్ళిపోతుంది. శంతనుని ముందు అతిలోక సౌందర్యంతో ప్రత్యక్షమై ఆకర్షించగా, అతని కోరికమేరకు తాను ఏం చేసినా అడగకోడదనే షరుతుతో వివాహం చేసుకుంటుంది. తనకు పుట్టిన ఏడు మందిని ప్రవాహ మద్యంలో పడవేసింది. తర్వాత అష్టమ పుత్రుడైన గాంగేయుడుని సర్వవిద్యల్లో ఆరితేరినట్లు చేసి మహాభారత కథామూలపురుషున్ని అందించిన దేవతామూర్తి గంగాదేవి.

**సత్యవతి :**

ఆమె సత్యగంధి దాసరాజు కుమార్తె. శంతనమహా రాజు రెండవ భార్య. ఒకరోజు సత్యవతి పడవ నడుపు తుండగా పరాశరుడనే జ్యోతిశ్శాస్త్ర ప్రవీణుడయిన మహా ముని ఆమెను కామించాడు. తాపసులకిది తగదని ఆమె అభ్యంతరపెట్టినా అతను నిగ్రహించుకొనలేకపోయాడు. ఆ ముహూర్తానికి అలా జరిగిపోవాలన్నాడు. ఆమె శరీర మంతా అతిలోక పరిమళభరితమయ్యేలాగానూ, ఆమె కన్యాత్వం చెడకుండేలాగానూ వరమిచ్చాడు. అలా వారి సంగమం కారణంగా యమునా నదిలో ఒక ద్వీపంలో ఆమె సద్యోగర్భాన (కన్యాత్వం చెడకుండా) జన్మించిన కొడుకే కృష్ణద్వైపాయనుడు లేదా వ్యాసుడు. అలా కృష్ణద్వైపాయనుడుకు తల్లయ్యి, మహాభారత కథకు శ్రీకారం చుట్టింది. ఆ పిల్లవాడు పుట్టగానే పన్నెండేళ్ళ ప్రాయునిగా ఎదిగి, తల్లికి ప్రమాణం చేసి, స్మరించినపుడు వచ్చి దర్శనం చేసుకొంటానని మాట యిచ్చి వెళ్ళి పోయాడు. మునివరం వలన ఆమె ఎక్కడికి వెళ్ళిందీ ఏమయిందీ ఎవరూ అడుగలేదు. ఆమె శరీరం యోజనం మేర సుంధాలు విరజిమ్ముతున్నందున అమె "యోజన గంధి" అయింది.

దేవవ్రతుడు (భీష్ముడు, గాంగేయుడు) అనే కుమా

రుని హస్తినాపురం రాజైన శంతనునికి అప్పగించి గంగ అతనిని విడచిపోయింది. తర్వాత యమునాతీరంలో వేటకు వెళ్ళిన శంతనుడు సత్యవతిని చూసి మోహించాడు. తనకిచ్చి పెళ్లి చేయమని ఆమె తండ్రి దాశరాజును కోరాడు. అయితే తన కుమార్తె సంతతికే రాజ్యం కట్ట బెట్టేలాగయితేనే రాజుకు తన కుమార్తెనిస్తానని దాశరాజు చెప్తాడు. తండ్రి ద్వారా ఈ సంగతి తెలిసికొన్న దేవ వ్రతుడు దాశరాజు వద్దకు వెళ్ళి తాను ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉంటానని, తనుగాని, తన సంతతిగాని రాజ్యంకోసం సత్యవతి సంతానంతో పోటీపడే సమస్యే రాదని భీషణంగా ప్రతిజ్ఞ చేశాడు. సత్యవతిని తనకు మాతృదేవతగా అనుగ్రహించమని అర్థించాడు. ఆమెను సగౌరవంగా తోడ్కొని వెళ్ళి తండ్రితో వివాహం జరిపించాడు.

సత్యవతీ, శంతనులకు చిత్రాంగదుడు, విచిత్ర వీర్యుడు అనే బిడ్డలు కలిగారు. శంతనుని మరణానంతరం చిత్రాంగదుడు రాజయ్యాడు కాని ఒక గంధర్వునితో యుద్ధంలో మరణించాడు. తర్వాత భీష్ముడు విచిత్రవీర్యుని రాజు చేశాడు. అతనికి కాశీరాజు కుమార్తెలు అంబిక, అంబాలికలనిచ్చి పెళ్లి చేశాడు. కామలాలసుడైన విచిత్రవీర్యుడు కొద్దికాలానికే అనారోగ్యంతో, నిస్సంతుగా మరణించాడు.

ఇక వంశపరిరక్షణకు వేరే మార్గం లేదని, భీష్ముని పట్టాభిషేకం చేసుకోమని సత్యవతి కోరింది కాని భీష్ముడు ప్రతిజ్ఞా భంగానికి నిరాకరించాడు. దేవరన్యాయం ప్రకారం పెద్దల అనుమతితో ఉత్తములైన బ్రాహ్మణులతో కోడళ్ళకు ఆధానం జరిపి వంశాన్ని కాపాడుకోవచ్చునని సూచించాడు. అప్పుడు సత్యవతి తన వివాహపూర్వ వృత్తాంతం భీష్మునితో చెప్పింది. తనకే సద్యోగర్భంలో జన్మించిన వ్యాసునితో కోడళ్ళకు ఆధానం జరుపవచ్చునా అని అడిగింది. వ్యాసుని పేరు వినగానే భీష్ముడు ఆమెకు ప్రణామం చేశాడు. తనను కన్న తల్లియైన గంగవలెనే ఆమె కూడా పరమ పవిత్రమూర్తి అన్నాడు. ఆమె కారణంగా తమ వంశం పావనమైందని అన్నాడు. అనంతరం సత్యవతి వ్యాసుని స్మరించి తమ అవసరం తెలియజెప్పింది. వంశ పరిరక్షణార్థం తన పుత్రుడైన వ్యాస మహర్షిచే....కోడళ్ళకు సంతానప్రాప్తి కలిగించి... కురుకుల వంశాన్ని నిలబెట్టిన ఆలోచన పరిణితి గల 'స్త్రీ' మూర్తి సత్యవతి.

**అంబ :**

అంబ అనే నామవాచక పదానికి నిఘంటువు ప్రకారం సాధారణ ప్రయోగంలో అమ్మ అని అర్థం. ఇది పార్వతి దేవికి పర్యాయపదంగా పేర్కొనబడింది. దీనిని కొందరు స్త్రీల వ్యక్తిగత పేర్లలో పూర్వపదంగా గాని లేదా ఉత్తర పదంగా గాని ప్రయోగంలో ఉంది. కాశీని పరిపాలించే మహారాజుగారికి అంబ, అంబిక, అంబాలిక అని ముగ్గురు కుమార్తెలు. వారిలో అంబ పెద్దది. మహాభారతంలో అందమైన స్త్రీలలో ఒకరైన ఈమెకి ఆమె తండ్రిగారు స్వయంవరాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో మహారాజు భారతదేశంలోని మహారాజులందరికీ ఆహ్వానాలు పంపి హస్తినాపుర మహారాజుకి పంపడం మరిచిపోయాడు. ఇది చూసి ఆగ్రహించిన భీష్ముడు తన మేనళ్ళుడైన విచిత్రవీర్యునికి అంబనిచ్చి పెళ్లి చేయదలచి అంబ, అంబిక, అంబాలిక ముగ్గురినీ అపహరించాడు. కానీ అప్పటికే స్వయంవరంలో తాను సాళ్వ మహారాజుకి మనసిచ్చానని,సాళ్వ మహారాజు తనను తప్ప వేరొకరిని వివాహమాడనని ప్రతిజ్ఞ పునాడని చెప్పిన ధీరవనిత అంబ. తన ప్రేమని భీష్ముని ముందు వ్యక్తపరచడం చూస్తే ఆ కాల పరిస్థితులకి ఇది చాలా ధైర్యమైన చర్య అని చెప్పచ్చు. తనని సాళ్వుడి వద్దకు పంపమని అంబ కోరింది.

భీష్ముడు పుణ్యాంగనల సహాయంతో సాళ్వమహారాజు వద్దకు పంపగా, సాళ్వుని నిరాధరణకు గురై, సాళ్వుడు తనని అంగీకరించనప్పుడే దాంపత్య సౌఖ్యం చేయిదాటి పోయినదని నిశ్చయించిన ఏకాత్మ మోహితురాలు అంబ. కాని తన దీనావస్థకు భీష్ముడు కారణంగా ఎంచి అతని పతనాశక్తి కోసమై భీకర తపస్సు చేయాలని నిశ్చయించగా మౌనులు, శాలిహొత్రుడు... ముక్కుపచ్చలారని యవ్వనాన్ని వృదా చేయడం తగదని వారించినా,

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

పట్టుదల వదలక పరశురాముడిని కలవగా... అమ్మ... భీష్మునికిగాని, సాళ్వునికిగాని... నిన్ను ఆదరంతో స్వీకరించి పరాభవ వేధన తొలగించవలసినదని ఆదేశించగలను. ఈ ఉభయ మార్గాలలోను నీకు అభీష్టమేమి?అని ప్రశ్నించాడు. అందుకు ప్రతిగా అంబ తనను స్వీకరించనని చెప్పిన వారి సన్నిధికిపోబోనని భీష్ముని పతనానికై.... తపస్సు చేపట్ట నిశ్చయించానని చెప్పిన అభిమానవతి. భీష్ముడు పరశురామల భీకర యుద్ధానికి కారణభూతి అయ్యింది. తర్వాత యమునాతీరం చేరి కఠిన వ్రతమాచ రించింది. అంతట భగీరథి....ఆమె ముందు సాక్షాత్కరించి తన సంకల్పం కుటిల ప్రవృత్తి అని ఇందుచేత నీ శరీరం పరిత్యాగంతో ఏరై ప్రవహించగలదని చెప్పగ ఆ పలుకు లను ఏమాత్రం లక్ష్యపెట్టక తన అపార తపశక్తితో సగభాగం వినియోగించి ఆ ప్రదేశంలో అంబ నదిగా ప్రవహించి, మిగిలిన అర్ధ తరశ్శక్తితో తన స్వరూపానికి ఒకించుకైనా వికృతి కలగనీయక తీవ్ర తపశ్చరణం ప్రారంభించిన ధీశాలి. తన తప: బలముతో హరదేవున్ని మెప్పించి మరుజన్మలో నీ కోరిక నేరవేరగలదని వర మియ్యగా...... ఆనాడే తన... ఆశ్రమ సమీపంలో అగ్ని జ్వాల ప్రజ్వలింపజేసి క్రోథారుణవదనంతో ''మరుజన్మ లోనే నవశ్యం భీష్ముని వదింతునుగాక!'' అని పలికి అగ్నిలో ప్రవేశించి మరణించి మరుజన్మలో ద్రుపద వంశంలో శిఖండిగా జన్మించి తన కోరికను నేరవేర్చుకొనిన వీరవనిత. భారతయుద్ధంలో కీలకపాత్రధారిగా నిలచి కురువంశ క్షయానికి కారణభూమి అయ్యింది. 'స్త్రీ' తలచుకొంటే ఏదైనా సాధించగలదనే మాటకు నిదర్శన రూపం అంబ.

**అంబిక, అంబాలిక :**

అంబిక, అంబాలిక మహాభారతంలోని పాత్రలు. వీరిరువురు విచిత్రవీర్యుని భార్యలు. ధృతరాష్ట్రుడు, పాండురాజు వీరి కుమారులు. అంబ, అంబిక, అంబాలిక ముగ్గురు అక్కాచెల్లెలు. వీరు కాశీరాజు కుమార్తెలు. వీరి వివాహం కోసం కాశీరాజు స్వయంవరం ప్రకటించగా అనేకమంది రాజులు పోటీపడ్డారు, వారందరినీ భీష్ముడు ఓడించి, యువరాణులు ముగ్గురినీ ఎత్తుకు వెళ్ళాడు. అంబ సాళ్వరాజును ప్రేమించానని చెప్పడంతో భీష్ముడు ఆమెను అతడి వద్దకు పంపించేశాడు. అంబిక, అంబాలిక లను తన తమ్ముడైన విచిత్రవీర్యునికిచ్చి వివాహం చేశాడు. విచిత్ర వీర్యుడు క్షయరోగంతో నిస్సంతుగా మరణించాడు. వంశవృద్ధి కోసమని అతడి తల్లి సత్యవతి తన తొలిపుత్రుడైన వ్యాసుని కోరింది. అంబిక, అంబాలికలకు సంతానాన్ని ప్రసాదించేందుకు అతడు అంగీకరించాడు.

అంబిక వ్యాసుని వికారాకారం చూడలేక కళ్ళు మూసు కుంది. ఆ కారణాన వ్యాసుడు ఆమెకు, పుట్టుగుడ్డియైన ధృతరాష్ట్రున్ని ప్రసాదించాడు. అంబాలిక వ్యాసుని చూడడంతోనే భయంతో తెల్లబారింది. ఆ కారణాన ఆమెకు, పాండురోగం కారణాన తెల్లబారిపోయిన చర్మంతో పాండురాజు పుట్టాడు. ఇలా మహాభారత కథ కొనసాగింపుకు కారకులైనారు. ధృతరాష్ట్రుడు, పాండురాజుకు జన్మనిచ్చి... మహా సంగ్రామానికి తెర లేపారు.

**గాంధారి :**

మహాభారత ఇతిహాసములో ధృతరాష్ట్రుడి భార్య, కౌరవులకు తల్లి. ఇప్పుడు ఆఫ్ఘనిస్తానులో ఉన్న కాంధహార్ (పాతపేరు ''గాంధార'') నగరానికి చెందినది కావున ఈమెకు "గాంధారి" అని పేరు వచ్చింది. గాంధారి తండ్రి సుబలుడు, తమ్ముడు శకుని. ధృతరాష్ట్రుడుతో వివాహ సంబంధం వచ్చిన వెంటనే గాంధారి ధృతరాష్ట్రుడిని పతిగా భావించి, తన భర్త గ్రుడ్డివాడు అవడంచేత తాను కూడా కళ్ళకు గంతలు కట్టుకుంది. ఈమెకు దుర్యోధనుడితో మొదలయ్యే నూరుగురు కౌరవులుగా కుమారులు మరియు దుస్సల అనే కుమార్తె కలిగారు.

జన్మత: అంధత్వము లేకపోయినా తన భర్త అయిన ధృతరాష్ట్రునికి కరువైన నేత్రానందము తనకు తగదని భావించి కళ్ళకు గంతలు కట్టుకున్న మహాసాధ్వి. శ్రీకృష్ణ భగవానుడి విశ్వరూప దర్శన సమయంలో పరమాత్మ అనుగ్రహంతో ధృతరాష్ట్రుడు విశ్వరూప దర్శనము గాంచిన తర్వాతనే తాను దర్శించి భర్త కోరిక మేరకు శ్రీకృష్ణుడు ఆయన చూపును పరిగ్రహించగా తిరిగి తాను

గంతలు కట్టుకున్న పరమ సాధ్వీమణి. తన నూరుమంది కొడుకులను కోల్పోయి దు:ఖ సాగరంలో మునిగి ఉన్న క్షణంలో ఇంత అనర్థానికి కారణహేతువుగా శ్రీకృష్ణ భగవానునెంచి... వంశ... నిర్వంశమౌగాక.... యాదవ కుల సంజాతులు అంత: కలహాలతో అంతమౌదురు గాక. అని ప్రత్యక్ష నారాయణునే శపించగల శక్తి కలిగిన పతివ్రత గాంధారి. ఈమె యాదవ కులవంశ నాశనానికి హేతువుగా చెప్పవచ్చు.

**కుంతీదేవి :**

కుంతి యాదవుల ఆడబిడ్డ. వసుదేవుని చెల్లెలు, శ్రీకృష్ణుని మేనత్త. ఆమె అసలు పేరు పృథ. కుంతిభోజుడనే రాజు సంతానము కనుక ఈమెకు కుంతీదేవి అనే పేరు వచ్చింది. కుంతీదేవి మహాభారతంలో పాండవుల తల్లి. పాండురాజు భార్య. యాదవ కులంలో ప్రాదుర్భవించిన సౌజన్యవతి.. ధీరచిత్త, సహనవతి. త్రిమూర్తులనే తన కోపావేశము చేత శపించిన దుర్వాస మహర్షికి, సేవలు చేసి మెప్పించిన భక్తితాత్పర్యాలు కలిగిన ముదిత.

పువ్వుపుట్టగానే పరిమలిస్తుంది. కుంతి చిన్ననాడే చాలా బుద్ధిమంతురాలనిపించుకుంది. ఆమెనుచూస్తే పెద్దలకు ముద్దు వచ్చేది.ఆమె దైవభక్తి, గురుభక్తి, మెచుకోదగ్గవి. ఆ ఇంట్లో కుంతి అంటే ఎంతో అనురాగం వెల్లివిరిసేది. తన తండ్రి కుంతిభోజుడు తమ ఇంటికి ఎవరైనా పెద్దలు వస్తే కూతురుని పిలిచి ఆమె చేత వారికి పాదాభివందనం చేయించేవాడు, పరిచర్య చేయించేవాడు. ఆశీర్వదించ మని అర్థించేవాడు. ఇలా కాలం గడుస్తూ ఉంది.

ఒక నాడు కుంతిభోజుడు సభలో కొలువై ఉన్నాడు. ఆకస్మికంగా దుర్వాసుడనే ఋషి అక్కడకి వచ్చాడు. ఆయన రుద్రాంశ సంభూతుడు. ఆయనను చూస్తే అందరికీ భయమే, ఆయనకు కోపం ముక్కుమీదే ఉంటుంది. ఆయన శపిస్తే తిరుగులేదు. అటువంటి చండప్రచండుడైన ఋషికి ఆతిథ్యమివ్వాలి. సపర్య చేయాలి. ఆ భారం కుంతిపై పడింది. తండ్రి బిడ్డ శిరస్సు నిమిరుతూ "తల్లీ! నీ ఓర్పుకిది గీటురాయి" అన్నాడు. కుంతి ఆనందంతో, అరమోడ్పు కన్నులతో " నాన్నా! మహర్షులకు సేవచేసే భాగ్యం అందరికీ కలసి వస్తుందా? దుర్వాసుని సేవ నా జీవితానికి వెలుగు త్రోవ" అంటూ నమస్కరించి దీవెనలు పొందింది.

దుర్వాసుడు ఆమె పరిచర్యకెంతో ఆనందించి "రాజ కుమారి నీ సపర్య నాకు మహదానందము కలిగించింది. అభిమతమేమి? అడగగా మీ సంతృప్తే నాకు ఆనందమని వినమ్రముగా పల్కగా... దుర్వాసుడు మారు మాటాడక స్వీకరించవలసింది అని 'నీ కావేల్పు నారాదించిన సత్వరమే అతడు ప్రసన్నుడు కాగలడ'ని అనుగ్రహిం చాడు. ఈ వరం ప్రకారం, ఆమె తాను కోరుకున్నప్పుడు ఏ దేవుడైనా ప్రత్యక్షమయ్యి వారి వలన ఆమెకు సంతాన ప్రాప్తి కలిగేలా ఒక వరం ప్రసాదించాడు. ఆమె వరం నాకెందుకు ఉపయోగపడుతుందని అడగగా భవి ష్యత్తులో అవసరమౌతుందని బదులిస్తాడు. ఆమె ఆ మంత్రాన్ని పరీక్షించడం కోసం ఒకసారి సూర్యుని కోసం ప్రార్థిస్తుంది. ఆమె తెలియక మంత్రాన్ని జపించాననీ, సూర్యున్ని వెనక్కి వెళ్ళిపోమని కోరుతుంది. కానీ మంత్ర ప్రభావం వల్ల ఆమెకు సంతానం ప్రసాదించి కానీ తిరిగివెళ్ళలేనని బదులిస్తాడు.

"తపనదేవా! పెద్దలు, బాంధవులు కలసి ఆర్య సమ్మతమయిన ధర్మమార్గంలో, శాస్త్రోక్త పద్ధతిలో వివాహం నేరవేర్చిన ఆనంతరమే సమాగమం సముచితం కాగలదు. అంతేగాని కన్యక తన కులశీలాలుజ్జగించి ఇట్టి దోరణ కనుమతించగలదా? నీకిది అభిమతం అయి నప్పుడు, తర్వాత పైనపడిన నింద తప్పక భరించి తీర వలసిందేగదా అని నిశ్చయించుకొన్నాను. అని పలుకగా కుంతి భోజాత్మజా నౌనధర్మ పదతి అనుసరించగలనను కొన్నావా? నాతో సాంగత్యం వల్ల నీ కన్యత్వానికే మాత్రము భంగం కలగనేరదు. అంతేగాదు నీ కత్యంత తేజశ్శాలి అయిన సంచనుడుద్భవించగలడు ఏ విధమైన లోకనింద సంద్రీప్తించనేరదు. ఇది ముమ్మాటికి తథ్యం సుమా! అని పల్కి సూర్యదేవుడా రాజకుమారి నాత్మ సమాగమంతో కర్ణుడుకి జన్మనిచ్చింది. అటు తర్వాత స్త్రీ జన్మత: సహజోతమైన మాతృత్వాన్ని వదులుకోవడానికి ఆమె పడిన వేదన తన బిడ్డను పంచ భూతాలు, సకల దేవతలు దీవెనలు వెన్నంటి ఉండాలని కన్నీటితో దీవించి శిశు

వును ఒకపెట్టెలో భద్రపరచి తమ రాజధానికి అనతి దూరంలో గల అశ్వనదీ ప్రవాహంలో వదిలినది. అతిశయించిన సంతాపంతో వలవల విలపించినది. జనకుని కులానికి తాను మచ్చకారాదని భావించి తన మాతృత్వాన్ని త్యాగం చేసిన వనితగా చెప్పవచ్చు.

ఆ పెట్టె అశ్వనదిలోనించి చర్మణ్వతిలోకి, చర్మణ్వతిలోనుండి యమునలోకి, యమునలో నుండి గంగలోకి అంచెలంచెలుగా ప్రయాణించింది. అలల్లో ఊయల ఊగుతూ, సూత దేశములోని చంపాపుర ప్రాంతములో పోతూవుంది. ధృతరాష్ట్రుని సఖుడైన అతిరథుడనే సూతుడు భార్య సమేతంగ జల క్రీడలాడుచూ, పెట్టెను చూశాడు. అతని భార్య రాధ పెట్టెను తెరిచింది. మణికనక కాంతులతో ప్రకాశించే శిశువును ఇద్దరూ చూశారు, మనకు బిడ్డలులేరు కనుక భగవంతుడు ఈ బిడ్డను యిచ్చాడు అని యదకు హత్తుకున్నారు. విధి విలాసమేమో! కుంతి కన్న కొడుకు రాధేయుడయ్యాడు.

తర్వాత పాండురాజును వివాహమాడి శాపగ్రస్తుడై దాంపత్యానికి దూరమైన భర్తకు సపర్యలు చేస్తూ... వంశాంకురానికై భర్తపడుతున్న వేదనను చూసి... తాను దుర్వాశముని ప్రసాదించిన వరం గూర్చి ప్రస్తావించడంతో పాండురాజు సంతోషంగా అంగీకారం తెల్పడంతో యమధర్మరాజుని ప్రార్థించి ధర్మరాజుని, వాయుదేవున్ని ప్రార్థించి భీముణ్ని, ఇంద్రుణ్ని ప్రార్థించి అర్జునుడ్ని పొందినది. భర్త కోరికమేరకు మాతృత్వాన్ని తాను పొండదమేగాక తన సవతి మాద్రి కూడా మంత్రం ఉపదేశించి అశ్వినీ దేవతలచే నకుల, సహదేవుల్ని పొందేలా చేసిన దాతృమూర్తి కుంతీదేవి. వంశ పరిరక్షణ చేసిన తేజోవతి. చివరలో అశ్వత్థామునిచే మరణించిన తన ముని మనవడు పరీక్షన్మహారాజును అచంచల భక్తితో శ్రీకృష్ణుని కృపచే తిరిగి బతికించుకున్న మహిమాన్విత స్త్రీ. పుట్టింటి వారి క్షేమం, కీర్తి కోరి కర్ణున్ని వదిలింది. అత్తింట క్షేమం, కీర్తికోసం....యవ్వనాన్ని సన్యసింప చేసింది. భర్త కోరిక మేరకు అంతరించబోతున్న వంశాన్ని పునురుద్ధరణ గావించి జీవితకాలం కష్టాలనే అనుభవించి ఒంటరిగానే సంతాన పెంపకాన్ని చేపట్టి మహోన్నతులను గావించిన సంపూర్ణ మాతృమూర్తి. భక్తి ప్రవృత్తులలో శ్రీమన్నారాయణుడైన శ్రీకృష్ణున్ని మెప్పించి ఆయన కృపా దృష్టితోనే చివరికంటా గమ్యం చేరిన స్త్రీ రత్నంను మహాభారతానికి హృదయ భాగం అని చెప్పవచ్చు.

**మాద్రి :**

పాండురాజు కుంతి భోజుని కుమార్తె. కుంతిని మరియు మాద్ర దేశపురాజు కుమార్తె మాద్రిని వివాహం చేసుకున్నాడు. కుంతి తనకు వరము వలన తెలిసిన మంత్రంను మాద్రికి ఉపదేశించగా, మాద్రి ఆమంత్రంను ఉపయోగించి అశ్విని దేవతల వలన నకులుడు మరియు సహదేవుడు అను కవలలను పుత్రులుగా పొందినది. పాండురాజు ఒకనాడు అడవిలో వేటాడుతూ లేడి రూపంలో సంభోగించనున్న ఒక ఋషిని తన బాణంతో కొట్టడం వల్ల, ఆ ఋషి పాండురాజుని తన భార్యతో సంభోగించ ప్రయత్నించిన మరణించెదవని శపించాడు. దానితో విరక్తి కలిగిన పాండురాజు రాజ్యాన్ని విడచి తన భార్యలతో కలిసి అడవిలో నివసిస్తూవున్నాడు. ఒకరోజు కుంతి మరియు కుమారులు లేని సమయంన పాండురాజు మాద్రిని చూసి ఆకర్షితుడై ఆమెను తాకగానే ముని శాప ఫలితంగా వెంటనే మృతి చెందాడు. మాద్రి పతితో పాటు సతీ సహగమనం చేసిన మహాసాధ్వి. పాండు పుత్రులను సంరక్షించే నిమిత్తంగా కుంతీదేవి బతికివుంది.

**ద్రౌపది :**

పాంచాల దేశపు మహారాజైన ద్రుపదరాజు కుమార్తె, దుష్టమ్నుడి సోదరి. యజ్ఞసేని, పరమ పవిత్రరాలు. మహాభారతంలో పది అందమైన స్త్రీలలో ద్రౌపది లేదా పాంచాలి తప్పక ఉండి తీరుతుంది. మహాభారతం రెండో సగంలో ఆమె పోషించిన పాత్ర శ్లాఘనీయం. అర్జునుడు ఆమెని స్వయంవరంలో గెలిచినా చివరికి ఐదుగురు పాండవులకీ ఉమ్మడి పత్ని అయ్యింది. ద్రౌపది ఎప్పుడూ నమ్మి పూజించే శ్రీకృష్ణుడే ఈమెని నిండు కౌరవ సభలో వస్త్రాపహరణం సమయంలో అవమానం నుంచి గట్టెక్కించాడు.

ద్రౌపది పూర్వ జన్మలలో వేదవతి, ఒక జన్మలో మౌద్గ

ల్యుడు అనే ముని యొక్క భార్య ఇంద్రసేన. మౌద్గల్యుడు ఐదు శరీరాలు ధరించి ఆమెతో విహరించాడు. తర్వాత జన్మలో ఆమె కాశీరాజు కుమార్తె అనామికగా జన్మించింది. చాలాకాలం కన్యగా ఉండి పతికోసం ఘోరమైన తపస్సు చేసింది. పరమశివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమనగా పతి అని ఐదుసార్లు కోరింది. తర్వాత శివుడు ఇంద్రున్ని ఐదు మూర్తులుగా రూపొందించి మానవులుగా పుట్ట వలసిందని శాసించాడు. ఆ పంచేంద్రియాలే ధర్ముడు, వాయువు, ఇంద్రుడు, అశ్వినులు. వారి ద్వారా పంచపాండవులు జన్మించారు. నీకు ఐదుగురు పతులున్నా అది ధర్మవిరుద్ధమని ఎవరూ భావించరు అని, ఆమె కోరుకున్న విధంగా ఐదుగురితో సుఖించటానికి తగ్గ యవ్వనం, కామభోగేచ్ఛ, వారిని సేవించేందుకు అవసరమైన శుశ్రూషాభావం, కన్యాత్వం, సౌభాగ్యం అనుగ్రహించాడు. మరుజన్మలో యాగ ఫలంగా ద్రుపదుడికి ద్రౌపది మరియు ధృష్టద్యుమ్నుడు జన్మించడం జరుగుతుంది. ఆమెను పార్థునికివ్వాలన్న ఆలోచనతోవున్న ద్రుపదుడు, పాండవులు మరణించారన్న మాట విని, ఆమెకు స్వయంవరం ప్రకటించాడు. ఆ మత్స్య యంత్రాన్ని ఛేదించి భార్యగా అర్జునుడు పొందగా... తల్లితో ఫలమని పరిహాసమాడగా సహజంగా అందర్ని పంచుకోమనడం దైవఘటనగా, వర ప్రభావంగా వర్ణించారు.

కురుక్షేత్ర యుద్ధం చివరి రోజులలో ఒక ఉదయం ... యుద్ధం భీకర పర్యవసానాన్ని చూసి విచారపడుతున్న ద్రౌపది ఈ మారణహోమం జరగటంలో తన పాత్రను గురించి ఆత్మపరీక్ష చేసుకొంటూ ఉంటుంది. అంతకు ముందురోజు ఉదయం ద్రౌపదిని నిద్రలేపిన నకులుడు ద్రౌపది కుమారులు ఐదుగురినీ రాత్రికి రాత్రే అశ్వత్థామ సంహరించిన విషయం చెప్తాడు. ఆ వార్త విన్న ద్రౌపది వివశురాలవుతుంది. యుద్ధభూమిలో సోదరుడిని, పుత్రుల మృతశరీరాలను చూసిన ద్రౌపదికి దుఃఖంతో పాటు కోపంకూడా వచ్చింది. అశ్వత్థామను చంపి పగతీర్చు కొమ్మని తన భర్తలను నిలదీసింది. చంపటానికి వచ్చిన పాండుపుత్రుల చేతిలో ఓడిపోయిన అశ్వత్థామ క్షమాభిక్ష కోరి తన తలపై ఉన్న చూడామణిని కోసి ఇచ్చాడని తెలిశాక ఆమె కోపం చల్లారుతుంది.

ఆ తరువాత యుద్ధంలో చనిపోయిన బంధువులకు పాండవులు తిలోదకాలు సమర్పిస్తుండగా కర్ణుడికి కూడా తిలోదకాలివ్వమని కుంతి కోరుతుంది. కర్ణుడు తన జ్యేష్టకుమారుడన్న సత్యాన్ని బయటపెటుతుంది. ఈ విషయం విన్నవారంతా ఆశ్చర్యపోతారు. అతడి మరణం అత్యంత విషాదాన్ని ఏర్పరిచింది. అతనికి అద్భుత, విశిష్ట వ్యక్తి అనే కీర్తి వచ్చింది. తమకూ, కర్ణుడికీ ఉన్న బాంధవ్యం తెలిసిన పాండవులు విషాదభరితులయ్యారు. ధర్మరాజుకు రాజ్యం మీద విరక్తి కల్గింది. అతన్ని పట్టాభిషేకానికి సుముఖున్ని చేసే బాధ్యత ద్రౌపదే తీసుకోవలసి వచ్చింది.

ఏ మహారాణికీ జరగని అవమానాలు ద్రౌపదికి జరిగాయి. ఏకవస్త్ర అయిన ద్రౌపదిని నిండుసభకు జుట్టు పట్టుకుని ఈడ్చుకువచ్చాడు దుశ్శాసనుడు. దుర్యోధనుడు ఆమెను కూర్చోమని తన తొడను చూపించాడు. ఆమె భర్తలముందే ఆమెను వివస్త్రను చేయబూనాడు. ఆ ప్రయత్నం విఫలమైన తర్వాత మరోసారి జూదమాడి పాండవులను అడవుల పాలు చేశాడు. ద్రౌపది పాండవులతో పాటు పన్నెండేళ్ళు వనవాసం చేయాల్సి వచ్చింది. ఆ సమయంలోనే సైంధవుడు ద్రౌపదిని అపహరించడానికి ప్రయత్నించాడు. వనవాసం ముగిశాక అజ్ఞాతవాసం కోసం విరాటపురం వెళ్ళినప్పుడు. ద్రౌపది విరాట రాణికి సైరంధ్రిగా ఉండవలసి వచ్చింది. కీచకుడు ఆమెను బలవంతంగా అనుభవించటానికి ప్రయత్నించి భీముని చేతిలో మరణించాడు.

అజ్ఞాతవాసం తరువాత రాయబారాలు, సంధి ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు ద్రౌపది వాటిని వ్యతిరేకించింది. యుద్ధం జరిగి, తనను అవమానించినవారిని తన భర్తలు వధించి తన పగ తీర్చాలని ఆమె కోరింది. ఆ కోరిక నెరవేరే క్రమంలో తన పుత్రులను కోల్పోయి పెద్ద మూల్యమే చెల్లించుకోవలసి వచ్చింది. ఆ తర్వాత ఆమె కొన్నేళ్ళు హస్తినాపుర పట్టమహిషిగా జీవించింది. కొన్నాళ్ళకు కృష్ణుడు మరణించాడు. పాండవులు మహా

ప్రస్థానం ప్రారంభించారు. ఆ యాత్రలో అందరికన్నా ముందు మరణించింది ద్రౌపది.

మహాభారత కథాగమనానికి అత్యంత కీలకమైన పాత్ర ద్రౌపది. స్వతంత్రంగా ఆలోచించడం, స్వేచ్ఛగా మాట్లాడటం, ఆత్మగౌరవ చైతన్యంతో ప్రవర్తించడం ద్రౌపది వ్యక్తిత్వంలో ముఖ్యాంశాలు. కౌరవలు పాండవులకు చేసిన అపకారాలకు, తనకు చేసిన పరాభావాలకు తగిన ప్రతిక్రియను ఆమె ఆశించింది. ప్రతిక్రియకు కావాల్సిన ఉత్సాహశక్తి నిరంతరం పాండవుల్లో ప్రజ్వలించడానికి ఉత్ప్రేరకంగా పనిచేయటంలో పన్నెండేళ్ళ అరణ్యవాస కాలాన్ని, ఒక ఏడాది అజ్ఞాతవాస కాలాన్ని వ్యూహాత్మకంగా ఉపయోగించుకొన్న ధీశాలి ద్రౌపది. కౌరవులపై పాండవుల విజయం వెనుకవున్న స్త్రీశక్తి ద్రౌపది. సంఘర్షించడం, వాదించడం, ప్రతిఘటించడం, సహించడం వంటివి ఇంట్లోనేకాదు సభల్లోనూ ప్రదర్శించడం ద్రౌపదిలోని సజీవ లక్షణాలు. అవ్వే ఆమెను విశిష్ఠ వ్యక్తిగా నిలబెట్టాయి.

**ముగింపు :**

స్త్రీ మూర్తులైన సీత, గంగాదేవి, ద్రౌపది మొదలైన పైన ఉదహరించిన స్త్రీ మణులందరూ మంగళకరులై తమదైన పాత్రలను సమర్థవంతంగా నడిపి... సూర్య చంద్రులు ఉన్నంత కాలం స్మరించుకొనేలా మహాభారత కథా విశేషానికి అలంకారులై భాసిల్లుతున్నారు. సత్యవతి, గంగాదేవి, కుంతి, ద్రౌపది పాత్రలు... సామాన్య దృష్టికి వింత గొల్పుతూ... పాండిత్య దృష్టికి దైవికమైన శోభతో కారణజన్ములుగా తెల్పుబడుతున్నారు. ధర్మాన్ని తెలుసుకున్నంత మాత్రాన ప్రయోజనం లేదు. దాన్ని ఆచరిస్తేనే ఫలితం ఉంటుంది. రామాయణ.... మహాభారాతాలు పారాయణ గ్రంథాలు కాదు. ఆచరణ ప్రధాన గ్రంథాలు.

నేటి సమాజంలో జరగుతున్న ప్రతి అంశానికి ఎదురవుతున్న ప్రతి సమస్యకి భారతంలో సందర్భోచితంగా పరిష్కార మార్గం దొరుకుతుంది. మానవులు సమాజంలో ఎలా మెలగాలి, ఎలా మెలగకూడదు, ఎలా జీవించాలి, ఎలా జీవించకూడదు, ఎలా జీవిస్తే ఉన్నత గతులు కలిగి జన్మసార్థకం అవుతుంది. ఎలా జీవిస్తే అదఃగతి పాలవుతారో, ఏది ధర్మం, ఏది అధర్మం, వీటిలో ఏ మార్గం అనుసరించాలి, ఏ మార్గం అనసరించ కూడదు అనేది భారతంలోని సందర్భోచితంగా ఆయా పాత్రల ద్వారా తేటతెల్లమవుతుంది. భారతం లోకోత్తర నీతి సూక్తులమయం.

**ఉపయుక్తగ్రంథసూచి :**

1. ఉమాదేవి, ముదిగొండ. మహాభారత ఉపాఖ్యానము. హైదరాబాద్ : కిషన్ ఆర్ట్ ప్రింటర్స్, 2018.
2. వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, బొమ్మకంటి. శ్రీ మదాంధ్ర సంపూర్ణ మహాభారతము - వ్యవహారికాంధ్ర వచనము. రాజమండ్రి : గొల్లపూడి వీరాస్వామి సన్, 2001.
3. వెంకటేశ్వర్లు, చిలుకూరు. శ్రీ మదాంధ్ర మహాభారతము (1,2). హైదరాబాద్ :రామకృష్ణ మఠం, 2018.
4. సుబ్రహ్మణ్యం,జి.వి.(ప్ర.సంపా) కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము (సరళ వ్యాఖ్యాన సహితం). సంపుటము-1,3,4,5,6,7,8,9,10,11,12,13,14,15 (ఆది,సభా,అరణ్య, విరాట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, సాప్తిక, స్త్రీ, శాంతి,అనుశాలనిక, అశ్వమేథ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వములు)తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు, 2013.
5. సత్యనారాయణ, కంభంపోటి. ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర-1. హైదరాబాద్ : హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 1981.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# 'చిత్తూరు కథ'లో చిత్రింపబడ్డ ప్రజల ఆర్థిక దుస్థితి

- డా॥ పి. జయచంద్రుడు, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.యన్. ప్రభుత్వ కళాశాల, చిత్తూరు.

సమకాలీన సమాజంలో సమస్యలను చిత్రిస్తూ, వాటిపై పోరాటం సాగిస్తున్న ఆధునిక సాహితీ ప్రక్రియలలో ప్రధానమైనది కథానిక ప్రక్రియ. ఈ కథానిక ప్రక్రియ గురజాడతో ప్రారంభమై ఒక శతాబ్దకాలం పూర్తి చేసుకొంది. నేటికీ ఆధునిక సాహితీ ప్రక్రియలలో విశిష్ట స్థానాన్ని చూరగొంటూంది. కథానిక ప్రక్రియ ఆంగ్ల సాహిత్యంలోని 'Short story'కి సమానార్థకంగా వాడబడుతున్నారు. అసలు కథానిక ప్రక్రియను నేడు 'కథ'గానే ప్రస్తావించడం జరుగుతూంది. అటువంటి కథా ప్రక్రియ సమాజానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, మతాది అంశాలను ఇతివృత్తంగా స్వీకరించి సరికొత్త సమాజాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నిస్తుంది. సమాజంలో సామాజిక వ్యత్యాసాలను వివరిస్తూనే, వాటి కారణంగా సామాజిక ఫలాలకు దూరమైన అణగారిన ప్రజల వెతలను చిత్రిస్తుంది. దేశంలోని మత పరిస్థితులను వివరిస్తూనే మతాల మధ్య నెలకొంటున్న చిచ్చును, కులకక్షలను ప్రశ్నిస్తుంది. దేశానికి సుసంపన్నమైన రాజకీయ పరిస్థితులను ఆశిస్తూ, కులరాజకీయాలను ఎండగట్టుతుంది. అలానే దేశంలో ఆర్థిక అసమానతలు రూపుమాపి పేదరికం లేని సమసమాజాన్ని నిర్మించాలని సూచిస్తుంది. అలా తెలుగు సాహిత్యంలోని కథలు ప్రజలలోని అనైక్యతను పారద్రోలి, సమైక్యంగా విజయం సాధించి, సమాజంలోని ప్రజలు ఆనందదాయకమైన జీవనాన్ని అనుభవించాలని అటువైపుగా ప్రజలు చైతన్యం పొందాలని సలహాలిస్తున్నాయి. అటువంటి కథల్లో తిరుపతికి చెందిన పేరూరు బాలసుబ్రమణ్యం సంకలనపరచిన 'చిత్తూరు కథ' ఒకటి. ప్రస్తుతం 'చిత్తూరు కథ' సంకలనంలో చిత్తూరు కథకులు చిత్రించిన చిత్తూరు ప్రజల ఆర్థిక దుస్థితిని విశ్లేషించడం నా పత్రోద్దేశం.

'చిత్తూరు కథ' సంకలనంలో మొత్తం నలభై నాలుగు కథలున్నాయి. వాటిలో కొన్ని చిత్తూరు ప్రజల జీవన విధానాన్ని, చిత్తూరు ప్రజలు సంస్కృతి సంప్రదాయాలను వివరిస్తే కొన్ని సరైన ఆర్థిక పరిస్థితులు లేని కారణంగా జీవచ్ఛవంలా బ్రతుకుతున్న ప్రజల ఈతి బాధలను ఆవిష్కరిస్తున్నాయి. అలా చిత్తూరు కథకులు చిత్రించిన చిత్తూరు ప్రజల ఆర్థిక జీవన విధానాన్ని ఇలా విశ్లేషించడానికి ప్రయత్నిస్తున్నాను.

ప్రపంచంలో నేడు ఎక్కువగా మనం వింటున్న పదం ప్రపంచీకరణం. ప్రపంచీకరణం కారణంగా యావత్ప్రపంచం ఒక్క ఇల్లై సమానత్వం సంతరించుకోవాలని, పేదరికం లేని సమాజం ఏర్పడాలని దీని ప్రధానోద్దేశం. కాని ప్రపంచీకరణం కారణంగా నేడు తొంభైశాతం ప్రజలు స్థానికతను కోల్పోతూ, జీవనోపాధి లేక దుర్భరమైన ఆర్థిక సుడిగుండంలో చిక్కుకొని విలవిల్లాడుతున్నారు. పది శాతంమంది ప్రజలు మాత్రం ఆర్థికంగా ఎగబాకుతున్నారు. నేడు వారిచేతుల్లోనే ఆర్థిక వ్యవస్థ నడపపడుతున్నాయి. అటువంటి ప్రపంచీకరణం కారణంగా మన దేశంలో కొందరు కులవృత్తులను కోల్పోయారు. కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న జీవితాలు రోడ్డున పడ్డాయి. అలా కులవృత్తులను నమ్ముకున్న ప్రజలు ఎలాంటి దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారో వివరించు కథే 'అన్నం గుడ్డ'. ఈ 'అన్నంగుడ్డ' కథను నేటి సమకాలీన చిత్తూరు కథకులైన సుంకోజి దేవేంద్రాచారి రచించాడు. 'అన్నం గుడ్డ'కథలో ఆచారి ప్రధాన పాత్ర. ఆచారి తన కులవృత్తియైన 'కంసాలి' వృత్తిని నమ్ముకొని జీవించేవాడు. ఒకప్పుడు తన వృత్తితో తీరిక లేకుండా బ్రతుకు సాగించిన ఆచారి ప్రపంచీకరణంలో ఒక భాగమైన యాంత్రీకరణం కారణంగా తన కులవృత్తి ప్రాధాన్యం తగ్గిపోవడంతో ఒక్కసారిగా బ్రతుకు సాగించడం భారమైపోయింది. వర్షాకాలం ప్రారంభమైతే తమ వద్దకు వచ్చి మడకలు చెక్కించుకునే రైతులు ట్రాక్టర్ల రాకతో ఆచారి అవసరాన్ని మరచిపోయారు. ఆచారి ఆర్థిక పరిస్థితి మరింత

దిగజారిపోయింది. ఆచారి చేత పనిచేయించుకునే వాళ్ళు కరువయ్యారు. ఒక వేళ ఆచారికి పని దొరికినా గిట్టుబాటు కాని కూలీ లభించేది. అలా యాంత్రీకరణ కారణంగా కులవృత్తులు ఎలా నశించి పోతున్నాయో 'అన్నంగుడ్డ' కథలో సుంకోజి చక్కగా వివరించాడు. యాంత్రీకరణం కారణంగా ఆచారి బ్రతుకు తెరువు ఎలా కోల్పోయాడో అతని మాటల్లో విందాం "ట్రాక్టర్‌ను చూస్తుంటే ఈ మద్దెన ఆచారికి కోపం పుటుక్కున వచ్చేస్తాండాది. 'అదొచ్చేలకే కదా, రైతులకూ మాకూ ఉండే ఒగే ఒగ సమ్మందం 'మడకలు' చెక్కడం పూర్తిగా లేకుండా పాయ. మాకు బతుకుదెరువే లేకుండా పాయనే". యాంత్రీకరణం కారణంగా కంసాలి కులస్థులు ఆర్థికంగా ఎలా చితికిపోయారో పై మాటల్లో మనం గ్రహించవచ్చు.

చిత్తూరు ప్రజల ఆర్థిక దుస్థితిని చిత్రించిన మరో కథ 'సృష్టికే అందం'. ఈ కథను ప్రముఖ రాయలసీమ కథకునిగా ప్రసిద్ధిగాంచిన పులికుంట కృష్ణారెడ్డి రచించారు. ఈ కథలో ప్రధాన పాత్ర 'రిక్షావాడు'. రిక్షావాడు బాడుగ బండిని నడుపుతూ బ్రతుకు పోరాటాన్ని కొనసాగిస్తున్నాడు. అతని భార్య అనారోగ్యం కారణంగా మంచానపడి జీవచ్ఛవంలా బతుకుతుంది. భార్యకు మంచి వైద్యం చేయడానికి కానీ లేనివాడు. రిక్షావాని శ్రమను యజమాని దోచుకుంటున్నాడు. కాని రిక్షావాడు తన ప్రతిభతో కొంత సంపాదించుకొని భార్య ఆరోగ్యాన్ని కాపాడుకొంటున్నాడు. ఒకరోజు తన రిక్షాలో బాడుగకు వచ్చిన రచయిత తన జీవన విధానాన్ని ప్రశ్నిస్తే రిక్షావాడు తాను ఎలా దోపిడికి గురౌతూ ఆర్థికంగా ఎలా ఎదగలేక పోయాడో ఇలా వివరించాడు "చూడండి బాబూ! బుద్ధిలేనోళ్ళెవురో బుద్ధి లేకుండా కలిసి బతికితే నేను పుట్టుంటాను. బుద్దెరగని నాటి కత ఏఁవిటో గానీ - బుద్ధి తెలిసింది మొదలు బుద్ధిగా బతకాలనుకున్నాను. మూటలు మోశాను. చెన్నపట్నంలో సవారిబండి లాగాను. ఇప్పుడీ ఊళ్ళో రిక్షా తొక్కుతున్నాను. నిన్న మొన్నటి నుండి కాదు, ఇరవై ఏండ్లుగా. ఎంత తొక్కినా బతుకులో తొక్కుళ్ళు సడలేకుండా వున్నాను. కానీ, బాబూ! ఈ ఇరవై ఏండ్లలో నేను చూస్తూ ఉండగానే గుడిసెలు మిద్దెలైనాయి. మిద్దెలు మేడలైనాయి. నా బండిలో తిరిగిన వాళ్ళు నా బండిలో అప్పుడు కాలుమోపలేనోళ్ళు కార్లలో తిరుగుతుండారు". ఒక సామాన్య శ్రామికుడు సంవత్సరాలు గడచిపోతున్నా కేవలం శ్రామికుడుగానే మిగిలిపోతున్నాడు. మధ్యవర్తుల దోపిడి కారణంగా ఆర్థికంగా ఎలా ఎదగలేకపోతున్నాడో 'సృష్టికే అందం' కథ మనకు వివరిస్తుంది. ధనికుడు మరింత ధనికుడైపోతున్నాడని, పేదవాడు మరింత పేదవాడైపోతున్నాడనే మన ప్రభుత్వ నియమించిన కార్వే కమిటీ నివేదనలను ఈ కథ మనకు స్పష్టం చేయడం జరుగుతుంది.

ప్రజలు ఆర్థికంగా ఎదగక పేదరికంలోనే మగ్గడానికి మరొక కారణం పెద్దవ్యాపారుల చేత మోసపోవడం. అలా మోసపోయిన వాళ్ళ మనోవేదనకు గురై ఆత్మహత్యలకు కొందరు పాల్పడితే, మనోవ్యథతోనే మరణించేవారు కొందరు. అలా యజమాని మరణంతో ఆ కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి కడుపేదరికాన్ని అనుభవిస్తున్నాయి. అటువంటి కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న కుటుంబాన్ని చిత్రించిన కథ 'సిక్కెంటిక'. జిల్లేళ్ళ బాలాజి రచించిన సిక్కెంటిక కథలో దేవాని కుటుంబం. సిక్కెంటికల్ని కొంటూ సవరెంటికల్ని తయారు చేసి మద్రాసు వ్యాపారికి అమ్మేవారు. మొదట్లో నమ్మకస్తుడైన మద్రాసు వ్యాపారి చివరకు మోసం చేసి యాభైవేల సరుకును దోచుకున్నాడు. ఆ దిగులుతో మంచానబడ్డ దేవాని భర్త కాలమయ్యాడు. రెండేళ్ళ వయస్సు గల పిల్లవాడితో దేవాని బ్రతుకుదెరువు లేని అనాథయ్యింది. అంతవరకు ప్రేమగా చూసుకున్న అత్త ఆదాయం మార్గం లేకపోయేసరికి కోడల్ని ఈసడించుకొనేది. నానావిధాలుగా నిందించేది. అత్త మెప్పుకోసం డబ్బు సంపాదించాలని ఆకలి కడుపుతో బిడ్డను జోలిలో పెట్టుకొని తిరిగినా డబ్బు వచ్చే మార్గం కనబడేది కాదు. ఆకలి బాధలతో అలమటించేది. అలా ఆకలి బాధలతో అలమటించిన దేవాని నెల రోజుల తరువాత పట్నంలో ఒక మంగలిషాపు ప్రారంభించి బ్రతుకుదెరువు పొందింది.

బ్రతకడానికి దేవాని పురుషులు చేసే క్షవరపనిని ఎందుకు నేర్చుకోవాల్సి వచ్చిందో 'సిక్కెంటిక'లో జిల్లేళ్ళ బాలాజీ చక్కగా వివరించారు.

సరైన ఆర్థిక పరిస్థితులు లేని కారణంగా పేదరికా ననుభవిస్తున్న కుటుంబాలలోని స్త్రీలు బతుకుబండిని లాగడానికి చేస్తున్న ప్రయత్నంలో ఎలాంటి అవమానా లకు, ఎలాంటి అత్యాచారాలకు గురౌతున్నారో వివరించు కథలు 'హద్దు', 'జర్తె' కథలు. కుటుంబ బాధ్యతల్ని మరచిన భర్త కుటుంబ భారాన్ని మోయడానికి తన శీలాన్ని పణంగా పెట్టిన రాజమ్మ ధీన పరిస్థితిని ఎ. పుష్పాంజలి 'హద్దు' కథలో చిత్రిస్తే, బ్రతుకుపోరాటాన్ని సాగించడానికి కట్టలమ్ముకుని బ్రతికే ఎల్లమ్మ అడవిలో అత్యాచార ప్రయత్నానికి గురైన విధానాన్ని 'జర్తె' కథలో మధురాంతకం మహేంద్ర కళ్ళకు కట్టినట్టు వివరించారు. ఎ.పుష్పాంజలి రచించిన 'హద్దు' కథలో రాజమ్మ భర్త పరాయి స్త్రీ వ్యామోహంలో మునిగితేలుతూ కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తుంటే, పది రోజులుగా ఎడతెరిపిలేని వర్షం కారణంగా పనుల్లేక చేతిలో చిల్లి గవ్వలేక పోవడంతో రాజమ్మ కుటుంబం ఆకలి బాధతో అలమటిస్తుంది. ఒకవైపు రెండు చిన్న ప్రాణాలు, మరోవైపు ముసలి అత్త ఆకలితో బాధలతో మూలుగుతుంటే వారిని చూడలేక శెట్టిని అప్పడుగుతుంది. ఇదివరకే తీసుకున్న అప్పును తన భర్త తీర్చకపోవడంతో రాజమ్మ అవమానంతో వట్టి చేతుల్లో తిరిగి వస్తుంది. పిల్లల ఆకలి తీర్చలేని పరిస్థితుల్లో ఉన్న రాజమ్మ పిల్లల బాధలను చూడలేక తనపై మోజుపడుతున్న ఎదిరింటి ఆదిగాడికి తన శీలాన్ని కోల్పోయి పిల్లల ఆకలిబాధలను తీర్చుతుంది. సామాన్య కుటుంబంలో, అందునా భర్త ఆదరణ లేని కుటుంబంలో ఆర్థిక పరిస్థితులు ఎంత దయనీయంగా ఉంటాదో, అటువంటి పరిస్థితులకు దర్పణం పుష్పాంజలి రచించిన ఈ 'హద్దు' కథ. అలాగే మధురాంతకం మహేంద్ర రచించిన 'జర్తె' కథలో ఎల్లమ్మ భర్త కుటుంబ భారాన్ని నిర్లక్ష్యం చేసి తాగుబోతుగా తయారైతే ఎల్లమ్మ ఆత్మాభి మానంతో కట్టెలు కొట్టి జీవించేది. కాని అలా కట్టెలను కొట్టుకొని పట్నంలో అమ్ముకోడానికి అటవీ అధికారులకు, రైల్వే అధికారులకు చిక్కకుండా జాగ్రత్త పడేది. అలా బతుకుతున్న ఒకసారి కట్టెలకోసం వెళ్ళిన ఎల్లమ్మను అక్కడ జీవాలను కాపుకాస్తున్న గురుస్వామి అత్యాచారం చేయడానికి ప్రయత్నిస్తాడు. కాని ఎల్లమ్మ తప్పించు కొంటుంది. అటవీ అధికారికి చిక్కిపోతుంది. బ్రతుకు బండి లాగడానికి సరైన ఆర్థిక పరిస్థితులు లేని కారణంగా స్త్రీలు ఎలాంటి దుర్భర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందో 'హద్దు', 'జర్తె' కథలు మనకు చక్కగా వివరిస్తాయి.

'చిత్తూరు కథ' సంకలనంలో మధ్య తరగతి కుటుంబా ల్లోని ఆర్థిక జీవితాన్ని వివరించు కథలు 'పోనేల కాశికి...', 'గేటు' కథలు ప్రధానమైనవి. మధ్య తరగతి కుటుంబ ఆర్థిక జీవితాల్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించిన 'పోనేల కాశికి'... కథను తెనాలి సుశీల రచిస్తే, కనీస అవసరాల్ని కూడా తీర్చుకోలేని మధ్య తరగతి కుటుంబ జీవితాన్ని 'గేటు' కథలో కలువకొలను సదానంద వివరించారు. 'పోనేల కాశికి'... కథలో ప్రధాన పాత్ర రాజేశ్వరి. రాజేశ్వరి తాను చిన్ననాళ్ళలో సమయానికి పావలా లేకపోవడంతో లంబాడివాడు చూపించే కాశీపట్నం మొదలైన బొమ్మ లను చూడలేకపోతుంది. అప్పటినుండి పెళ్ళయ్యేవరకు కాశీపట్నం బొమ్మలు చూసే అవకాశం రాకపోవడంతో పెళ్ళైన తర్వాత తొలిరాత్రి సమయంలో భర్తను కాశీపట్నం చూడాలని తన తొలికోరికగా కోరుతుంది. కాని భర్త రామారావు భార్య కోరికను తీర్చడానికి ఎంతో ప్రయత్ని స్తాడు. కాని వీలు కాకుండా పోతుంది. సంవత్సరం తిరిగే లోపు పాపపుట్టడం, వాళ్ళ ఖర్చులు తరువాత అత్తగారు అనారోగ్యానికి గురికావడం, తరువాత మరణించడం కారణంగా భర్త చేసిన అప్పులు వాటికే సరిపోయాయి. పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు, వారికి పిల్లలు - ఇలా కాలం గడచిపోతున్నా రాజేశ్వరి కోరిక కోరికగానే మిగిలిపోతూ ఉంది. చిరుద్యోగియైన భర్త రామారావు ముదిమ వయస్సుకు చేరుతున్నా తన భార్యకోర్కెను తీర్చలేక పోతున్నాడు. ఇంతలో రామారావుకు బి.పి., షుగర్ వంటి

వృద్ధాప్య సమస్యలు తలెత్తడంతో రాజేశ్వరి ఆశలు చివరకు అడియాసలైపోయాయి. ఆర్థికలేమి కారణంగా మధ్య తరగతి ప్రజల కోర్కెలు ఎలా నీరుగారిపోతున్నాయో తెనాలి సుశీల ఈ 'పొనేల కాశికి...' కథలో చక్కగా వివరించారు. మధ్య తరగతి వెతల్ని చిత్రించిన మరో సహజ సిద్ధమైన కథ కలువకొలను సదానంద రచించిన 'గేటు' కథ. ఈ కథలో ప్రధాన పాత్ర వెంకటలక్ష్మి. వెంకటలక్ష్మి భర్త కన్నయ్య ఒక సన్నకారు రైతు. వెంకటలక్ష్మి కొత్తగా పెళ్ళై అత్తారింటికొచ్చిన కొత్తకోడలు. వెంకటలక్ష్మి సంవత్సరమైనా కాలేదు. అటువంటి వెంకటలక్ష్మికి గొప్ప కేశసంపద ఉంది. కాని రెండురోజులుగా కొబ్బరినూనె లేకుండా వెంట్రుకలు వెలవెలబోతుందని వెంకటలక్ష్మి బాధపడింది. భర్తను కొబ్బరి నూనెనడిగితే ఇంట్లో ఉండే నూనేదో రాసుకోమని సమాధానమిస్తున్నాడు. ఇక భర్తనడగడం అనవసరమని పెరట్లోని మునగచెట్టులోని మునగాకు కోసి పేటకు వెళ్ళి మునగాకును అమ్మడానికి ప్రయత్నించింది. కాని పేటలో వస్తుపన్నువసూలు చేసే వాడు మునగా కమ్మగా వచ్చిన డబ్బును పన్నుకింద తీసేసుకోవడంతో వెంకటలక్ష్మి వట్టి చేతుల్లో నిరాశతో దిగాలుగా ఇంటికి చేరుకుంటుంది. కనీసావసరాలను కూడా తీర్చుకోని మధ్య తరగతి ప్రజల ఆర్థిక జీవనం ఎలా ఉంటుందో ఈ 'గేటు' కథ ద్వారా మనకు అవగాహనకు వస్తుంది.

అడవి ప్రాంతాల్లో నివసించే గిరిజన ప్రజల ఆర్థిక పరిస్థితులు ఎంత దయనీయ స్థాయిలో ఉంటుందో చివరకు ఆకలి తీర్చుకోలేక ఆత్మాభిమానం చంపుకొని దిగజారిపోతున్నారో మనకు చక్కగా వివరించు కథ ఆముదాల మురళి రచించిన 'కట్టుబాటు' కథ. ఈ 'కట్టుబాటు' కథలో కథారచయిత ఆముదాల మురళి సరైన జీవనోపాధి లేని ఒక గిరిజన కుటుంబం ఆకలి బాధలతో ఎలా అలమటిస్తుందో, ఆకలి బాధ నుండి విముక్తి కోసం వేటగాడి భార్య వేటగాడిని విడిచి మరో పరాయి పురుషునితో ఎలా లేచిపోతుందో తెలిపే ఈ కథ మనకు ఒక దృశ్యమాలిక. 'వేటగాడు' అనే పేరులేని పాత్ర ఈ కథలో ప్రధాన పాత్ర. వేటగాడు నియమనిబంధనాలు గలవాడు. వేటగాడు, అతని భార్య, చంటి పిల్లవాడు అతని కుటుంబం. రెండు మూడు రోజులుగా వేటగాడి కుటుంబం ఆకలితో అలమటిస్తూ ఉంది. నీరు తాగుతున్న జింక ప్రతిసారి వేటగాడ్ని మోసగిస్తూ జారుకుంటుంది. అలా రెండుమూడు రోజులుగా జింక తప్పించుకోవడంతో వేటగాడి కుటుంబానికి ఆకలి బాధ తప్పడం లేదు. చంటి బిడ్డకు పాలివ్వడానికి కూడా స్థోమతలేని భార్యను చూస్తే వేటగాడికి జాలివేసింది. పంతులమ్మ ఇంటికెళ్ళి కాస్త చద్దినీళ్ళు తీసుకొని వచ్చేలోపు పోలయ్యమామ కుందేలు మాంసం ఇచ్చాడని భార్య తింటుంది. కాని వేటగాడు మాత్రం భార్య ఆకలిని తీర్చలేక పోతున్నాడు. అటువంటి సమయంలో ఆకలి బాధను తీర్చుకోడానికి, కటిక దారిద్ర్యాన్ని దూరం చేసుకోడానికి వేటగాడి భార్య వరసకు మామైన పోలయ్యతో లేచిపోతుంది. వేటగాడి జీవితం ఒంటరి ప్రయాణమౌతుంది. ఆర్థిక లేమి కుటుంబ జీవితాన్ని ఎలా చిన్నాభిన్నం చేస్తుందో ఈ 'కట్టుబాటు' కథలో ఆముదాల మురళి మనకు చక్కగా వివరించాడు. గిరిజనుల ఆర్థిక పరిస్థితులను చిత్రించిన మరో చిత్తూరు కథ 'జింకపిల్ల'. ఈ కథను మదనపల్లెకు చెందిన కరణం బాలసుబ్రమణ్యం రచించాడు. ఈ కథలో ప్రధాన పాత్ర 'సుక్క'. అసలు పేరు సుకన్య. అందరూ సుక్క అనే పిలిచేవారు. సుక్క యానాది నరసిగాడి కూతురు. తల్లి లేని పిల్ల. ఆ గ్రామంలోని యానాది కులంలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఒకే ఒక్కతి సుక్క. సుక్క ఎప్పుడు అది కావాలి, ఇది కావాలని తండ్రిని అడిగింది కాదు. కాని లేకలేక పంజాబి డ్రస్సు కావాలని అడిగింది. సుక్క కోర్కెను తీర్చడానికి తండ్రి నరిసిగాడు జింకపిల్లను వేటాడి రెడ్డోరబ్బాయికి ఇవ్వడానికి నానావిధాలుగా వలలు పన్నుతాడు. చివరకు జింకపిల్లను పట్టుకొంటాడు. బిడ్డ కోర్కె తీర్చడానికి ప్రయత్నించే యానాది తండ్రి ఆర్థిక పరిస్థితి ఎలాంటిదో 'జింక పిల్ల' కథలో కరణం బాల సుబ్రమణ్యం పిళ్ళై మనకు చుక్కగా తెలిపారు.

వివిధ వర్గాల ఆర్థిక పరిస్థితులను చిత్రించిన 'చిత్తూరు కథ' రాసాని రచించిన 'తపస్సు' కథలో కళాకారుల ఆర్థిక పరిస్థితులను చిత్రించడం జరిగింది. 'తపస్సు' కథలో రంగప్ప ప్రధాన పాత్ర. రంగప్ప వీధి నాటకం ఆడే కళాకారుడు. వీధి నాటకాలు లేనప్పుడు వ్యవసాయం చేసుకొని బ్రతికే సాధారణ రైతు జీవితం గడిపేవాడు. మంచి నీటి సౌకర్యం ఉంటే పంటలు బాగా పండించవచ్చని భావించి బోరువేయడానికి రంగప్ప సొసైటి నుండి అప్పుతీసుకున్నాడు. సకాలంలో వర్షాలు కురవక పంటలు పండక పోవడంతో రంగప్ప సొసైటీ వాళ్ళ అప్పుతీర్చలేకపోవడంతో రంగప్ప ఇల్లు జప్తుకు గురైంది. ఇలా రంగప్పకు జీవనాధారం లేకపోయింది. మరోవైపు నాటకాలను నమ్ముకున్న రంగప్ప వయస్సు మీదపడటంతో ట్రూపులో గురువు అతనికి అవకాసాన్ని ఇవ్వడానికి విముఖత చూపించాడు. ఇలా వృత్తి, అలా ప్రవృత్తి రెండూ కూడా రంగప్పను ఆదుకోలేకపోయింది. మరోవైపు ఆడబిడ్డకు పెళ్ళిచేయలేని స్థితిలో రంగప్ప ఉన్నాడు. పనిచేసేశక్తిలేని రంగప్ప పెళ్ళికాని కూతుర్ని రోడ్డుపనికి పంపిస్తున్నారు. ఇటువంటి సమయంలో భారత నాటకమాడుతున్న ట్రూపు నుండి తపస్సుమాను ఎక్కడానికి రంగప్పకు పిలిపు వస్తుంది. వయస్సు ఎక్కువ కావడంతో తపస్సుమానెక్కలేనేమోనని సందేహించినా, తిండి గింజలు కూడా లేని కుటుంబ పరిస్థితులను గుర్తుకు తెచ్చుకొని అతి కష్టంమీద గురువిచ్చిన పనిని పూర్తి చేసాడు. అలా ఆర్థిక సమస్యల నుండి కొంతవరకు గట్టెక్కడానికి ప్రాణాలను ఒడ్డి వయస్సుకు తగని తపస్సు మానెక్కి బతుకు జీవడాయని బయటపడ్డాడు. వృద్ధులైన కళాకారులు బతుకు తెరువు కోసం ఎలాంటి సమస్యలకు గురౌతున్నారో, ఎంతటి సాహసాలకు పూనుకొంటున్నారో రాసాని 'తపస్సు' కథ మనకు చక్కగా వివరిస్తుంది.

అలాగే చిత్తూరు ప్రాంతంలోని పడమటి మండలాల్లోని హరిజన ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను, వారనుభవిస్తున్న కడు దయనీయమైన పేదరికాన్ని ఎండపల్లి భారతి 'సావుబియ్యము' కథలో కళ్ళకు కట్టినట్లు చిత్రించింది. చిత్తూరు జిల్లా పడమటి మండలాల్లో ధనికులైనవారు, బాగా పేరుపొందినవారు మరణిస్తే, వారి ఆత్మశాంతికోసం ఇచ్చే ధాన్యపు గింజలతో ఆకలి తీర్చుకునే ప్రజల ఆర్థిక పరిస్థితులను ఈ కథలో ఎండపల్లి భారతి చక్కగా వివరించారు. ఈ కథలో రచయిత్రి తన స్వీయ అనుభవాలను పంచుకున్నట్లు తెలుస్తుంది.

చిత్తూరు ప్రాంతం ప్రధానంగా వ్యవసాయాధారిత ప్రాంతం. చిత్తూరు ప్రాంతంలో ఎక్కువగా సన్నకారు రైతులు నివసిస్తున్న ప్రాంతమనే చెప్పవచ్చు. రాయలసీమ కరువును పూర్తిగా కాకపోయినా పాక్షికంగా ప్రతిబింబించే ప్రాంతం చిత్తూరు జిల్లా. అనంతపురం, కర్నూలు లాంటి రాయలసీమ ప్రాంతాలతో పోల్చుకుంటే చిత్తూరు జిల్లా కొత్త మెరుగైన జిల్లానేనని చెప్పవచ్చు. కాని చిత్తూరు ప్రాంత రైతులకు తగిన ఆర్థిక పరిస్థితులు లేవని చెప్పవచ్చు. సకాలంలో వర్షాలు కురవక కరువు ఏర్పడటం వల్ల, నీటి కోసం వేసిన బోర్లకు చేసిన అప్పులు తీర్చలేక అప్పులపాలుకావడం వల్ల, అధికారుల నిర్లక్ష్యం వల్ల, ప్రకృతి వైపరీత్యాలవల్ల పెద్ద రైతుల దౌర్జన్యాలవల్ల రైతుల ఆర్థిక జీవనం దిగజారిపోతూవుంది. రైతులు ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు. హత్యకు గురౌతున్నారు. పేదరికం కారణంగా బంధువులు దూరమౌతున్నారు. సంబంధాలు తెగిపోతున్నాయి. అలాంటి రైతుల ఆర్థిక జీవనవిధానాల్ని చిత్రిస్తూ లంకిపల్లె కన్నయ్యనాయుడు 'జీవనం', గోపిని కరుణాకర్ 'దేవరెద్దు', పలమనేరు బాలాజి 'తపన' కె.ఎ. మునిసురేష్ పిళ్ళై 'రాతి తయారి' వంటి కథలను రచించడం జరిగింది.

లంకిపల్లె కన్నయ్యనాయుడు రచించిన 'జీవనం' కథలో వ్యవసాయంపై ఆధారపడి జీవించే జీవయ్య తన శారీరక కష్టంతో అప్పులు తీర్చి, భూములు సంపాదించాడు. కాని ప్రకృతివైపరీత్యాలు, అధికారుల నిర్లక్ష్యాల వల్ల పంటలు సరిగ్గా పండకపోయినా శిస్తులు మాత్రం సకాలంలో చెల్లించాలని అధికారులు తొందరపెట్టేవారు. వచ్చే చాలీచాలని ఆదాయంతో కొడుకును చదివించే వాడు. కుమార్తె పెళ్ళి ఎలా చేయాలని బాధపడేవాడు.

అలాగే గోపిని కరుణాకర్ రచించిన 'దేవరెడ్డు' కథలో యువరైతు ఎంగట్రవణ వ్యవసాయాన్ని నమ్ముకొని జీవించేవాడు. సకాలంలో వర్షాలు లేకపోవడంతో పంటలు పండలేక కటిక పేదరికాన్ని అనుభవించేవాడు. ఒకప్పుడు ఎంగట్రవణకు సేద్యంలోని గొప్పతనానికి మెచ్చుకొని కూతుర్నిస్తానన్న మేనమామ ఇప్పుడు దరిద్రుడని తన కుమార్తెను అలాంటి కుటుంబానికి పంపనని ఉద్యోగం చేసే మరొక వ్యక్తికిచ్చి వివాహం చేయదలచాడు. పలమనేరు బాలాజి రచించిన 'తపన' కథలో వ్యవసాయం చేసుకోడానికి గోవిందయ్య కుటుంబం బోరుబావి వేసుకోడానికి నగలమ్ముకుంటుంది. అసూయపరుడైన మునివెంకటరెడ్డి పలుకుబడితో ఎం.ఆర్.ఓ. గోవిందయ్య వేస్తున్న బోరుబావిని ఆపివేయడంతో చేసిన అప్పులు తీర్చలేననే బాధతో పురుగులమందు త్రాగి ఆత్మహత్య చేసుకుంటాడు. అదేవిధంగా - నీటికోసం బోర్లమీద బోర్లు వేసి ఆర్థికంగా చితికిపోయిన మునివెంకటరెడ్డి ఆత్మహత్య చేసుకుంటాడు. అలా సరైన ఆర్థిక సహాయసహకారాలు లేకపోవడం, ఆర్థిక పరిస్థితులు క్షీణించడంతో ఎందరో రైతుల జీవితాలు దుర్భరమౌతున్నాయి. మరెందరో ఆత్మహత్యలకు పాల్పడి ప్రాణాలను కోల్పోతున్నారు. కె.ఎ.సురేష్ పిళ్ళై రచించిన 'రాతి తయారి' కథ ఒక యువరైతు తినడానికి తిండికూడా లేని పరిస్థితుల్లో, తన కుటుంబం ఆకలి బాధతో అలమటిస్తుందనే మన స్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంటాడు. ఇలా ఎందరో రైతుల జీవితాలు సరైన ఆర్థిక పరిస్థితులు లేని కారణంగా గాలిలో కలిసిపోతున్నాయి.

ఇలా చిత్తూరు కథలో సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన ప్రజలు సరైన ఆర్థిక స్థోమత లేని దుస్థితిలో జీవితాన్ని గడుపుతున్నారు. నిరాశ చెందినవాళ్ళు ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు. దేశానికే అన్నం పెట్టే రైతులు ఆకలి బాధలతో అలమటించడం, దుర్భర జీవితాన్ని గడపటం, ఆత్మహత్యలకు పాల్పడటం దేశాభివృద్ధికి అంత ఆరోగ్యకరమైన పరిస్థితి కాదు. అదేవిధంగా సమాజంలో వెనుకబడ్డ హరిజనులు, గిరిజనులు, కులవృత్తులపై ఆధారపడి జీవించేవాళ్ళు, పురుషాదరణ లేని స్త్రీల కుటుంబాలు, సంస్కృతినే రక్షించే కళాకారులు మొదలైన అణగారిపోతున్న ప్రజలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం చొరవచూపాలని, అప్పుడే ఏ ప్రాంతమైనా అభివృద్ధి వైపు పయనిస్తుందని భావించవచ్చు. దేశాభివృద్ధి చూడాలంటే ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగు పడిన్పుడే అదిసాధ్యమౌతుంది. నేడు ప్రజలు జీవితం చితికి పోవడానికి కారణం సరైన ఆర్థిక పరిస్థితులు లేకపోవడమే కారణమని చెప్పవచ్చు. అలా ఆర్థికలేమి కారణంగా చిత్తూరు ప్రజల జీవన విధానం ఎలా అస్థవ్యస్తంగా తయారయ్యిందో చిత్తూరు కథకులు తమకథల్లో చక్కగా చిత్రించారు.

"ధనమ్ మూలమ్ ఇదమ్ జగత్"

## పరిశీలనా గ్రంథాలు :

1. చిత్తూరు కథ - బాలసుబ్రమణ్యం పేరూరు
2. ప్రపంచీకరణ సంస్కృతి - రవి తెలకపల్లి

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# సత్యకామ జాబాలి వచన కవితాకావ్యం - జాబాలి పాత్ర

- ఎ. సుబ్రమణ్యం, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం, తిరుపతి.

మానవ అజ్ఞానంలోంచి జనించిన దైవభావం
మనిషి చైతన్యం పాలిట మత్తుమందులా మారినమతం
ఆత్మ పరమాత్మల మధ్య - మధ్యవర్తిత్వం
జరుపుతోన్నట్లు నటించే పరోహితవర్గం
మనుషుల్ని వాజమ్మలుగా మార్చుతోన్న కర్మసిద్ధాంతం
మానవతని ముక్కముక్కలుగా నరుకుతోన్న వర్ణధర్మం
దేవుని పేరిట జేబులు గోడుతోన్న పూజారివర్గం.
సత్యకామ జాబాలి - (పుట-58)

భారతదేశంలో ప్రాచీన గ్రంథాలైన రామాయణం, భారతం, భాగవతం. ఈ గ్రంథాలను అధ్యయనం చేసి తెలుగు సాహిత్యంలో వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ, హేతువాద దృక్పథంతో రచనలు చేసినటువంటి వారు చాలా అరుదుగా వున్నారు. అంటువంటివారిలో వేమన, త్రిపుర నేని రామస్వామి చౌదరి, గుర్రం జాషువా, గురజాడ అప్పారావు, కందుకూరి విరేశలింగం పంతులు, నార్ల వేంకటేశ్వర రావు.

తెలుగు సాహితి సమాజంలో హేతువాద దృక్పథంతో రచనలు చేసినవారు సి.వి.1970 దశకంలో హేతువాద దృక్పథంతో సమాజంలో కుల, మత మూఢవిశ్వాసాలపై వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో రకరకాల నయ వంచకులనూ తన పదునైన అక్షరాలతో రచనలు ద్వారా చీల్చి చెండాడిన ప్రముఖకవి సి.వి. అభ్యుదయకవి, హేతువాది, నిత్యనూతన పరిశోధకుడు, వివిధ తత్వశాస్త్రాలను నిరంతరం అధ్యయనం చేసి రచనలు చేశారు. సి.వి. అసలు పేరు "చిత్తజల్లు వరహాలరావు" 1930 జనవరి 14 గుంటూరులో జన్మించారు. సి.వి. శాస్త్రీయకవి తన కళ్ళ ముందు జరిగే అన్యాయాలను, ఆగడాలను చూస్తూ వుండే రకం కాదు. సి.వి. 2017 నవంబర్ 8 మరణించారు. సి.వి. దాదాపుగా 30 పుస్తకాలు రాశారు.

సి.వి. 1972లో సమాజంలో పెచ్చరిల్లుపోతున్న పెట్టుబడిదారి వ్యవస్థ, వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ, మత మూఢ విశ్వాసాలపై వివిధ వేషాలు వేసి జీవిస్తున్న పురోహిత వర్గంపై సి.వి. ప్రాచీన గ్రంథమైన రామాయణంలోని "సత్యకాముడు" పాత్ర తీసుకొని "సత్యకామజాబాలి" అనే వచన కవితా కావ్యం రాశారు.

సత్యకాముడు చార్వక భౌతికవాదుల కోవకు చెందిన వాడు. ఈ కావ్యం రామాయణంలోని నాయకుడు రాముడు, ఇతని ఋషులైనటువంటి వసిష్ఠుడు, యాజ్ఞవల్క్యుడు. ఈ కావ్యమంతా సంవాదంగా సంభాషణలతో సాగుతుంది. పాలక ప్రజావాదుల మధ్య జరిగిన తరుణంలో జాబాలి అడిగే ప్రశ్నలకు పాలక ఆదిపత్య వాదులైన ఆర్య ఋషులు సమాధానాలు చెప్పలేక కకావికలమైపోతారు.

పరమ పవిత్రమైన యీ యజ్ఞం జేసిన యజమానికి
ఈ లోకంలో అఖండమైన కీర్తి
ఆ లోకంలో స్వర్గ సౌఖ్యమూ లభిస్తాయి!
తరతరాల దాకా ఆ మహామహుని పేరు జనం చెప్పుకొంటారు
యజ్ఞం వల్ల దేశంలోని కరువు కాటకాలు అమాంతం పారిపోయి
ప్రజలు సుఖశాంతుల్తో సుభిక్షంగా జీవిస్తారు
అశ్వమేధ యాగం జేస్తే జన్మ చరితార్థిమైనట్లే!!!
బ్రహ్మ హత్యా పాతకం తగిలిన పుణ్యమూర్తులూ
రెక్కలు ముక్కలుగా జేసుక మేం సృష్టించిన ధనధాన్య సంపదను
బొక్కసాల్లో నింపుకొనే గజదొంగలైన చక్రవర్తులూ తప్ప
అశ్వమేధాన్ని సామాన్యులు చేయగలరా వసిష్టా?
సత్యకామ జాబాలి - (పుట-64)

అంటూ కవి ప్రస్తుత సమాజంలో యజ్ఞయాగాల పేరిట వ్రతాలు చేస్తూ పురోహితవర్గం చేస్తున్న ఆగడాలను

ప్రశ్నిస్తూ ప్రజల సొమ్మును దోచుకుంటున్న పురోహిత వర్గంను ఖండిస్తూ కవి ప్రస్తుత సామాజిక పరిస్థితులను తెలియజేసారు. ప్రజలలో పాతుకుపోయిన మూఢనమ్మకాలను విడనాడాలని ప్రతిపాధించాడు.

నేను నాస్తికుణ్ణి- వాస్తవాన్నే మాట్లాడతాను
నువ్వు ఆస్తికుడివి - అబద్ధాలే చెబుతావ్!
వొకే నాలికతో ఏకకాలంలో
రెండు మాటలు మాట్లాడే నువ్వా
నన్ను విమర్శిస్తోంది?
నా హృదయం అవునన్న దాన్ని నా నాలిక కాదనదు
మనోవాక్కాయ కర్మల రీత్యా నా మాటకీ చేతకీ తేడా రాదు
ఆస్తికులు వాస్తవం చెప్పడం
పగలు వెన్నెల కాయడం-మగాడికి గర్భం రావడం
అవసరమొచ్చినపుడు మునగ చెట్టెక్కించడం
అవసరం తీరాక ముక్క మీద గుద్దడం
పెళ్ళయ్యేంతదాకా - అల్లుడా రమ్మనడం
ఐపోయిం తర్వాత ముండా కొడకా పొమ్మనడం
సత్యకామ జాబాలి - (పుట-73)

అంటూ కవి జాబాలిచే నాడు జరిగిన వాస్తవాలను దృష్టిలో పెట్టుకొని, పాలకవర్గాలు, పురోహితవర్గాలు చెప్పే అవాస్తవాలను పుజారివర్గం చేస్తున్న ఆగడాలను, కర్మ సిద్ధాంతాల పేరిట చేసే నీచమైన పనులను కవి తీవ్రమైన విమర్శ చేశారు.

పాపపుణ్యాలు గూర్చి నువ్వు ఉపన్యాసాలు దంచవొద్దు
అడిగిన దానికి సూటిగా సమాధానం జెప్పు
ఆదిశక్తి పెట్టిన మూడు గుడ్లలోంచి
అమాంతం బయటికొచ్చిన త్రిమూర్తుల కుల గోత్రాలేవిటి?
వాళ్ళ పెళ్ళాలైన లక్ష్మి సరస్వతి పార్వతుల కులగోత్రాలేవిటి?
వాళ్ళని సృష్టించిన మీ వైదిక రుషుల కులగోత్రాలేవిటి
విష్ణుమూర్తి బొడ్డులోంచి పుట్టిన
బ్రహ్మ దేవుని కులగోత్రాలేవిటి?
పార్వతి ఒంటిమీద నలుగుపిండిలోంచి జనించిన
వినాయకుని కులగోత్రాలేవిటి?
రంకుమొగుళ్ళకీ వెధవ ముండలకీ పుట్టిన
అమాంబాపతు పురుషవరేణ్యుల కులగోత్రాలేవిటి?
పాయసంలోంచి జనించిన రామభద్రుని కులమేది?
నాగటి చాలులో దొరికిన సీతమ్మ కులమేది?
బోయవాడుగా పుట్టిన - ఆది కవిగా పరిణమించిన
వాల్మీకి మహర్షి కులమేది?
సత్యకామ జాబాలి - (పుట-134)

ఈ కావ్యంలో సత్యకాముడు వేసిన ప్రశ్నకు ఆర్య ఋషి వసిష్ఠుడు, సమాధానం చెప్పలేక తికమకపడ్డాడు. పాప పుణ్యాలు, స్వర్గ, నరకాలు వున్నాయంటూ చెప్పుకు బ్రతుకుతున్న పురోహితవర్గంను కవి సత్యకామునిచే హేతువాద దృక్పథంతో పలికించాడు. హిందూ సమాజంలో దేవుడు, దెయ్యాలు వున్నాయంటూ చెప్పుకొని తిరిగే బాబాలను, దేవుళ్ళకు కులాలు, గోత్రాలు లేనప్పుడు మనిషికి కులగోత్రాలు ఆపాదించిన పురోహితవర్గం తమ సిద్ధాంతాల పేరిట సమాజాన్ని సర్వనాశనం చేస్తుందంటూ కవి అధిక్షేపించాడు.

రక్తమాంసాలు గల మానవుల్ని
గాడిదలుగా పరగణించే మీ వర్ణధర్మం
బల్లి ఉచ్చ కన్న హీనాతిహీనం
పిచ్చి బచ్చల మొక్క కన్న నీచాతి నీచనం
మనుషుల్ని చాకలి, మంగళ్ళుగా జూసే మీ వర్ణధర్మం
మాలమాదిగలుగా లెక్కవేసే మీ వర్ణధర్మం
ఎలిక పెంటికల కన్న హేయాతి హేయం
జాతిలో వొహ భాగమైన స్త్రీలని
బోగంసాన్లుగా జేసివేసిన మీ వర్ణధర్మం
అత్యంత జుగుప్సాకరమేగాక మానవత్వానికీ తీరని కళంకం
మానవుల్ని అగ్ర - అధమ కులాలుగా విభజించి
ధర్మాన్ని బుగ్గి పాల్జేసిన మీ వర్ణధర్మాన్ని!
సర్వనాశనం జేసేందుకే మేం ఉద్భవించాం!
సత్యకామ జాబాలి - (పుట-142)

అంటూ భారతదేశంలో నేడు వైదికమతం పాలక -

పురోహిత వర్గాలు కులం పేరిట, మతం పేరిట పేద ప్రజల్లో చీలికలూ వైషమ్యాలూ సృష్టించి, తమ పబ్బం మాత్రం గడుపుకో కల్గుతున్నారు. అంచేతనే కుల, మత బేధాల్తో మనిషినీ వేరుజేయని సమసమాజ స్థాపన కోసం సమస్త కులాలకి చెందిన పేదలు పోరాడాలని వర్ణ వ్యవస్థను నాశనం చేయాలని కవి పిలుపునిచ్చాడు.

భక్తుడు - బానిస
భగవంతుడు-బానిస యజమాని!
భక్తునికీ భగవంతునికీ వున్న బాంధవ్యం
దాసునికీ దాసయజమానికీ మధ్య వున్న సంబంధం!
దేవుడికీ భక్తుడికీ మధ్యన అర్చకుడు
జీవాత్మ పరమాత్మల మధ్యన పురోహితుడు
దోపిడీ వర్గాల పీడనకి దోహదం జేసే ఈ దేవుళ్ళ వేషాలు
మానవత పట్ల మహ నీచమైన మోసాలు
దేవుని పేరుతో చలామణి అవుతోన్న మీరు తుంగమొక్కలు
మతం పేరిట పొట్టలు నింపుకొంటోన్న మీరు కత్తెర దొంగలు
రాళ్ళూ రప్పల్ని ప్రేమించేవాళ్ళు
మానవుల్ని మానవతనీ ద్వేషిస్తారు!
సత్యకామ జాబాలి - (పుట-182)

ఆధునికి సమాజంలో జరుగుతున్న మొసాలను కవి సి.వి.సత్యకామ జాబాలిపాత్రచే పలికించాడు. మారు వేషాలు ధరించి వివిధ రంగాలలో పెచ్చరిల్లుపోతున్న పెట్టుబడిదార్ల దోపిడీలను, దేవుళ్ళ పేరు చెప్పి మంది సొమ్మును కాజేస్తున్న బాబాలను, మతాల పేరిట మాన వత్వాన్ని నాశనం చేస్తున్న పండిత పురోహిత వర్గం పై సి.వి. తీవ్రమైన విమర్శ చేశారు.

నిష్టదరిద్రుల అవసరాల్లోంచి
పుట్టిందే వడ్డీ వ్యాపారం
ధనిక దరిద్రులున్నంతకాలం
ఆస్తీ- అప్పూ - వెలుగునీడల్లా వుంటాయ్!
రాత్రింబగళ్ళూ గుడ్లు పెట్టే వడ్డీ కావాలి
అసలు కన్న వడ్డీ ముద్దు గదా?!
అప్పు తీర్చలేని నిర్భాగ్యుల
ఇల్లూ వాకిలీ - పెళ్ళాం బిడ్డల్ని
నిర్దాక్షిణ్యంగా అమ్మేయమని
మీ ధర్మశాస్త్రకర్తలు శాసిస్తోన్నారు.
సత్యకామ జాబాలి - (పుట-208)

అంటూ ధనిక సమాజం వున్నంత కాలం శ్రామికుని తన శ్రమను దోచుకుంటున్న పెట్టుబడిదారి వ్యవస్థ నాశనం కావాలని జాబాలిచే స్వంత ఆస్తి పీడన లేని సమాజం నేడు కావాలని కవి సి.వి. ప్రతిపాదించాడు.

సి.వి. తన రచనల్లో పరుషమైన పదజాలం వుంటుందని చాలనే విమర్శలున్నాయి. సి.వి. రాసిన సత్యకామ జాబాలి కావ్యం 1970 దశకంలో సంచలనం సృష్టించిన ఒక మహా కావ్యం. ఈ కావ్యం నేడు హిందూ పౌరాణిక వాదులకు నిప్పులు చేరిగే కావ్యం కావచ్చు. కానీ ఆధునిక సమాజంలో యువతి యుకులకు హేతువాదులకు, నాస్తికులకు ఈ కావ్యం ఆదర్శంగా చదవాల్సిన అవసరం ఎంతైన వుంది. సి.వి. ఎంత గొప్ప దార్శనికుడో ఈ ఒక కావ్యం క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే తెలుస్తుంది. సి.వి. ఒక మహాకవి సాంస్కృతిక విప్లవ యోధుడు, మానవత దృక్పథం కల్గిన శాస్త్రీయ కవి.

**ఆధార గ్రంథాలు :**

1. పూర్వగాథాలహరి-వేంకట్రామ అండ్ కో, మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, ఏలూరు -2012.
2. సత్యకామ జాబాలి వచన కవితా కావ్యం - ప్రజాశక్తి, డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్-2015.
3. ఆధునిక యుగంలో కులవ్యవస్థ సి.వి. - ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్ హైదరాబాద్ - 2015.
4. మనతరం - ప్రజాస్వరం సి.వి. - ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ-2017.
5. కవిత్వావరణం - రాచపాళెం - డి.టి.పి. & ముద్రణ: లక్ష్మీగ్రాఫిక్స్, అనంతపురం- 2018.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# తొలి తరం దళిత కవులు

**- డా. వై.విజయానంద రాజు,** తెలుగు శాఖాధ్యక్షులు, పి.బి.సిద్ధార్థ కళాశాల, విజయవాడ.

దళిత సాహిత్యం, దళిత కవులు అనే పదాలు వినబడగానే గుర్రం జాషువా, బోయిభీమన్న, జ్ఞానానంద కవి, కొలకలూరి ఇనాక్ మొదలగు వారు అందరికి గుర్తొస్తారు. వీరు సుప్రసిద్ధులు, సాహితీలోకానికి పరిచయస్థులు. వీరికి ముందు, వీరితోపాటు దళిత కవులు లేరా? ఉంటే ఎవరు? అనే ప్రశ్న వేసుకుంటే జాలా రంగస్వామి, నక్కాచిన వెంకయ్య, కుసుమ ధర్మన్న మొదలగు అనేక మంది కవులున్నారని చెప్పవచ్చు. అయితే ఆనాడు వారు వ్యక్తపరచిన భావాలు ఈనాటి దళిత కవుల వలె ధిక్కార స్వరంతో చెప్పినవి కావు. అస్పృశ్యులు వెలిబుచ్చుకున్న గోడుగానే మిగిలిపోయింది. అందువలన సాహితీ విమర్శకులు వారి గురించి అంతగా పట్టించుకోలేదు. అలాంటి అప్రసిద్ధ దళితకవుల గురించి రేఖామాత్రంగా పరిచయం చేయడమే ఈ వ్యాస ప్రధానోద్దేశం.

"హరిజన సమస్య"పై ముందుగా స్పందించినది ఒక అజ్ఞాతకవి. ఆయన తన గేయంలో భారతదేశానికి అంటరానితనం ఒక మచ్చని, ఐకమత్యానికి విఘాతమని తన గేయంలో సూచించాడు. ఇది "మాలవాంఢ్ర పాట" అనే శీర్షికతో భారతి మాసపత్రికలలో 1909లో ముద్రింపబడింది. ఆ గేయంలో

"అందారు పుట్టిరి హిందమ్మ తల్లికి
"అందారు ఒక్కటై ఉందారి సక్కంగా
'..................................
'..................................
"..................................
"ఎట్టాగు యెక్కువ బ్యామ్మర్లు మాకంటే
"ఎట్టాగు యెక్కువ యేరైన మాకంటే" అంటూ అగ్రజాతుల కులాధిక్యాన్ని తొలిసారిగా నిలదీసింది. ఈ గేయాన్ని దళిత కవి రాసారా? అనే విషయంలో స్పష్టత లేదు.

**జాలా రంగస్వామి :**

వీరు 1904లో పేరమ్మ, కుప్పస్వామి అనే పుణ్య దంపతులకు జన్మించారు. 8వ తరగతి వరకు చదువుకున్నా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం జరిపారు.

"అంటరాని వారెవరు?" (1930), "మేలుకొలుపు" (1930), "మాలశుద్ధి" (1923) మొదలగు సుదీర్ఘ గేయాలలో హరిజనులను మాంస, మద్యాలను విడనాడి, పరిశుభ్రంగా జీవించమని హితవు చెప్పారు. అంతేగాక వశిష్ఠ, వ్యాస, వాల్మీకాది పురాణ ప్రసిద్ధులందరూ మావారేనంటూ అగ్రజాతులకు చాటి చెప్పారు.

"చక్కని పంటలు పండిస్తేను చల్లంగ తింటారె
"మమ్ములను ముట్టగ మాత్రము వారికి వెగటు పుట్టునండి" అంటూ హరిజనుల కాయకష్టాన్ని అనుభవించేటప్పుడు లేని అంటు వారిని ముట్టుకుంటే ఎలా వస్తుందని అగ్రజాతులను నిలదీశారు.

ఉన్నత కులానికి చెందిన రైతు అనివార్య పరిస్థితులలో కళ్లు తెరచి, తన కూతురు అభీష్టాన్ని కాదనలేక ఆమెను మాలవాడికిచ్చి వివాహం చేయడం 'రైతు పిల్ల" (1938) అనే నవలలోని ఇతివృత్తం. ఇది తొలి తెలుగు దళిత నవలని ఆచార్య జయధీర్ తిరుమలరావుగారి అభిప్రాయం. (6 ఏప్రిల్, 1996 వార్త దినపత్రిక)

సుమారు 200 సంవత్సరాల క్రిందట జీవించిన "నందనార్" అనే పేరు గల మాలయోగీంద్రుని జీవిత చరిత్ర ఇతివృత్తంగా "భక్తనందనార్" (1937) నాటకంగా రచించారు. దీనిలో పద్యగద్యాలతో పాటు పాటలు కూడ ఉన్నాయి. ఇది ఐదు అంకాలతో కూడిన భక్తిరస ప్రధాన నాటకం.

చదువుకున్న హరిజన స్త్రీ సమాజంలో కుల పరంగా, లింగ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలకు "అనాథ" (1947) నాటకంలో చిత్రించారు. దీనిలో సమకాలీన

రాజకీయ నాయకుల దురాగతాలు కనబడతాయి. ఇది ఐదు అంకాల సాంఘిక నాటకం.

బడి పంతుళ్ల జీతాలు చాలక పడేపాట్లను ఇతి వృత్తంగా "బడిపంతుల బ్రతుకు" (1953) అనే నాటకాన్ని రచించారు. ఇది పద్యగద్యాలతో కూడిన నాటకం. రచయిత కూడ బడి పంతులు కావడం విశేషం.

వీరు సుమారు 20కిపైగా రచనలు చేశారు. వాటిలో "అహింస", "అస్పృశ్యత", "దున్నేవానిదేభూమి", "మధు పిశాచి", "నిరుద్యోగి", "ఆరని అమరజ్యోతి అంబేద్కర్", "కాలచక్రం తిరిగింది", "కడుపుమంట", "ఆదిజన మహా భక్త విజయం", "ముమ్మడి వరం బాలయోగి", "అంబేద్కర్ రాయభారం-సందేశ జీవితం", "త్రాగుబోతు మగడు" పేర్కొనదగినవి.

## నక్కా చిన వెంకయ్య :

వీరు ఈరమ్మ, కొరయ్య పుణ్యదంపతులకు 1908లో జన్మించారు. 5వ తరగతి వరకు చదువుకున్న వీరు అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం జరిపారు. వీరికి "ఆంధ్రరత్న" అనే బిరుదు కలదు.

వీరు "హరిజన కీర్తనలు" (1935), "అంటు దోషము" (1935) మొదలగు గేయాలలో అగ్రజాతులు హరిజనుల శ్రమను దోచుకుని, వారిని కడుహీనంగా చూస్తున్నారని ఆవేదన చెందారు. పొలం పనుల దగ్గర నుండి శవం పనులు దాకా అన్ని పనులు తన జాతి చేత చేయించుకుని అంటుదోషమంటూ మమ్ములను ప్రక్కన ఉంచుతున్నారని, తన జాతి దైన్యస్థితికి ఆవేదన వ్యక్తంచేశారు.

హరిజన పాలేరు జీవితాన్ని ఇతివృత్తంగా 1938లో "పాలేరు" నాటకాన్ని రచించారు. ఇది ఐదు రంగాల నాటకం. "హరిజన సంఘాలు","హరిజన స్త్రీల అలరింపు", "జీవహింస", "మద్యపాన నిషేధ కీర్తనలు" మొదలగు రచనలు చేశారు.

## కుసుమ ధర్మన్న :

వీరు "నల్లదొరతనం" అనే శీర్షికలున్న రెండు గేయాలలో సానుల సరసన, కుష్ఠురోగుల ప్రక్కన కూర్చునే భారతీయ అగ్రజాతులు మాల, మాదిగలను కుక్కలు, నక్కలు కంటే నీచంగా చూస్తున్నారనీ వారు మా పురోభివృద్ధిని కాంక్షించక మమ్ములను దోచుకుంటున్నారనీ వారి పాలనలో మాకు సుఖసంతోషాలు ఉండవని తెలియ పరిచారు. అందుకే "మా కొద్దీ నల్లదొరతనము - దేవ మా కొద్దీ నల్లదొరతనము" అంటూ భారతీయుల స్వయం పరిపాలన వ్యతిరేకించారు. ఇది గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన "మా కొద్దీ తెల్లదొరతనము" అనే గేయానికి పోటీగా రాయబడిన గేయం.

వీరు "ఆలకింపుమయ్య హరిజనుండ" అనే మకుటంతో 108 ఆటవెలదులలో "హరిజన శతకాన్ని" (1933)లో రచించారు. దీనిలో కుక్కను భైరవుడిగాను, కోతిని హనుమంతుడిగాను, పందిని విష్ణువాహనంగాను, ఎలుకను వినాయకుడి వాహనంగాను, గ్రద్దను గరుడి వాహనంగాను, ఎద్దును శివుని వాహనంగాను, పామును విష్ణుపాన్పుగాను ప్రజలు భావించి వివిధ జంతువులను పూజిస్తారని, తోటి మానవులను అంటటానికి సందేహిస్తారని తన ఆవేదనను ఇలా తెల్పారు..

"కాయకూరలీయ కమ్మగా దిననేర్చు
"పండు ఫలములీయ పనికి వచ్చు
"నంటు దోషమప్పుడంటరాదది యేల?"
"పాలు నీవు పితుక పాపమంటరాదు
"చేతబైకమిడిన చేదుకాదు

"అంటుదోషమప్పుడంటరాదది యేమొ? మొదలగు పద్యాలలో కష్టించి పండించినప్పుడు లేని అంటరానితనం మనుషుల మధ్య సంచరిస్తే ఎందుకొస్తుందని అగ్రజాతులను నిలదీశారు.

ఇంకా వీరు "నిమ్నజాతి ముక్తి తరంగిణి" (1921), "నిమ్నజాతులు-ఉత్పత్తి" (1924), "మద్యపాన నిషేధము" (1930), అసుర పురాణము అను హరిజన చరిత్రా సంగ్రహము, అంటరానివాళ్ళా? మొదలగు రచనలు చేశారు.

వీరితో పాటు అప్రసిద్ధ దళిత కవులైన బీర్నీడి మోషే, గద్దల జోసెఫ్, దమ్ముతానయ్య, నంబూరి దుర్వాస మహర్షి, కె.సి. జాన్, బొడ్డు ప్రకాశం, గెరా ప్రేమయ్య,

అత్తోటి రత్నం, బీర్నీడి ప్రసన్న, బొడ్డు ప్రకాశం, మోదుకూరి జాన్సన్, జాలాది, నూతక్కి అబ్రహం, నంబూరి శ్రీనివాస రావు, మల్లవరపు జాన్, తలమర్ల కళానిధి, సిద్ధేశ్వర కొలప్ప, బొక్కా ప్రకాశం, తాటిపర్తి శామ్యూల్, పెనుమాక శామ్యూల్, సముద్రపు శ్రీమహావిష్ణు, నడకుర్తి వెంకట రత్నం, దాస బసవయ్య మొదలగు అనేక మంది కవులను తొలితరం దళితకవులుగా గుర్తించవచ్చు. వారందరినీ ఈ చిన్న వ్యాసంలో పరిచయం చేయడం సాధ్యం కాదు కనుక వారిలో కొందరిని మాత్రమే స్థూలంగా పరిచయం చేస్తున్నాను.

### బీర్నీడి మోషే :

వీరు మరియమ్మ, సుబ్బయ్య పుణ్య దంపతులకు 1886సం॥లో గుంటూరు జిల్లాలోని వినుకొండ గ్రామంలో జన్మించారు. వీరు జాషువాకు సమకాలికుడు. హరికథలు చెప్పేవారు.వీరికి ఆంధ్రకవితా విశారద, కవికోకిల, ఆంధ్ర క్రైస్తవ కవితా పితామహుడు అనే బిరుదులున్నాయి. వీరు "హరిజనాభ్యుదయం", "హనుమత్సందేశం", "రమా సుందరి", "శ్రీకృష్ణదేవరాయ చరిత్ర", "నవసంధ్య", "చుట్టరికం", "రణభేరి", అభ్యున్నతి (పద్యకావ్యాలు), "గురుభక్తి", "ఇసావధ", "ఉత్తర గోగ్రహణం", "యేసేపు చరిత్ర", పువ్వుల గంప (హరికథలు), క్రీస్తుమత ప్రభ (నాటకం), "మృత్యుంజయ శతకం" మొదలగు రచనలు చేశారు.

### గద్దల జోసెఫ్ :

వీరు గుంటూరు జిల్లాలోని వినుకొండ తాలూకా గోకన కొండ ప్రాంతాన 1908సం॥లో జన్మించారు. సంతోషమ్మ, జాన్ వీరు తల్లిదండ్రులు. వీరు సెకండరీ పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేసి అనంతరం రాజకీయాల్లోకి ప్రవేశించారు. వీరికి "కవిశేఖర", "కవిమార్తాండ", "సుకవి రాజు", "వీరప్రబంధ పరమేశ్వర" మొదలగు బిరుదులున్నాయి. వీరు 'కన్నీటి కబురు" (1966), "వసంత కుమారి" (1946), "కట్టమంచి" (1966), "భక్తవిజయం" (1934), "చంద్రహాసము" (1966), "ప్రతిజ్ఞాభేరి" (1963), "భారతీయుడు", "భారవి", "జానకి", "కథాగుచ్ఛము", "సింహగర్జన", "వేమన" మొదలగు అనేక రచనలు చేశారు.

### కె.సి.జాను :

వీరి అసలు పేరు కంతేటి చిన్నజాను. వీరు గుంటూరు జిల్లా తుళ్ళూరు గ్రామాన 1906 సంవత్సరంలో జన్మించారు. తల్లిదండ్రులు రత్నమ్మ, అననీయ. వీరు "ధర్మ చక్రం", "బహిష్కారం", "స్వాతంత్ర్యరజతోత్సవం" మొదలగు రచనలు చేశారు.

### అత్తోట రత్నం :

వీరు 26 ఏప్రియల్ 1908న గుంటూరు జిల్లాలోని ఎడ్లపల్లి గ్రామంలో జన్మించారు. వినుకొండయ్య, సత్తెమ్మ వీరి తల్లిదండ్రులు. ఆరవ తరగతి వరకు చదువుకున్న వీరికి "కవిశేఖర", "నూత్నభావరత్నాకర", "కవిరత్న", "భాగవతరత్న" అనే బిరుదులున్నాయి. వీరు "కుశలవ", "పూలగంప", "పాకిస్తాన్ సమరం", "బోసు", "మోషే", "స్వప్నవాహిని", "అంబేద్కర్ జీవిత చరిత్ర", "జీసస్ చరిత్ర", "ఆవులు-మానవులు", "వేజండ్ల బాపయ్య చరిత్ర", "అలపర్తి నాగభూషణం చరిత్ర", "వీరబాహు చరిత్ర", "కలలో గాంధీ", "స్వాతంత్రోద్యమ గీతాలు", "కళాప్రయోజనం", "రారాజురాక", "పిరదౌసి", "హరి జనాభ్యుదయం" మొదలైన 25 రచనలు చేశారు. వీటిలో 10 ముద్రితాలు, 15 అముద్రితాలు.

### నంబూరి శ్రీనివాసరావు :

వీరు 1906సం॥లో లక్ష్యయ్యదాస్, లక్ష్మమ్మ పుణ్య దంపతులకు జన్మించారు. 7వ తరగతి వరకు చదువుకున్న వీరికి "కవిశ్రేష్ట", "ఆంధ్ర భాషా ప్రియ" అనే బిరుదులున్నాయి. వీరు "శ్రీనివాస పద్యమంజరి" (1967) అనే శతకాన్ని, "ప్రజా విజయం", "జయపతాక" అనే నాటకాలను, "అలలు" అనే పాటలను రచించారు.

### పసుపులేటి ఆంధ్రికవి :

వీరు నాగమ్మ, వెంకట్రామయ్య పుణ్యదంపతులకు జూలై 1, 1909సం॥లో జన్మించారు. ఎస్.ఎస్.ఎల్.సి. చదువుకున్న వీరు "నీతి పద్యరత్నాకరము" రచించారు.

## నంబూరి దుర్వాస మహర్షి :

వీరు పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి గ్రామాన 1925 సంవత్సరంలో జన్మించారు. లక్ష్మమ్మ, లక్ష్మయ్యలు వీరి తల్లిదండ్రులు. ఎస్.ఎస్.ఎల్.సి. చదువుకున్న వీరికి "మధురకవి", "కళాప్రపూర్ణ" బిరుదులున్నాయి. వీరు "స్వయంవరం", "నిజుపేద", "లోకాలోకనం" (1971), "సాక్షాత్కారం" మొదలగు రచనలు చేశారు.

## బొడ్డు ప్రకాశం :

వీరు రమణమ్మ (అన్నమ్మ), చినవీరయ్య (దావీదు) పుణ్యదంపతులకు జూలై 01, 1912 సం॥లో గుంటూరు జిల్లాలోని బాపట్ల తాలూకాలో జన్మించారు. బి.ఏ. చదువుకున్న వీరికి "కళావీర", "సరసకవి చక్రవర్తి" అనే బిరుదులున్నాయి. వీరు "రక్షరేఖ" (1966), "గాంధీ శత జయంతి" (1970), "భరతవర్షము" (1976), "కింకిణులు", "ఖైదీ", "గురు పూజ", "అభ్యుదయం", "అంబేద్కర్ ప్రశంస", "పిచ్చిగీతాలు" మొదలగు రచనలు చేశారు.

## నడకుర్తి వెంకటరత్నం :

వీరు గుంటూరు జిల్లాలోని అమృతలూరు మండలం గోవాడలో 1915 సం॥లో జన్మించారు. తల్లిదండ్రులు రామాంబ, వెంకటస్వామి. ఎఫ్.ఏ., చదువుకున్న వీరికి "బాలకవి", "కవిభూషణ" బిరుదులున్నాయి. వీరు "బాలకోటేశ్వర తారావళి", "ధ్యానాంజలి" (పద్య కావ్యాలు), "మహోదయం", "శివకేశవ యుద్ధం" (పద్య నాటకాలు) రాసి ప్రచురించారు.

## మోదుకూరి జాన్సన్ :

వీరు గుంటూరు జిల్లాలోని కొలకలూరు గ్రామా 1934 సంవత్సరంలో రత్నమ్మ, గురవయ్య దంపతులకు జన్మించారు. బి.ఏ., బి.ఎల్., చదువుకున్న వీరికి "అగ్నికవి" అనే బిరుదు కలదు. వీరు అనేక సినిమా పాటలు రాశారు. ఇంకా వీరు "దేవాలయం" (1985),"నిచ్చెనమెట్లు", "నీరద", "నటనాలయం", "సిలువభారం", "కాకి" మొదలగు రచనలు చేశారు.

## నూతక్కి అబ్రహం :

వీరు మార్చి 7, 1923 సంవత్సరాన గుంటూరు జిల్లాలోని కొలకలూరు గ్రామంలో కోటమ్మ, కాటయ్య (దానియేలు) పుణ్య దంపతులకు జన్మించారు. ఎఫ్.ఏ. చదువుకున్న వీరికి "మధురకవి", "కవికుల భూషణ" అనే బిరుదులు ఉన్నాయి. వీరు "జీసస్" (1951), "పిడుగులు" (1952), "జలరుహాక్షి" (1954), "పరిపూర్ణుడు" (1972), "పావురము" (1985), "మత్కుణం" (1992) మొదలగు పద్య కావ్యాలు, "అభాగ్యజీవి" (1949) అనే నవల, "పాపక్షమ" (1953) అనే నాటకాన్ని, "కులవ్యవస్థ" (1995) అనే విమర్శనా గ్రంథాన్ని రచించారు.

## వేలూరు అప్పలస్వామి :

వీరు చెల్లమ్మ, స్వామి పుణ్యదంపతులకు 1917 సంవత్సరాన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకాలోని పాలమూరు గ్రామంలో జన్మించారు. వీరు "బర్మా భూగోళ చరిత్రము", "జాతీయ ప్రబోధం" మొదలగు రచనలు చేశారు.

## తలమర్ల కళానిధి (కొల్లప్ప) :

వీరు ఓబాంబ, ఓబన్న పుణ్యదంపతులకు జూలై 1, 1915 సంవత్సరంలో జన్మించారు. వీరికి లలిత కవికోకిల, "విద్యారత్న", "కవిరత్న", "కవికళానిధి" అనే బిరుదులున్నాయి. వీరు "శ్రీరామాయణ నిధి", "శ్రీ దక్షిణేశ్వర భాగవతము", "మధుకణము", "కళా సౌధం", "హరిజనోద్ధరణ", "కథానిధి", "గీత గోవిందం", "కథాలహరి" మొదలగు ఇరవైకు పైగా రచించారు..

## మల్లవరపు జాన్ :

వీరు రత్నమ్మ, డేవిడ్ పుణ్యదంపతులకు జనవరి 22, 1927 సంవత్సరంలో జన్మించారు. భాషా ప్రవీణ పట్టా పుచ్చుకున్న వీరికి "కవిభూషణ", "మధురకవి" అనే బిరుదులు ఉన్నాయి. వీరు "సాంసన్ డెలిలా" (1967), "విశ్వ ప్రకాశం" (1973), "అతుకుల బ్రతుకులు" (1981), "కాంతి రేఖలు" (1987), "సూక్తి శతకం" (1991), "సరస వినోదిని", "భావవిపంచి"(1996) మొదలగు రచనలు చేశారు.

**బోడగిరి చంద్రారావు :**

వీరు బుల్లెమ్మ, వెంకటస్వామి పుణ్యదంపతులకు జూలై 14, 1932 సంవత్సరంలో జన్మించారు. ఇంటర్ చదువుకున్న వీరికి "మధురకవి", "గౌతమీ కోకిల", "భీమకవి" మొదలైన బిరుదులు కలవు. వీరి "వేకువ" (1950), "మన గేయాలు" (1953), "చంద్రరావు గీతాలు" (1970), "భీమశతకం" (1968), "హృదయ వీణ", "అన్వేషణ", "గౌతమీ కోకిల", "శ్రీ వేదుల" (1993) మొదలగు రచనలు చేశారు.

**చెఱకుపల్లి ఐజయ్య :**

వీరు విశ్రాంతమ్మ, యేసేబు పుణ్యదంపతులకు డిసెంబర్ 14, 1937 సంవత్సరంలో జన్మించారు. ఎస్.ఎస్.ఎల్.సి., చదువుకున్న వీరికి "వంచితులు", "బహిష్కృతులు", "రాగవలయం", "నిష్క్రమణ", "ఆహుతి", "సాలెగూడు", "రాణియెస్తేరు" మొదలగు రచనలు చేశారు.

**దమ్ముతానయ్య :**

వీరు లక్ష్మమ్మ, చెన్నయ్య దంపతులకు ఆగస్ట్ 15, 1928 సంవత్సరంలో జన్మించారు. వీరు "జాగృతి" (1970), "ఆంధ్రుడా", "వరాల మూట", "సద్యః ఫలమ్", "గుప్పెడు రూకలు", "శ్రీమత్ భగవద్గీత", "అంబేద్కరు" మొదలగు రచనలు చేశారు.

**ఎం.పి. జాన్ :**

వీరు ఏలీశమ్మ, ఐజయ్య పుణ్యదంపతులకు జూలై 1, 1945 సంవత్సరంలో జన్మించారు. ఎస్.ఎస్.ఎల్.సి. చదువుకున్న వీరికి "కవిసింహ", "ప్రజాకవి", "కవితా భూషణ" మొదలగు బిరుదులున్నాయి. వీరు "మానవత" (1976), "వీర భారతమాత" (1978), "బుద్ధ చరిత్ర" (1979), "జాతిపిత" (1983), "కావ్యకన్య" (1988), "స్వేచ్ఛాగీతి" (1994), "క్రీస్తు చరిత్ర", "హృదయ స్పందన" మొదలగు రచనలు చేశారు.

**బోయ జంగయ్య :**

వీరు నల్లగొండ జిల్లాలోని పతంగి గ్రామాన 1 అక్టోబర్ 1942 సంవత్సరంలో జన్మించారు. వీరు "కష్టసుఖాలు" (1963), "జాతర" (1988), "గొడ్లు" (1983), "లోకారాం" (1973), "దున్న", "చీమలు", "రంగులు", "నడుస్తున్న చరిత్ర", "వెలుతురు", "హెచ్చరిక", "పావురాలు" మొదలగు రచనలు చేశారు.

వీరు కథా సాహిత్యానికి నాగార్జున విశ్వవిద్యాలయం 1984లో శ్రీశ్రీ స్మారక బంగారు పతకంతో గౌరవించింది. 'జాతర'కు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం లభించింది.

**గేరా ప్రేమయ్య :**

వీరు మరియమ్మ, ఐజాక్ పుణ్యదంపతులకు జూలై 15, 1907సం॥లో జన్మించారు. ఎస్.ఎస్.ఎల్.సి. చదువుకున్న వీరు హరికథలు చెప్పేవారు. వీరు "దశకన్య" (1954), "వయోజన విద్య" (1948), "యేసేపు చరిత్ర" (1954), "శ్రీ పొట్టి శ్రీరాములు" (1954), "శాంసన్ డెలీలా" (1957), "పది ఆజ్ఞలు", "వయోజన విద్య", "చదువులేని రైతు బిడ్డ" మొదలగు అనేక రచనలు అందించారు.

**సిద్ధేశ్వరం కొల్లప్ప :**

వీరు సాకమ్మ, సిద్ధప్పలకు జూలై 1, 1939 సంవత్సరంలో జన్మించారు. ఫోర్త్ ఫారమ్ చదువుకున్న వీరు శ్రీ "సరస్వతీ శతకం", "సిద్ధేశ్వర శతకము"లను రచించారు.

**గాదెలపర్తి రాధా ఆశీర్వాదం :**

వీరు గుంటూరు జిల్లా తెనాలి తాలూకా చినగాదెలవర్రు అనే గ్రామాన జూలై 17, 1937సం॥లో జన్మించారు. భాగ్యమ్మ, అహరోను వీరి తల్లిదండ్రులు. భాషా ప్రవీణ పట్టాపుచ్చుకున్న వీరికి "మధురకవి", "ప్రజాకవి" అనే బిరుదులున్నాయి. వీరు "బాలనుడులు" (1953), "కళ్ళజోడు" (1970, 1972), "దీనాలాపం" (1954), "పాకిస్తాన్ భస్మాసుర" (1956), "సత్య జ్యోతి" (1975), "అగమ్యుడు" (1979), "స్వప్న విలాపము" (1980), "నిమ్నజాతుల జ్యోతి" (1975), "వికలాంగుల ఆవేదన" (1991), "కవితాపం" (1991) మొదలగు అనేక రచనలు చేశారు.

### పాటిబండ్ల దానియేలు :

వీరు ఎలీసమ్మ, డేవిడ్ పుణ్యదంపతులకు మే 6, 1914సం॥లో జన్మించారు. ఎఫ్.ఏ. చదువుకున్న వీరికి "కవికోకిల" బిరుదు కలదు. వీరు "మాణిక్యవీణ" (1975), "ప్రేమ జ్వాల", "స్లీవ విజయం" (1976), "ధ్యానాంజలి", "జీవజలం", "దైవతరం", "చైతన్య సారధి", "డాన్ బోసో" మొదలగు రచనలు చేశారు.

### బీర్నీడి ప్రసన్న :

వీరు సంతోషమ్మ, మోషేకవి పుణ్యదంపతులకు ఆగస్ట్ 15, 1917సం॥లో జన్మించారు. థర్డ్ ఫారమ్ చదువుకున్న వీరికి "మహాకవి", "మధురకవి", "మధుర కవి మన్మధుడు" మొదలగు బిరుదులున్నాయి. వీరు "మధుమాసము" (1964), "పృధ్వీ భాగవతము" (1966), "తుకారా" (1978) "వీరపత్ని", "మేలుకొలుపు", "కొత్త బ్రతుకు", "క్రీస్తు పుట్టుక", "గంగినేని శతకము" మొదలగు రచనలు చేశారు.

ఇంకా కొలకలూరి గోపకవి, పినపాటి జెర్మియ, కంచర్ల భాస్కరరావు, పాకలనాటి దాసుబాబు, పాటిబండ్ల ఆనంద రావు, సవ్వప్పగారి ఈరన, దొడ్ల చైతన్య, నవ్వులగంటి జగన్నాధం, లంకపల్లి జాకోబ్, ముళ్ళపూడి జేమ్స్, దొండపాటి దేవదాసు, సర్వేపల్లి పెంచలయ్య, పెరుమాళ్ళ మునెప్ప, బొక్కా యేలియ్య, దొండపాటి రామారావు, గూఢ అంజయ్య, నీలం అప్పారావు, పాగోలు అభ్యుదయం, దాసరి అమరేంద్ర, అమూల్యశ్రీ, బన్న అయిలయ్య, బోయి భీమన్న, దావాల ఆంద్రూస్, బూదాల ఆదాము, చందవోలు ఆనందం, దాసరి ఆనందం, పిడపర్తి ఎజ్రా, సూరపోగు ఏసుదాసు, గుంటూరు ఏసుపాదం, అంకం ఏసురత్నం, ముళ్ళపూడి ఏసురత్నం, నల్లి కుటుంబరావు, జి.ఆర్. కుర్మే, భూష కృష్ణదాసు, కానేటి మీనన్, కాకుమాను కోటయ్య, మున్నంగి క్రీస్తుదాసు, దారగోపి, జువ్విగుంట చిన పెంచలయ్య, జంగం చెన్నకేశవులు, గర్నెపూడి జాన్, గేరా జాన్, పాడేటి జాన్సన్, కొర్రపాటి జేమ్స్, పసుపులేటి జేసురత్నం, ఎడ్లపల్లి జోసఫ్, రావెల జోసఫ్, ఉడుముల తిపన్న, మురికిపూడి తెరిసా దేవదానం, హెచ్. దేవదానం, చిలుకూరి దేవపుత్ర, బడుగు ధర్మారావు, తిరుక్కోవళ్ళూరి నరసయ్య దాస్, భూరేల నరసింహులు, దేవరపల్లి నాగయ్య, వసే నాగేశ్వరరావు, గోళ్ళ నారాయణ, వేది నారాయణ దాస్, కోటపాల్ దేవరాజు, మేడికుర్తి పుల్లయ్య, బల్లి పురుషోత్తమ్, పాలకుర్తి పెదరంగయ్య, కోపెల ఫిలిప్స్, కూకటిపల్లి పొలయ్య, ఆశావాది ప్రకాశరావు, పొలుకొండ భద్రయ్య, బండారు మృత్యుంజయబాబు, గేరా యాదయ్య, అప్పగుడిశె రత్తయ్య, రావూరి రత్నం, బల్లి రాజగోపాలరావు, బొడ్డు రాజభూషణం, ధర్మవరం రామకృష్ణ, భూపతి రాజారావు, భూపతి రామారావు, మక్కెన రూబెన్, జి. లలిత, దాసరి లాజరస్, కొప్పుల వసంతరావు, చుక్కా విన్సెంట్‌పాల్, ఇసాకోటి విశ్వాసం, గుడేటి వెంకటరత్నం, బుడితి వెంకటరత్నం, పాలా వెంకట సుబ్బయ్య, కొనతం వేమనాచార్యులు, గనిపె శామ్యూల్, జంగం సంజీవరావు, వజ్రపు సాంబమూర్తి, కొలకలూరి స్వరూపరాణి, బేరి స్వామిదాస్ మొదలగు అనేక మంది రచయితలను తొలితరం దళిత రచయితలుగా గుర్తించవచ్చునని చెప్పవచ్చు.

తొలితరం దళితకవులు గాంధీ, అంబేద్కర్‌లచే ప్రభావితులు కావడం, స్వాతంత్రోద్యమంలో పాల్గొని, జైళ్లకు వెళ్లడం మొదలగు కారణాలరీత్యా వారు అస్పృశ్యతా సమస్యను జాతీయ దృక్పథంతో, మానవతా దృక్పథంతో చిత్రించారు.

వీరు కేవలం వాళ్ల సొంత సమస్యలకే పరిమితం కాకుండా మొత్తం సమాజ అభ్యుదయాన్ని కాంక్షిస్తూ అన్ని రకాల సామాజికాంశాలపై స్పందిస్తూ రచనలు చేశారు. వీరు ఆయా కాలాలలో సంభవించిన ప్రతి సంక్లిష్ట సమస్యకి స్పందించారని చెప్పడానికి చైనా దురాక్రమణ పైన, నవకాళీ ప్రాంత దురాగతాలపైన వీరు రాసిన కావ్యాలే అందుకు తార్కాణాలు.

మొత్తం మీద వీరు అన్ని సాహిత్య ప్రక్రియలలో రచనలు చేసి, తెలివి ఒక వర్గం సొత్తు కాదని నిరూపించారు. అయితే వీరికి తగిన ప్రోత్సాహం ఉండి ఉంటే

ఇంకా విశేషంగా రచనలు వీరి నుండి వచ్చి ఉండేవి. వీళ్ల రచనలలో కొన్ని లభ్యం కావడం లేదు. ప్రయత్నించి, సంపాదించి పరిశీలిస్తే వివిధ అంశాలు తప్పకుండా వెల్లడి కాగలవని ఆశిద్దాం.

**ఆధారగ్రంథాలు :**


1. తెలుగు సాహిత్యం - హరిజన రచయితల సేవ, డా॥ వై.విజయానంద రాజు. అముద్రితం.
2. దళితసాహిత్య చరిత్రం, డా॥ పిల్లి శాంసన్, 2000.
3. హరిజనాభ్యుదయం- ఆధునికాంధ్ర కవిత్వం, డా॥ కల్లూరి ఆనందరావు, 1994.


❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 భావవీణ UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# దళిత ఉద్యమం

- **గూడెపు అనిత,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

**దళిత పద అర్థ వివరణ :**

దళితం అనే పదానికి నరికిన, విచ్చిన, వికసించిన అటు ఇటు చిమ్మిన, నిక్షిప్తమైన, సగంగా విభజించిన, రెండుగా చేసిన అనే అర్థాల్లో దళిత పదాన్ని చెప్పవచ్చు. సంస్కృతంలో దళిత అనే పదాన్ని 'దాల్' అనే పదం విరగగొట్టబడిన, విభజించబడిన, పగలగొట్టబడిన, చింపి వేయబడిన, తొక్కి వేయబడిన, విసిరవేయబడిన, నుజ్జు చేయబడిన, నాశనం చేయబడిన అనే అర్థాలు కల్గి ఉంది.

'దళ్' అనే దాతు నిష్పన్న విశేషణ రూపమే దళిత శబ్దం దళితము, దళము, దళవాయి అను పదాలకు అర్థం ఖండించినది. చేదించినది, వికసించినది అనే అర్థాలు ఉన్నట్లు కన్పిస్తుంది[1].

సామాజిక వ్యవస్థలో ఉన్నతమైన స్థానం లభించ కుండా, వివక్షకు గురవుతున్న వారందరికి దళిత శబ్దం వర్తిస్తుంది. శతాబ్దాల తరబడి జరిగిన పోరాటంలో వ్యక్తమైన ఆత్మగౌరవ నినాదం దళిత.

సమాజంలో అట్టడుగు స్థాయిలో బతుకుతూ, ఆ కష్టాల నుండి బయటపడడానికి శాస్త్ర విజ్ఞానాన్ని, విశ్వసిస్తూ హేతువాద భావనా బలంతో పోరాడుతూ అస్తిత్వం కోసం నిత్యం ప్రయత్నించే వారికి ప్రాతినిధ్యం వహించే పదం శబ్దం దళిత[2] మొదట్లో వీరిని పరయాలు, కుల భ్రష్టులు, హరిజనులు, పీడిత వర్గాలు, పంచములు, అతిశూద్రులు అని వ్యవహరించారు.

సామాజిక వర్గీకరణకు మూలకారణమైన వర్ణ వ్యవస్థలోకి ఈ దళితులు రారు. ఎందుకంటే ఆ వ్యవస్థలో నాలుగు వర్ణాలే ఉన్నాయి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర దళితులను పంచములుగా ఐదవ వర్ణంగా పరిగణిం చారు. అంత్య (చిట్టచివరి), బాహ్య (గ్రామం వెలుపల), అంత్యజ (ఆఖర్నపుట్టిన), అంత్యవాసిని (చివర్న నివసించే వారు) వంటి పదాలను దళితులకు ఉపయోగించారు.

20వ శతాబ్దం ప్రారంభంలో 1920లో దళితులు తామే అసలైన భూమి పుత్రులుగా (సన్స్ ఆఫ్ ది సాయిల్) ప్రకటించుకున్నారు. తమ ప్రాంతీయ గుర్తింపు ముందు 'ఆది' అనే పదాన్ని ఉపయోగించారు. మద్రాసు ప్రెసిడెన్సీలోని తెలుగు మాట్లాడే వాళ్ళు తాము 'ఆది ఆంధ్రులుగా' తమిళులు 'ఆది ద్రావిడులు'గా ప్రకటించు కున్నారు. దళిత పదం ఒక కులాన్ని కాకుండా ఒక వర్గాన్ని సూచిస్తోంది. మహారాష్ట్ర ప్రజలు దళిత అనే పదాన్ని వాడుకలోకి తీసుకువచ్చారు. మొట్టమొదటి సారిగా డా॥ బి.ఆర్. అంబేడ్కర్ 'దళితులు' అన్న పదాన్ని ఉప యోగించారు. 1970లో 'దళిత పాంథర్స్' ఉద్యమ ప్రభావంతో ఈ దళిత పదం మరింత విస్తృతమయింది. దళిత్ అంటే మార్పుకు, విప్లవానికి ప్రతీక.

1971లో జరిగిన ప్రపంచ దళిత మహాసభ దళిత పాంథర్స్ వారు దళితులంటే ఎవరు అన్న పదాన్ని ఈ కింది విధంగా నిర్వచించారు.

**Who is Dalit?**

"Members of scheduled castes and tribes, Neo Buddhits, the working people, the landless and poor peasants, women and all those who are being exploited politically, economically and in the name of religion.[4]"

దళితులంటే అంటరాని వారు. మాల - మాదిగ కోవకు చెందిన వారని అర్థం. సామాన్య జీవితంలో బ్రతకడానికి కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ మొదలైన వాటికి నోచుకోని అభాగ్యులు. అంతేకాదు తరతరాల నుండి అణగద్రొక్కబడుతున్నవారు దళితులు.

కులపరంగా, అణచివేతకు గురైనవారు, సామాజికంగా చిన్నచూపుకు లోనయినవారు, గౌరవంలోనూ, ఆర్థిక విషయంలోనూ, విద్యాసముపార్జనలోనూ, పాలక వ్యవస్థలోనూ అట్టడుగు స్థాయిలో ఉన్నవారు దళితులు.

పై నిర్వచనాలను పరిశీలిస్తే సంఘ బహిష్కరణకు గురైన వారు ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతికంగా అణగదొక్కబడ్డ వారు, సమాజ జీవన స్రవంతిలో కలవనివారు, శారీరక శ్రమపై బతికేవాళ్ళు నీచ వృత్తులు చేసుకుంటూ జీవనం సాగించే వాళ్ళు దళితులు.

భారతదేశ చరిత్రలో వలస వచ్చిన విదేశీయులపై దండయాత్రలు చేసినది దళితులేనని, వీరు సమూహాలుగా ఏర్పడి వారి విశ్వాసాలకు, తత్వాలకు, మతాలకు, భంగం వాటిల్లకుండా ఎదిరించి పోరాటాలు సాగించారని, ఈ దేశంలో మొదటి నుండి దళితులు ఉద్యమాలను నడిపించారని కత్తిపద్మారావు గారి అభిప్రాయం.

1906లో భాగ్యరెడ్డి వర్మ స్థాపించిన 'జగన్ మిత్ర మండలి' ఆవిర్భావంతో దళితోద్యమం పురుడు పోసుకుంది. నిజాం కాలంలో దళితులు ఎదుర్కొన్న సమస్యలను చూసి చలించి హైదరాబాదులో మొదలైన ఉద్యమం ఆది ఆంధ్ర ఉద్యమం. ఆ కాలంలో దళితులకు చదువుకునే అవకాశం లేదు. దళితులు చదువుకోక పోవడానికి ప్రధాన కారణం కులం. భాగ్యరెడ్డి వర్మ ఎన్నో విధాలుగా కుల వివక్షకు గురయ్యి మార్పు నాతోనే మొదలు కావాలని, అగ్రకులస్తుల రెడ్డి, వర్మ, యాదవ్ వంటి కుల సూచిక పదాల పేర్లను తన పేరుతో పోల్చుకొని భాగయ్య, భాగ్యరెడ్డి వర్మ అయ్యాడు. దళిత సమస్యలు పరిష్కారం కావాలంటే దానికి మూల కారణం విద్యేనని గట్టిగా నామ్మడు. 1910లో తానే స్వయంగా దళిత విద్యార్థుల కోసం పాఠశాలలు నిర్మించారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో మరో 40 పాఠశాలలు స్థాపించారు. ఈయన దళితుల కోసం ప్రత్యేక పాఠశాలలు స్థాపించి, నడపడం చూసిన నిజాం నవాబు వాటిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నడపడానికి అనుమతి ఇచ్చాడు. ఈ పాఠశాలలో విద్యాబోధన సామాన్య ప్రజలకు అర్థమయ్యే విధంగా మాతృ భాషలోనే ఉండాలని నిర్ణయించారు.

1917 నవంబర్ 4-6 వరకు ప్రాదేశిక పంచమ సదస్సు నిర్వహించి ఆ సదస్సులో అంటరానివారే ఈ దేశ మూల వాసులు, ఆదివాసులని వారిని పంచములు అనడానికి వీలులేదని వారిని ఆది ఆంధ్రులుగా పరిగణించాలని చెప్పారు. దళిత విద్యార్థులకు ఉపకారవేతనాలు మంజూరు చేయాలని దళిత యువతకు ఉపాధి కల్పించాలని కోరుతూ, దళిత వర్గాల ప్రయోజనం కోసం వృత్తి విద్య సంస్థలను, కుటీర పరిశ్రమలనూ, తెరవాలంటూ, దళితులకు ప్రభుత్వ బంజరు భూములను పంచాలంటూ, దళితులను ప్రభుత్వ బావులు, చెరువుల నుంచి నీళ్ళు తీసుకోకుండా దేవాలయాలు, సత్రాలు, హోటళ్లు మొదలైన వాటిలో అడుగుపెట్టనివ్వకుండా ఆటంకపరిచే అగ్రవర్ణ హిందువులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అనేక తీర్మానాలు చేశారు.

భాగ్యరెడ్డి వర్మతో పాటు అరిగే రామస్వామి, ఆదయ్య, శ్యాంసుందర్, వెంకట్రావు లాంటి వారు దళిత జాగృతికి, ఉద్యమాలకు అండగా నిలిచి పోరాడారు. స్వాతంత్ర్యానికి పూర్వం ఆది హిందూ, ఆది ఆంధ్ర మహాసభల ఆధ్వర్యములో నిర్మించిన ఉద్యమాలు దళితులకు గుర్తింపు, అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని అపాదించాయి.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో అంబేద్కర్, గాంధీల ప్రభావం ఎక్కువగా ఉంది. గాంధీజీ స్వాతంత్రోద్యమం కోసం అందరిని కలుపుటకు దళితులకు కొన్ని ప్రత్యేక ఆశలు చూపారు. హరిజన అనే పదాన్ని దళితులకు ప్రత్యామ్నయంగా వాడాడు. 1932 హరిజనోద్యరణ ఉద్యమాన్ని ప్రారంభించాడు. 'హరిజన సేవక్ సంఘం' అనే సంస్థను స్థాపించి, హరిజనుల బాధలు తీర్చండి అని చాటి చెప్పాడు. కానీ ఆచరణలో మాత్రం శూన్యం. దళితులకు ఎలాంటి ప్రయోజనం జరగలేదు. భారత దేశంలో దళితులకు జరుగుతున్న అన్యాయాలను చూసి నిమ్న కులాల సమస్యలను పరిష్కరించడం కోసం అనేక ఉద్యమాలు చేసినవారు అంబేద్కర్ 1924లో 'బహిష్కృత హితకారిణి' సంస్థను స్థాపించి ఆ సభ ద్వారా అంటరానితనాన్ని రూపుమాపాడు.

జ్యోతిరావుపూలే, అంబేద్కర్, సిద్ధాంత పునాదుల మీద తన ఆలోచన విధానంతో తరతరాలుగా అణగారిపోయిన బహుజనులకు రాజ్యాధికారం అనే నినాదంతో కాన్షీరాం

ప్రజాస్వామ్య రాజకీయల్లోకి అడుగుపెట్టాడు. 1973లో బాయ్‌సెఫ్ (ఆల్ ఇండియా బ్యాక్ వర్డ్ అండ్ మైనారిటీ కమ్యూనిటి ఫెడరేషన్స్ అనే సంస్థను స్థాపించి ఉద్యోగులపై జరిపే వేధింపులకు అన్యాయాలకు తక్షణ పరిష్కారం కనుగొన్నాడు.

అప్పటి వరకు భారతస్వాతంత్ర్యం కోసం పోరాడిన దళితులందరు బి.యన్. మూర్తి, వేముల కుర్మయ్య, జ్వాలా రంగస్వామి, దామెర సంజీవయ్య మొదలైన వారంతా కాంగ్రెసు పార్టీలో చేరడంతో దళిత ఉద్యమం కుంటుపడింది. ఆంధ్రప్రదేశ్‌లో అప్పటికే క్రైస్తవ ప్రభావం ఎక్కువగా ఉండడం వల్ల దళితులకు విద్యావిధానం కొంత దగ్గరయ్యింది. 1968లో కృష్ణా జిల్లాలో కంచిక చెర్ల కోటేశ్‌ను దొంగతనం చేశారనే కారణంతో కట్టేసి సజీవ దహనం చేశారు అగ్రకులస్తులు. ఈ సంఘటనతో దళితులందరు ఐక్యంగా ఏర్పడి దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ తిరుగుబాటు మొదలుపెట్టారు.

కత్తిపద్మారావు, బొజ్జతారకం, దళిత మహాసభను స్థాపించి నిరంతరంగా పోరాటం చేశారు. కారంచేడు ఉద్యమ స్ఫూర్తితోనే గ్రామాల్లో అంబేద్కర్ యువజన సంఘాలు ఏర్పడ్డాయి. దళిత వాడల్లో అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించుకొని, అంబేద్కర్ జయంతి, వర్థంతి కార్యక్రమాలు జరుపుకోవడం మొదలయ్యాయి.

1994లో 'ఈ దుముడి' అనే చిన్న గ్రామంలో దండోర ఉద్యమం ఏర్పడింది. దీని వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ. ఇది కేవలం 20 మంది డిగ్రీలు కూడా పూర్తి చేయని యువకులతో ప్రారంభమయ్యి నేడు నాలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద సంఘంగా గుర్తింపు పొందింది. అట్టడుగు స్థాయి కులాల అందరికి సరైన సమానమైన న్యాయం జరగాలంటే యస్.సిలో, ఏ.బి.సి.డి. వర్గీకరణ అవసరమని, వర్గీకరణ కోసం నిరంతర పోరాటం చేస్తున్న ఉద్యమం దండోర ఉద్యమం.

20వ శతాబ్దం నుండి తరతరాలుగా దళితులు అణచివేతకు, దోపిడికి వెలివెతకు గురవుతూనే ఉన్నారు. జ్యోతిరావ్‌పూలే, నారాయణగురు, సాహుమహారాజ్, పెరియార్, భాగ్యరడ్డి వర్మ, అంబేద్కర్ వీరంతా దళితుల కోసం ఉద్యమాలు చేశారు. గుర్రం జాషువా, కుసుమ ధర్మన్న, బోయి భీమన్న కొలకలూరి ఇనాక్, బొజ్జాతారకం, బోయ జంగయ్య, కత్తి పద్మారావు, జూకంటి జగన్నాథం, శిఖామణి, ఎండ్లూరి, సుధాకర్, బన్న అయిలయ్య, మొదలైన వారంతా తమ రచనల్లో దళితుల పక్షాన నిలబడి రచనలు చేస్తున్నా నేటికి దళితులంటే సమాజంలో చిన్న చూపే కన్పిస్తుంది.

## ఉపయుక్త గ్రంథసూచి :

1. దళిత సాహిత్యంలో ఆత్మకథలు - పరిశీలన పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం - గిన్నారపు ఆదినారాయణ.
2. దళిత వికిపీడియా.
3. ఆంధ్రప్రదేశ్ దళిత ఉద్యమ చరిత్ర - యాగాటి చిన్నారావు.
4. దళిత వికిపీడియా.
5. ఆంధ్రప్రదేశ్ దళిత ఉద్యమ చరిత్ర - యాగాటి చిన్నారావు.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# సాహితి వెలుతురు బోయ జంగయ్య

- భుప్పాల రవీందర్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాదు, తెలంగాణ.

బోయ జంగయ్య అక్టోబర్ ఒకటి 1942 లో జన్మిం చారు. నల్గొండ జిల్లాలోని చౌటుప్పల్ మండలం లింగారెడ్డి గూడెం వీరి జన్మ స్థానం. తల్లిదండ్రులు రైతు కూలీలు. అవమానాల బతుకు దిద్దిన ఓనమాలతో సాతాని చదువులు చదివారు. అందరితో కాకుండా పిల్లలకు దూరంగా కూర్చోబెట్టారు. అప్పటి అమానవీయ చూపులే అతనిలో ఒక కొత్త ఆలోచన పుట్టించాయి. ప్రశ్నింప చేశాయి. "చాకిరి చూస్తూ, అవమానాలకు గురవుతున్న నా తోటి మానవులను చూచి ఆత్మ ఘోషిస్తుంది. వాటిని తట్టుకోలేక అరిచిన అరుపులే కవిత్వం, నా కథలు, నా సాహిత్యం" అంటాడు జంగయ్య. తన చుట్టూ ఉన్న దుర్భర జీవితాలను చూసి రాయటం మొదలు పెట్టాడు. మొదటి కథ 1971లో హనస్సు కథ తరుణి పత్రికలో అచ్చయింది. దీంతో ఆయన సాహిత్య ప్రస్థానం మొదలైంది. ఆయన కలం నుంచి లిఖించబడిన రచనల్లో కష్టసుఖాలు 1963, దేశం కోసం 1965, కొత్త బాటలు 1980లో నాటకాలు రాశాడు. 12 కథా సంకలనాలు రాశాడు. లోకం 1973, గొర్రెలు 1980, దొంగలు 1994, చీమలు 1996, తెలంగాణ వెతలు 1998, భోజ కథలు 2000, బొమ్మలు, ఉప్పునీరు 2002, ఇప్పపూలు 2003, ఆమె 2004, ఇతని కవితా సంకలనాలు.. నడుస్తున్న చరిత్ర 1976, వెలుతురు 1984, బోజ కవితలు 2002 లో వెలువరించారు.

## పొందిన పురస్కారాలు, సన్మానాలు :

శ్రీశ్రీ మెమోరియల్ బంగారు పతకం నాగార్జున విశ్వ విద్యాలయం 1984, జాతర - ఉత్తమ నవల అవార్డు తెలుగు విశ్వవిద్యాలయం 1989, డాక్టర్ అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు, దళిత సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ 1994, చాసో స్ఫూర్తి అవార్డు విజయనగరం 1999, స్వరాజ్యలక్ష్మి అవార్డు కాకినాడ 1991, మలయశ్రీ అవార్డు కాకినాడ 1991, పద్మశ్రీ డాక్టర్ లక్ష్మీనారాయణ డూబ మెమోరియల్ అవార్డు పాణిపట్టు 2001, విశాల సాహితీ అకాడమీ 2001, ప్రతిభ అవార్డు 2002, గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని 2003లో తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాదు ద్వారా పొందారు. ఇతని కవిత ధారలు పాఠకులకు హాయినిస్తాయి. "పూజారి చేసిన గుడి గంటల సందడిని/ ఆలయ గోపురాల నుండి/ ఎగిరిన పావురాలు/ ప్రభువు ప్రార్థన కోసం/ ఫాస్టర్ చర్చి తలుపులు తెరిచిన పుడు/ ఎగిరిన పావురాలు/ అల్లా ఓ అక్ బర్/ మౌజర్ పిలుపుకు మసీదు మినారుల నుండి/ ఎగిరిన పావురాలు.../ అన్నీ కలిసి తిరుగుతున్నాయి. అన్నీ కలిసి తింటున్నాయి. కానీ పూజారి/ ఫాస్టర్/మౌజర్"...( పేజీ 51) ఏమిటి తేడాలు అని ప్రశ్నిస్తాడు బోయ జంగయ్య. ప్రశ్నల పరంపర ఉద్యమం అంటాడు జంగయ్య. చరిత్రను ఆకళింపు చేసుకుని ఈ సమాజాన్ని మేల్కొప డానికి కన్నీటి వెతలను రచనలుగా అక్షరీకరించాడు. దళిత బహుజన వాద సిద్ధాంతానికి ఉండవలసిన ప్రతిష్టమైన దాఖలాలను ఈ కవి ఆనాడే సుస్పష్టం చేశాడు. ఈ విషయంలో జంగయ్య ఒక చారిత్రక పురుషుడు. పావురాలు శాంతి సంకేతాలు. వెలుతురు కావ్యంలో పావురాలు శీర్షికన ఈ అద్భుతమైన సందేశాన్ని అందించారు. ఆలయ గోపురాల మీదున్న, చర్చి భవనాల మీదున్న, మసీదు మినార్ల మీదున్న పావురాలు కలిసి ఎగరడం, ఒకచోట కలిసి తిరగటం, ఒకే చోట కలిసి తినడం, తిరిగి తిరిగి మళ్ళీ తమ ఇళ్లకు వెళ్లడం చాలా సహజమైన చిత్రీకరణ. కానీ మనుషులను చూస్తే హిందూ, క్రిస్టియన్, ముస్లిం మత స్థులు పావురాల లాగా కలిసి తిరగలేక పోతున్నారు. కలిసి బతకలేక పోతున్నారు. కలిసి తిరిగినా అందులో సహజత్వం లోపిస్తుంది. ఎందుకోనని కవి సహజంగానూ, ఆశ్చర్యంగానూ, అసహనంగానూ, ప్రశ్నార్థకంగానూ చిత్రించాడు. ఈయన సున్నితంగా ఏమర్చిన ఈ లెక్కను చూస్తే.

"అధికార వర్గాల దండయాత్రల, జయా అపజయాల లెక్కలు, మనిషిని పీల్చి చంపుతూ, వాళ్ల రక్తంలో మతాలు, తమని నిలబెట్టు కిందికి గీస్తున్న, పాత నీతుల ( బైబిల్ -ఖురాన్- భగవద్గీత ) గీతాలు"...ఆయన సున్నితంగా స్పర్శించిన ఒక వెలుగు అనిపిస్తుంది. అది ఒక నీతి అని పిస్తుంది. అది ఒక ధర్మోపదేశం అనిపిస్తుంది. ఆయన ఆకలి నుండి కవిత్వం పుట్టాయంటాడు. "హోటల్ వెనుక, చెత్త కుండీల దగ్గర, విసిరేసిన విస్తళ్లలోని మిగిలిన ఎంగిళ్ల కోసం, కుక్కలను తరుముతున్న మనుషులు, మనుషులను కురుస్తున్న కుక్కలు, కడుపులో రగులు తున్న ఆకలి పోరాటాన్ని ప్రోత్సహిస్తుంది" అని అంటాడు. తెలుగు సాహిత్యంలో గండపెండేరాలు తొడుక్కున్న కవులు కూడా ఇవ్వనటువంటి ముగింపులను అలవోకగా ఇచ్చేస్తాడు. ఎన్నో మతాలను, ఎందరో భక్తులలో ఉండే తారతమ్యాలను వారి మధ్య ఉన్న అడ్డుగోడలను తొలగించడానికి ప్రయత్నం చేస్తాడు. మరియు మనము శాంతి కపోతాల వలె సహవాసం చేయాలనే సదుద్దేశమైన సందేశాన్ని అందుకోమని పాఠకులను ఆలోచింప చేస్తాడు. యుద్ధం వద్దు- సాహిత్యమే ముద్దు అని ఆధునికులు మానవ విలువలను పెంచే దిశగా పయనించాలని కోరు కునే ఒక సాహిత్య కారుడు బోయ జంగయ్య.

ఆయన ఏ రచన చదివినా ఒక కొత్త ఒరవడి, ఒక కొత్త నేపథ్యం, ఒక కొత్త వస్తువు, ఒక నైపుణ్య వంతమైన ఆలోచన, ఒక వినూత్నమైన పరిష్కారం, ఒక ప్రయోజన కరమైన చైతన్యం ఇట్లా చెప్పుకుంటూ పోతే ఆయన రచనల్లో ఎన్నో లక్ష్యం వైపు పయనించే మానవ విలువలు బోధపడతాయి. మనిషి ఆధ్యాత్మిక జీవితంలో దేవునికిచ్చి నంత విలువ సాటి మనిషికివ్వలేక పోతున్నారని చెప్ప డానికి ఆయన కవనాన్ని చూడండి. " అమ్మా! కుంటోన్ని.. పోయిరా!, తల్లీ !గుడ్డోడిని.. వెళ్ళిరా/ మా తల్లీ! ముస లోన్ని.. పో పో/ ఏడుకొండలవాడా వెంకటరమణ.. వస్తున్నా ఉండు నాయనా!...( పేజీ 40 ) ఇలా మినీ కవితా సౌందర్యాన్ని చిత్రీకరించారు జంగయ్య. అంతే మొత్తంలో అధికారిక చర్యలను కూడా చిత్రించిన తీరు మనల్ని విస్మయానికి గురిచేస్తుంది. "సచివాలయపు చెత్తబుట్టలో సామాన్యుల వేలిముద్రలు" అనే సామాజిక స్పృహ ఎంతమంది కుంటుంది అనే ప్రశ్న మన మనసు లను తొలిచే అవకాశం ఉంది.

మానవ విలువలకు ప్రపంచంలో ప్రాముఖ్యత ఎక్కువ. ఇవి ఈయనను ఉన్నత శిఖరాలు వైపు నడిపిం చాయి. ఇది ఆయన రచనల వెల్లువల పరంపర " మీకు తెలియని దానిని/ తెలియకుండా ఉంచబడ్డ దానిని/ ఈ సంఘాన్ని/ దాని ఏజెంట్లను/ వాళ్లు నడిపే వింతలను/ వాళ్లు చూపే తంతులను/ ప్రశ్నించు... ( పేజీ 78) అని సున్నితంగానే చెప్తాడు. ఈ సమాజానికి అంబేద్కర్ ఇచ్చిన వెలుగును తెలుపుతూ... ఒకవేళ అంబేద్కర్ ఇంకా పదేళ్లు బతికి ఉంటే గొప్ప మార్పు వచ్చేదని ఆశించాడు. అంబేద్కర్ శీర్షికలో "ఒక్క చూపుడువేలు తోనే/ కుల రక్కసిని కూల్చావు/ ఒక్క కలంపోటుతోనే/ మా నుదిటి రాతను మార్చినావు/ ఉన్న వాళ్లకు లేని వాళ్ల/ ఊడిగం ఇగ ముగియనుంది/ బాబా. ఇంకో పదేళ్ళు నీవు బ్రతికి ఉంటే/ భారతావని బతుకంతా మారిపోయేది" (పేజీ 50) అని నిక్కచ్చిగా చెప్పాడు. చీకటి నుండి వెలుగులోకి నడిపించే ఆశాకిరణంగా అంబేద్కర్ ని తలచాడు.

ఈ విధంగా జంగయ్య గారి రచనలన్నీ పాఠకుల్ని నిద్ర లేపుతాయి. బోధిస్తాయి. ఏ విషయాన్నైనా అవగాహన చేస్తాయి. ఒక తాటి మీదకు తెస్తాయి. సున్నితంగా ప్రశ్నింప జేస్తాయి. సమస్యలను పరిష్కరిస్తాయి. ప్రయోజనాలను అనుభవింప చేస్తాయి. మనుగడ వైపు నడిపిస్తాయి. మానవ విలువలను పెంచుతాయి. సంఘాన్ని బలోపేతం చేస్తాయి. ఇవి మనిషి జీవనానికి కావలసిన వనరులు. ఇవే వాడకు, ఊరుకు, మండలానికి, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి, ప్రపంచానికి నిత్యవసర వస్తువులు కూడా. ఈ నిత్యవసర వస్తువులను ఇచ్చే జంగయ్య గారు మరో విశ్వనరుడు.

**ఆధార గ్రంథాలు :**

1. బోయ జంగయ్య సాహితీ దర్పణం, 2. వెలుతురు సంకలనం, 3. మినీ కవితా సంపుటి, 4. నడుస్తున్న చరిత్ర

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# తిన్నని వృత్తాంతము - గిరిజన జీవన చిత్రణ

- డా॥. చొట్ల కిశోర్, తెలుగు శాఖాధిపతి, కాకాని వేంకటరత్నం కళాశాల, నందిగామ, కృష్ణా జిల్లా.

16వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయుల భువన విజయంలో స్థానం సంపాదించిన వాడూ, అష్టదిగ్గజ కవులలో ఒకడిగా పేర్గాంచినవాడు, తన కవితా మాధుర్యంతో కృష్ణరాయలంతటి వాని చేత "స్తుతి మతియైన ఆంధ్ర కవి ధూర్జటి పల్కులకేల కలిగెనో, అతులిత మాధురీ మహిమ" అని ప్రశంసించబడినవాడు ధూర్జటి మహాకవి. "శ్రీకాళహస్తి మాహాత్మ్యము, నిశ్రీకాళహస్తీశ్వర శతకము" వీరి రచనలు. 'శ్రీకాళ హస్తీశ్వరా' అనే మకుటంతో అచంచలమైన శివభక్తి తత్త్వంతో వ్రాసిన వీరి శతకం శ్రీకాళహస్తీశ్వర శతకం. ఈ శతకం ధూర్జటి కవితాధారకు నిదర్శనంగా నిలబడటమే కాకుండా బుద్బుదప్రాయమైన మానవజీవితం, మాన వుడు చేరుకోవలసిన గమ్యాన్ని గురించి, శివభక్తి పారమ్యాన్ని బోధిస్తుంది. "కాళహస్తి మాహాత్మ్యము" 4 అశ్వాసాల శివభక్తుల కథల సమాహారం.

శ్రీకాళహస్తి మాహాత్మ్యంలోని తృతీయాశ్వాసములో షుమారుగా 130 పద్య గద్యలతో "తిన్నని వృత్తాంతం" వర్ణించబడింది. ఇది నాటి గిరిజనుల జీవనవిధానాన్ని గురించి ఎంతో అమూల్యమైన సమాచారాన్ని అందిస్తుంది. ముఖ్యంగా దక్షిణాన చిత్తూరు ప్రాంతంలో "సువర్ణముఖీ" నదీతీరాన గల అంజనాద్రి, కాళహస్తి ప్రాంతాల్లోని తూర్పు కొండల్లో నివసించిన గిరిజనుల సామాజిక జీవనాన్ని గ్రంథస్తం చేసిందీ ఇతివృత్తం. కృష్ణరాయల కాలం నాటి, విజయనగర రాజ్యంలోని గిరిజనుల చరిత్రగా దీనిని చూడవచ్చు. ఈ ఇతివృత్తం ఆధారంగా గిరిజనుల జీవన విధానాన్ని పరిశీలించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

పొత్తపినాటి సీమలో తూర్పు కొండల్లో "ఉడుమూరు" అనే ఒక బోయపల్లె ఉంది. ఆ ఊరికి నాథనాథుడు అధిపతి. అతని భార్య తండె. వీరి కుమారుడు తిన్నడు. ఇతని కథ ఈ వృత్తాంతం. యుక్తవయస్కుడైన తిన్నడు వేటకు వెళ్ళాడు. అక్కడ మృగయా వినోదం తర్వాత అలసిపోయి నిద్రిస్తుండగా అతనికి కలలో ఈశ్వరుడు కన్పించడం, "బాలకా! యిచట శిలావట మూలంబున, కొండదండ, మొగలేటిదరిన శైలసుతాపతి, భక్తుల పాలిట పెన్నిది నివసిస్తున్నాడని, ఆయన్ని భక్తితో కొలువు మయ్యా" అని అంతర్ధానం కావడం, అడవిలోపల తనకు కలలో ఈశ్వరుడు చెప్పిన శివలింగాన్ని దర్శించడం, తన ఊరికిరమ్మంటూ ప్రార్థించడం. అక్కడే ఉంటూ శివపూజ చేస్తుండటం. చివరకు ఒకానొక సందర్భంలో నికంటి కంటే వేరొక కన్ను గలదా ముక్కంటికు అంటూ శివుని కంటిని తన కంటితో నయం చేయడానికి ప్రయత్నించి, శివునిలో ఐక్యం అవ్వడం ఇదీ కథ.

ఉడుమూరు వర్ణనతో ఈ కథ ప్రారంభమౌతుంది. ఉడుమూరు సహజ సుందరమైన బోయపల్లెలను, గుర్తుకు తెస్తుంది. ఆ పల్లె సెలయేళ్ళతో నిండి ఉంటుంది. ఆ సెలయేళ్ళలో ఉన్న పద్మాల నుండి వీచే గాలి ఆ పల్లెను పరిమళభరితం చేస్తుంది. వరాహ, సర్ప, గజ, వేణువుల నుండి పుట్టిన ముత్యాలు వారికి అడవిలో దొరికే వివిధ రకాల పండ్లతో సాటి. అలాగే ఆ పల్లె చెంచెతలు వంటచెఱకుగా చందన వృక్షాల ముక్కలు ఉపయోగిస్తారు. ఇండ్లు అలకడానికి స్త్రీలు సుగంద ద్రవ్యాలైన జవ్వాజిని, పునుగు, కస్తూరి జాదులను ఉప యోగిస్తారు.

### గిరిజనుల ఆహారం :

ధూర్జటి ఆయా సందర్భాల్లో గిరిజనుల ఆహారాన్ని వర్ణించాడు. ఉడుమూరు యువతులు రకరకాల బియ్యంతో పాయసం వండుతారు. నివ్వరి బియ్యం, "ఒడిపిళ్ళు" అనే ఒకరకం బియ్యం, గునుకు బియ్యం, వెదురు బియ్యం వీటితో చమరీ మృగాల పాలు కలిపి పాయసం చేస్తారు. పుట్టతేనె, పెరతేనె, పుట్టజున్ను, తొఱ్ఱతేనె నిత్యం ఆహారంగా తీసికొంటారు. చక్కగా కాలి

పొడియై, చూర్ణం లాగా రాలిపోయే, ''నింజెట్లు'' అనే ఒకరకం దుంపలు ఆ తేనెల్లొ నంజుకొని తింటారట. ఆటవికులు ఉపయోగించే పలు రకాల పండ్లు చాలా రకాలను తెలియజేశాడు ధూర్జటి. నేరేడు పండ్లు, జానపండ్లు, గంగరేగు పండ్లు, వెలగపండ్లు, పుల్లవెలగ పండ్లు, మోవి పండ్లు, సంకెన పండ్లు, బులుసు పండ్లు, బీర పండ్లు, పిచ్చుక బీర పండ్లు, కొమ్మ పండ్లు, ఈత పండ్లు, గొంజి పండ్లు, మేడి పండ్లు,- ఇవన్నీ చెంచు స్త్రీలు ఇంటికి తెస్తారని చెబుతాడు కవి. షుమారుగా 24 రకాల పండ్లు ఆనాటి గిరిజనులు ఆస్వాదించారట. వీటిలో కొన్ని ఆధునికులకు తెలియదు కూడా. ఆనాటి బోయపల్లెలు స్వయంసంపూర్ణాలు. అందుకే తిన్నడు శివుని తన పల్లెకు ఆహ్వానిస్తూ నిమా పల్లెం గోరిన వెల్లనుంగలవు తెప్పల్గాగ, నీకిచ్చెదు అని వేడుకొంటాడు. గిరిజనుల మాంసాహారాన్ని గురించిన వివరణ కూడా సవివరంగా తెలియజేశాడు కవి.

ఉ॥ నిక్రొవ్విన యేకలమ్ములను గొన్నిటి( గూల్చికమర్చి పెంచులం
జివ్వుచు నెఱ్ఱమన్నలది చివ్వన నీరివురంగ నేర్చినో
ళ్ళువ్విళులూర( బ్రేల్చి చమురుట్టిపడం గఱుకుట్లు గాల్చి క
జ్జువ్వులనీడ నొక్క పరిశుద్ధ శిలాతల భూమి నందఱున్ పుట. 74.

(శ్రీకాళహస్తి మాహాత్మ్యము రెండవభాగం)

అడవి పందిమాంసాన్ని కరకట్లుగా, కాల్చుకుని, పక్షుల మాంసాన్ని పక్కన పెట్టుకుని పుట్టతేనెలో నంజుకుంటూ, ''నింజెట్లు'' అనే దుంపలతో కలిపితింటున్న వారి వర్ణన ఎంతటివారికైనా నోళ్ళువ్విళ్ళూర వలసిందే. ఆధునికులు తినే తందూరి వంటకాలు వీటినుండి పుట్టినవేనంటే అతిశయోక్తి కాదు.

## గిరిజనుల వేట :

గిరిజనుల ప్రధాన వృత్తి వ్యవసాయం అయినా, ''వేట'' వారి జీవనంలో నిత్య కృత్యం. అడవిలో వివిధ రకాల జంతువులను వేటాడే నైపుణ్యం వారికి చిన్న వయసు నుండి అలవడుతుంది. ఈ కథలో 8 పద్యాలతో వేట వర్ణన సాగుతుంది. తిన్నడు చిన్న వయసు నుండే మంచి వేటగాడు.

సీ॥ ఒకనాడు తెరవేఁటనుగ్ర సత్త్వంబుల బుడమిపైఁ దడకాలువడ వధించి,
యొకసారి సారమేయోద్ధతి నుద్దురస్తబ్ధరోమంబులు సంహరించి,
యొకమరి దీమంబులొడ్డి పారులు దీర్చి బహు విహంగంబులఁ బట్టి తెచ్చి
యొకవేళ డేగ వేటకుఁజని యెగ (జోపి నానాండ జముల ప్రాణములు గెడపి

తే॥ ముంగివేఁటేదువేఁట సివంగి వేట
యఱ్ఱివేఁట యుగంట వేఁటెద్దువేఁట
మొదలుగాఁ గల వేఁటల యద నెఱింగి
తిన్నఁడొక్కొక్కతూకు వర్తింపదొడఁగె పుట. 69.

పై వర్ణలో తిన్నడు చేసిన తెరవేట, ముంగివేట, ఏదు వేట, సివంగివేట, యిఱ్ఱివేట, గంటవేట, ఎద్దువేట మొద లైన వేటలు వర్ణితమయ్యాయి. వేటకు బయలుదేరి నప్పుడు తెర చీర కట్టలు, ప్రోగు చుట్టలు, తీసికొని బయలుదేరతాడు. అలాగే దొడ్డివల, వేటివల, కుందేటి వల, పందివల, సవదండవల, మకరివల, యొలికవల - ఇవన్నీ వలల్లోని రకాలు. వీటిని గిరిజనులు వేటకు ఉపయోగించేవారు. రకరకాల జంతువులకు రకరకాల వలలు. ఓరణంబులు, సెతకట్టెలు, సాళువంబులు, గిద్దులు, వేసడంబులు మొదలైనవి విడివేటకు కావలసిన పక్షులు. పూరేడు, కారుకోడి, కౌరజంబు, కౌజు కెక్కర, చిందులు మొదలైనవి పాణివేటకు సిద్ధం చేసిన పక్షులు. ఇంకా సివంగులు, కుక్కలు, కృష్ణజింకలు, ముంగిసలు, ఎద్దులు మొదలైన జంతువులను కూడా వెంట తీసుకెళ్ళేవారు.

ఉరులు, ఉరి గోలలు, బోనులు, చిక్కాలు, చిగురు గుండెలు తీపుత్రాళ్ళు, ఒడిత్రాళ్ళు, ధతల ముళ్ళుశర, శరాసన, మొదలైనవి సాధన సామాగ్రి.. ఇవి కూడా వెంట ఉండవలసిందే. ఈ విధంగా ధూర్జటి గిరిజనుల వేట,

వేటలోని రకాలు, మెళుకువలు చెప్పాడు. ఏఏ జంతువుల, పక్షులు ఏ ఏ వలలు ఎప్పుడు ఎలా ఉపయోగించాలో గిరిజనులకు క్షుణ్ణంగా తెలిసిన విద్య. ఈ విద్యను భావితరాలకు అందిస్తుంది ఈ వృత్తాంతం.

వేటలో గిరిజనులకు కొన్ని సంప్రదాయాలున్నాయి. వేటలో ముందుగా పడిన జంతువును తమ కులదేవత అయిన కాత్రేనికి సమర్పించుకోవాలి. తర్వాత తమవారికి కానుకలుగా పంపుకోవాలి.

ఆ॥ "మునుపు పడిన మోకముగొని వచ్చి మిడిగ్రుడ్లు
పొడిచి నీట శిరము దడిపి తోఁకఁ
గోసి, ధూపమిచ్చి, మాసంబు పెకలించి
కానుకిచ్చి కాటిఱేని గొలిసు అంటూ వర్ణిస్తాడు కవి.
పుట. 73.

## గిరిజనుల విందులు వినోదాలు :

భిల్ల దంపతులు సురాపానం చేయడం ఆనవాయితీ. కలసి వేటాడటం, వ్యవసాయం చేయడంతో పాటుగా స్త్రీలు విందులు, వినోదాల్లో కూడా పురుషులతో పాటుగా ఆనందిస్తారని ఈ వృత్తాంతం చెబుతుంది.

నిమంకెన పూవులో విడిసి మత్తిలి యుండెడు తేఁటి రీతి మీ
నాంక సరోజ రాగ కలితాభరణాంతర నీలలీల హా
లాంకు రితా రుణచ్ఛవి సమంచిత లోచన తారకద్యుతుల్
బింకము జూపఁబానములు పెక్కువ జుక్కిరి భిల్ల దంపతుల్
- పుట. 64

అధిక మధ్యపానము చేత భార్యభర్తలు ఒడలు మరిచారని అంటాడు కవి. అలాగే మధ్యపాన మత్తులై భార్యలను నిందించేవారు కొందరు, కొద్దిగా మద్యాన్ని సేవించగానే పడిపోయిన భర్తలను హేళన చేస్తూ ఇతరుల బిగి కౌగిలిలో ఒదిగిపోయేవారు, భర్తను వదిలి ప్రియుణ్ణి చేరి ఆనందించే స్త్రీలు, ఇలా అన్ని రకాల మనస్తత్వాలు గల స్త్రీలు అక్కడ ఆనందిస్తారు.

ఈ వేడుకలు గిరిజనులు తమ కులదైవం అయిన కాత్రేని ని పూజించే క్రమంలో జరుగుతాయి. కాత్రేని పూజానంతరం బలులు సమర్పించిన తర్వాత గిరిజన దంపతులు ఒకచోట చేరి విందులు, వినోదాల్లో మునిగిపోతారు. ఈ సందర్భాల్లో ధూర్జటి మద్యపాన ప్రియులైన గిరిజనుల ప్రవర్తనను అత్యంత సహజంగా వర్ణించాడు.

సీ॥ మాటలాడదలంచి మఱచిపోయెడి వారు, నడవ
బోవుచు దొ్రటుపడెడువారు.
నూరకుండెదమని యుండనో పనివారు, లేచెద
మని లేవలేని వారు,
బనిలేని పనిబట్ట బయలు దిట్టెడి వారు బాడనే
రకయును బాడు వారు
నెదురైన వారికి నెల్ల మ్రొక్కెడి వారు వ్రీడావిహీనులై
యాడువారు

జాలద్రావియు మగుడ జేసాచువారు
దొడరి యుపదంశ భాండముల్దొడుకు వారు
నైరి మృగయాధి దైవత యాత్రయందు
బానములు చేసి శబర దంపతులు రతులు
- పుట. 59.

## గిరిజనుల పూజలు :

గిరిజనులు తమ కులదైవం కాత్రేనిని పూజించడానికి బయలుదేరిన విధానం ఈ కథలో అతి సుందరంగా వర్ణించబడింది. శబర యువకులు తాము నేర్చుకొన్న విలువిద్యను కాత్రేని గుడిలో ప్రదర్శించవలసి ఉంటుంది. ఈ సందర్భంగా పూజలు జరుగుతాయి. శబర స్త్రీలు నుదుట పెద్ద పెద్ద బొట్లతో, స్థనములపై తామర తూండ్లు ధరించి, భుజాలకు నెమలిపురి దండలు, చెవులకు నెమలిరెక్కలు, నడుముకు పండుటాకుల పుట్టములు కట్టుకొని, కురులలో ఎఱ్ఱ గోరంట పూగుత్తుల దుముకొని, పాదములకు పారాణి పూసుకుని, కత్తి వంటి వాడి చూపులతో కూడిన కండ్లకు నల్లని కాటుకలతో, పునుగు, జవ్వాది, కస్తూరి వంటి సుగంధ ద్రవ్యాల మైపూతలతో పూజలకు బయలుదేరతారు. వారి వద్ద నివ్వరి బియ్యం, చమరీ మృగం పాలతో చేసిన పాయసం,

వెదురు బియ్యంతో చేసి ఆవిటి కుడుములు, నేల గుమ్మడి కాయ ముక్కలతో చేసిన పిండికూరలు, అడవి ఆకులకూరలు, అనేక రకాల మాంసాలు, మద్యాలతో పాటుగా బలులకోసం తీసికొచ్చిన రకరకాల జంతువులు, పక్షులు ఉంటాయి. వీటన్నింటితో వీరు బండ్లపై కా్ౖరేని గుడికి జాతరకు బయలుదేరతారు.

అలాగే సువర్ణముఖీ నదీతీరాన తిన్నడు చేసిన శివపూజ కూడా చెంచుల నిష్కల్మషమైన భక్తి ప్రపత్తులకు నిదర్శనంగా నిలుస్తుంది.

ఉ॥ నివిల్లొక చంక, నంపపాదివీపున దొప్పలు కేలు దోయిఁ బు
క్కిళ్ళ బవిత్ర కాంచన ముఖీజల మొప్పఁగ వచ్చి భక్తి రా
జిల్లఁదదంబు మజ్జనము సేయుచు దొప్పల నంజుడద్రి రా
జల్లుని నారగింపుమన నా పరమేశ్వరుడూర కుండినన్

- పుట. 107.

పై వర్ణనలో గిరిజనుల ముగ్ధభక్తి వర్ణితమైంది. తిన్నని పూజా విధానం శుభ్రమైనది కాకపోయినా స్వచ్ఛమైనది. అందుకే తిన్నడు శివుని సాయుజ్యం పొందగలిగాడు.

## గిరిజనుల ముగ్ధభక్తి :

"తిన్నని వృత్తాంతం" పరమార్థం చెంచు ప్రజల ముగ్ధ భక్తిని లోకానికి తెలియజెప్పడమే. "తందె" గర్భాన పడి నప్పటి నుండి సాయుజ్యం వరకు ప్రతి సన్నివేశం శివభక్తి మయంగా సాగుతుంది. చెంచుల భక్తి మయజీవితానికి ఇది ఉత్కృష్టమైన ఉదాహరణగా చెప్పవచ్చు. శివభక్తి వారి జీవితంతో విడదీయలేనిది. శివుడు వారి అనాది దేవుడు. ప్రతినిత్యం వారితో ఉంటాడు. కవి "తందె" గర్భం ధరించిన విషయాన్ని ఈ విధంగా వర్ణిస్తాడు కవి.

శైలజాధిపుని దయ వల్ల నెలమసలిన తందె కు
"భసితాంగరాగ శోభావిలాసంబుతో (బ్రతివచ్చు నానన పాండుగరిమ
కంఠహాలాహల కాళి మచ్చువి తోడ నెనవచ్చు గుబ్బ చన్మొనల నలుపు
పరశివాకృతి తోడ సరివచ్చు నణుతరం బన(జాలి ఘనతరంబైన నడుము
స్వస్వరూపవిచార సంప్రాప్త శాంతితో మార్పడు చిత్తైధ మాన జడిమ
సరభసానంగ సంక్రీడ జరుగనీక
దౌహృదము, గర్భమున నున్నతనయుఁడీశుఁ
డై ప్రకాశింప గల(డని యపుడు దెలుపు
కరణిఁబెంపొందె నమ్మందగామినికిని

- అంటాడు. పుట. 28

అలాగే కవి తన కంటిని పెకిలించే సన్నివేశంలో

ఉ॥ ప్రాణము వోవునో, తనువు భంగము నొందునో నాక, తూణికా
బాణము జిఱ్ఱునదిగిచి భల్ల మూఖాగ్రము రక్తపద్మ దృ
క్కోణముఁ జేర్చిగ్రుచ్చి యొక్క గ్రుడ్డి వడింబెకలించి శోణిత
ద్రోణికయైన దైవత శరో మణికంట నమర్చె నంతటన్ - ఇది ముగ్ధభక్తికి పరాకాష్ట.

## గిరిజనుల వైద్యం :

శివుని కంటి వెంట నీరు కారినప్పుడు తిన్నడు చేసిన నేత్ర వైద్యం పరిశీలించదగినది. నికోకపొట్లం బావి గొన నూది యొత్తుచు అన్న పద్యంలో దీనిని స్పష్టంగా వర్ణించాడు కవి. కోక పొట్లం ఊది దాని కొన నూది ఒత్తడం, రెండు చేతుల రాపిడి వలన కలిగే వేడిని కళ్ళకు వత్తడం దగ్గర నుండి తిన్నడు అనేక రకాలుగా ప్రయత్నిస్తాడు. నెత్తిన తంగేడాకు రాస్తాడు. రేచకి నిమ్మపండ్లు నూఱి పులుసు తీసి పట్టీ వేస్తాడు. అలాగే తెల్ల దింటెన పువ్వు తెచ్చి దాని రసాన్ని తీసి రాశాడు. కలివె పువ్వులు కోసి వాటి రసాన్ని తీసిరాశాడు. పేరిన నేయి రాశాడు. పెరుగు వత్తులు రాశాడు. చివరికి శబరాంగనల చను బాలను సేకరించి శివుని కంటికి రాశాడు. శంఖాన్ని సంపాదించి దానితోనూ వత్తుతాడు. ఈ వైద్య విధానాలన్ని

"నాటువైద్యం" అని అనుకున్నా ఇవి తరతరాలుగా మానవజాతి అనుసరిస్తున్నవే. ఇవన్నీ గిరిజన జనజీవన స్రవంతి నుండి వచ్చినవే అని చెప్పవచ్చు.

## గిరిజన స్త్రీలు :

గిరిజన స్త్రీల జీవితం స్వేచ్ఛతో కూడుకొన్నది. భక్తి, బాధ్యతలు, శృంగార, వైరాగ్యం వీటితో ముడిపడినది. ప్రాయకంగా వీరు భక్తి పరులు. తాము నమ్మిన దైవాన్ని మూఢంగా ఆరాధిస్తారు. అలాగే పురుషులతో పాటుగా వేట వ్యవసాయాల్లో పాల్గొంటారు. బహు సుందరాంగులు. తిన్నని వృత్తాంతంలోని షుమారు 10 పద్యాలలో వీరి సౌందర్యం, శృంగారం, భక్తి విశేషాలు వర్ణితాలైనాయి.

ముఖ్యంగా వ్యవసాయంలో వారు భర్తలకు తోడుగా ఉంటారని చెప్పడానికి ఈ అందమైన వర్ణనే నిదర్శనం.

ఉ॥ "మంచెల మీఁద నెక్కి కటి మండలిఁ జుట్టిన పాఱుటాకులిం
చించుక చంచలించి మరునిల్లు బయల్పడు జేయుఁ బిట్టలన్
జెంచెత లార్చి వ్రేయుదురు చిత్రముగా నొడిసెల బాహుమూ
లాంచిత దీధితుల్ చిఱుతయైన చనుంగవ మీద పర్వంగన్"

- పుట. 13.

శబరకాంతల శ్రమ, సౌందర్యం రెండూ ఈ వర్ణన ద్వారా చెప్పాడు ధూర్జటి. వారి కోయిల కూతలతో పక్షలను బెదిరిస్తూ, వడిసెళ్ళతో రాళ్ళు విసిరే దృశ్యం చెంచు యువకుల హృదయాలను గిలిగింతలు పెడుతుంది. భిల్ల స్త్రీలు తమ జుట్లుకు నెమలి పురులను కట్టుకొని, పూతి పునుగుతో బొట్టు పెట్టుకుని, గురివిందలను మెడలోదాల్చి, నడుముకు పండుటాకులు కట్టుకొని ధనర్భాణాలను చేతపట్టుకొని తమ భర్తలతో కలిసి వేటలో పాల్గొంటారు.

చెంచు యువకులు తమ ఇండ్లలో సింహం పిల్లలను, నెమలి పిల్లలను, లేడిపిల్లలను, ఏనుగు పిల్లలను పెంచుకుంటారు. దానికి కారణం వారికి సింహం నడుము, నెమలి కురులు, లేడి చూపులు, ఏనుగుస్తనములు గల తమ భార్యల మీద గల ప్రేమే అని కవి వర్ణించాడు. గిరిజనుల పెంపుడు జంతువులను ఇలా అన్వయించడం కవి చమత్కారంగాను, గిరిజనుల సహజ జీవిత చిత్రణగాను పేర్కొనవచ్చు.

"తేనియలు గ్రోలి పిదపన్
మానవతుల యధరమాని మఱుతురు శబరుల్
తేనియ తియ్యదనంబు స
మానంబన( దగునేయధరమధురిమ కెందున్ పుట. 18 అన్న వర్ణన గిరిజన స్త్రీలకు మాత్రమే సరితూగ గలదు.

చెంచు స్త్రీలు పట్టు చీరలు గట్టుభాగ్యం ఉండి కూడా పాఱుటాకులనే కట్టుకుంటారు. మంచి వరి ధాన్యంతో తినే స్థాయి ఉన్నా నివ్వరి బియ్యాన్నే తింటారు. అలంకారాలు వదలి కేవలం గురివిందలను ధరిస్తారు. మంచాలను వదలి పూ పొదరిండ్లలోనే సేద దీరుతారు.

"ఎంత సంపద గల్గియు, నెట్టి వారుఁ
దమ కులాగత ధర్మకర్మములు విడువఁ
జాల రటుకానఁ దత్పురీ శబర సతులు
మహిమ కలిగియు మానరు సహజ వృత్తి"

- పుట. 8

అని చెప్పడం ద్వారా కవి శబర స్త్రీల నిరాడంబర, సాధారణ జీవిత వాంఛను తెలిపాడు.

## ముగింపు :

ఈ ఇతివృత్తంలో కవి "గిరిజన" పదానికి ప్రత్యామ్నాయంగా ఆయా సందర్భాల్లో శబరులు, భిల్లులు, చెంచులు, ఎరుకలు అనే జాతులను సమానార్థాలుగా ఉపయోగించాడు. తిన్నని వృత్తాంతం సహజమైన, గిరిజనుల జీవితాన్ని సమగ్రంగా తెలియజేసింది. 16వ శతాబ్దం నాటి గిరిజనుల జీవితం నుండి నేటి ఆధునికులు నేర్చుకోవలసినది ఎంతైనా ఉంది. చాలా వరకు ఆహార విహారాల్లో, ఆవాసాల్లో, అభిరుచుల్లా ఆధునిక ప్రజలు గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను పాటిస్తూ దాన్ని ఆధునికంగా చెప్పుకోవడం ఇటీవల మంచి పరిణామం.

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# పాత రోతేనా? చరిత్రబూజు దులపక్కరలేదా?

- డా॥ పి.ఎ. సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

**ముఖ్యాంశాలు :**

సజీవ కళకు సజీవ వస్తువు, సజీవ అభివ్యక్తి సామగ్రి కాని పాతవస్తువు పాత అభివ్యక్తి కావు.

సజీవ కళ సమకాలీనతలోంచే జన్మిస్తుంది కాని చరిత్ర భూమికగా కాదు

చరిత్ర దిద్దుబాట్లు పరిపాలన ఆర్థికాది దృక్కోణాల్లో తప్ప కళలో కాదు

నవనవోన్మేష ప్రతితిభకు నవనవోన్మేష వ్యుత్పత్తి, అభ్యాసంతప్ప చరిత్ర పనికిరాదు.

పాత పనికి రాదా? చరిత్రను రాజకీయంగా, పాలన, ఆర్థికం సామాజిక దృక్కోణాల్లో మాత్రమే చూడాలా? కళగా చూడటానికి అది ఉపయోగపడదా? అంటే కళాచరిత్ర లేదా సాహిత్య చరిత్ర అధ్యయనం వృధా ప్రయాసేనా? అన్నది చర్చ నీయాంశం.

సాహిత్య చరిత్ర అంటే వస్తువు, అభ్యిక్తుల చరిత్ర అని అర్థం. అభివ్యక్తి చరిత్ర అంటే అలంకార శాస్త్రం అన్నమాట.

సనాతన సమాజంలోని వస్తువు అర్వాచీన సమాజానికి పనికి రాదని; అదే విధంగా సంప్రదాయం అభివ్యక్తి, శిల్పం, సమకాలీన వస్తువుకు సరిపడవని; సమకాలీన సాహిత్యవస్తువుకు సమకాలీన సమాజమే భూమిక అని, సమకాలీన వస్తువుకు సమకాలీన అభివ్యక్తి మాత్రమే సరిజోడు అన్నది వినూత్నవాదం.

అంటే సంప్రదాయం సాహిత్యాన్ని చరిత్రగా అధ్యయనం చేయడం ఒక దండగ మారి వ్యవహారం అని సిద్ధాంతీకరించడం మేధోమధనానికి వేదిక అవుతుందన్నమాట.

ప్రతిభావంతుడయిన కళాకారుడు తన 'వ్యుత్పత్తి'కి సమకాలీన సాహిత్యాన్నే భూమిక చేసుకోవాలి. తన 'అభ్యాస'ం కూడా సమకాలీనతలోనే జరగాలి. లేకపోతే సమకాలీన వస్తువు సంప్రదాయ అభివ్యక్తిలో శక్తిమంతంగా జ్వలించదు.

సంప్రదాయ వస్తువు, సంప్రదాయ అభివ్యక్తిని సమకాలీన సమాజం చర్విత చర్వణంగా, సృజనరాహిత్యంగా, అనుకరణగా, అనుసరణగా జమకడుతుంది. అంటే సృజన సృజనకాకుండా పోతుందన్నమాట.

పాత భాష పరాయి భాషగా కనిపిస్తున్నట్టే; పాతవస్తువు పాత అభివ్యక్తి కాలం చెల్లినవవుతాయి. సమకాలీన వస్తువు, సమకాలీన అభివ్యక్తి మాత్రమే జోడీ కుదురుతుందా? పాత వస్తువు పాత అభవ్యక్తి, పాతవస్తువు నూత్న అభివ్యక్తి, నూత్నవస్తువు పాత అభివ్యక్తి, నూత్నవస్తువు - నూత్న అభివ్యక్తిలలో ఏజంట ఎప్పుడు ఎందుకు ఎక్కడ బావుంటుంది. ఈ 'బాగు'కు ప్రమాణాలేంటి అన్నవాటిని తరచిచూడాలి.

అసలు వస్తువు, దాని అభివ్యక్తిని వెతుక్కుని తొడుక్కుంటుంది. అంటే వస్తువు, అభివ్యక్తి ఒకేసారి పుడతాయి. మరి ఒక వస్తువును మరో అభివ్యక్తిలోకి చొప్పించడం ఎందుకు? వస్తువు దాని సహజాభివ్యక్తినికాదని కొత్త ఉడుపులు ధరించడం సృజనను శక్తిమంతం చేయడానికేనా? లేదా సృజనను సంక్లిష్టంగా మలచడానికా? పాత వస్తువు కొత్తఉడుపుల్లో, లేదా కొత్త వస్తువు పాత అభివ్యక్తిలో దాని ప్రభావశీలతను రెట్టింపు చేసుకుంటుందా? లేదా సంప్రదాయం మీద 'చాదస్తపు' అభిమానంవల్లనా? అసలు పాత అభివ్యక్తి కొత్తవస్తువుకు తొడుగుగా అర్వాచీనంలో ఎలామనగలుగుతుంది? పాతవస్తువు పాత అభివ్యక్తిలో అర్వాచీనంలో ఎలా బతకగలుగుతుంది? లేదా బతికిస్తున్నామా? అయితే ఎందుకు?

సంప్రదాయ సమాజమైనా అర్వాచీన సమాజమైనా దాని సహజవాతావరణంలో దాని స్వభావానికనుగుణంగా, దాని సహజ వస్తువును అభివ్యక్తిని నిర్మించు

కుంటుంది. ఇక్కడ దాని వస్తువు, అభివ్యక్తులు దాని అవసరాలు, అభిరుచులు ప్రాతిపదికగా తయారువు తాయి. అంటే ఒక సమాజానికి సహజమైన వస్తువు అభి వ్యక్తుల స్థానంలో ఆసమాజానికి అసహజ వస్తువు అభి వ్యక్తులు ఎందుకు అప్పుడప్పుడు పానకంలో పుడకల్లాగ అడ్డుతగులుతాయి.

ఒక సామాజానికి సహజ సిద్ధమైన అనులైన వస్తు అభివ్యక్తుల్ని కాదని ఆ సమాజానికి అసహజమైన అపరిచితమైన వస్తు, అభివ్యక్తులు పెత్తనం చెలాయించే క్రమంలో ఇలాంటి అవలక్షణాలు అనివార్యంఅవుతాయి.

గుడ్డి పరివారం ఉన్నంతకాలం ఇవి 'ట్రెండుసెట్టర్లు'గా చలామణీ అవుతాయి. ఒక సమాజానికి అపరిచితమైన వస్తువైనా, అభివ్యక్తి అయినా దానికదేబతకదు. దాన్ని పనిగట్టు బతికించాల్సివస్తుంది. అలా బతికించడం వెనుక ఆధిపత్య భావజాలం, గతం మీద మూఢ భక్తి అర్వాచీన వైముఖ్యం కలసి ప్రబలమైన ప్రగతి నిరోధక శక్తిగా నిలబడ తాయి.

అర్వాచనతలోకి సంప్రదాయవస్తు అభివ్యక్తులు చొరబడటం అంటే ఆసమాజపుజీవితాన్ని అవి ఆక్రమించి నట్టే. ఆసమాజపు జీవితం ఆ సమాజపు సాహిత్యంలో ప్రతిఫలించనీయకుండా చేయడం అంటే అణచివేతే అని అర్థం. ఆ సమాజపు నోరుమూయించడం అన్నమాట. ఒక సమాజం దానిది కాని మాటలు, దానివి కాని అనుభ వాలు వల్లిస్తుందంటే అది ఉక్కుపాదం కింద నలిగి పోతున్నట్టే.

ఒక సమాజం దాని స్వీయానుభవాన్ని, స్వీయాభివ్యక్తిని సృజనలో ఆవిష్కరించుకోలేకపోతుందంటే ఊడిగంలో మూలుగుతున్నట్టే. అసలు కొత్తవస్తువుకు చిరుగుల బొంతలాంటి పాత అభివ్యక్తిని ఎందుకు కట్టబెట్టాల్సి వచ్చింది? కళలో సంక్లిష్టతకు ఎక్కువ విలువ ఆపాదించ బడుతుంది. ఆ మాటకొస్తే ఎక్కడైనా సంక్లిష్టతకు ఎక్కువ విలువ ఉంటుంది. బంగారు ఆభరణాన్ని మెరుపుల పేటికలో భద్రం చేసినట్టు విలువైన విషయం అని తెలియడానికి విలువైన ఉడుపు అవసరమయ్యిది. పాత అభివ్యక్తి కొత్త తరానికి కొత్తగా, కష్టంగా క్లిష్టంగా ఉండటం సహజం. ఎందుకంటే పాత అభివ్యక్తికి అర్వాచీనసమాజం జన్మస్థానం కాదుకాబట్టి. పాత అభివ్యక్తికున్న ఈ సంక్లిష్టత లక్షణం వల్ల అర్వాచీన కవులు దీన్ని అర్వాచీన వస్తువుకు ఉడుపుగా వాడుకున్నారు.

అంతేకాదు పాత అభివ్యక్తికి అసహజం అయిన అర్వాచీన సమాజంలో సంక్లిష్టత సిద్ధిస్తుంది కాబట్టి. ఈ సంక్లిష్టత అర్వాచీన కవులకు ప్రతిష్టా సూచకం కావడం సహజం అయ్యింది.

పద్యాలలో అర్థంకాని మాటలలో చెప్పటం గొప్ప అని గణించబడింది. ఈ గొప్పకోసం పాండిత్యప్రకర్ష అవసర మయ్యింది. ఈ పాండిత్యంలో పడికవిత్వం మట్టికొట్టకు పోయింది. ఇదేమీ పట్టని కవులు సిగపట్లు పట్టారు గండ బెండూరాలే లక్ష్యం చేసుకున్నారు. ఈ భావనను ఢీకొట్టడా నికి గద్యం కవీనాం నికషం వదంతి అన్న నానుడివచ్చింది.

ప్రతిష్టా సూచకం అయిన ఈ పాత అభివ్యక్తి అర్వాచీన సమాజంలో ఇప్పటికీ కొనసాగుతుండటం మనకు తెలి సిందే.

అందుకే పద్యాలు, రాని వాళ్ళు ప్రతిభాహీనులుగా గణించబడుతున్నారు. పద్యాలు అర్థం అయినా కాక పోయినా లయాత్మకంగా తలలూపుతూ ఉండే పండి తులు పద్యంలోని ఏవోకొన్నిమాటలు అర్థంకాకపోవడం పరువు నష్టంగా భావిస్తున్నారు.

పాత తొడుగులు, పాత మాటలు, పాత వ్యాకరణం పాండిత్యంగా చలామణిఅవుతున్నది. తొలి తెలుగు భాషా శాస్త్రవేత్త దీన్ని ఎప్పుడో ఎండగట్టాడనుకోండి.

పాత అభివ్యక్తి ప్రతిష్టా సూచకం ఎందుకయ్యిందంటే అర్వాచీన సమాజానికి అది అసహజ అభివ్యక్తికాబట్టి. ఈ అసహజత్వం దానికి సంక్లిష్టతను ఆపాదించిపెట్టింది. ఈ సంక్లిష్టత దానికి ప్రతిష్టా సూచకత్వాన్ని ఆపాదించపెట్టింది. అంతేకాదు సాంస్కృతికంగా ఎంతపాతదైతే అంత విలువ ఉంటుంది కాబట్టి పాత అభివ్యక్తికి ప్రతిష్టా సూచకత్వం అనేది ఈ సాంస్కృతిక విషయికంగా కూడా సిద్ధించింది.

మొత్తంమీద పాత అభివ్యక్తి కొత్త వస్తువుకు ఇలా బలవంతంగా అసహజంగా కట్టబెట్టబడింది అని సిద్ధాంతీకరించాం.

అయితే పాత వస్తువు పాత అభివ్యక్తిలో అర్వాచీన సమాజంలోకి ఎలా చొచ్చుకువచ్చింది; అది ఇప్పటికీ ఎలా కొనసాగగలుగుతుంది అన్నది మరొక ప్రశ్న. సంప్రదాయ వాదం వస్తుగతమైన కొన్ని మార్పులు చేర్పులతో పాత పద్యాలతో, పాత మాటలతో పాత వ్యాకరణంతో సమకాలీన భాషకు, అర్వాచీన సమాజానికి కొత్తగా వింతగా అసహజంగా నవ్య సంప్రదాయవాదం అన్న గుర్తింపుతో ఇప్పటికీ కొనసాగుతున్నది. ఎందుకంటే 'ఆధునిక'త జీర్ణం కాని 'వృద్ధ' తరం 'ప్రగతి' మింగుడుపడక, గతమే మేలు అన్న గుడ్డి విశ్వాసంతో ప్రతిష్ట పీఠాలు కదలిపోతున్నాయన్న భ్రమల్లోంచి సృష్టిస్తున్న 'మూగరాతల్లా' విమర్శకులు దీన్ని తీర్మానిస్తారు.

అంతేకాదు ఈ (నవ్య సంప్రదాయవాదం) పాత వస్తువు కొత్త అభివ్యక్తిలో అర్వాచీన సమాజంలో కనిపిస్తుంది కూడా అంటే ఇది 'పాత అభివ్యక్తి' మోజు వదలించుకుని పాత వస్తువును అర్వాచీన సమాజానికి అంటగట్టేందుకు కంకణం కట్టుకుందన్నమాట. అయితే ఇది మరీ ప్రమాదం. పాత వస్తువు పాత అభివ్యక్తిలో ఉంటే పేచీలేదు ఎందుకంటే అది అర్వాచీన సమాజాన్ని ప్రభావితం చేసే అవకాశం చాలా స్వల్పం.

ఆకలి, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వాలకు భిన్నంగా రాజులు, రంభల్ని, దేవుళ్ళ మహిమల్ని ఏకరువు పెట్టే ఈ రాతలు సమాకాలీన భాషలో ఉండటం ప్రగతి నిరోధక శక్తుల్ని ప్రేరేపించడానికే అని సిద్ధాంతీకరించవచ్చు.

ఇలా కొత్త వస్తువు - పాత అభివ్యక్తి, పాత వస్తువు - పాత అభివ్యక్తి పాత వస్తువు - కొత్త అభివ్యక్తి, కొత్త వస్తువు - కొత్త అభివ్యక్తి లలో సర్వోత్తమం చివరిదే అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

లయతప్ప లోనారసి చూడలేని వాళ్ళు, పద్యాలు రాని వాళ్ళు పద్యాల మోజుచావని వాళ్ళు, పద్యాలు అభివ్యక్తి పరమైన సాంస్కృతిక సంపదగా భావించడంతో సరిపెట్టకుండా అవి కొనసాగించబడాలని కోరుకునే వాళ్ళు. పద్యాలు ప్రతిష్టాసూచికలుగా నమ్మేవాళ్ళు 'కొత్త వస్తువు - పాత అభివ్యక్తి' ని సమర్థిస్తారు, స్తుతిస్తారు. కాని కొత్త వస్తువు - పాత అభివ్యక్తిలో రాణించలేదు. రణరంగంలో అది ఒక కుంటి గుర్రంగా జమచట్టబడుతుంది.

'కొత్తవస్తువు - కొత్త అభివ్యక్తి'లో మంటలు మాట్లాడతాయి. రక్తం జ్వాలా గీతం ఆలపిస్తుంది. కన్నీళ్ళు మార్దవంగా పలకరిస్తాయి. క్రోధం నిప్పులు చెరుగుతుంది. పిట్ట మాతృభాషలా పలకరిస్తుంది. సహజవస్తువుకు సహజాభివ్యక్తి అన్నది ఇక్కడ పరిపూర్ణం అవుతుంది. సంక్లిష్టత, ప్రతిష్టాసూచికత్వం పేర్లతో అసహజత్వానికి చోటు కల్పించకూడదు. చోటు కల్పిస్తే ఏమవుతుంది కుంటెద్దుకు, మంచెద్దుకు ఒకే కాడి కట్టినట్టవుతుంది.

వస్తువుకు సరిపడని అభివ్యక్తి చిలకపలుకుల్లాంటిది. జీవంతొణికిసలాడదు. ఉజ్జీవం రేకెత్తించలేదు. ప్రతిష్ట కోసమో, సంక్లిష్టతకోసమో చేసే అసహజప్రయోగంగా మిగిలిపోతుంది.

ప్రస్తుతానికి అసహజం అయిన పాతకాలపు వస్తు, అభివ్యక్తులు భాషను, భావాన్ని, సజీవంగా ప్రకటించలేక పోతాయి. సమస్య అయినా సామరస్యమయినా సీమా సమయాల నిబద్ధంకాబట్టి ఎవరి గొంతుకను వాళ్ళు సవరించుకోవలసిందే!

పాత కాలపు అభివ్యక్తి సమకాలీనతకు పనికిరాదు. పాతకాలపు వస్తువు అర్వాచీనతకు అసలే పనికిరాదు. ఇలాంటి వైరుధ్యం ముక్కుకి ముక్కు పుడకకాకుండా వడ్డాణం పెట్టినట్టు అసహజంగా ఉంటుంది.

మరి అభివ్యక్తిగా, వస్తువుగా పనికిరాని పాతకాలపు కళాసంపదను ఒక సాంస్కృతిక వైభవ చిహ్నంగా గుర్తించడం మాత్రమే చేయాలి తప్ప దాన్ని వర్తమానంలోకి నెత్తికెక్కించుకుని మోసుకురాకూడదు అన్నది ఇక్కడ సైద్ధాంతిక చర్చ. అలా నెత్తికెక్కించుకుంటే అరిష్టం, అపసవ్యం, ప్రజ్ఞాహీనత, నిష్క్రియాశీలత అని చెప్పడం ఉద్దేశం.

పాత వస్తువును కాకపోయినా పాత అభివ్యక్తిని అదీ యథాతథంగా కాకుండా దాన్ని కొత్తసృజనకు పునాదిగా చేసుకోవాలన్నది మరొక వాదం. ఇది మధ్యేమార్గంగా చలామణీ అవుతున్నది.

కొత్త భూమి కొత్త ఆకాశం కొత్త వస్తువు కొత్త అభివ్యక్తి. పాతవి గతిస్తాయి. నూత్న సృష్టి, నూత్న సృజన ఆవిష్కారం అయ్యేటపుడు ఈ రీసైకిలింగ్ ప్రోసెస్' ఎందుకన్నది ఒకధిక్కారస్వరంగా కనిపిస్తుంది కాని కొత్త కళాఖండ తయారీకి పాతముడిసరకుతో పనిలేనప్పుడు ఈ రీసైకిలింగ్ దండగమారి వ్యవహారం ఎందుకన్నది ఒక బలమైన ప్రశ్న.

అయినా కళకు భూమిక కావలసింది సమకాలీన దేశంకాని సనాతన కోశం కాదు. కళ సమకాలీన సమాజాన్ని పునాదిగా చేసుకుని ఉద్భవిస్తుంది కాని తాతలు నేతులు తాగారన్న వైభవాల వల్లింపులమీదకాదు. ఈ వల్లింపుల వల్లఒరిగేదేం ఉండదు. బాధకైనా భావుకతకైనా, సవాలు కయినా, సమాధానానికయినా సమకాలీనతే పునాది అవ్వాలి. లేకపోత గీతయినా రాతయినా రాగమయినా, తాళమయినా కురూపంగా కర్ణకఠోరంగా ఉంటుంది.

అయినప్పటికీ ఈ అసహజవస్తు అభివ్యక్తులు సమకాలీనతలో ఎందుకు ఇంత పలుకుబడి గడిస్తున్నాయి అన్నది ఒకప్రశ్న. సమకాలీనతలో ఆధునికతను త్రోసి రాజని కొన్ని అప్రజాస్వామ్య ప్యూడల్‌శక్తులు వీటి ప్రతిష్టకు కాపలాదారులుగా నిలబడ్డాయి. వీటిని సమూలంగా తుడిచిపెట్టడానికి గిడుగులు, గురజాడలు దిగి రావాల్సిందే.

తెలుగే అయినా పాత కాలపు భాష పరాయి భాష అయినప్పుడు, బూజుపట్టిన పాత భావజాలం వారసత్వానికి ప్రతిబంధకంగా పరిణమించినపుడు కళ చరిత్రగా ఏంపనికొస్తుంది. సాంస్కృతిక వైభవ చిహ్నంగా మ్యూజియంలో మౌనంగా కూర్చోవడంతప్ప.

అంటే గత సాహిత్యం చరిత్ర అధ్యయనాంశంగా నిరుపయోగం అవుతుంది. సమకాలీన కళకు సమకాలీన వస్తువు, సమకాలీన అభివ్యక్తి చక్కగా అమరినట్టు సరిపోతాయి. నది దాని ఉధృతినిబట్టి దాని నడకను, ఆకారాన్ని పరిమాణాన్ని దానికదే ఏర్పరచుకున్నట్టు కొత్తవస్తువు కొత్త అభివ్యక్తిని దానికదే దానికి తగిన దాన్ని రూపొందించుకుంటుంది. మరిపాత కళాసామగ్రితో కొత్త కళకు అసలు సంబంధం ఉండదు.

చరిత్రను పరిపాలన, సామాజిక, రాజకీయ ఆర్థికాది దృక్కోణాల్లో జ్ఞాన భాండాగారంగా చూస్తాం. సాంస్కృతికంగా గత వైభవ చిహ్నాల పేటికగా భావిస్తాం. పాలనాది రంగాల్లో దిద్దుబాట్లు అవసరం. అయితే కళకు సంబంధించి తప్పొప్పులు ఉండవు. కళ ఎంతవస్తుగతమో అంతే వ్యక్తిగతం. ఈ వైయక్తిక వ్యవహారంలో కళకు సంబంధించి వ్యుత్పత్తికయినా, అభ్యాసానికైనా సమకాలీనతే పునాది. అది పునాదిగాలేని కళ సజీవంకాజాలదు.

సజీవకళకు సమకాలీనతలోంచి జన్మించిన సజీవ వస్తువు, సజీవ అభివ్యక్తి ముడి సరుకు, కళాసామాగ్రి కాగలుగుతాయికాని, అపరిచిత సమాజంలోంచి జనించిన పరాయి వస్తువు, కిరాయి అభివ్యక్తి ఉపబలకాలు కాజాలవు.

సజీవతకు సమకాలీనతే ఉనికి పట్టు అయినప్పుడు నవనవోన్మేష ప్రతిభాశాలి అయిన కళాకారుడికి అరవు తెచ్చుకున్న ఎరువు సామాగ్రి గుదిబండే అవుతుది. అపారే కావ్య సంసారే కవి రేవ ప్రజాపతి, అన్నప్పుడు విధాత సృజనకు కొట్టివేతలు దిద్దుబాట్లు పనికిరావు. కళాకారుడు తన ఇచ్ఛచొప్పున తన అభీష్టాన్ని సృజనలో ప్రతిఫలింప జేస్తాడు. కళాకారుడు సహజంగా (ఎడిటింగ్) సవరణకు సమ్మతించడు.

సామాన్యంగా దిద్దుబాట్లకు గురువుగా చరిత్ర పనికొస్తుందికాని దిద్దుబాట్ల అవసరంలేని 'కళ'కు చరిత్రతో పనిలేదు. అంటే కళకు అయినా కళలో భాగం అయిన సాహిత్యానికయినా, దాని చరిత్రతో పనిలేదు. దాని రూపు రేఖల్ని సారభూతాన్ని అత్యంత ప్రభావశీలతతో సమకాలీనత సమకూర్చుతుంది.

**ఉపసంహారం :**

కామశాస్త్రం చదవకపోతే కామకేళి పట్టువడదా?

అన్నట్టు పిట్టకు గూడు కట్టడం సహజప్రవృత్తి అయినట్టు అభిరుచి సృజనకు కొత్త కవాటాలు తెరుస్తుంది. కాబట్టి సమకాలీనతలోంచి జనించే సమకాలీన కళకు సనాతనతతోపనిలేదు. పైగా అలాంటి వ్యాసంగం పనికి మాలిన దండగ మారి వ్యాసంగం అన్న దిక్కడ సైద్ధాంతిక చర్చ. లోకోత్తర రసానుభూతిని వెదికే సహృదయుడికి తప్ప స్రష్టకు కళాచరిత్రతో పనిలేదు, సమకాలీన కళతోతప్ప.

**కీలక పదాలు :**

సమకాలీనత, సనాతనత, అర్వాచీనత, వస్తువు, అభివ్యక్తి, సంక్లిష్టత, ప్రతిష్టాసూచకత్వం. వస్తుగతం, వ్యక్తిగతం. ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం, దిద్దుబాట్లు చరిత్ర.

**ఆధార గ్రంథాలు :**

1) రసమయి - సంజీవ్‌దేవ్

2) కాంతిమయి - సంజీవ్‌దేవ్

3) ఒక వస్తువు భిన్న సందర్భాలు - డా॥ పి.ఎ. సత్యనారాయణ

4) సాహిత్య సమీక్ష - ఆచార్య జి. నాగయ్య

5) ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం - ఆచార్య కొలకలూరి ఇనాక్

# జానపద సాహిత్యంలో పంబకథ తెలుగు నుడికారం

- **కొమ్మలపాటి శ్రీనివాసరావు,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

తెలుగులో కావ్యభాష నన్నయ నుంచి ప్రారంభమై ఉండవచ్చు. లేదా మరో ఒకటి రెండు శతాబ్దాల ముందు నుంచి కావ్యభాష రూపొందింపబడి ఉండవచ్చు. కాని జానపదుల భాషకు మాత్రం సుమారు రెండువేల సంవత్స రాల చరిత్ర ఉంది. తెలుగు శాసనాలు 6వ శతాబ్దం నుంచి కనిపించవచ్చును గాక, వ్యవహారంలో మాత్రం తెలుగుభాష క్రీస్తు పూర్వం నుంచే ఉండేదనడానికి అనేక ఆధారాలున్నాయి. క్రీస్తు పూర్వం నుంచి తెలుగు స్వరూపాన్ని శాస్త్రీయంగా నిరూపించే ప్రయత్నాలు జరి గాయి.

తెలుగు భాషలో తెలుగుదనపు మాధుర్యాన్ని తెలుసు కోవాలంటే మనకు సహాయపడేది ప్రాచీన గ్రంథాలు కావు. మౌఖిక జానపదమే అందుకు సహాయకారి. తెలుగంటే చిన్న చూపుండే పండితులు మాత్రం తెలుగు పదాలలో సత్వం లేదని, ఉత్తమ కావ్యరచనకు తగిన శక్తి తెలుగుకు లేదని చెప్తారు. సంస్కృతమే భాషలన్నిటికీ తల్లి అని నమ్మే పండితులు కూడా కొందరు ఈనాటికీ ఉన్నారు. ఆంధ్ర భాషా భూషణాన్ని వ్రాసిన కేతన గారు తెలుగు ఆవశ్యకత, ప్రాచీనతను సుమారు ఏడు శతాబ్దాల క్రితమే గుర్తించారు. అందులో "తల్లి సంస్కృతంబె యెల్ల భాషలకును, దాని వలన గొంతగానబడియె కొంత తాన కలిగె నంతయు నేకమై తెనుగు బాస నాగ వినుతికెక్కె" అని తెలుగుకూ తనది అని చెప్పుకోగలిగింది కొంత ఉం దనే విషయాన్ని చెప్పాడు.

తెలుగు భాషలోని దేశ్యభాగం జానపద భాషకు ఆయువు పట్టు. తరతరాల నుంచి తెలుగు భాషకు జీవనాడిగా ఉండే దేశ్య పదాలు జానపద భాషకు మూల స్తంభాలు. ఈ పదాలు సంస్కృతం నుంచో, ప్రాకృతం నుంచో ఎరవు తెచ్చుకున్న సొమ్ములు కావు. వందలకొద్దీ సంవత్సరాల నుంచి తెలుగు వారి నాలుకల పైన నాట్యమాడే పదాలవి.

ప్రాచీనకాలం నుంచి తెలుగు భాష ఏ విధంగా వికాసం చెందిందనే విషయాన్ని తెలుసుకోవాలంటే పండి తుల కావ్యాలకంటె శాసనాలు, తరతరాల నుంచి మౌఖికంగా బ్రతుకుతూ వచ్చిన జానపద సాహిత్యం, దేశి సాహిత్య విభాగానికి చెందిన ప్రక్రియలు దోహదం చేస్తాయి. జానపదుల భాష గలగలపారే జీవనది వంటిది.

## జాపపద నిరుక్తి (Folk etymology) :

జానపద నిరుక్తి అన్నది జానపదుల మనస్తత్వానికి అద్దం పడుతుంది. అర్థంకాని పదాలను కూడా జాన పదులు తమకు బాగా పరిచయం ఉండే వాటిలాగా మార్చుకుంటారు. జానపదులు ఒక పదానికుండే అర్థం గాని, అక్షరాలు గాని సరిగ్గా అర్థం కాకుంటే ఆ పదాన్ని మరోవిధంగా మార్చుకోవడమో లేక ఎక్కువ పదాలుగా చేయడమో చేస్తారు. వీటివల్ల ఒక్కొక్క భాషలోని పద సంపద పెరుగుతుంది.

జానపద సాహిత్యంలో సహజంగానే నానుడులు, పలుకుబళ్ళు, సామెతలు, అసంఖ్యాకంగా కనిపిస్తాయి. నిజమైన జీవద్భాష స్వరూపం తెలుసుకోవాలంటే ఇవే శరణ్యం. ఇలా చెప్పుకుంటూపోతే తెలుగువారి లోగిళ్ళలో నిత్యకృత్యంగా సందర్భానుసారం పాడుకునే గేయాలు, పనిపాటలు, పారమార్థిక గేయాలు, బాంధవ్య గీతాలు, పిల్లల పాటలు, వేడుక పాటలు, వలపు పాటలు, హాస్య గీతాలు, కన్నీటి పాటలు, కథాగేయాలు, వీరగాథలు, అద్భుతరస గేయాలు, వివిధ ఐతిహ్యాలు, గద్య కథ నాలు, సామెతలు, ఆమెతలు, పొడుపు కథలు, ఆలం కారిక పదాలు, నమ్మకాలు, గ్రామ దేవతారాధన, మతం, మంత్ర తంత్రాలు, పండుగలు, నోములు, జాతరలు, వ్రతాలు, ఉత్సవాలు, తిట్లు, ఒట్లు మొదలగు అసంఖ్యాక విషయాల్లో కమ్మని తెలుగు నుడికారపు సొంపు కని పిస్తుంది.

మౌఖిక సాహిత్య ప్రధాన లక్షణం భాష పరిణామ స్వరూపం ఎప్పటికప్పుడు మారుతుండడమే. జానపద పాట ప్రవాహశీలత కలిగినటువంటిది. గొప్ప భావ వ్యక్తీకరణ కలిగిన వ్యక్తి వృత్తి కథాగాయకుడైనప్పుడు తన పరిజ్ఞానాన్ని సందర్భోచితంగా కథాగానంలో చొప్పించి, ప్రేక్షకులను మంత్రముగ్దుల్ని చేసి, సమ్మోహనంగా మెప్పించే అవకాశం ఉంది. అనేక అనుభవాల కలనేతగా, ప్రత్యక్షానుభూతి కారణంగా అరిగి, తరిగి, విరిగి, పెరిగి ఆయా ప్రాంత అంశాలను, కథలను, మాండలికాన్ని, భావజాలాన్ని కలుపుకుని ఉత్తుంగ శిఖరాల నుండి కిందికి దూకి జలపాతమై కొండలు, గుట్టలు, లోయలను తాకుతూ ప్రవహించే నది వంటిది జానపద సాహిత్యం. కనుకనే ఎన్నో తరాలనుండి నిలిచి వెలుగుతున్నది. రాజరికపాలన అధికారాలతో సంబంధం లేకుండా, ఆచారాలు, సంప్రదాయాలు, నమ్మకాలు రూపంలో గ్రామీణ ప్రజలే పోషకులై అనేక కళలను ఆదరించారు. అవి సమాజంలో ఒక భాగమై బ్రతుకు పాటైంది. కర్ణుడి కవచకుండలాలవలె పుటకతో అబ్బిన ఆజన్మ జ్ఞాన పరంపర. జానపద సాహిత్య సాగరంలో అసంఖ్యాక మౌఖిక జ్ఞానాన్ని, అమూల్య భాషా సందపను కాపాడటమంటే మన అమ్మ భాషను కాపాడటమే.

జానపద జీవనంలో భాగంగా జానపద స్త్రీ దేవతలను కొలుపుల రూపంలో పూజిస్తుంటారు. ఆ సందర్భంగా ఆయా దేవర్లకు సంబంధించిన కథలను వృత్తి కథాగాయకులు అద్భుతంగా గానం చేస్తారు. ప్రకాశం జిల్లాలో మనుగడలో వున్న కళల్లో చెప్పుకోదగ్గది పంబకథ అనబడే జానపద కళారూపం. ముఖ్యంగా అంకమ్మ తల్లిని వివిధ రూపాల్లో గ్రామదేవరగా, ఇంటి దేవరగా అనేక జాతి ప్రజలు భేదం లేకుండా కొలుస్తుంటారు. ఆ కొలుపు సందర్భంగా పంబలవారు అమ్మవారి కథను గానం చేస్తారు. ఆ కథలోని అంశాలను పరిశీలిస్తే ద్విపద, మంజరీ ద్విపద, అంత్య ప్రాసలు దుఃఖ సాయలు, రగడలు పాడేటప్పుడు అందులో అంతర్గతంగా వున్న అద్భుతమైన పదజాల, ఆలంకారిక శైలి, నిగూఢ ప్రశ్నావళి, తత్త్వజ్ఞానం, అమ్మవారి మహిమలు, మారాస రాజుల చేష్టలు, చారిత్రక విశేషాలు మొదలగు అసంఖ్యాక అంశాలు దర్శనమిస్తాయి.

సిగినీమాంకాళి పట్నానికి అర్ధరాత్రి వెళ్ళి మారాస సోదరులు అమ్మవారి బోషాణం తీసుకొని పట్నం వెలుపలికి వచ్చి, అమ్మవారి మాయచేత అంధులై ఇలా దుఃఖిస్తున్నారు.

"గోడు గోడున గోడుగోడున
రాజులు గోమండలించి
ముచ్చమంత కన్నీరు ముఖమందు రాలి
పగడమంత కన్నీరు పలువరసగమ్మి"

మారాస రాజులు అమ్మవారి మహిమతో నివాస భవనాలు మహా గొప్పగా నిర్మించారు. అవి ఎలా ఉన్నవంటే "ఇంటింట ఒక వాయ ఈదినారి కడప గమళ్ళ నెన్నూరు కనక పట్నమేమి రాజాకి ద్వారణములు రత్తసివాసనములు మావిడాకు దోరణములు మన్నెవీదులాను తమలపాకు దోరణములు తల దోరణములు"

మదించిన మారాస రాజులు అంకమ్మ అమ్మవారిని కొట్టడానికి అనేక ఆయుధాలు ధరించి ఎలా సిద్దమయ్యారంటే

"కాశి మీదన కాశి హనుమంతు కాశి
ఆ కాశి మీదను పింజముల దండ
పింజముల దండమీద పెంచు కురియాలు
నిగనిగ మెరిసేటి నీలారి పోగులు
దగదగ మెరిసేటి ఆదండు కడియాలు
బిల్లల మొలతాడు బిగువైన బెట్టి
చేకత్రి బోణంబు చెంపనాబిల్ల
వాలియ రుమాల కడ వన్నెక జుట్టి
భూమికి మూరెడెత్తున దూది పావళి దొడిగి"

ఆ విధంగా సిద్దమై బంగారు పసిడి బెత్తములు తీసుకుని రాజులు కదిలి తనకోసమే వస్తున్నారని గ్రహిం చిన అమ్మవారు మంత్రం ఇలా పటిస్తున్నది.

"రామ కుండములుండేటి
రామ వీభూది దీసి

కభో మండములుండేటి తీర్థముదీసి
నారాయణ మంత్రము జదివి
నరసింహ మంత్రము జదివి
సత్తి యోగము జదివి
సామంత యోగము జదివి
అరవై నాలుగు మంత్రములు
ముప్పై నాలుగు చెట్టు కిరియలు
హోమ్మని డోంకారము పటించి''

గోరెడు విభూది తీసుకుని రాజులపై అట్లా వెదచల్లగా పరాక్రమంగా వచ్చే రాజులు మూర్ఛపోయారు. తర్వాత తిరిగి లేచి అమ్మవారిని కొట్టుకుంటూ శనేశ్వరుని చట్టు బండ వద్దకు తీసుకొచ్చే సందర్భం ముక్తపదగ్రస్త అలంకారంలో చెప్పబడింది.

''ఊరికి ఉత్తరాన ఒకమల్లెకాడు
కాటికి పరమట కొత్త ఒలికేమి
కొత్త ఒలికి కాడ మూడూళ్ళ కూడలి
మూడూళ్ళ కూడలి కాడ ఉయ్యాల గుంట
ఉయ్యాల గుంట కాడ సనివేశ్వర బండ''

రవద్దేవిరాజు చెల్లెలు శివగంటల మహద్దేవమ్మ తన మేనల్లుళ్ళను దేవగిరి పట్నానికి తీసుకొచ్చి ఎంచి, పెంచి, ఏడేళ్ళ బాలా కుమారులను చేసి, వారికి సాధనా గరిడీలు కట్టించింది. అవి ఎలా ఉన్నాయంటే

''వరయా ఘోర ఎత్తు కంచుగొన్నాది
కంచున గట్టిచ్చినాది పెంచునా గరిడి
పెంచున గట్టిచ్చినాది కంచునా గరిడి
మూడువేళ్ళకు దీర్చినాది ముద్దులా గరిడి
నాలుగు వేళ్ళకు దీర్చినాది నందులా గరిడి
పది వేళ్ళకు దీర్చినాది పచ్చలా గరిడి''

కథలో బాలమండాద్రిని పాలించిన మండవరాజు గురించి ఇలా వర్ణించబడింది.

''మూడు శిరసులు ఆరస్తములు గలిగినవాడు
సావూ పుటకలేని సాంబమూర్తి
భూమి గడగడ వణికి భూదేవుతలు బలికినా
మోకాలు ఒక జాము మోపగలిగిన వాడు
ఆకాశవేణి అల్లట్లాడి అంబోతు బలికినా
అరిసేయి ఒక జాము అపగలిగినవాడు''

రవద్దేవిరాజు సోదరి శివగంటల మహద్దేవమ్మ గురించి వివరిస్తూ ఆనాటి రాజకాంతల అంతఃపురం వైభవం ఇలా వర్ణించబడింది.

''తూరుపున ఒక మేడ సూర్యుండికి వెదురు
పరమట ఒక మేడ పరువుతానికి వెదురు
ఉత్తరాన ఒక మేడ ఉదియ కాశికి వెదురు
దచ్చినాన ఒక మేడ దనుము కోటికెదురు
నాలుగు మేడల సందు నవనందుల మేడ
నవనందుల మేడలోను ఒట్టికారుసైక
ఒట్టికారు సైకలోను చిత్తారుసైక
చిత్తారు సైకలోను సిరిబొమ్మటిల్లు
ఆ సిరిబొమ్మటింట్లో
నాలుగు కోళ్ళ పట్టెమంచం పాన్పుజేసుకోని
ఆ పానుపుల మీద దీనాపదిళ్ళు
దీనాపదిళ్ళు మీద బూర కంబళ్ళు
బూర కంబళ్ళ మీద రత్నకంబళ్ళు

ఇలా అవిరామంగా సాగే అంకమ్మ, ఎల్లమ్మ, గంగమ్మ పోలేరమ్మ, పెద్దమ్మ వంటి స్త్రీ దేవతల జానపద గాథల్లో మాతృస్వామిక వ్యవస్థ మూలాల ఆనవాళ్ళు ఉన్నవి. దీనిని కాపాడువారు పంబలవారు, బైనీడవారు, కొమ్ము వారు, ఆసాదివారు, వీరవిద్యావంతులు వంటి గాయక వృత్తి కళాకారులు. వీరంతా శక్తి ఆరాధకులు. వీరు ప్రదర్శించే మౌఖిక కథాగానంలోని పదాలు చాలా తెలుగు నిఘంటువులకు కూడా లొంగవు.

# ఉద్యమ గీతాలు - దళితాభ్యుదయం

- గూడూరి గ్లోరియానెట్, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

## గీత రచన - నేపథ్యం :

సాహిత్యంలో సమాహార కళయైన నాటక ప్రక్రియ గొప్పది. కవిత్వంలో గీతరచనకు అత్యంత ప్రాధాన్యం, ప్రాచుర్యం ఉంది. కారణం సంగీతంలో శ్రవ్యంగా ఆలపించేతత్వం గీతాలకు ఉండటమే. అయితే గీతాన్ని పాట, గేయం అని కూడా పిలుస్తున్నారు. ఈ మూడు సమానార్థకాలుగానే చలామణీ అవుతున్నాయి. 'గీయత ఇతిగీతం' గురుబాల ప్రబోధిక అనే అమరకోసం చెబుతుంది. దీనిని బట్టి గేయం, గీతం సమానార్థకాలుగా కనిపిస్తుంది. గానయోగ్యమైన రచన గేయం. సంగీత సాహిత్యాల సమ్మక్ మిళితమైన గేయకవిత్వం ఆ పాత మధురమేకాదు ఆలోచనామృతం కూడా. గీతం సంగీతాన్ని సమకూర్చి పాడుకోవడం వల్ల పాఠకుణ్ణి గట్టిగా ఆకట్టు కుంటుంది. ఆటపాటలకు, పనిపాటలకు మధ్య ఒక చారిత్రక పరిణామక్రమం ఉంది. ఆటపాటల్లో ఆట ఉంటుంది. పనిపాటల్లో పనే ఉంటుంది. అయితే వీటిల్లో దృక్పథ ప్రాధాన్యం గల పాటల సామాజిక ప్రయోజనాన్ని కూడా కాంక్షిస్తూ ఉంటాయి. జాతీయోద్యమ గీతాలు, స్వాతంత్ర్యోద్యమ గీతాలు, ఆంధ్రోద్యమ గీతాలు, తెలంగాణ పోరాట గీతాలు, వామపక్ష గీతాలు, స్త్రీవాద గీతాలు లాంటి అనేకం తెలుగు సాహిత్యంలో చోటు చేసుకున్నాయి.

తెలుగు సాహిత్యంలో గీత రచన ప్రాధాన్యాన్ని గూర్చి వివరిస్తూ "ఉద్యమకాలంలో మిగతా సాహిత్యం ప్రక్రియల కన్నా గీతంపై చేయిని సాధిస్తుందనే అంశం వేరు వేరు ఉద్యమాల్లో వెలువడిన గీతాల్ని బట్టి ఋజు వైంది. అలాగే కవిత్వం జనంలోని వెళుతుందనటానికి కూడా గీతం ఒక ఉదాహరణగా నిలుస్తున్నది. అలాగే, జానపద కళారూపాలైన బుర్రకథ, ఒగ్గుకథ, హరికథ, కోలాటం మొదలైన వాటిల్లోనూ నాటిక, నాటకాల్లోనూ సంగీతం నృత్య రూపాల్లోనూ, గీతం అంతర్వాణిగా ఉంటుంది" అని యస్.పి. సత్యనారాయణ అన్నారు.

ఈ విధంగా జానపద సాహిత్యం నుండి నేటి వరకు గీతం సమాజంపై విస్తృతమైన ప్రభావాన్ని చూపిస్తూనే ఉంది. ఆధునిక సాహిత్య ఉద్యమాలన్నింటిలో ప్రముఖ పాత్ర వహించిన గీతరచన దళిత సాహిత్యంలోనూ తన విశ్వరూపాన్ని కనబరిచింది. సంఘ సంస్కరణాభిలాషలో అన్ని వర్గాలకు చెందిన కవులు దళితాభ్యుదయం కోసం గీత రచనను ఒక సాధనంగా ఎన్నుకోవడం ఆనందాన్ని, ఆసక్తిని కనబరిచే విషయం.

ఆధునిక కాలంలో దళిత సంబంధమైన ఇతివృత్తం వచ్చిన సాహిత్యంలో ప్రప్రథమంగా పేర్కొవలసింది. 1909 సం॥లో 'ఆంధ్రభారతి' మాస పత్రికలో వెలువడిన 'మూలవాంఢ్ర పాట' ముద్రిత రూపంలో దొరికిన ఈ పాట ఆకస్మాత్తుగా ఊడిపడలేదు అని అటువంటిది సేకరణకు, ముద్రణకు నోచుకోక కోకొల్లలుగా ఉం టాయని భావించవచ్చు. అయితే ఈ పాట ఆధునికాంధ్ర సాహిత్యంలో దళిత సమస్యల పట్ల మొదటిసారి దృష్టిసారించిందని పేర్కొనవచ్చు. ఈ పాట అజ్ఞాత కర్తృత్వం.

"అందారు పుట్టిరి హిందమ్మ తల్లికి
అందారు ఒక్కరై ఉండాలి సక్కంగ
కష్టమ్ము లొచ్చిన నిష్ఠూరమొచ్చిన
ఇష్టముగా నుండి కట్టుగా నుందాము
ఎట్టగు ఎక్కువ యేరైన మాకంటే
వర్గాలు ఎక్కువ పుట్టంగ లేదయ
మమ్మేల క్రిందికి కుమ్మేరు మావోరు"

దళితుల సాంఘిక స్థాయికి దగ్గరగా ఉండే భాష, వాళ్ళ కష్టాల పట్ల ఆవేదన, మానవ సంఘం పట్ల ఆలోచన, దళితుల్లోని లోపాల్ని సంవరించాలనే దృష్టి ఈ పాటలో కనిపిస్తుంది. కండగతిలో సాగిన ఈ గేయం దళిత ప్రగతిని కాంక్షించేదిగా ఉంది. అయితే హిందూ

మతానికి బలం చేకూర్చడానికి, క్రైస్తవమతంలోనికి వలస వెళ్ళిన దళితుల్ని హిందూ మంతంలోకి తిరిగి ఆహ్వానించ డానికి ఆంగ్ల తెలుగు నేర్చుకోవాలనే భావన కూడా ఈ పాటలో వ్యక్తమౌతుంది. కాబట్టి ఇది దళిత పురోగమనాన్నే కాక, తిరోగమనాన్ని కూడా సూచిస్తుందని కొందరు భావిస్తున్నారు.

గురజాడ అప్పారావు రాసిన 'ముత్యాల సరాలు' 1910వ సం॥లో 'ఆంధ్ర భారతి'లో వెలువడింది. ఈ కవితలో కవిత దళిత సాహిత్యానికి మార్గదర్శకమైనది చెప్పవచ్చు. పట్టణాలలో జాతులన్నీ ఒక్కటేనని సంఘసంస్కర్తలు సంఘ సమానత్వానికి తొలమెట్టుగా సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారని తన భార్యతో చెప్పాడు.

"మొన్న పట్టణమందు యిదియని
పెట్టినారొక విందు జాతుల
పెట్టినారొక విందు జాతుల
జేర్చి వినవైతో..."

దీంతో ఆయన భార్య సహపంక్తి భోజనాన్ని నిర సిస్తుంది, కలిసి మెలిసి ఉన్నంత మాత్రాన ఐకమత్యం కలదని అంటుంది. 'మాల, మాదిగ కన్య నెవతనో మరలు కొనరాదో?' అని మూతి ముడుచుకుంటుంది. గురజాడ అన్ని వర్ణాలు సమానంగా ఉండాలని ఆకాంక్షించారు. కానీ, ఆయన భార్య జవాబుగా వర్ణాంతర వివాహం చేసుకోవచ్చుగా? అనే నిరసన ధ్వనించే విధంగా మాట్లాడిం చారు.

వర్ణాంతర వివాహాల్లో వర్ణ సమానత్వానికి అనే విషయాన్ని ప్రతిపాదించారు. 'ఎల్లలోకము ఒక్క ఇల్లై వర్ణ బేధము లెల్ల కల్లై' ఉండాలని కవి ఆశించాడు. వర్ణాంతర వివాహాలు ప్రతిపాదించిన గురజాడ 1911వ సం॥లో 'లవణరాజు కల' అనే కథా గేయంలో ఆచరణలో చూపిం చాడు.

అస్పృశ్యతను పాటించే హృదయమాలిన్యం గలవాడి ప్రవర్తనలో అధర్మాన్ని అహేతుకత్వాన్ని ఈ కథాగేయంలో సందర్భానుసారంగా ఎత్తిచూపుతూ -

"మలిన దేహులు మాలలనుచు
మలన చిత్తులు కథిక కులములు
నెల వొసొంగిన వర్ణధర్మమ
ధర్మ ధర్మంబె"

సత్యాసత్యాలు దాచిపెట్టి మానవుడు కుల వ్యవస్థను పెంచి పోషిస్తున్నారని మనుష్యుల్లో మంచి చెడులు అనేవి రెండే కులాలని గురజాడ బోధించాడు. మాలవానిని మంచిగా ఉండాలని అభ్యుదయాన్ని కాంక్షించే తాను వారిలో ఒకడనని వర్ణధర్మానికి నూతన భాష్యం చెప్పాడు.

"మంచెచెడ్డలు మనుష్యులందున
నెంచిచూడగ రెండే కులములు
మంచియన్నది మాల యైతే
మాలనే అగుదున్"

మాలెత తండ్రి చేత సమాజాన్ని నిలదీయించి ప్రశ్నింప జేశాడు గురజాడ. మలి వృత్తులు మానితే మాకు అంటు పోతుంది. కానీ, మలిన బుద్ధులు సవర్ణులకు పోతాయా? కాకపోతే సవర్ణులే అస్పృశ్యులైతారని చురక వేశాడు గురజాడ. ఈ గేయం ద్వారా హృదయ మాలిన్యం తొల గించుకోవాలని సవర్ణులకు పిలుపునిస్తూ దళితాభ్యుద యానికి అందరూ కలిసి కృషి చేయాలని ఆధునిక ఆంధ్ర దళిత సాహిత్యానికి మార్గదర్శకుడయ్యాడు.

గరిమెళ్ళ సత్యనారాయణ, గిడుగు రామ్మూర్తి పంతులు వ్యవహారిక భాషోద్యమానికి ప్రభావితులై వాడుక తెలుగు పట్ల అభిమానాన్ని పెంచుకొని అందులోనే రచనలు చేయడం ప్రారంభించారు. జానపద బాణీల్లో పాటలు వెలువరించిన గరిమెళ్ళ వ్యవహారికాన్ని అభి మానించడంలో ఆశ్చర్యం లేదు. 1915వ సం॥లో 'వాడుక తెలుగు' అనే 80 చరణాలు గల దీర్ఘగేయాన్ని కృష్ణా పత్రికలో ప్రచురించాడు. ఈ స్మృతి గీతమే గరిమెళ్ళ వారి లేఖిని నుండి వెలువడిన మొదటి రచన అని చెప్పవచ్చు. 1921వ సం॥లో స్వరాజ్య గీతాలు మొదటి భాగంలో 'పంచములు (అనే గీతాన్ని వ్రాసే దళితుల పక్షాన వకాల్తా తీసుకొని అస్పృశ్యుల్ని ఆదరించాలని వారు చేసే వృత్తుల్ని, పనుల్ని సహృదయంతో అర్థం చేసుకొని వారిపట్ల న్యూనతాభావాన్ని ప్రదర్శించకూడదని సవర్ణ హిందువుల్ని

అభ్యర్థించాడు.

"అన్నలారా వినుడి మన - యఘం యొక్కటి గనుగొనుడి మన
చిన్ని తమ్ములను జేరదేసి దయం - చేసి మహాదరమడుడి ॥ అన్నలారా ॥
పంచమహాపాతకముల సమముర - పంచములగుచు వచించి
పంచ భాగముల నొకటగు హైందవ - ప్రజలను దూషణ నేత ॥ అన్నలారా ॥
వేదశాస్త్రములు ధర్మ శాస్త్రములు - వేయి విధంబుల ఉన్మాదత వీడి యెల్లరును నొకుటను - మాన్య సూత్రమును నెరుగు" ॥ అన్నలారా ॥

అంటూ జంతుజాలంపైన కరుణ జూపించే మానవుడు సాటి మనిషిని అసహ్యంచుకోవడం అవమానాలకు గురిచెయ్యడం అనుచితమని వివరించారు. సర్వ మానవులు సోదరభావంతో మెలగాలని సర్వేవ్వరుడు ఆ రకమైన సమతాభావాన్ని అందరికీ ఇవ్వాలనే ఆశాభావాన్ని ఈ గీతంలో పేర్కొన్నాడు. అంతేకాక, వీరు 1921వ సం॥లో స్వరాజ్య గీతాలు మొదటి భాగం, 1922 సం॥లో స్వరాజ్య గీతాలు 2వ భాగం, 1926వ సం॥లో నూతన జాతీయ గీతాలు, 1933వ సం॥లో హరిజన పాటలు మొదలైన ఎన్నో గీతాలు రాశారు.

దళితుల అభ్యున్నతి కోసం సాహితీ సృష్టి గావించిన వారినే కాక, సాంఘికంగా తోడ్పడిన సవర్ణ హిందువుల సంస్కరణాభిలాషను అభినందిస్తూ ఐదు చరణాల్ని వ్రాశారు. ఆ చరణాల్లో ప్రస్తుతించబడిన వారిలో కందుకూరి, గురజాడ, చిలకమర్తి, మంగిపూడి వెంకటశర్మ, భాగ్యరెడ్డి వర్మ, మాడపాటి హనుమంతరావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య మొదలైన అనేకమంది ఉన్నారు.

కొండపల్లి జగన్నాధరావు 1921వ సం॥లో 'స్వరాజ్య నవనీతం' అనే శీర్షికలో దళితాభ్యుదయాన్ని, దేశభక్తిని ప్రభోదిస్తూ కీర్తనల్ని వ్రాశాడు. వీటిలో మేలుకొలుపు అనే గీతం మిక్కిలి ప్రాచుర్యం పొంది వీరికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది.

"మేలుకొనరా మాలవాడా! మేలుకొనరరా మాలోవాడా
మేలుకొనవేరా! సోదరా
మేరుకొనుటకు వేళలెమ్మిక! మేలుకొనుమిక మేలు
మేలుకొనుమిక! చాలు చాలును నిదుర మానుమురా! సోదరా
పాచి మొగమును కడుగు కొనుమిక, నీచవనో
త్తుల మానుకొను మిక! బూచి వాడనిపించు కొనకుమురా! సోదరా
బూత మాటల నాడ బోకుము! నితిగాదది
మానవునకును! జాతిగౌరవమెంచుకొనవేరా సోదరా!"

అంటూ పరిశుభ్రతతను అంటగట్టి అస్పృశ్యుడిగా చూస్తున్నారో దాని విషయంలో జీవన విధానాన్ని మార్చుకొని శుచిశుభ్రతలు పాటిస్తూ బూతులు మాట్లడకుండా గొడ్డుమండసం భుజించకుండా ఉండాలని హితవు పలికాడు. మాల మాదిగలు హిందు మతంలో అన్యులు కారని, అంతర్భాగమేనని పేర్కొన్నాడు.

**ముగింపు :**

ఈ విధంగా మారుతున్న కాలానికి అనుగుణంగా తెలుగు సాహిత్యం విస్తృతపరచుకుని దళితుల సాహిత్యం కొత్తపుంతలు తొక్కింది. భూస్వామ్య, రాచరిక వ్యవస్థలో సామాన్యులపైన, వృత్తికారులపైన, శ్రమజీవులపైన గ్రామీణ భూస్వామ్య రాజకీయార్థిక పెత్తందారీతనాన్ని ప్రశ్నించడానికి, ధిక్కరించడానికి సరికొత్త ఊపిరి పోసి చైతన్యాన్ని తీసుకువచ్చింది దళితాభ్యుదయం.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగులో ఉద్యమ గీతాలు - యస్.పి. సత్యనారాయణ పుట - 441
2. దళిత గీతాలు - 'మాలవాంఢ్రపాట' - అజ్ఞాత కర్తృత్వం పుట - 3
3. గురజాడ రచనలు - గురజాడ అప్పారావు పుట - 6
4. దళిత గీతాలు - గరిమెళ్ళ సత్యనారాయణ పుట - 6
5. దళిత గీతాలు - కొండపల్లి జగన్నాధరావు పుట - 7

BHAVAVEENA
Vol. 17, Issue. 1(2), January - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# రాయలసీమ గిరిజన మూలికా వైద్యం

**- యం. శోభారాణి,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ రెండు ప్రాంతాలలో గిరిజనులున్నారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలయిన కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలో గిరిజనులున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 35 తెగలలో దాదాపు 24 తెగల గిరిజనులు రాయలసీమలో ఉన్నారు. రాయలసీమలో ఎక్కువగా సుగాలీ, ఎరుకలు, యానాదులు ఉన్నారు. మిగతా తెగలు స్వల్పంగా ఉన్నారు.

సమస్త ప్రాణకోటికి జీవనాధారం ప్రకృతి. మానవ మనుగడకు వృక్షాలే మూలాధారం. మానవుని శ్వాసకు చెట్లు ఉపయోగపడటమే గాక, మనిషికి కలిగే వివిధ రకాల వ్యాధులు తొలగించడానికి ఔషధాలుగా ఉప కరిస్తాయి. నాగరికత అభివృద్ధి చెందుతున్న క్రమంలో మనిషి ప్రకృతిని విస్మరించి, ప్రకృతికి హాని కల్గిస్తున్నాడు. (నాటువైద్యాలను) మూలికావైద్యాన్ని వాడటం తగ్గిస్తు న్నాడు. అయితే గిరిజనులు ప్రకృతిని ఆరాధ్యదైవంగా భావిస్తున్నారు. ప్రకృతి వనరులను వినియోగించి మూలికా వైద్యం చేస్తున్నారు. నవనాగరికతలోను ఇంగ్లీష్ మందు లను వాడకుండా, మూలికావైద్యాన్ని నమ్ముతున్నారు. గిరిజనులలో కొంతమందికి మూలికా వైద్యంలో నైపుణ్యం ఉంది.

## వివిధ వ్యాధులకు గిరిజనులు చేసే మూలికా వైద్యం :

కామెర్ల వ్యాధి, అజీర్ణనానికి నేల ఉసిరికమొక్క రసం తీసి, అరగ్లాసు రసాన్ని, అరగ్లాసు మజ్జిగతో పరగడుపున మూడు రోజులు తీసుకొంటే ఫలితాన్ని ఇస్తుందని గిరిజనుల నమ్మకం. ఇది అందుబాటులో లేకపోతే ఆముదం ఆకు చిగుర్లు, 10 మిరియాలను నూరి గోళిగా చేసి మింగిన కామెర్లు రాకుండా ఉంటాయి. సాధా రణంగా వచ్చే జలుబు, దగ్గు, జ్వరాలు రాకుండా ఉండటానికి ఉసిరి, నిమ్మ, పిల్లపెసర, తక్కలి, తెల్లిఉ ప్పి, నేరేడు, కరక మొదలైన మొక్కల వేరుతో కషాయం చేసుకొని తాగుతారు. షుగరు వ్యాధికి అల్లనేరేడుపిక్క, మారేడు, ఇండువవేరు సమంగా తీసుకొని చూర్ణం తయారు చేస్తారు. ఈ చూర్ణాన్ని 40 రోజులు వాడిన షుగరు వ్యాధిని నివారించవచ్చు. ఈ చూర్ణం గుండె పోటును కూడ తగ్గిస్తుందని గిరిజన వైద్యులు చెప్తారు.

గిరిజనులకు తేలు, పాము లాంటి విషపురుగులవల్ల వచ్చే ప్రమాదాల గురించి వైద్యం తెలుసు. పాము కాటుకు పొడప్రత్తి, మిరియాలు కలిపి నూరి పాముకాటు వేసిన దగ్గర పట్టీ వేస్తే, విషం తగ్గిపోతుందని గిరిజనుల నమ్మకం. వీరు మంత్రాలను నమ్మరు. కొంతమంది ఆయుర్వేద వైద్యులు చెంబకాయ గింజను నీళ్ళలో కరగదీసి కాటుపైన గింజను అంటిస్తారు. బాధ తగ్గిన తర్వాత ఆ గింజ దానికి అదే రాలిపోతుంది. మరికొంత మంది గిరిజన వైద్యులు సంతానం లేనివారికి సంతానం కల్గడానికి మూలికావైద్యం చేస్తారు. తప్పకుండా ఫలితం ఉంటుందని గిరిజనుల నమ్మకం. ఇలా వైద్యం చేసే టప్పుడు ఇష్టదైవానికి పూజలు చేస్తారు. స్త్రీలకు తెల్లబట్ట, ఎర్రబట్ట వ్యాధులు తగ్గితే సంతానం కల్గుతుందని గిరిజనుల విశ్వాసం. తెల్లబట్టకు కొండపిండివేరు, జీలకర్ర కలిపి ఇస్తారు. ఎర్రబట్టకు ఆరేచక్క రసం ఇస్తారు. నెలస్నానమయిన తర్వాత సంతానం నిలుస్తుందని గిరిజనుల నమ్మకం. గర్భనిరోధానికి కూడా వీరి దగ్గర ఔషధాలున్నాయి. నాగరసం వేరు దంచి చిన్నముద్ద చేసి బహిష్టయిన నాల్గవరోజు నుండి వరుసగ 3 రోజులు తీసుకొంటే సంతానం కల్గదని చెబుతారు. ఒకవేళ తిరిగి సంతానం కావాలనుకుంటే లేత చింతకాయ ఉడకబెట్టి ఆ రసాన్ని 3 రోజులు తాగితే అంతకు ముందు తాగిన నాగరసం ప్రభావం విరుగుడై మళ్ళీ పిల్లలు పుడతారని గిరిజనులు నమ్ముతారు. చాలా వరకు ఈ వైద్యం మంచి ఫలితాలు ఇస్తుందని గిరిజనులు ఈ వైద్యాన్ని ఆదరిస్తు న్నారు. వేలు లక్షలు ఖర్చు చేసే సంతాన సాఫల్య కేంద్రాల కంటే ఈ వైద్యానికి డిమాండు ఎక్కువ ఉంది. కొంత

మంది వైద్యులు పశువైద్యంలో కూడా ప్రావీణ్యం కలిగిన వారున్నారు.

విరిగిన ఎముకలకు చికిత్స, అజీర్ణ వ్యాధులు, స్త్రీల వ్యాధులు భూతప్రేత పిశాచ గ్రహ పీడన నివారణకు కూడా గిరిజన వైద్యం పనిచేస్తుంది. పొయ్యిడొక్కి అనే మూలకను కరక్కాయతో కలిపి తీసుకొంటే కడుపు నొప్పి, అజీర్ణవ్యాధి నయమవుతుంది. మొండి వ్యాధులైనా ఆస్తమా, ఆయాసం లాంటి జబ్బులకు కూడా మూలికా వైద్యం ఉంది. కొంతమంది గిరిజన వైద్యులు కుక్క పాలాకు రసాన్ని పరగడపునే తీసుకొంటే ఈ మొండి వ్యాధులు నయమవుతాయని చెపుతారు. మరికొంత మంది వైద్యులు మూర్ఛవ్యాధిని కూడా తగ్గిస్తున్నారు. పొయ్యడక్కి వేరు లేక కాయలు తులం నూరి రసం తీసి వారానికి ఒకసారి మూడువారాలు తాగితే మూర్ఛవ్యాధి తగ్గుతుంది. ఆకలి తక్కువ ఉన్నవారి కోసం ఒక తులం దహరువస మూలికను వరుసగా పదిరోజులు పాటు తాగిస్తే అజీర్ణం తగ్గి ఆకలి పెరుగుతుంది. దంతం చెట్టు కొమ్మ కణువులు దండగగుచ్చి మెడలో వేస్తే కామెర్ల వ్యాధి తప్పకుండా తగ్గుతుందని వైద్యులు చెబుతారు. బూసి చెక్క రసం శరీరానికి పూస్తే భూతాలు దిగిపోతాయని, జెడ్డపిక్కలు, పాలకాయల గుజ్జు ఏదైనా సుఖవిరోచనానికి పనికి వస్తుందని వైద్యుల వాదన.

బాలింతలకు వచ్చే గుర్రపు వాతం, ఇతర ప్రసవ వ్యాధులకు సూదికాయతీగ ఎల్లిపాయలు మూడు దంచి రసంతీసి వెచ్చజేసి ఒక గ్రుటక తాగిస్తే వ్యాధులు నయమవుతాయని గిరిజన వైద్యుల నమ్మకం. పక్షవాతం, క్యాన్సర్ వంటి నయంకాని దీర్ఘకాలిక జబ్బులకు గిరిజనులు మూలికావైద్యం చేస్తారు. పోతబరినికవేరు, వర్ణావాలుతో కలిపి మజ్జిగ తీసుకొంటే బ్రెస్ట్ క్యాన్సర్‌ను నివారించవచ్చు. గొంతులో మంటకు సీమవేరు నూరి రెండు రోజులు త్రాగితే తగ్గుతుందని గిరిజనులు సూచిస్తారు. అంతేకాక కొడిపొట్టు తీగ రసం తాగితే జ్వరం తగ్గుతుంది.

మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వ్యాధులకు కూడా వీరు మూలికా వైద్యాన్ని నమ్ముతారు. ఈ వ్యాధులు వచ్చినప్పుడు తమపై దయ్యాలు వచ్చాయని నమ్మి ఇంట్లో ధూపం వేసి పూజ చేస్తారు. ఈ ధూపాన్ని 20 నుండి 30 రకాల మూలికలతో తయారు చేస్తారు. ధూపంలో వాడే ఈ మూలికల వల్ల బ్యాక్టీరియా, వైరస్‌లు చనిపోతాయని గిరిజన వైద్యుల నమ్మకం.

ఈ విధంగా గిరిజనులు అనేక రకాల వ్యాధులకు మూలికావైద్యాన్ని నమ్ముతారు. గిరిజనుల మూలికా వైద్యం చౌకైనది, ప్రమాదకరం కానిది. మూలికావైద్యం ఆయుర్వేదవైద్యంలో భాగమైనప్పటికి చాల వ్యాధులకు తక్షణ నివారణ కల్పిస్తుంది. అంతేకాక ఆధునిక వైద్యానికి లొంగని అనేక వ్యాధులు గిరిజన మూలికావైద్యం ద్వారా నివారించబడుతున్నాయి. కాబట్టి నాగరికత పేరుతో అడవులన్నింటిని, మైదానాలుగా మార్చకుండా, అడవులలో లభించే వివిధ రకాల మూలికలను మనం వినియోగించుకోవాలి. అంతేకాకుండా గిరిజనులు చేస్తున్న మూలికా వైద్యంపై శాస్త్రీయ పరిశోధనలు జరగాలి. అలా జరగినప్పుడే వాటి ప్రాముఖ్యత ప్రజలందరికి తెలిసి, మొక్కల అవసరం తెలుస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. ఆశీష్ బోన్, ఇండియన్ బిలియన్ ప్లన్‌పీపుల్ 2001 సెన్సన్ హైలెట్స్, మెథడాలజీ & ట్రైబల్ మీడియా కవరేజ్ బి.ఆర్. వరల్డ్ బుక్స్, న్యూఢిల్లీ - 2005.
2. కుమార్ .ఎ. ట్రైబల్ డెవలప్‌మెంట్ ఇన్ ఇండియా, సరూప్ & సన్స్, న్యూఢిల్లీ - 2002
3. నదీంహస్‌నైన్, భారతీయ గిరిజనులు, ఓరియంట్ లాంగ్మన్, హైదరాబాదు - 1995
4. డా॥ రమేష్ .యన్, ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిక్ట్ గెజిటీర్స్ - విశాఖపట్నం, గవర్నమెంట్ ఆఫ్ ఎ.పి. హైదరాబాద్ - 1979
5. ఆదివారం ఆంధ్రభూమి, 4 ఫిబ్రవరి 2001
6. ఆదివారం వార్త, 15 డిసెంబర్, 2002
7. ఆదివారం ఆంధ్రప్రభ, 27 నవంబర్, 2005.

# కందుకూరి వీరేశలింగం- స్త్రీ సంస్కరణోద్యమం

– కె. సతీష్‌కుమార్, తెలుగుశాఖ, పరిశోధక విధ్యార్థి, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై, తమిళనాడు.

సంఘసంస్కరణ,ఆధునిక యుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగంపంతులు.1848 వ సం॥ ఏప్రిల్ 16వ తేదీన రాజమహేంద్రవరంలో పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు జన్మించాడు. వీరు చేపట్టిన సామాజిక కార్యక్రమాలలో అధిక భాగం స్త్రీలకు సంబందించినవే.

కన్యాశుల్కాన్నీ, బాల్యవివాహ నిర్మూలనం, స్త్రీ విద్యావాప్తి, వితంతువులకు పునర్వివాహం మొదలైన వాటికోసం తన జీవితమంతనూ ధారవోసిన ధన్యజీవి. ఆంగ్ల సంస్కృతాంధ్రంలో విద్వత్కవి, ప్రహసన కర్త, వచన రచనా సారధి, స్త్రీ జనోద్ధారకుడు అటు సాహిత్యంలోనూ, ఇటు సంఘంలోనూ ఆంధ్ర ప్రజలకు అపార సేవచేసిన గొప్ప సంఘసంస్కర్త.

తెలుగు సాహిత్యంలో కందుకూరి సంఘసంస్కరణ, గురుజాడ సంఘ సాహిత్య సంస్కరణ,గిడుగు వ్యవహారిక భాషోద్యమం జాతీయోద్యమం పై పాశ్చాత్యు సాహిత్య ధోరణుల ప్రభావం ఎంతైనా వుంది.నవల (వచన ప్రబంధం), నాటకం (ప్రహసనం), వ్యాసం, కవుల చరిత్ర,అనువాదం, శతకం, సులభ వ్యాకరణం, గ్రంధ విమర్శకుడిగా, పత్రికా నిర్వాహకుడిగా, ఆధునిక సాహిత్యంలో అన్ని ప్రక్రియలకు తానే ఆధ్యుడయ్యాడు.

నవ్యాంధ్ర సాహిత్య విశారదుడు, అఖండ సాహితీ స్రష్ట, జాతిని జాగృతం కల్గించిన ప్రప్రథమ వైతాళికుడు, నవ్యాంధ్ర సాహిత్య యుగకర్త, దక్షణ భారతదేశ విద్యా సాగరుడు, గద్యతిక్కన, రావుబహుద్దూర్, ఆంధ్ర రాజా రామ్మోహన్ రాయ్‌గా పేరుగాంచాడు. అభినవ ఆంధ్రకు "ఆద్యబ్రహ్మ" ఆధునిక కవులకు, రచయితలకు పూజనీయుడు, తన జీవితంలో 50సం॥లకు పైగా సంఘ సంస్కరణతో పాటు సాహిత్య కృషిచేసిన మహనీయుడు.

## సంస్కరణోద్యమం-సాంఘీక ధోరణి :

సనాతన భావజాలాన్ని ఆకళింపుచేసుకొని వర్తమానం భావాలను అవలోకనం చేసుకొని నూతన భావ ఆచరణాత్మకమైన సమాజాన్ని నిర్మించాడు. కందుకూరి ఉపాధ్యాయునిగా వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్నా సత్యానికి, ధర్మానికి మరియు న్యాయానికి కట్టుబడి ఎన్ని అవాంతరాలు వచ్చినా ధైర్యంగా ఎదురుగా నిలబడి పోరాటం చేయటం అలవాటు చేసుకున్నాడు. పత్రికా రంగంలో కూడా కందుకూరిది అసమానమైన ప్రజ్ఞ, స్వయంగా కొన్ని పత్రికలు నడిపాడు. సమకాలీన పత్రికలకు వ్యాసాలు పంపేవాడు. అన్యాయాలను, అక్రమాలను, వ్యక్తుల అవగుణాలను, సంఘంలోని దురాచారాలను పత్రికల్లో చీల్చి చెండాడేవాడు. ఇక కందుకూరి సంస్కరణా రంగంలో వీర విహారం చేశాడు. భాషా విషయకమైన, స్త్రీ సంబంధమైన,నీతియుతమైన అంశాలను స్వీకరించి తన సంస్కరణలను అమలుచేయడానికి యావచ్ఛక్తీ వినియోగించాడు.

కందుకూరి వారు తన సత్యవాది అనే పత్రికలో "ఇకనుండి నా వనరులు, నా శక్తియుక్తులను అంటే మానసిక భౌతికశక్తులను, ధ్రవ్యాన్ని చివరకు అవసరమైతే నా ప్రాణాన్ని సైతం స్త్రీ జన క్షేమానికి వినియోగిస్తాను." అని రాశారు. బాల వితంతువుల దీనస్థితి, విధ్యలేమి, మూఢవిశ్వాసం నిర్మూలనం స్త్రీలు సభలలోకి రాకూడదనే సాంఘీక నియమాలు లాంటి ఆ సమస్యలను పరిష్కరించుటకు పూనుకున్నాడు. తను విశ్వసించిన దానిలో నమ్మకం ఉన్న వ్యక్తి సంకల్ప బలము కల మహా మనిషి.

## స్త్రీ జనోద్ధారణ-విప్లవాత్మక మార్పు :

విద్య నేర్పించవలసిన అవసరం వుందని గ్రహించాడు. ఇరవై సం॥లు నిండకుండానే స్త్రీ పక్షం వహించి రచనలు చేశాడు. సకల అనర్ధాలకు మూలం స్త్రీకి విద్యలేకపోవడం,

స్త్రీల స్థితి బాగు పడితేకానీ మొత్తం దేశం బాగుపడదని ఆయన ప్రగాఢ విశ్వాసం. ఇక్కడే సరిగ్గా ఆయన ఉద్యోగ జీవితం మొదలైంది. పరవస్తు వెంకటరంగా చార్యులు పునర్వివాహ సంగ్రహమనే పేరుతో స్త్రీ వివాహం శాస్త్ర సమ్మతమేనని 1875లో ఒక చిన్న పుస్తకం వ్రాసి ప్రచురించాడు. అప్పటికే కందుకూరి స్రీ విద్య కోసం తన వంతు కృషి చేస్తున్నాడు.1874లో ధవళేశ్వరంలోనూ 1881లో రాజమండ్రిలోనూ బాలికా పాఠశాలను స్థాపించాడు. ముందుగా తన భార్య రాజ్యలక్ష్మికి విద్య నేర్పి ఆమెనొక ఉపాధ్యాయినిగా తయారు చేశాడు.

1873లో స్త్రీ విద్యను పొగుడుతూ "ముద్దియ విద్దియ పెద్దకార్యమనుట ప్రసిద్ధము..." అనే వ్యాసాన్ని పురుషార్థ ప్రధాయిని పత్రికలో వ్రాశాడు.1883వ సం॥లో స్త్రీల కోసం ప్రత్యేకంగా సతీహితభోదిని అనే పత్రికను ప్రారంభిం చాడు. అదే సం॥రం సత్యవతీ చరిత్ర అనే వచన ప్రబంధం రాశాడు.ఆరోజుల్లో స్త్రీలే కాకుండా పురుషులు చదివి స్త్రీలు తమ శిశువులకు నవలలో కథానాయిక అయిన "సత్యవతీ" పేరు పెట్టుకున్నారు. ఇది తమిళ కన్నడ భాషల్లోకి అనువాదం పొందింది. 1884 చంద్రమతీ చరిత్ర,1887సత్యసంజీవని, 1897 విక్టోరియా మహారాణి చరిత్ర, స్త్రీలకు అత్యంత ఆవశ్యకమైన శరీర ఆరోగ్య ధర్మాలను భోదించే "దేహారోగ్య ధర్మభోధిని" 1896లో పత్నీహిత సూచని స్త్రీలు గర్భాధారణ సమయంలో, శిశు పోషణ సమయాల్లో అనుసరించాల్సిన చిన్నచిన్న రోగా లకు ఆచరింపవలసిన చిట్కాలు మొదలైన విషయాలు తెలుపబడ్డాయి. 1889లో సతీహిత భోదినిలో స్త్రీలకు ఉపకరించే వ్యాసాలు పుస్తక సంకలనంగా వెలువడింది. "స్త్రీ నీతిదీపిక" అనే పేరుతో నీతి బోధకమైన శతకాన్ని రాశాడు.

స్త్రీ నీతిదీపిక శతకంలో "విద్య వలన జ్ఞానంబు వెలయు గాన నవని నిదిమంచి యిది చెడ్డయనుచు తెలియబాలురును, బోలె, దప్పక బాలికలును విద్య నేర్వంగా వలయును హృద్యమగును. (మకుటనియమం పాటించని పద్యం)

## సాంఘీక దురాచార నిర్మూలన :

నాటి సంఘంలో ప్రబలియున్న అతివృద్ధ వివాహాలు తద్వారా వితంతువుల సంఖ్య ఎక్కువ కావడం. చిన్న వయస్సులో వున్న బాలవితంతువులకు శిరోమండనం చేయడం ఆయన హృదయాన్ని గాఢంగా కలిచి వేసింది. వితంతు పునర్వివాహాలపై ప్రజాభిప్రాయాన్ని కూడగట్టు కోవటం కోసం రాజమండ్రిలో కొన్ని సభలు చేశాడు. ప్రజల మనస్సులలో మార్పు రావాలంటే సాహిత్యమే మార్గమని "బ్రహ్మవివాహం" అనే ప్రహసనం రాశాడు. 1879లో వితంతు వివాహ సంఘస్థాపన, చల్లపల్లి బాపనయ్య, పరవస్తు రంగాచార్యులు కరపత్రంతో రాజమండ్రిలో నిర్భంద వైధవ్యాన్ని నిరశిస్తూ, వేదాలను, స్మృతులను, విద్యారణ్య భాష్యాల ఆధారంతో తన వాదనను సమర్ధిస్తూ ఉపన్యాసం చెప్పాడు. 11.12.1881న వితంతు పునర్వి వాహ సంఘము స్థాపించాడు. 1881 డిసెంబర్ 11న మొదటి వితంతు వివాహం జరగినది. ఇది దక్షిణాదికే మొదటిది వధువు తిరువూరికి చెందిన గౌరమ్మ, వరుడు గోగులపాటి శ్రీరాములు, 1881 డిసెంబర్ 15న రెండవ వితంతు వివాహం. సమాజం నుండి ఎంతో ప్రతిఘటన ఎదురైన పట్టుబట్టి సుమారు 40 వితంతు వివాహాలు జరిపించాడు. పైడా రామకృష్ణయ్య, ఆత్మూరి లక్ష్మీనరసింహం, బసవరాజు గవర్రాజు వంటి మిత్రులు ఆయన విద్యార్థులు అండగా నిలిచారు. 1856లో "వితంతు పునర్వివాహ చట్టం" ఈశ్వరచంద్ర విద్యాసాగర్ కృషి వల్ల వచ్చింది. రాజమండ్రిలోనే గాక మద్రాసు, గుంటూరు, నరసాపురం, మచిలీపట్నం మొదలైన చోట్ల వితంతు పునర్వివాహలు జరిపించాడు. వివాహానంతరం వారి బాగోగులు పట్టించుకునేవాడు. వారికి ఇల్లు, ఉద్యోగం, రోగులు రోష్ఠులు వస్తే మందులిప్పించి నయం చేయించేవాడు. వీరేశలింగం పంతులు తమకు బిడ్డలు కలుగలేదని బాధపడకపోగా అనాధలు, ఆశ్రితులు, బాల వితంతువులే తమ బిడ్డలని చెప్పి గర్వించేవారు. కందుకూరి సంస్కరణలో వితంతు వివాహాలే కాక భోగ మేళాల నిషేధానికి కూడా పడరాని పాట్లు పడి మార్గదర్శ

కుడయ్యాడు. మొదటి వివాహానికి భోగమేళం ఇతరుల పట్టుదల వల్లే జరిగింది.కాని తర్వాత అభ్యంతరం తెలిపాడు. ఆ దుర్మార్గపు ఆచారాన్ని రూపుమాపడానికి తన రచన నైపుణ్యాన్ని వాడి, సంస్కృతి పేరుతో భోగం మేళాలను భోగం స్త్రీలను ఆదరించిన పెద్దలపై తన హాస్యాన్ని కుమ్మరించి, వీరిని ఎగతాళి చేసి, వారిపై జుగుప్సను కల్గించాడు. వారి శీలాన్ని ఖడించాడు. నాట్య స్త్రీలను ఉంపుడుగత్తెలుగా ఉంచుచుకోవడాన్ని, వారి చేత నృత్యాన్ని చేయించడానికి పెద్దలు భయపడే స్థితి సాంఘీక వాతావరణం కలిగించాడు. తర్వాత సంఘసంస్కర్తల ద్వారా రూపుమాపించాడు.

కళావంతులు అని పిలువబడే ఒక ప్రత్యేక కులానికి చెందిన స్త్రీలకు నాట్యం, సంగీతం, లలితకళలు నేర్పి వివాహం లేకుండా దేవునికి అంకితం చేసి వారిని "దేవదాసీ"లుగా చిత్రించేవారు. 19వ శతాబ్దంలో వారు రాజులకు, వారి ఉద్యోగులకు ఉంపుడు గత్తెలుగా ఉంటూ వారిచ్చిన ఇనాములతో బ్రతికేవారు. కందుకూరి వారికి ఈచర్య నచ్చలేదు రోత కలిగింది. వారి సభ్యత, సంస్కారం, న్యాయం, ఈదుష్ట చర్యలను ఖండిస్తూ తన పత్రికలైన "వివేక వర్ధిని, చింతామణి, సత్యవాది"లలో వ్రాయడమే కాకుండా బహిరంగ సభల్లో కూడా తీవ్రంగా ఖండించాడు.

## సమ సమాజ స్థాపన :

మద్రాసులో సంఘ సంస్కరణ, సమాజానికి, దక్షిణ భారత బ్రహ్మసమాజానికి వీరేశలింగం అధ్యక్షులైనారు. తన ఇంటిలోనే ప్రెస్సు, ఎగ్మూరు బాలికా పాఠశాలలో బాల వితంతువులకు ఆశ్రయం ఏర్పరిచాడు. సొంత ధనంతో చెన్నపురిలో వితంతు శరణాలయాన్ని, సంఘ సంస్కార సమాఖ్య మందిరాన్ని నిర్మించాడు. శరణా లయంలో ఉండే వితంతువులను ఉపాధ్యాయినీ బోధనాభ్యసన పాఠశాలకు పంపేవాడు.

కందుకూరి వీరేశలింగం పంతులు గారు 1908 వ సం॥రం మే నెల 2వ తేదీన హితకారిణీ సమాజాన్ని సంఘసంస్కరణ దృష్టితో, ముఖ్యంగా స్త్రీ జనోద్ధరణ కోసం స్థాపించారు. తాను ప్రారంభించిన కార్యక్రమాలు తన తదనంతరం కూడా కొనసాగేవిధంగా హితకారిణీ సమాజాన్ని స్థాపించాడు. తన యావదాస్తిని సమాజానికి వ్రాసి ఇచ్చాడు. ఈ సమాజం బాధ్యతలతో ముఖ్యమైనవి. ఏమంటే బాలికా పాఠశాల, వితంతు శరణాలయం, అనాధ శిశు సంరక్షణశాలలు రాజమహేంద్రవరం పురమందిరం మొదలైన వాటిని జాగ్రత్తగా నడపటం. కొత్తగా ఏమన్నా ఉంటే ప్రారంభించి నడపటం, ఇలా తన జీవితాన్ని స్త్రీల సేవకే వినియోగించి హితకారిణీ సమాజంలో సభ్యులుగా చేరి దాని అభివృద్ధికి కృషి చేయమని తెలుగు వాళ్ళకు చేతులెత్తి మ్రొక్కాడు.అందుకే ఆయన "దీనస్త్రీజన బాంధవుడయ్యాడు".

వీరేశలింగం పంతులుగారు తన భార్య రాజ్యలక్ష్మమ్మ గురించి చెబుతూ నా జీవితంలో నేను సాధించినది, ఆమె సంపూర్ణ సహాయ సహకారాలు లేకున్నచో నేను చేయగలిగి ఉండేవాడినికాదు అని తన సంస్కరణ విజయాలకు కారణం తన భార్యఅని నమ్మినాడు. రాజమండ్రిలోని మహిళా పాఠశాల, మహిళా ప్రార్థనా సమాజం, అనాధా శ్రమముల నిర్వహణకు బాధ్యత వహించింది రాజ్యలక్ష్మి నని తన ఆత్మకథలో వ్రాసుకున్నాడు. జీవితంలో ఏనాడు చలించని ధీరుడు ఆమె వియోగంతో తీరని అసహాయంతో అనుభవించాడు. ఆమె సమాధికి ప్రక్కనే తన సమాధికి చోటుంది. ఆ తోటకు"రాజ్యలక్ష్మిప్రమదావని" అని పేరు పెట్టి అలా కృతజ్ఞతను తెలుపుకున్నాడు.

మద్రాసులో కొమర్రాజు లక్ష్మణరావు గారి స్వగృహమైన "వేదవిలాస్"లో వీరేశలింగం నివాసం చేయడం జరిగింది. పోతన మీద వ్యాసం రాసేటప్పుడు జ్వరం వచ్చింది. విష జ్వరంగా మారింది. వ్యాసం పూర్తిచేసాడు. వీరేశలింగం శిష్యుడైన ఆచంటి లక్ష్మీపతి వైద్యం చేస్తున్నాడు. మిత్రులు అందరికి టెలిగ్రాం పెట్టాడు. కాశీనాధుని నాగేశ్వరరావు వచ్చి చివరి కోరిక ఏమిటి అని అడిగాడు, ఏమీ లేదని తల ఊపాడు. 1919వ సం॥రం మే 27తేదీ ఉదయం 4.గం॥ 20 నిమిషాలకు ఆయన శ్వాస అనంత

వాయువుల్లో కలిసిపోయింది. మద్రాసులోనే అంత్య క్రియలు జరిగాయి. ఆయన చితాభస్మంని రాజ్యలక్ష్మి సమాధి ప్రక్కనే భస్మాన్ని స్థాపితం చేసి సమాధి కట్టారు. జీవితంలోనూ మరణంలోనూ వీరేశలింగం రాజ్యలక్ష్మమ్మ దంపతుల భాగస్వాములే. ఆంధ్రదేశ గగనతలం నుండి సంస్కరణోద్యమ సూర్యుడు అస్తమించాడు. వీరేశలింగం గారి శిష్యుడైన చిలకమర్తి లక్ష్మీనరసింహం ఈ విధంగా ప్రశంసించాడు.

తన దేహము తనగేహము,
తన కాలము తన ధనమ్ము తనవిద్య
జగజ్జనులకు వినియోగించిన
ఘనుడీ వీరేశలింగం కవి జనులారా.

అందుకే ఆయన చూపిన మార్గం మనకు వెలుగు బాట.

**ఆధార గ్రంధాలు :**

1. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటి) - జి.నాగయ్య
2. వెలుగుబాట వీరేశలింగం (నవల) - ఆచంటి సత్యనారాయణ
3. తెలుగు కవిత్వంలో సంఘసంస్కరణ - డా॥పోతిరెడ్డి చెన్నకేశవులు.
4. అమరధామం తెలుగు పాఠ్యపుస్తకం - ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం.

Bhavaveena
Vol. 17, Issue. 1(2), January - 2020.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# దళిత జనోద్ధారకుడు - బోయి భీమన్న

**డా. జి. శ్రీనివాస రావు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ,
ఏ పి జె ఏ కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పటాన్ చెరువు, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ

## 1.ఉపోద్ఘాతం:-

"విదళిత హృదయాల్ని మేల్కొల్పిన జాతీయ కవి, పాలేరు నుంచి పద్మభూషణ్ వరకు ఎదిగిన సామాజిక చైతన్య కవి బోయి భీమన్న."

తెలుగు సాహిత్యాన్ని, దళిత అస్తిత్వ చైతన్యాన్ని తన రచనల ద్వారా సుసంపన్నం చేసిన ప్రసిద్ధ మహాకవి, జాతీయవాది.

## 2.బాల్యం - విద్యాభ్యాసం:-

తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో ఒక పేద దళిత (హరిజన) కుటుంబంలో జన్మించారు.

జననం, తల్లిదండ్రులు: 1911 సెప్టెంబరు 19న పుల్లయ్య, నాగమ్మ దంపతులకు జన్మించారు. వీరిది పంచపాండవుల వలె ఐదుగురు మగపిల్లలు, ఒక ఆడపిల్ల ఉన్న కుటుంబం. భీమన్న తండ్రి మగపిల్లలకు ధర్మరాజు, భీమన్న, అర్జునుడు, నకులుడు, సహదేవుడు అని పేర్లు పెట్టారు. 1935లో బి.ఎ. మరియు 1937లో బి.ఇడి. పూర్తి చేశారు. విద్యాభ్యాసం తర్వాత ఉపాధ్యాయుడిగా, జర్నలిస్టుగా సేవలందించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. 1978 నుండి 1984 వరకు శాసనమండలి సభ్యుడిగా (మీాజ) కూడా పనిచేశారు.

బోయి భీమన్న సుమారు (70) కు పైగా గ్రంథాలను తెలుగు, ఇంగ్లీష్ భాషలలో రచించారు. గుడిసెలు కాలిపోతున్నాయ్: ఇది ఆయనకు అత్యంత పేరు తెచ్చిన ప్రసిద్ధ వచన కవితా సంపుటి / ఖండకావ్యం.

ఇతర రచనలు: 'పాలేరు' (నాటకం), 'నాకు తెలిసిన జాషువా', 'రాజకీయ వీరుడు డాక్టర్ ఖాన్', 'పిల్లి శతకం', మరియు ఆత్మకథ 'పాలేరు నుండి పద్మశ్రీ' మొదలైనవి.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు: 'గుడిసెలు కాలిపోతున్నాయ్' గ్రంథానికి లభించింది.

పద్మశ్రీ (1973) మరియు పద్మభూషణ్ (2001) పురస్కారాలను భారత్ ప్రభుత్వం నుండి అందుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, నాగార్జున విశ్వవిద్యాలయాల నుండి గౌరవ డాక్టరేట్లు, మరియు 'కళాప్రపూర్ణ' బిరుదు పొందారు.

## 3.బోయి భీమన్న రచనలు:-

3.1.కవితలు

.మార్పు

అనాది కొసనుంచి అనంతతత్త్వంలోకి

రాగవైశాఖి

రాభీలుహొ(కవితా సంకలనం).

గుడిసెలు కూలిపోతున్నై' కవితాసంపుటి 1975 (కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది).

భీమన్న ఉగాదులు

భీమన్న కావ్యకుసుమాలు

మోక్షం నా జన్మహక్కు

చివరిమెట్టుమీద శివుడు

కూలీ శతకం

రాగోదయం

అకాండతాండవం

గిల్లిచెబుతున్నా

మధుబాల

మధుగీత

దీపసభ

3.2.నాటకాలు

పాలేరు, నాటకం – 1938

కూలిరాజు

అసూయ

ప్రగతి

పడిపోతున్న గోడలు

రాగవాసిష్ఠం

ఆదికవి వాల్మీకి

వేదవ్యాసుడు

ధర్మవ్యాధుడు

బాలయోగి

చిత్రకళా ప్రదర్శనం (నాటికల సంపుటి)

నవజీవన్ పత్రిక

చండాలిక (టాగూర్ రచించిన చండాలిక నాటికకు అనువాదము)

3.3.ఇతర రచనలు

ఏకపద్యోపాఖ్యానం

ఇదిగో ఇదీ భగవద్గీత

జన్మాంతరవైరం

పురాణాలలో హరి–గిరిజన మనీషులు

ధర్మం కోసం పోరాటం

అంబేద్కరిజం

అంబేత్కరమతం

జానపదుని జాబులు

## 4.బోయి భిమన్న రచనలు - దళిత జనార్ధారణ:-

బోయి భీమన్న తన రచన ద్వారా తన జాతిని మేల్కొల్పి, వారి సామాజిక ఆర్థిక స్థితిగతులను మెరుగపరచడానికి కృషి చేసిన గొప్ప మానవతావాది భీమన్న.వారి రచనలలో దళిత జనార్ధారణ

### 4.1. పాలేరు నాటకం:-

పాలేరు' బోయి భీమన్న రచించిన ప్రసిద్ధ సాంఘిక నాటకం. ఇది 1938లో రచించబడింది. నాటకానికి ప్రధాన ఇతివృత్తం కుల వివక్ష నిర్మూలన, విద్య ప్రాముఖ్యత, సమానత్వం, కులాంతర వివాహం.

నాటకంలోని కథానాయకుడు వెంకన్న అనే పాలేరు యువకుడు. అతను విద్యను అభ్యసించి సామాజికంగా ఎదగాలని కోరుకుంటాడు. అగ్రకులానికి చెందిన వనబాలనుప్రేమించివివాహం చేసుకోవాలనుకోవడంతో కులవ్యవస్థ, సంప్రదాయాలు, సామాజిక వ్యతిరేకతలతో సంఘర్షణ ఎదురవుతుంది.

నాటక సందేశంపుట్టుక ఆధారంగా మనుషుల మధ్య భేదాలు ఉండకూడదు. విద్య అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రధాన సాధనం.కులాంతర వివాహాలు సమాజంలో సమానత్వాన్ని పెంపొందిస్తాయి.

మానవత్వం కులం, మతం, ఆచారాల కంటే గొప్పది.

సామాజిక మార్పు కోసం సాహిత్యం శక్తివంతమైన సాధనం.

'పాలేరు' ద్వారా బోయి భీమన్న అణగారిన వర్గాల బాధలను మాత్రమే చూపకుండా, విద్య మరియు ఆత్మగౌరవం ద్వారా వారు ఉన్నత స్థాయికి ఎదగగలరనే ఆశావాదాన్ని వ్యక్తం చేశారు. అందువల్ల ఈ నాటకం తెలుగు దళిత, అభ్యుదయ సాహిత్యంలో ముఖ్యమైన రచనగా గుర్తింపు పొందింది.

### 4.2. పిల్లి శతకం:-

పిల్లీ శతకం' బోయి భీమన్న రచించిన విలక్షణమైన శతక కావ్యం. ఇది సుమారు 1967లో వెలువడినట్లు సాహిత్య ఆధారాలు పేర్కొంటున్నాయి.

ప్రధాన భావం

హిందూ సంప్రదాయంలో పిల్లిని చాలాసార్లు అశుభానికి సూచకంగా భావిస్తారు. ఈ మూఢనమ్మకాన్ని ప్రశ్నిస్తూ, బోయి భీమన్న పిల్లిని కేంద్రంగా తీసుకొని సామాజిక వ్యంగ్యాన్ని, హేతువాద దృష్టిని, మానవ సమానత్వ భావనను వ్యక్తం చేశారు.

పిల్లిని కేవలం జంతువుగా కాకుండా, సమాజంలోని అనవసరమైన భయాలు, మూఢవిశ్వాసాలు, కుల వివక్ష, సామాజిక అసమానతలకు ప్రతీకగా ఉపయోగించడం ఈ రచన ప్రత్యేకత.

సాహిత్య ప్రాధాన్యం

ఇది సంప్రదాయ భక్తి లేదా నీతి శతకాల మాదిరిగా కాకుండా వ్యంగ్యభరితమైన సామాజిక శతకం.

సాధారణంగా అశుభంగా భావించే పిల్లిని కవితా వస్తువుగా ఎంచుకోవడం ద్వారా భీమన్న సాహిత్య ప్రయోగశీలతను చూపించారు.

ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలను ప్రశ్నించి, వివేకం మరియు హేతుబద్ధమైన ఆలోచన అవసరమని సూచించారు.

'గబ్బిలం'పై జాషువా కావ్యం రాసిన నేపథ్యంలో, భీమన్న 'పిల్లి'పై శతకం రాయడం ఒక ప్రత్యేక సాహిత్య ప్రయోగంగా గుర్తించబడింది.

### 4.3. గుడిసెలు కాలిపోతున్నాయి:-

గుడిసెలు కాలిపోతున్నాయి కవితా సంకలనం గుడిసెలు కాలిపోతున్నాయి" బోయి భీమన్న రాసిన ప్రతీకాత్మక గద్య కవిత/కవితా సంకలనం; ఇది 1973లో ప్రచురితమై, 1975లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందింది. ఇది కేవలం నిప్పులు, గుడిసెల గురించి కాదు---అజ్ఞానం, అణచివేత, కుల వివక్షతో కూడిన దళిత జీవిత పరిస్థితులను మార్చుకోవాలన్నది ఆయన కోరిక.

సామాజిక అసమానతలను, అంటరానితనాన్ని ఎదిరిస్తూ, మానవతావాదాన్ని వెలుగెత్తి చాటాడు ఆయన స్మృత్యర్థం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు విశ్వవిద్యాలయంలో 'బోయి భీమన్న సాహిత్య పీఠం' ఏర్పాటు చేసింది.

### 5 బిరుదులు-సత్కారాలు:-

బోయి భీమన్నకు తెలుగు సాహిత్య సేవలకు గాను అనేక బిరుదులు, జాతీయ మరియు రాష్ట్రస్థాయి పురస్కారాలు లభించాయి. ముఖ్యమైనవి ఇవి:

ప్రధాన బిరుదులు

మహాకవి --- 1968లో కాకినాడలో జరిగిన సన్మానంలో ప్రదానం చేశారు.

కళాప్రపూర్ణ --- ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌గా 1971లో అందించింది.

నవ్యయుగ కవి సార్వభౌమ --- 2000లో విజయభవన్, విజయనగరం ప్రదానం చేసింది.

దళిత చైతన్య కవి --- ఆయన రచనల సామాజిక ప్రభావాన్ని సూచించే ప్రసిద్ధ విశేషణం.

ముఖ్య పురస్కారాలు

### 6.ముగింపు:-

బోయి భీమన్న రచనలన్నింటిలోనూ సమానత్వం, దళిత ఆత్మగౌరవం, శ్రమ గౌరవం, కులవివక్ష వ్యతిరేకత, మానవతావాదం ప్రధానంగా కనిపిస్తాయి.

ఆయన మానవతావాది, సోషలిస్టు, హేతువాది అనే బహుముఖ వ్యక్తిత్వం స్పష్టమవుతుంది. సామాజిక అసమానతలను, అంటరానితనాన్ని ఎదిరిస్తూ, మానవతావాదాన్ని చాటిన భీమన్న 2005 డిసెంబర్ 16న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు.

### ఆధార గ్రంథాలు:-

1. పాలేరు ..... బోయి భీమన్న
2 గుడిసెలు కాలిపోతున్నాయి. బోయి భీమన్న
3. పిల్లి శతకం........ ... ......... బోయి భీమన్న
4. గబ్బిలం... గుర్రం జాషువా
5. తెలుగు వికీపీడియా.

★ ★ ★

భావవీణ

# BHAVA VEENA

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

Journal of Literary, Culture & Language Study

సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

January (2) 2020





















































































Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.